

జాన్ హోల్ట్

# బాల్యం నుంచి స్వేచ్ఛ



ప్రజాశక్తి బుక్‌హౌస్



# బాల్యం నుంచి స్వేచ్ఛ

జాన్ హోల్ట్

# బాల్యం నుంచి స్వేచ్ఛ

జాన్ హోల్ట్

ప్రజాశక్తి బుక్‌హౌస్ - తెలంగాణ

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర

హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013

108215

ప్రచురణ సంఖ్య : 1345

ప్రథమ ముద్రణ : జనవరి, 2015

వెల : ₹ 100/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్** - తెలంగాణ

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

బ్రాంచీలు

హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.

నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


ప్రచురణకర్తల మాట ........................................ 7

1. బాల్యం ఒక సమస్య ........................................ 9
2. బాల్య వ్యవస్థ ........................................ 15
3. చరిత్రలో బాల్యం ........................................ 21
4. కుటుంబం, దాని లక్ష్యం ........................................ 33
5. పెద్దలకు అధికార భంగం ........................................ 41
6. జీవితంలోని అసంఖ్యాక సంక్షోభాలు ........................................ 45
7. పిల్లల పెంపకం భారమా ? ........................................ 49
8. బాల్యంతో ఒక ఉపయోగం ........................................ 57
9. సహాయం - సహాయం చేసేవారు ........................................ 59
10. పిల్లల సామర్థ్యం ........................................ 65
11. ప్రేమకు చిహ్నంగా పిల్లలు ........................................ 75
12. పిల్లలను అందమైన వస్తువుగా భావించడం ........................................ 83
13. పిల్లలు క్యూట్‌గా ఉండడాన్ని ఎలా ఉపయోగించుకుంటారు ? ..... 91
14. ప్రేమ అన్నింటికి పరిష్కారం కాదు ........................................ 99
15. పిల్లలకు కావల్సినవన్నీ మనకు కూడా కావాలి ........................................ 109

16. హక్కు అనే మాట.................................................. 113

17. ఓటు హక్కు........................................................ 117

18. పనిచేసే హక్కు...................................................... 131

19. ఆస్తి కలిగి ఉండే హక్కు .............................................. 145

20. ప్రయాణం  చేసే హక్కు ............................................... 149

21. సంరక్షకుడిని ఎంచుకునే హక్కు ....................................... 157

22. తప్పనిసరిగా రాబడి పొందే హక్కు..................................... 167

23. ఆర్థిక మరియు చట్టపరమైన బాధ్యత కలిగి ఉండే హక్కు........ 171

24. ఇష్టానుసారం నేర్చుకునే హక్కు........................................ 183

25. మందులు వాడే హక్కు................................................ 189

26. వాహనం నడిపే హక్కు............................................... 201

27. చట్టం, యువత ఇంకా శృంగారం ...................................... 204

28. తీసుకోవాల్సిన చర్యలు.............................................. 209

రచయిత గురించి.................................................... 216

# ప్రచురణకర్తల మాట

విద్యాసంబంధ విషయాలపై పలు గ్రంథాలు వెలువరించిన ప్రసిద్ధ రచయిత జాన్ హోల్ట్. బాలల స్థితిగతుల గురించి సామాజిక కోణంలో, మనోవైజ్ఞానిక కోణంలో ఆయన ఎంతో విలువైన విశ్లేషణలు చేశారు. ఆ విశ్లేషణల ఆధారంగా వినూత్నమైన, విప్లవాత్మకమైన సూత్రీకరణలు, నిర్ధారణలు అనేకం చేశారు. 'పిల్లలు ఎలా నేర్చుకుంటారు', పిల్లలు ఎలా వెనకబడతారు' లాంటి ఆయన ప్రసిద్ధ గ్రంథాలను ఇప్పటికే తెలుగులో అందించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇప్పుడు 'బాల్యం నుంచి స్వేచ్ఛ' పుస్తకాన్ని అందిస్తున్నది. పిల్లల్ని అతి ప్రేమతో లేదా అతి క్రమశిక్షణతో ఎలా నిర్బంధ బాల్యానికి గురిచేస్తున్నామో ఈ పుస్తకం వివరిస్తుంది. పిల్లల్ని స్వేచ్ఛగా పెరగనిస్తే, అలాంటి వాతావరణాన్ని కలుగచేస్తే ఎంతటి సత్ఫలితాలు లభిస్తాయో జాన్ హోల్ట్ దీనిలో ఎంతో సమర్ధవంతంగా పాఠకులకు తెలియచేస్తాడు.

పిల్లల మీద తమకు సర్వాధికారాలు ఉన్నాయన్న రీతిలో వ్యవహరించే పెద్దలు వారి స్వేచ్ఛాయుతమైన మానసిక, శారీరక పెరుగుదలకు ఎలా ఆటంకంగా తయారవుతారో ఆయన సోదాహరణంగా వివరిస్తారు. పిల్లలను స్వేచ్ఛగా పెరగనివ్వడమే కాకుండా వారికి వయసుతో నిమిత్తం లేకుండా ఓటు హక్కు, పనిచేసే హక్కు, ఆస్తి హక్కు, ప్రయాణం చేసే హక్కు, తమ సంరక్షకుడిని తానే ఎంచుకునే హక్కు, తనకు ఇష్టమైన స్కూలుకు వెళ్లే హక్కు, వాహనాలు డ్రైవ్ చేసే హక్కు మొదలైన వాటిని కలుగచేయాలంటూ – ఆశ్చర్యకరమైన ఇలాంటి ప్రతిపాదనలను సహేతుకంగా ముందుకు తెచ్చి పాఠకుడిని పూర్తిగా ఒప్పిస్తాడు.

పిల్లల పెంపకంలో, విద్యాబుద్ధులు నేర్పించడంలో పెద్దలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా వ్యవహరించాలి అనే విషయాలను సమగ్రమైన రీతిలో వివరించే ఈ గ్రంథం తల్లిదండ్రులకు, టీచర్లకు, బాలల గురించి సరైన పద్ధతిలో అవగాహన చేసుకోవడం పట్ల ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగపడేది. దీన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

**ప్రజాశక్తి బుక్‌హౌస్,**

**హైదరాబాద్.**

# 1. బాల్యం సమస్య

ఆధునిక సమాజంలో చిన్న పిల్లల స్థానం గురించి ఈ పుస్తకం చర్చిస్తుంది. ఆధునిక జీవనంలో బాలల స్థానం ఎక్కడో గుర్తించి దాన్ని నిర్వచించే వైఖరులు ఆచారాలు నియమాలను ఇది ప్రస్తావిస్తుంది. వీటితో కూడిన ఒక ఆధునిక బాల్య వ్యవస్థ గురించి, పిల్లల జీవితాలు ఎలా ఉండాలో పెద్దలమైన మనం వారితో ఎలా ప్రవర్తించాలో అది నిర్ధారించే తీరు గురించి ప్రధానంగా ఈ పుస్తకం తర్కిస్తుంది. ఆధునిక బాల్యపు వివిధ రీతులు పిల్లలకు ఎలా హాని కలిగిస్తున్నాయో చెబుతూ, దాన్ని ఎలా మార్చి తీరాలో, మార్చవచ్చో ఇందులో పేర్కొనడం జరిగింది.

ఈ వ్యవస్థను ప్రశ్నించాలన్న భావన నాకు చాలా రోజుల వరకు తట్టనే లేదు. పిల్లల జీవన విధానం మరోలా ఉండే అవకాశం ఉందా అన్న మీమాంస ఈ మధ్యనే మొదలైంది నాలో. అప్పటి నుంచి వారిని నేను నిశితంగా గమనించాను. వారు 'పసిబిడ్డలు'గా ఉంటున్నారు, ఆశ్రితులుగా, పరాధీనులుగా గడుపుతున్నారు. పెద్దలు వారిని ఖరీదైన 'న్యూసెన్స్'గా, బానిసలుగా, 'సూపర్ పెట్స్'గా చూస్తున్నారు. ఈ పరిస్థితులు ఎక్కువ మంది పిల్లలకు మేలు కంటే నష్టమే ఎక్కువగా కలిగిస్తాయి.

పెద్దలకు ఉండే హక్కులు, సౌకర్యాలు, బాధ్యతలు అన్నీ కూడా ఏ వయసులో ఉన్న పిల్లలకైనా సరే, వారు కోరుకున్నట్లయితే వారికీ *లభింపజేయాలని* నేను ప్రతిపాదన చేస్తున్నాను. ఇప్పుడున్న పిల్లల హక్కులకు వీటిని అదనంగా చేర్చాలి. అవి:

1. చట్టం దృష్టిలో సమానత్వం, ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే పెద్దవాళ్లతో సమాన స్థాయి.

2. పిల్లలకు కూడా ఓటు వేసే హక్కు , వారికిష్టమైనట్లయితే రాజకీయాల్లో పాల్గొనే అవకాశం.

3. వారి జీవితానికి, వారి పనులకు సంబంధించిన పూర్తి బాధ్యత వారికే ఉండే హక్కు.

4. డబ్బు కోసం పనిచేసే హక్కు.

5. వారి విషయాలు గోప్యంగా ఉంచుకునే హక్కు.

6. ఆర్థిక స్వాతంత్ర్యం మరియు బాధ్యత కలిగి ఉండే హక్కు : ఉదాహరణకు – ఆస్తి మీద యాజమాన్యం, కొనుగోలు లేదా అమ్మకం, అప్పు తీసుకోవడం లేదా ఇవ్వడం, కాంట్రాక్టులు సంతకం చేయడం... ఇలాంటి అన్ని రకాల హక్కులు.

7. వారి విద్యా విషయమైన నిర్ణయాలు వారే తీసుకునే హక్కు.

8. ప్రయాణాలు చేసే హక్కు, ఇంటికి దూరంగా నివసించే హక్కు లేదా స్వంతంగా ఇల్లు ఏర్పాటు చేసుకునే హక్కు.

9. వయోజనులకు ఉన్నట్టుగానే పిల్లలకు కూడా రాజ్యం నుంచి కనీస ఆదాయం పొందే హక్కు.

10. పరస్పర ఇష్టంతో పిల్లలు వారి కుటుంబ సంబంధాలు ఏర్పరుచుకునే హక్కు, ఉదాహరణకు తల్లిదండ్రులు కాకుండా వారికి ఇష్టమైన వాళ్లను తమ సంరక్షకులుగా పేర్కొంటూ చట్టబద్ధంగా వారికి బాధ్యతలు వారికి అప్పగించే హక్కు.

11. వయోజనులెవరైనా సరే చట్టానికి లోబడి చేయగలిగిన పనులన్నీ పిల్లలూ చేసేందుకు హక్కు.

నేను ఈ హక్కులన్నీ ప్రాధాన్యత క్రమంలో సూచించలేదు, ఇందులో కొన్ని కొంతమంది పిల్లలకు చాలా ముఖ్యమైనవే ఉండవచ్చు. కొన్ని అంత ముఖ్యమైనవి కాకపోవచ్చు. ఈ బాధ్యత, హక్కులన్నింటినీ ఒక ప్యాకేజి కింద జమకట్టాలని నేను అనడం లేదు, ఎవరైనా పిల్లలకు ఇలా జీవించాలనుకుంటే వారికి అలా జీవించే స్వేచ్ఛ ఉండాలని మాత్రం నేను అంటున్నాను. వారికి వీటిలో కొన్నింటిని ఎంచుకునే అవకాశం ఉండాలి. అదే సమయంలో వీటిలో కొన్నింటిని ఇతరుల చేతికి కూడా అప్పగించాల్సి ఉంటుంది. ప్రయాణించే హక్కు, తమ ఇంటిని స్వంతంగా ఏర్పాటు చేసుకునే హక్కు కావాలంటే వారికి చట్టబద్ధమైన రాబడి ఉంటేనే సాధ్యమౌతుంది. కాబట్టి వారికి పనిచేసి సంపాదించే హక్కు ఉండాలి.

వీటిలో కొన్ని హక్కులు చట్టసంబంధమైన మార్పులు, ఆచారాలు, వైఖరులతో ముడిపడి ఉన్నాయి. పద్నాలుగేళ్ల వయసు వచ్చిన పిల్లలకు కారు నడిపించే హక్కును కొన్నిసార్లు ఓటు వెయ్యడానికి ముందే ఇస్తాం. కొన్నిసార్లు ఓటేసే హక్కును వారు తమ వైవాహిక లేదా లైంగిక జీవితాన్ని నిర్ణయించుకొనే హక్కు కంటే ముందే ఇస్తాం. కానీ మన సమాజం పిల్లలకు పనిచేసే హక్కును మాత్రం, యునైటెడ్ స్టేట్స్‌లో 1973లో మాదిరిగా ఇవ్వడానికి సిద్ధంగా లేదు. దారిద్ర్యాన్ని దూరం చెయ్యడానికి ఎక్కువ మొత్తంలో ఉద్యోగావకాశాలు పెద్దల ముందు ఉంచడంతో పాటు పిల్లలకు కూడా ఉపాధి కోసం పోటీ పడే అవకాశం స్వీడన్, డెన్మార్క్ దేశాల మాదిరిగా కల్పించాలి. అదేవిధంగా స్త్రీలకు, ఇతర అల్ప సంఖ్యాకులకు చట్టంలో సమాన అవకాశాలు కల్పించేందుకు నిరాకరించే ఏ సమాజం పిల్లలకూ వాటిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉండదు.

నేను కోరుకుంటున్న మార్పులన్నీ ఒక్కసారిగా జరిగిపోవు. కొన్ని సంవత్సరాల పాటు ఒకదాని తర్వాత మరొకదాన్ని ఒక పద్ధతి ప్రకారం అంచెల వారీగా అమలులోకి తీసుకురావలసి ఉంటుంది. అందులో భాగంగానే ఓటేసే వయోపరిమితిని ఈ మధ్య కాలంలో ఇరవై ఒకటి నుంచి పద్దెనిమిదికి తగ్గించడం జరిగింది. త్వరలో దీన్ని పదహారు లేదా పదిహేను ఏళ్ళకు తగ్గించవచ్చు. ఆ తర్వాత పద్నాలుగు, పన్నెండుకు కూడా తగ్గించేందుకు అవకాశం ఉంది. ఇలా చిన్న చిన్న మార్పులతో మొదలై పరిసరాల్లో,

సమాజంలో జరిగే ప్రతి అంశంలోనూ పిల్లల భాగస్వామ్యాన్ని పెంచుతూ రావాల్సిన అవసరం ఉంది. తద్వారా వారు స్వతంత్రంగా, బాధ్యతగా తమ పరిసరాల్లో వ్యవహరించే అవకాశం కల్పించాలి. కాని దీనికి సమయం పడుతుంది. కాని ఇవన్నీ తప్పకుండా రావాల్సిన మార్పులు.

ఒక సమావేశంలో నేను ఆధునిక బాల్యం గురించి మాట్లాడినపుడు ఒక నల్ల జాతి మహిళ మీరు దీన్నే ఎందుకు ఎంచుకున్నారు. ఇంతకంటే తీవ్రమైన అంశాలెన్నో ఉన్నాయి కదా అని ప్రశ్నించారు. మొదటి విషయాలను మొదట ప్రస్తావించవచ్చు కదా అన్నది ఆమె మనసులో ఉద్దేశం. అంటే అమెరికాలోని నల్ల జాతీయుల సమస్య వంటివని ఆమె ఉద్దేశం. కానీ చాలా కారణాల వల్ల అణచివేతకు గురవుతున్న బాల్యం నాకు ఎక్కువ ముఖ్యమైనదిగా అనిపించింది. మొదట టీచర్‌గా, ఒక విద్యార్థిగా, నా పిల్లల స్నేహితుడిగా నా అనుభవాలు, నా విశ్వాసాలు నన్ను ఈ విషయం ప్రాధాన్యత గురించి ఆలోచింపచేశాయి. ఇక రెండోది వారి పక్షాన మాట్లాడడానికి చాలా తక్కువ మంది ఉన్నారు. వారి పక్షాన నిలబడి మాట్లాడడానికి పెద్దగా ప్రతినిధులు లేరు. మూడోది ఏమిటంటే పిల్లలపై శ్రద్ధ కలిగి వారి ఆలోచనను గౌరవించేవాళ్లు ఉన్నారు. వాళ్ళకయినా నేను చెప్పేది అర్థమవుతుందని అనుకున్నాను.

పాత సంప్రదాయాలు మార్చడం అంత సులభతరం కాదు. ఎవరో చెప్పిన మాట నాకు గుర్తొస్తోంది. ఏ విషయం గురించి కొత్తగా మా నాన్నమ్మకు చెప్పినా కూడా కేవలం ఈ రెండింటిలో ఏదో ఒక విధంగా స్పందించేవారు. 1. ఇదొక పిచ్చితనం, 2. ఇది నాకు ముందే తెలుసు అని. మనకు తెలిసినవి, మన నమ్మకాలు మనలో భాగాలు. మనకు అవన్నీ తెలుసనే అనిపిస్తుంది. మన ఆలోచనకు అందనిది లేదా మనం నిజం అని నమ్ముతున్నదానికి విరుద్ధంగా ఉండే విషయాలు కొత్తగా అనిపిస్తాయి. అవి చాలా క్రూరంగా, భయంకరంగా, ప్రమాదకరంగా, అసాధ్యంగా కూడా అనిపిస్తాయి. మామూలుగా మనుషులు వారికి బాధ కలిగించే విషయాలు ఒప్పుకోరు. ఈ పుస్తకంలో నేను ప్రస్తావించిన మార్పులు సాధ్యమేనని ఒక్కరు కూడా ఒప్పుకోకపోవచ్చు. ఇవన్నీ ఎలా సాధ్యమో ఎవరికి తెలియదు. కానీ నేను చెప్పేది ఒకటే మనుషులు బతకడానికి

అవసరమైన సమాజాన్ని మాత్రమే కాదు అందులో జీవించడానికి సంతోషపడే లాంటి సమాజాన్ని నిర్మించాలి. అలాంటి సమాజంలో వారు విజ్ఞులుగా, బాధ్యత గలవారిగా, సమర్థులుగా ఎదగ్గలరు. అలాంటి సమాజం కోసం మనం కొన్ని అంశాలు ఎంతో విభిన్నంగా నేర్చుకోవలసి ఉంటుంది.

ఈ మార్పు పట్ల అనుమానం ఉన్నవాళ్ళు "ఒకవేళ ఈ మార్పులను మేము అంగీకరించినప్పటికీ మీరు ప్రతిపాదించిన ఈ మార్పు వల్ల మంచే జరుగుతుందని మీరు నిరూపించగలరా? వీటి వల్ల ఎలాంటి సమస్య, ప్రమాదాలు, పాపాలు ఎదురు కావని మీరు నమ్మకంగా చెప్పగలరా?" అని అడుగుతారు. దానికి నేను "అవును" అనే సమాధానం చెప్తాను. అంతా మంచే జరుగుతుందని నేను చెప్పగలను. ఏ వ్యవస్థ కూడా శాశ్వత ప్రాతిపదికన సర్వసంపూర్ణంగా ఉండదు. పాత రుగ్మతలకు చేసే చికిత్సలు కాస్త ముందుగానో ఆలస్యంగానో తిరిగి కొత్తవాటిని సృష్టిస్తూనే ఉంటాయి. మనం చేయవల్సిందల్లా ఇప్పుడు మనకు తెల్సిన లోపాలను చక్కదిద్దడానికి ప్రయత్నించడమే. కొత్త సమస్యలు వచ్చినపుడు వాటికి పరిష్కారాన్ని అప్పుడు ఆలోచించాలి. అంతేకాదు గత అనుభవాల నుంచి నేర్చుకున్న వాటిని భవిష్యత్తులో ఎంత వీలైతే అంతగా ఉపయోగించుకోవాలి. అనుభవాల నుంచి మనం ఎన్నో నేర్చుకోవచ్చు, కానీ అన్నీ నేర్చుకోలేం. దూరదృష్టితో కొన్ని సమస్యలను ముందే ఊహించవచ్చు, వాటిలో అన్నిటినీ కాకపోయినా కొన్నింటినైనా ముందుగానే నిరోధించగలం.

వాద ప్రతివాదాలు, చర్చోపచర్చల ద్వారా చిట్టచివరకు సత్యాన్ని నిగ్గుతేలుస్తారని చాలామంది వలే నేను కూడా అనుకునేవాడిని. వాస్తవానికి ఇవన్నీ పోరాట పద్ధతిలో విచారణ జరపడం వంటివే. ప్రతివారూ తమ వాదనను గుర్రం ఎక్కించి బలంగా వేగంగా ముందుకు దూకిస్తారు. ఎవరి గుర్రం ఎదుటివాడి అశ్వాన్ని మట్టికరిపిస్తుందో అది గెల్చినట్లు లెక్క. అప్పుడు ఆ నేలకూలిన ఆ 'గుర్రం' తాలూకు వ్యక్తి తన ఓటమిని ఒప్పుకొని "మీరు గెలిచారు, మీరు చెప్పిందే సత్యం" అని అంగీకరించాల్సి ఉంటుంది. ఇలా వాదించడం వల్ల ఎదుటి వారి అభిప్రాయంలో వచ్చే మార్పు పెద్దగా ఉండదని చివరకు అనుభవం ద్వారా తెలుసుకుంటారు. వారు అప్పటి వరకు చేసిన వాదనలన్నింటిలో

ఎంత మాత్రం బలం లేదని, అవి ఎంత మాత్రం పొసగని విషయాలన్న సంగతిని వారు గ్రహిస్తారు. ఇప్పుడు నాకు ఒక దృక్పథం ఉంది. దాన్ని నేను ప్రపంచం ముందు పెట్టదలచుకున్నాను. ఎవరు నాతో పాటు ఆ దిశగా ఆలోచించగలరో వారు దాన్ని గురించి ఆలోచించవచ్చు. నేను నా ఈ భావాలు వారి మనసులో నాటలేకపోవచ్చు. ప్రతి ఒక్కరికి వారి సొంత అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. కానీ నా అనుభవాలకు సంబంధించిన వెలుగులో వారి ఆలోచనలను వారు మరింత స్పష్టంగా, కొంత విభిన్నంగా కూడా చూసే అవకాశం ఉంటుందని భావిస్తున్నాను.

నేను ముందే చెప్పినట్టు ఈ మార్పులు ఒకే రోజులో వచ్చేవి కావు. కొన్ని అంచెల్లో ఇవి ఆచరణలోకి వస్తాయి. పూర్తి స్థాయి మార్పులు జరగడానికి ఎన్నో ఏళ్ళు పట్టవచ్చు. సమాజంలో జరగాల్సిన ఇతర మార్పులు కూడా జరిగితే తప్ప ఇవన్నీ సాధ్యపడవు. ఇలాంటి మార్పులన్నీ జరిగితే ఎంత గొప్పగా ఉంటుంది? కొంతమంది చాలా గొప్పగా ఉంటుందంటారు. తగినంత మేధస్సు, నిజాయితీ, కరుణ, మానవీయతలు ఈ లక్షణాలు కలగలసి ఉన్న ఏ దేశంలోనైనా నేను ప్రతిపాదించే ఈ మార్పులు చోటు చేసుకోవచ్చు. అలాంటి దేశంలో సాధారణంగా ప్రజలు ఒకరి మీద అధికారం కోసం వెంపర్లాడరు, ఆ అవసరం ఉండదు. నంబర్ వన్ స్థానం కోసం అంతగా బాధపడిపోరు. కటిక దారిద్ర్యం, పనికిరానితనం, వైఫల్యాల భయంతో క్షణ క్షణం భయపడుతూ జీవించరు. ఒకరిని మరొకరు దోపిడి చేయరు, ఒకరిని మరొకరు కబళించాలని చూడరు. నేను పేర్కొన్న లక్షణాలు లేని దేశాల్లో సైతం మార్పు సంభవించగలదు. అయితే ఇక్కడ విషయమేమిటంటే... ఇది సాధ్యపడుతుందా అది సాధ్యపడుతుందా అంటూ ఆందోళన పడుతూ కూర్చోవడం కంటే మనం ఏది చేయగలమో అది చేయడమే ప్రధానం.

# 2. బాల్య వ్యవస్థ

**బా**ల్యం అనేది ఒక వ్యవస్థ కాదు, ఇది మానవుల జీవితంలోని భాగం. పుట్టినపుడు మనం జీవించడానికి ఇతరుల మీద ఆధారపడి ఉంటాం. మన సంరక్షణ మరొకరు చూడాల్సి ఉంటుంది. మనల్ని వెచ్చగా, పొడిగా, శుభ్రంగా ఉంచాలి. ఆపద నుంచి కాపాడాలి. ఈ విషయంలో ఇతర జంతువుల మాదిరిగానే ఉంటాం, కాని కొన్ని విషయాల్లో వైవిధ్యం ఉంటుంది. జంతువుల్లా కొన్ని నెలల్లోనే స్వతంత్రంగా జీవించలేము. అలా జీవించాలంటే సంవత్సరాలు పడుతుంది. ఇది బాల్యం యొక్క వాస్తవం. ఈ వాస్తవం మానవజాతి అంతటి పురాతనం. అయితే మనం పెరుగుతున్న కొద్దీ మన సంరక్షణను మనమే చూసుకోగలిగేలా రూపొందుతామనేది కూడా వాస్తవం.

నేను మొదట్లో కొలరాడోలోని ఒక స్కూల్‌లో పనిచేసేవాడిని. ఇటలీకి చెందిన కవల పిల్లలు అప్పట్లో కొంతకాలం ఆ స్కూలుకు వచ్చేవారు. అమెరికన్ ఒకరు ఇటలీలో పర్యటిస్తూ, ఆ పిల్లల గురించి విని వారిని తనతో పెంపకం తెచ్చుకున్నాడు. అంతకు ముందు కొంతకాలం క్రితం వరకు ఆ పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి అందరిలానే హాయిగా జీవించేవారు. అయితే రెండో ప్రపంచ యుద్ధ సమయంలో వారి తల్లిదండ్రులు జాడ తెలియకుండా పోయారు. చనిపోయారో జైల్లో పెట్టారో తెలియదు. ఈ కవలలు అప్పటికి కేవలం ఐదేళ్ళ చిన్నారులు. అయినా వారిద్దరు *తమంతట తామే* కొన్ని సంవత్సరాల పాటు జీవించారు. ఒక స్మశానాన్ని నివాసం చేసుకున్నారు. బతికేందుకు భిక్షమెత్తారు, చిల్లర దొంగతనాలు చేశారు. అప్పుడు దేశం గడ్డు పరిస్థితుల్లో ఉంది. దరిద్రం, నిరుద్యోగం తాండవిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాల తర్వాత కాని ఆ పిల్లలు ప్రభుత్వం దృష్టికి రాలేదు. చివరకు ప్రభుత్వం తరపున ఒక అనాథ శరణాలయం వీరి సంరక్షణ బాధ్యత తీసుకుంది. అక్కడి నుంచి వీరిని తెచ్చుకున్న అమెరికన్ పెంపుడు తండ్రి వీరి చదువుపై దృష్టి పెట్టాడు. ముందుగా ఆ పిల్లలకు కొంత ఇంగ్లీష్ నేర్పించాల్సిన అవసరం ఉందని భావించి మా స్కూలుకు పంపించాడు.

నేను చిన్నపిల్లలు స్మశానాల్లో ఒంటరిగా జీవించడం మంచిదని చెప్పడం లేదు. ఈ పిల్లలిద్దరి జీవితాలు చాలా దుర్భరంగా గడిచాయి. అయితే ఈ అనుభవాలు వారి మీద శాశ్వతంగా లేదా చాలా లోతుగా ప్రభావం చూపలేకపోయాయని మాత్రమే చెప్పదలచుకున్నాను. అదే వయసులో ఉన్న ఇతర అమెరికన్ పిల్లలతో పోల్చినపుడు వాళ్లు చాలా చురుకుగా, దృఢంగా ఉండడం మాత్రమే కాదు, ఇద్దరి మధ్య సమన్వయం కూడా ఎక్కువగా ఉంది. ఇతర పిల్లల కంటే మంచి సాకర్ ప్లేయర్స్ కూడా వాళ్లు. అయితే వాళ్లు అంత గొప్ప విద్యార్థులు కాకపోవచ్చు, వారికి ఇంగ్లీష్ నేర్చుకోవడం కూడా అంత ఆసక్తికరంగా లేకపోవచ్చు. వారు స్నేహపూర్వకంగా ఉండేవారు, చాలా ఆసక్తి కలిగి, ఉత్సాహంగా, భాష తెలియకపోయినా ఇతర పిల్లలతో త్వరగా కలిసిపోయే స్వభావం కలిగి ఉన్నారు. చాలామంది ఇతర పిల్లల మాదిరిగానే ఉన్నారు. కాబట్టి, మనం మన శారీరక నిస్సహాయ పరిస్థితి నుంచీ ఇతరులపై ఆధారపడే స్థితి నుంచీ చాలా మంది అనుకునే దానికంటే ఎంతో ముందుగా వేగవంతంగా బయటపడటం సాధ్యమేనని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.

మానవ జీవితాన్ని ఒక రేఖాపటం మీది అర్థ చంద్రాకార వక్రరేఖతో పోల్చితే దాని గమనం ఇలా ఉంటుంది : ఆ రేఖ మనిషి పుట్టుకతో మొదలై అతడు సాధించే భౌతిక, మానసిక, సామాజికాధికార ఉన్నత శిఖరాలకు ఎగబాకుతూ ఆ తర్వాత కొంతకాలం ఒక మైదాన ప్రాంతం మీద లాగా పయనిస్తుంది. తర్వాత అకస్మాత్తుగా వృద్ధాప్యం వైపు వాలిపోయి, చివరకు మరణంతో పరిసమాప్తమవుతుంది. ఈ జీవన వక్ర రేఖ ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఆకస్మిక మరణం వల్ల అర్థంతరంగా వాలిపోవచ్చు. కానీ ప్రతి మనిషికి ఒకటే వక్రరేఖ పరిపూర్ణంగా ఉంటుంది. ఇది నిరంతర వృద్ధిని, మార్పును ప్రతిబింబించే రేఖ. మనం ప్రతిరోజు నిన్నటి రోజు కంటే ఎంతో కొంత భిన్నంగా ఉంటాం. అయితే మనిషిలో వచ్చే ఈ ఎదుగుదల, మార్పు నిర్విరామంగా ఉంటాయి. అతడి జీవన వక్రరేఖలో ఎలాంటి విచ్ఛేదాలు, విరామాలు ఉండవు. కొన్ని కీటకాల మాదిరిగా నిన్నటి వరకు ఒక జీవిగా ఉండి, తెల్లవారేసరికి మరొక జీవిగా మనిషి మారడు కదా!

ఇక్కడ బాల్యం అనే వాస్తవం అంతమై బాల్య వ్యవస్థ మొదలవుతుంది. మనకు తెలిసిన బాల్యం ఈ జీవన వక్రాన్ని, ఈ పరిపూర్ణతను రెండు భాగాలుగా విభజిస్తుంది – ఒకటి 'బాల్యం', రెండోది 'యుక్తవయస్కత' లేదా పరిణత. అలా మానవ జీవితంలో అది 'మహా విభజన'ను ప్రవేశపెట్టింది. ఈ విభజనకు వ్యతిరేక దిశల్లో ఉండే మనుషులు, అంటే 'పిల్లలు', 'పెద్దలు' ఎంతో విభిన్నమైన వారని అనుకునేలా చేసింది. కాబట్టి, మనం ఏ పదహారేళ్ల వారికో, ఏ ఇరవై రెండేళ్ల వారికో మధ్య ఉండే వ్యత్యాసాలు ఏ రెండేళ్ల వారికో పదహారేళ్ల వారికో లేదా ఇరవై రెండేళ్ల వారికో డెబ్బై ఏళ్ల వారికో

మధ్య ఉండే వ్యత్యాసాల కంటే ఎంతో ఉన్నతమైనవి, ముఖ్యమైనవి అన్నట్లు మన ప్రవర్తన ఉంటుంది. తన స్వీయ జీవితం మీద తనకు ఉండే అదుపుపరంగా – ముఖ్యమైన ఎంపికలు చేసే సామర్థ్యపరంగా – చూస్తే, పదహారేళ్ల వయస్కుడు ఇరవై రెండేళ్ల వయస్కుడి కంటే రెండేళ్ల వాడికి దగ్గరగా ఉంటాడు.

నా దృష్టిలో బాల్య వ్యవస్థలో పెద్దల ప్రపంచానికి పిల్లల ప్రపంచానికి మధ్య అడ్డంకిగా నిలుస్తున్నవి ఏవంటే వైఖరులు, భావనలు, ఇంకా చట్టాలు, సంప్రదాయాలకు సంబంధించిన విషయాలు. ఇవన్నీ కూడా పిల్లలను తమ చుట్టూ ఉన్న సమాజానికి దూరం చేస్తున్నాయి. అంతేకాదు బాధ్యత ఏదైనా తీసుకోవాలన్నా, సమాజానికి సంబంధించి ఏదైనా కార్యక్రమంలో పాల్గొనాలన్నా కూడా ఇవన్నీ చాలా పెద్ద అడ్డంకిగా నిలుస్తున్నాయి. ఈ కారణాలు పద్దెనిమిది సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన వారందరిని ఇతరులపై ఆధారపడేట్లు చేస్తున్నాయి, ముందుగా నేను చెప్పినట్టు వారిని బానిసగా, ఖరీదైన చిరాకుగా, జాగ్రత్తగా కాపాడుకోవల్సిన ఆస్తిగా, ఇంకా అత్యంత ఇష్టమైన పెంపుడు జంతువుగా చేస్తున్నాయి.

ముందుగా నేను ఈ పుస్తకానికి బాల్యం ఒక *చెరసాల* అనే పేరు పెట్టాలకున్నాను. కొందరు *విముక్తి* అనే పదం టైటిల్‌లో ఉండాలన్నారు. కానీ ఒక మిత్రుడు దీనికి అభ్యంతరం చెప్పాడు. ఎందుకంటే ఇప్పటి వరకు తల్లిదండ్రులంతా కూడా పిల్లలను అలా చెరసాలలో ఉంచుతున్నారని అంటే ఎవరూ ఒప్పుకోరు. వారంతా చాలా బాధ్యతగా పిల్లలను పెంచుతున్నామని, వారి భవిష్యత్తుకు ఏది మంచిదని భావిస్తున్నారో అదే వారి కోసం చేస్తున్నామని నమ్ముతారు. అలాంటి ఆలోచన ఉన్న వారంతా కూడా ఈ పుస్తకాన్ని వ్యతిరేకిస్తారన్న అభిప్రాయం వ్యక్తంచేయడం జరిగింది. అందుకే నేను *చెరసాల, విముక్తి* మాటలు ఈ పుస్తకం పేరులో ఉపయోగించలేదు. ఎస్కేప్ అనే పదం వాడాను. ఇది దాదాపు ఆ మాటల భావాన్నే స్ఫురింపజేస్తుంది. మనం మంటల్లో చిక్కుకున్న ఇంటిలో ఉన్నా లేదా మునిగిపోతున్న నావలో ఉన్నా ఆ పరిస్థితి నుంచి 'ఎస్కేప్' అవ్వాలని అంటే తప్పించుకోవాలని అనుకుంటాం. ఏ పరిస్థితి నుంచైనా తప్పించుకోవాలంటే ముందు అది ప్రమాదకర పరిస్థితి అని గుర్తించగలగాలి. అప్పుడు మీరు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. పిల్లలకు కూడా బాల్యం అనేది ప్రమాదమా కాదా అని నిర్ణయించుకునే అవకాశం కల్పించాలనేది నా అభిప్రాయం.

బాల్య వ్యవస్థ మీద విశ్వాసం కలిగినవారు చాలామంది, పిల్లలను సంరక్షించాలని అనుకుంటారు. పిల్లలను వారు చిన్నవారుగా, బలహీనులుగా భావిస్తారు. వారిని ప్రపంచంలోని చెడు నుంచి, నష్టం నుంచి, కాఠిన్యం నుంచి –వారు పెద్దవారై అలాంటి ప్రతికూలతలన్నీ ఎదుర్కొనే శక్తినీ సామర్థ్యాన్నీ సాధించే వరకు– వారిని కాపాడాలని భావిస్తారు. చాలామంది పిల్లలకు బాల్యం అలాగే గడిచిపోతుంది. అలాంటి తల్లిదండ్రులను

నేను ఏ విధంగానూ ఆటంకపరచాలని అనుకోను. వారి పిల్లలను వారి నుంచి దూరం చేయాలని కూడా అనుకోడం లేదు. పిల్లలకు కూడా అది నచ్చితే తప్పకుండా వారు అందులోనే అలాగే ఉండనివ్వండి. కానీ చాలా మంది కాస్త ఎదిగిన పిల్లలకు ఆ సంరక్షణ తోటలా కాకుండా చెరసాలలాగా అనిపిస్తుంది. నేను అనేదేమిటంటే సంరక్షణ అనే తోటకు తప్పకుండా ఒక ద్వారం ఉండాలి. బయటికి రావడానికైనా, లోపలికి తిరిగి వెళ్ళడానికైనా అనువుగా అని నా అభిప్రాయం. అలా ఉండడం వల్ల ఇక ఈ తోట వల్ల వారికి ఎలాంటి ఉపయోగం లేదని భావించినపుడు బయటకు వెళ్ళిపోయేందుకు ఒక అవకాశం ఉంటుంది. అది వారికి అవమానకరంగా ఉండదు. కొంతసమయం పాటు అందులో నుంచి బయటపడడానికి, మరింత విశాల ప్రపంచంలో జీవించడానికి వారికి అవకాశం దొరుకుతుంది. తమకు అది సరిపడదని భావించినపుడు వారే తిరిగి తోటలోకి వస్తారు. కానీ మనం తోటలకు గేట్లు లేని గోడలు కట్టేస్తున్నాం, వారికి మరో అవకాశం లేకుండా చేస్తున్నాం.

బాల్యం పిల్లలందరికీ ఒక చెడు అనుభవమే అని నేను చెప్పడం లేదు. అందరు పిల్లలకు బాల్యం అమాయకంగా, సంతోషంగా, సురక్షితంగా, సంరక్షణలోనే గడిచిపోతుంది. కానీ కొందరు పిల్లలకు బాల్యం అంత అందంగా, నొప్పి లేకుండా సాగకపోవచ్చు.

కొంతమంది పిల్లలకు కుటుంబం ఉండకపోవచ్చు. తల్లిదండ్రులు చనిపోయి ఉండొచ్చు లేదా వారిని వదిలేసి ఉండొచ్చు. లేదా చట్టం వారిని వారి తల్లిదండ్రుల నుంచి దూరం చేసి ఉండొచ్చు. తల్లిదండ్రులు వారి సంరక్షణ చూడడం లేదన్న కారణంగా ప్రభుత్వం వారి బాధ్యత తీసుకొని ఉండొచ్చు. కారణమేదైనా సరే తల్లిదండ్రులకు దూరంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో పెరిగే పిల్లలను హోమ్స్‌లో పెంచుతారు. వారి పట్ల ప్రభుత్వ తీరు ఖైదీల పట్ల కంటే విరుద్ధంగా ఉండదు. వారు మరీ చిన్నపిల్లలు కాకపోతే వారిని ఏదో ఒక చెరసాలలోనే ఉంచుతారు. మీరు పారిపోకుండా మీకు కాపలాగా గార్డు ఉంటాడు.

చాలామంది పిల్లలు సాధారణ జీవితాలే గడుపుతారు. వారి బాల్యం సురక్షితంగా ఉంది అంటే వారు సంతోషంగా, అమాయకంగా బతికేస్తున్నారని అర్థం కాదు. సురక్షితంగా ఉన్నట్టు కనిపించినా దానికి విరుద్ధంగా వారు కుటుంబంలోనే వేధింపులు, అవమానాలు, దోపిడీలకు గురవుతుండొచ్చు. వారి జీవితం ఎంత వేదనాభరితంగా ఉందనే విషయం వారు కొంతకాలం వారి తల్లిదండ్రులు లేదా వారిని వేధిస్తున్న ఇతర కుటుంబ సభ్యులకు దూరంగా గడిపితేనే వారికి అర్థమవుతుంది. కానీ ప్రస్తుత సమాజంలో అలాంటి అవకాశం వారికి లేదు.

చాలామంది పిల్లలకు బాల్యం చాలా సంతోషంగానే గడుస్తుండొచ్చు. అలా చాలాకాలం పాటు కొనసాగుతుంది. అప్పటివరకు సంతోషంగా సాగుతున్న జీవితం

అకస్మాత్‌గా మారిపోవచ్చు. ఒక్కసారిగా వారికి తల్లిదండ్రులతో కలిసి బతకడం దుర్భరంగా అనిపించవచ్చు. ఇప్పటిదాకా కలిసి ఉండడం సంతోషంగానే ఉండి వుంటుంది. కాని, ఇప్పుడు పిల్లలు బయటికి వెళ్లిపోతారు. తల్లిదండ్రులకు ఇది బాధాకరం కావచ్చు. 'మేము చాలా సంతోషంగా ఉండేవాళ్ళం', 'ఈ మధ్య ఏమైందో ఏమో అతడికి', 'మా వల్ల ఏం తప్పు జరిగిందో తెలియడం లేదు' వంటి మాటలు తల్లిదండ్రుల దగ్గరి నుంచి వింటూ ఉంటాం. కౌమారం(టీనేజి) చివరలో ఉన్న వారు లేదా ఇరవైల వయసు మొదట్లో ఉన్న పిల్లలు ఇలా చెప్తుంటారు: "నేను నా తల్లిదండ్రులను చాలా ప్రేమిస్తాను కానీ వారు ఎప్పుడూ నన్ను ఇది చెయ్యి అది చెయ్యి అంటున్నారు. నాకు వారు చెప్పినట్లు చెయ్యాలనిపించడం లేదు. నాకు వేరొకటి చెయ్యాలనుంటుంది. కానీ అది వాళ్లకు నచ్చదు. నాలో ఎంతో అపరాధభావన కలుగుతుంది. చాలా కన్‌ఫ్యూజింగ్‌గా కూడా ఉంది. నాకు వారిని బాధపెట్టాలని లేదు, కానీ నా జీవితం నేను జీవించాలని కూడా ఉంది". ఈ మాటలు వారనడం స్వయంగా విన్నాను. బాల్యం అత్యంత సంతోషంగా గడిచిన వారికి కూడా అది చాలా వేదనాభరితంగా ముగుస్తుంటుంది.

బోస్టన్ సబ్‌వేకి వెళ్లే దారిలో ఒక బోర్డు ఉంటుంది.. "సంతోషంగా ఉండే కుటుంబం నుంచి ఎవరూ పారిపోరు" అని దానిపై రాసి ఉంటుంది. అలాంటి సంతోషకరమైన కుటుంబం పిల్లలకు మరింత విశ్వాసాన్ని, ఆసక్తిని, శక్తిని ఇస్తుండవచ్చు. అదే సమయంలో వారు ఈ విశాల ప్రపంచంలో తమ స్థానం ఏమిటో తెలుసుకోవాలని కూడా అనుకుంటూ ఉండవచ్చు. ఇలా చేయడానికి వారికి అనుమతి లేనప్పుడు అసంతృప్తి మొదలవుతుంది.

ఈ మధ్యకాలంలో నేను మధ్య పశ్చిమ ప్రాంతంలోని కొన్ని దిగువ మధ్యతరగతి స్కూళ్లలో మాట్లాడేందుకు వెళ్ళాను. అక్కడి వారు దాదాపు అందరు ఫర్వాలేదనిపించే మంచి జీతానికి దగ్గరలో ఉన్న కంపెనీలలో పనిచేసే కార్మికులు లేదా దిగువ స్థాయి ఆఫీసు ఉద్యోగస్తులు. వారంతా మధ్యతరగతి వారే. వారంతా కూడా వారి పిల్లలు కాలేజీలకు వెళ్ళి చదువుకొని సుస్థిరమైన మధ్యతరగతి జీవితం గడపాలని కోరుకున్నారు.

అదే రోజు మధ్యాహ్నం ఒక జూనియర్ హైస్కూల్‌లో నా మీటింగ్ ఏర్పాటు అయింది. తొమ్మిదో తరగతి రెండు క్లాసులను కలిపి వారి ఇంగ్లీషు పీరియడును ఇందుకు కేటాయించారు. మీటింగ్‌లో నేను ఒక్కడినే పెద్దవాడిని ఉండడానికి ముందే అంగీకారమైంది. కానీ, ఎందుకో మరి స్కూల్ అధికారులు కూడా నా వెంట సమావేశం గదిలోకి వచ్చారు. ఈ కారణం వల్ల మా మధ్య దాపరికంలేని చర్చ జరిగే అవకాశం లేకుండా పోయింది. కొంతమంది సహజంగానే భయంలేని పిల్లలు, లేదా సమస్యల్లో పడతామనే భయం లేనివారు, లేదా అప్పటికే ఎన్నో సమస్యల్లో ఉన్న వారు మాత్రమే ఆ కొద్ది పాటి సమయంలో మాట్లాడారు. కొత్తగా సమస్యల్లో పడతామని బాధపడాల్సిన అవసరం లేదంటూ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

నేను స్కూల్స్ గురించి, స్కూల్స్‌లో తీసుకు రావాల్సిన సంస్కరణల గురించి కూడా చర్చించాను. మీటింగ్ ముగియబోతుండగా బాల్య వ్యవస్థ గురించి మాట్లాడడానికి పిల్లలు ప్రయత్నించారు. మరోసారి మీకు గుర్తు చెయ్యాలనుకునేదేమిటంటే వీరంతా రాడికల్ భావాలు లేదా స్వతంత్ర భావాలు కలిగిన యువకులేమీ కారు. నేను వాళ్ళను మూడు ప్రశ్నలు అడిగాను. మొదటి ప్రశ్న – మీక్కూడా ఎలక్షన్‌లో ఓటు వేసే అవకాశం ఉండాలని మీలో ఎంతమంది అనుకుంటున్నారు? దాదాపు మూడింట రెండువంతుల మంది విద్యార్థులు చేతులెత్తారు. వారిలో చాలామంది చాలా త్వరగా స్పందించారు. ఇక రెండో ప్రశ్న – మీకు కూడా చట్టబద్ధంగా పనిచేసే అవకాశం ఉంటే కొద్ది సమయం పాటైనా పనిచేసే వాళ్ళం కదా అని మీలో ఎంత మంది అనుకున్నారు? మళ్లీ దాదాపు మూడింట రెండువంతులమంది చేతులెత్తారు. మొదటి వరుసలో కూర్చున్న ఒక పిల్లవాడు మాత్రం ఇతడు చర్చలో ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కాని "జీవితమంతా పని చెయ్యాల్సిందే కదా, పనిచేయడం మొదలుపెట్టడానికి ఎందుకంత తొందర" అని అన్నాడు. అందరూ నవ్వారు. కానీ చేతులు పైకి లేచే ఉన్నాయి. ఇక ఆ తర్వాత బాగా ఆలోచించి నేను నా చివరి ప్రశ్న అడిగాను "చట్టబద్ధంగా మీరు ఇంటికి దూరంగా కొంతకాలం జీవించే అవకాశం ఉంటే మీలో ఎంతమంది అలా బతకడానికి ఇష్టపడతారు?" దాదాపు అందరూ చేతులు పైకెత్తారు. అది కూడా వెనువెంటనే, ఎంతో వేగంగా, నేనేదో గొప్ప మ్యాజిక్ బటన్ నొక్కినట్టు. అందరి ముఖాల్లో ఆ ఆలోచనకే ఎంతో ఆనందం కనిపించింది. అప్పుడు నాలో నేను అనుకున్నాను ఈ ప్రశ్న నేను ముందు అడిగి ఉండాల్సింది అని. అప్పటికే పిరియడ్ అయిపోవచ్చింది. వాళ్ళకు శుభాకాంక్షలు తెలిపి నేను బయటికి వచ్చేశాను. నాకు ఆతిథ్యం ఇచ్చిన వారు, నేను అందరం కలసి ఇతర స్కూల్స్ కూడా సందర్శించడానికి బయలుదేరాము. నా చివరి ప్రశ్నకు వచ్చిన స్పందన గురించి మాలో ఎవరూ ప్రస్తావించలేదు. నేను కూడా దానిపై సంభాషణ సాగించదలచుకోలేదు.

ఇంటి నుంచి, వద్దు కాదు అనే తల్లిదండ్రుల నుంచి దూరంగా ఉండాలని పిల్లలు ఎందుకనుకుంటారంటే... పెద్దవాళ్ళంతా ఆనందించే స్మోకింగ్, డ్రింకింగ్, సెక్స్ వంటి 'పెద్దలకు మాత్రమే' సౌఖ్యాలను తామూ అనుభవించడానికి వీలవుతుందనే ఉద్దేశంతోనే అని కొంతమంది అనుకోవచ్చు. అయితే వారు ఇతర పెద్దవాళ్ళ మాదిరిగా జీవించి చూడాలని అనుకుంటున్నారు. వారిని పిల్లలుగా కాకుండా, వ్యక్తులుగా గుర్తించాలని ఆరాటపడుతున్నారని నాకు అనిపించింది.

# 3. చరిత్రలో బాల్యం

**బా**ల్య వ్యవస్థను నిర్వచించడానికి ఒక ఆదర్శ కుటుంబ చిత్రానికి రూపకల్పన చేసుకున్నాం. దానికి వాస్తవంతో సంబంధం ఉండదు. క్రితం రోజు నా పాత స్నేహితురాలు ఒకామె కలిసింది. నేను వాళ్ళ కుటుంబంతో కలిసి చాలాసార్లు గడిపాను. ఆమెకు ఎదిగిన పిల్లలు ఉన్నారు. తన పిల్లలతో జరిగిన ఒక చిన్న సంభాషణ గురించి ఆమె నాతో ప్రస్తావించింది. వాళ్ళింట్లో డిన్నర్ సమయం చాలా సరదాగా, ఇష్టాగోష్టి మాదిరిగా ఉంటుంది. కొద్దిరోజుల క్రితం ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి "యాన్ అమెరికన్ ఫ్యామిలి" అనే టీవీ షో గురించి మాట్లాడుతున్నపుడు ఆమె ఆ షో చాలా అసహజంగా ఉందని అన్నది. కుటుంబం అంతా కూడా డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చుని ఎక్కువగా మాట్లాడుకోకుండా భోంచెయ్యడం ఎంతో అసహజంగా ఉందని అభిప్రాయం చెప్పింది. కానీ ఆమె ఇద్దరు పిల్లలు కూడా దాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. "నీకు నేను ఎన్నోసార్లు చెప్పాను" పెద్దవాడు అన్నాడు. "నేను నా స్నేహితుల ఇళ్ళకు డిన్నర్‌కు వెళ్ళినపుడు ఆ సమయంలో వారు 'అది ఇలా ఇవ్వు', 'ఇది ఇలా తే, 'నాప్కిన్ వాడు' వంటి చిన్న చిన్న మాటలు మినహా పెద్దగా మాట్లాడుకోరు. ఇలా చుట్టూ కూర్చుని చివరిదాకా మాట్లాడుకుంటూ తినే వారు ఎక్కడా ఉండరు" అన్నాడు. చిన్నవాడు తాను వాళ్ళ స్నేహితుల ఇళ్లకి డిన్నర్‌కు వెళ్లినపుడు గమనించింది చెప్పాడు. వారు కనీసం టేబుల్ ముందు కూడా కూర్చోరని, కిచెన్‌లోని ఒక స్టాండ్ చుట్టూ చేరి ఆ స్టాండ్ మీద ఉన్న ఆహార పదార్థాలు తమకు నచ్చినవి నచ్చినట్టు వడ్డించుకొని తింటారని వివరించాడు.

ఆమె చెప్పిన ఈ విషయం నాకు ఒక పాత సంగతిని గుర్తుచేసింది. 1956లో నేను పదిమంది అమెరికా యువకులను అంతర్జాతీయ జీవన విధానానికి సంబంధించిన అధ్యయనం కోసం ఫ్రాన్స్ తీసుకెళ్ళాను. మేమంతా కూడా ఒక నెల రోజుల పాటు తలా

ఒక ఫ్రెంచి కుటుంబంతో కలిసి జీవించాం. వేసవి చివరన అందరం తిరిగి వెనక్కు బయలుదేరాం. మా అనుభవాల గురించి మాట్లాడుకున్నాం. నేను నా సహచరులను వారికి చాలా సంతోషం కలిగించిన అనుభవాల గురించి అడిగాను. అక్కడివారి జీవితాల్లో మీకు అతిగా నచ్చిన, మీరు మీ మనసుల్లో ఇంకా మోసుకొస్తున్న అనుభవాలను వివరించమని  అడిగాను. దాదాపు అందరూ కూడా చెప్పిందిది: "రోజూ రాత్రి భోజన సమయంలో కుటుంబమంతా ఒక చోట చేరతారు, చిన్న వాళ్ళు పెద్దవాళ్ళు అందరూ తీరికగా మనసు విప్పి మాట్లాడుకుంటూ భోంచేస్తారు." దాదాపుగా అందరు అమెరికన్ పిల్లలు కూడా వారిళ్ళలో కానీ, వారికి తెలిసిన వారిళ్ళలో కానీ  ప్రతిరోజూ ఇలా కుటుంబ భోజనాలు చేయడం క్రిస్మస్, థ్యాంక్స్ గివింగ్ డే వంటి ప్రత్యేక సందర్భాల్లో తప్ప ఎప్పుడూ జరగదని గుర్తు చేసుకున్నారు. అమెరికన్లు  చాలావరకు అందరూ  వారి వారి పనుల్లో తీరిక లేకుండా గడుపుతారు. ఎవరికి వీలైనపుడు వారు ఇంటికి తిరిగి వస్తారు. ఎవరి టైముకు వారు ఉన్నది ఏదో తీసుకొని తినేస్తారు. వాళ్ళు ఎక్కడికి వెళ్ళేది ఒక చిన్న మెసెజ్ పెట్టేసి తిరిగి వెళ్ళిపోతారు.

కాపాడుకుంటే మేలు అనిపించే ఏదో ఒక ఆచారం, ఒక తంతు, ఒక సంప్రదాయం, ఒక వ్యవస్థ సమాజంలో ఉంటే ఉండి ఉండవచ్చు. అయితే కాలక్రమంలో అది కూడా తన జీవం కోల్పోయి ఉంటుంది. బహుశ ఆధునిక కుటుంబ వ్యవస్థ ఇప్పటికే చాలావరకు చచ్చిపోయింది. మనం బహిరంగంగా దానిపై దాడి చేయడాని కంటే లేదా దాన్ని సమర్థించడాని కంటే ముందే ఇది జరిగింది. మన జీవితాలలో నిజమైన విలువ కలిగిన వాటిని సమర్థించడానికి మనం ఎప్పుడూ తీవ్రంగా ప్రయత్నించం. నలుగురి దృష్టిలో మనం విలువ ఇవ్వాల్సిన వాటిని మాత్రం తీవ్రంగా సమర్థిస్తాం. అయితే  వాటికి విలువ ఇవ్వనవసరం లేదని రహస్యంగా లోలోపల అనుకుంటాం. మన వ్యవస్థలు  (మన దేహాల్లాగా) పూర్తిగా జబ్బు పడి నిర్వీర్యమైనప్పుడు మాత్రమే... అవి ఎంతో ఆరోగ్యంగా ఉన్నాయని అప్పటి వరకు చేసిన వాదనకు ఇక ముగింపు పలుకుతాం.

బాల్యం మూలాలు, చరిత్రలను ఈ మధ్యనే అధ్యయనం చేయడం మొదలుపెట్టిన వారు బాల్యం, మాతృత్వం, ఇల్లు, కుటుంబం ఇలా మనకు తెలిసిన ఈ అన్ని వ్యవస్థలూ స్థానికమైనవీ, ఇటీవలి ఆవిష్కరణలూ అన్న అవగాహనకు వచ్చినట్లు కనబడతారు. కాని అవి 'మానవ స్థితి యొక్క సార్వజనీన భాగం' అని గుర్తించరు.

ది *డైలెక్టిక్స్* ఆఫ్ సెక్స్ అనే పుస్తకంలో షులామిత్ ఫైర్‌స్టోన్  దిగువ విషయాలు చర్చించింది:

> పద్నాలుగో శతాబ్దం తర్వాత మధ్యతరగతి ప్రజానీకం, వారితో పాటు అనుభవపూర్వక విజ్ఞానం అభివృద్ధి చెందడంతో ఈ పరిస్థితి నిదానంగా పరిణామం చెందసాగింది. బాల్యం అనే భావన ఆధునిక కుటుంబానికి ఒక అనుబంధంగా అభివృద్ధి చెందింది... పిల్లలతో వారిని అనుకరిస్తూ మాట్లాడటం (Childrenese) పదిహేడో శతాబ్దంకల్లా ఒక ఫ్యాషన్‌గా మారింది. 1600 సంవత్సరం వరకు పిల్లల కంటూ ఆటబొమ్మలే లేవు. ఆ తర్వాత వచ్చినా మూడేళ్ల పైబడిన వాళ్లకే ఉండేవి. కానీ పదిహేడో శతాబ్దం చివరకు వచ్చేసరికి పిల్లల కోసం ప్రత్యేక కళాత్మక సామగ్రి  కొనడం సర్వసాధారణమైంది. ప్రత్యేకమైన ఆటలు కూడా అందుబాటులోకి వచ్చాయి. *కానీ స్త్రీలకు మాత్రం బాల్యం లేదు.* ఆడపిల్లలు పొత్తిళ్ల గుడ్డల నుంచి నేరుగా పెద్దవాళ్ల బట్టల్లోకి మారిపోయేవారు. వారు స్కూలుకు కూడా వెళ్లేవారు కాదు. బాల్యానికి ఒక ఆకృతి ఇచ్చేది పాఠశాలే. తొమ్మిది పది సంవత్సరాలు వచ్చేసరికి ఆడపిల్ల 'లిటిల్ లేడీ' మాదిరిగా ఉండేది. ఆమె ప్రవర్తన అచ్చంగా ఎదిగిన స్త్రీ మాదిరిగానే ఉండేది. రజస్వల కాగానే అంటే దాదాపు పది పన్నెండేళ్ళ వయసు కల్లా తన కంటే వయసులో బాగా పెద్దవాడితో వివాహం జరిగిపోయేది.

డాఫీన్ చిన్నతనం విశేషాలను గురించి అతడి వైద్యుడిని ఉటంకిస్తూ ఏరీజ్ చెప్పిన దాని ప్రకారం, డాఫీన్ పదిహేడు నెలల వయసులోనే పాటలు పాడడం, వయొలిన్ వాయించడం చేసేవాడు. ఇదే వయసులో మాల్ అని పిలిచే ఒక ఆట ఆడేవాడు. ఇది గోల్ఫ్ మాదిరిగా ఉంటుంది. ఆ వయసులోనే అతడు మాట్లాడాడు, యుద్ధతంత్రం ఇమిడి ఉన్న ఆటలు ఆడాడు. దాదాపు మూడు నాలుగేళ్ల వయసు వచ్చేసరికి అతడు రాయడం, చదవడం కూడా నేర్చుకున్నాడు. నాలుగైదేళ్ల వయసులో డాఫీన్ బొమ్మలతో ఆడుకుంటూ కూడా విలువిద్య సాధన కూడా చేశాడు. అదే వయసులో అతడు పేకాట, చదరంగం కూడా ఆడేవాడు. ఐదు సంవత్సరాల పిల్లలు సామాన్యంగా వారు ఓడిపోతారనుకున్నపుడు ఆట నియమాలు తమకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకుంటారు. కానీ డాఫీన్ మాత్రం ఆటలన్నీ నియమానుసారమే ఆడే వాడు. ఒకసారి నేను ఆరు సంవత్సరాల వయసున్న ఒక పిల్లవాడితో చక్కర్స్ ఆట ఆడినపుడు అతడు నాకు వ్యతిరేకంగా ట్రిపుల్ జంప్ ట్రాప్ ఒకటి సవాలుగా విసిరాడు. విసిరి నా స్పందన

ఎలా ఉంటుందో అని ఒక ప్రత్యేకమైన ఆసక్తి కలిగిన ముఖంతో నా వైపు చూస్తున్నాడు. అది గమనించి నేను చిక్కు నుంచి తప్పించుకున్నాను. ఇక్కడ నేను చెప్పేదేమిటంటే డాఫీన్ నడక వచ్చినప్పటి నుంచి పెద్దలతో కలిసి నృత్యం చేయడం, వారు పాల్గొనే అన్నిరకాల కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. ఇదంతా అతడు ఎంత బాగా చెయ్యగలిగాడనేది మనకెవరికీ తెలియదు. ఫ్రాన్స్‌కి భవిష్యత్ రాజుగా అతడికి అవన్నీ నేర్చుకోడానికి పూర్తి అవకాశాలు అందుబాటులో ఉండాలి. పెద్దవాళ్లు అతడి లోపాలను మామూలు పిల్లలకు ఆపాదించినట్లు కాకుండా కొంత కప్పిపుచ్చి ఉంటారనడంలో కూడా సందేహం లేదు. కాని ఇక్కడ విషయం ఏమిటంటే, ఆ కాలపు పెద్దవారు ఒక చిన్న పిల్లాడైన యువరాజును ఎంతగా వీలైతే అంతగా తమతో సమానంగా చూడటమే అతడితో తాము ప్రవర్తించాల్సిన పద్ధతి అనుకునే వారు.

మనకు తెలిసిన బాల్యం ఒక్కటే ఒక ఆధునిక ఆవిష్కరణ కాదు, దేనినైతే సంరక్షించుకోవాలని ఎంతగానో చెప్పుకుంటామో ఆ కుటుంబం కూడా అలాంటిదే. ఎలిజబెత్ జేన్‌వే పుస్తకం Mans World, Woman's Place లోనుంచి కొంత భాగం:

> ఏరీజ్ పుస్తకం సూచించినట్లు (అదొక్కటే కాదు ఇలా పేర్కొన్నది), 'ఇల్లు' అంటే తల్లితండ్రుల, పిల్లల గుంపుతో కూడిన ఒక జీవన విధానం స్ఫురిస్తుంది. ఈ సామూహిక జీవనం చరిత్ర పరంగా ఎంతో కాలం మనలేదు, భౌగోళికంగా చూసినా మరీ అంత ఎక్కువగా విస్తరించలేదు. పోగా పోగా, విస్తృత కుటుంబాన్ని ఏర్పరచిన ఈ సమూహం కాస్తా ఎవరికి వారుగా ఉండే 'పరిమిత కుటుంబం' (న్యూక్లియర్ ఫ్యామిలీ)గా రూపాంతరం చెందింది. అందులో తల్లి, తండ్రి, వారి పిల్లలు మాత్రమే ఉంటారు. ఈ చిన్న కుటుంబాలు తొలినాళ్ల విస్తృత సామాజిక జీవనంతో తెగతెంపులు చేసుకుని విడివిడిగా ఒంటరిగా జీవించాయి. ఉత్తర యూరపు మినహా ఇతర ప్రాంతాలతోనూ అవి సంబంధాలు కోల్పోయాయి. ఒక కిందిస్థాయి ప్రత్యేక తరగతిగా సేవక వర్గం ఏర్పడింది. వారు గృహం లోపలే అందులో నివసించే వారి సౌకర్యార్థం పనిమనుషులుగా పనిచేసేవారు. అలా కాకుండా పనులు నేర్చుకునే వారుగా లేదా విపణి కోసం వస్తువులు ఉత్పత్తి చేసే కూలీలుగా మాత్రం ఉండేవారు కాదు. *గృహం* రానురాను పని ప్రపంచం నుంచి వేరవుతూ, పకడ్బందీ కుటుంబ జీవనం మరియు తీరుబాటు ఉండే *ఇల్లుగా* రూపాంతరం చెందసాగింది.

17 శతాబ్దానికి ముందు కాలంలో కొన్ని అరుదైన సందర్భాలలో మినహా 'ఇల్లు, పొయ్యి, పిల్లలు' అనే భావన లేనే లేదు – అంటే స్త్రీకి మనం భావించే ఇల్లు అనేది లేదు.

> మరి స్త్రీలు ఇంటికి చెందకుండా ఎక్కడ ఉండేవారు. కుటుంబం చుట్టూ తిరిగే జీవితం అనేది ఇప్పటి మధ్య తరగతి చేసిన ఆవిష్కరణ మాత్రమే అయితే, అంతకు ముందు ప్రజలు ఎలా జీవించేవారు?... వారు రెండు తరహా ఆవాసాలలో ఒక దానిలోనో మరో దానిలోనే నివసించేవారు: అవి ఒకటి భారీ గృహం, రెండు గుడిసె. భారీ గృహం ఉన్నత వర్గాలకు పరిమితం. వారు అందులో కేవలం తమ కుటుంబం ఒక్కదానితోనే నివసించేవారు కాదు, ఎందుకంటే, ఈ భారీ గృహాలు కేవలం ఆవాస ప్రదేశాలు మాత్రమే కావు. అవి కోటలు, లేదా ఆర్థిక కేంద్రాలు, లేదా రెండూ. వాటి గేట్ల లోపలే, ఆ కుటుంబాన్ని పరివేష్టించి సేవకులు, అప్రెంటిస్‌లు, అన్ని స్థాయిల ఉద్యోగులు, న్యాయాధికారులు, నిర్వాహకులు, గుమస్తాలు, మతాధికారులు, అసంఖ్యాకంగా సందర్శకులు ఉండేవారు. 20 శాతం మంది వరకు జనాభా ఇలాంటి క్వార్టర్లలోనే అంతా కలిసి నివసించేవారు.
>
> మిగతా జనం నగరం లేదా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న గుడిసెల్లో నివసించేవారు. ఇవి కేవలం మురికివాడలు మాత్రమే.

పిల్లలు పాక్షికంగా పెద్దల జీవితం గడిపేవారు. ఎందుకంటే వారిని దూరంగా ఉంచే వీలే లేదు. అప్పట్లో, ఆ మాట కొస్తే ఇప్పుడు కూడా, పేదవారు నివసించేందుకు అతి కొద్ది స్థలం మాత్రమే ఉండేది.దాంతో పిల్లలు జీవిత వాస్తవాలు అన్నీ గమనిస్తూ ఉండేవారు. తెలుసుకుంటూ ఉండేవారు. అయితే ఎంతో ధనవంతులైన వారి నివాసాల్లో సైతం మనం ఇప్పుడు ఎంతో ముఖ్యమని భావించే ప్రైవసీ ఉండేది కాదు. కోటల్లాంటి భవనాల్లో కూడా ప్రయివేటు రూములు అందుబాటులో ఉండవు. సాధారణంగా గదులు ఒక వరుసలో ఉంటాయి, ఒకదానిని ఒకటి అనుసంధాన పరుస్తూ, అంటే మీరు చివరి గదిలోకి వెళ్లాలంటే తప్పనిసరిగా దానికంటే ముందున్న అన్ని గదులను దాటుతూ వెళ్లాల్సి ఉంటుంది. ఈ అన్ని గదుల్లో ఉన్నవారంతా ఏం చేస్తున్నారో వద్దనుకున్నా కళ్లకు కనబడుతూ ఉండేవి. జీవితపు సహజ విధులు ఆ తర్వాతి కాలంలో మాదిరిగా అప్పట్లో నిషిద్ధ విషయాలు కావు.

మాతృత్వం కూడా దానికదే మనం అనుకుంటున్నట్టుగా శాశ్వతం, విశ్వజనీన సంబంధం కాదు. మిస్ జేన్‌వే రాసినట్టు :

> ఇదివరలో తల్లులు చాలా కష్టపడి పనిచేయాల్సి ఉండడం మనకు గుర్తుండే ఉంటుంది. వారు నిస్సందేహంగా తమ మొత్తం సమయాన్ని కుటుంబంతో గడపేవారు కాదు. కోట్ల మంది పిల్లలను వారికి జన్మనిచ్చిన స్త్రీలు కాకుండా ఇతర స్త్రీలు పెంచడం మనకు తెలుసు. నేను చెబుతున్నది తల్లి లేని పిల్లల గురించి కాదు, పిల్లలను ఇతరుల సంరక్షణలో పెరిగే వారి గురించి. కొందరిని బామ్మల దగ్గర లేదా అక్కల దగ్గర వదిలేస్తారు. విచక్షణ తెలిసే వయసు.. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు ఇది ఏడేళ్లు... వచ్చిన వారు స్కూల్‌కు (లేదా,ఈ లోపు సంరక్షణ కేంద్రాలకు) పంపిస్తారు. ఇలా వీరంతా కూడా దాదాపు ఏడేళ్ల వయసు వచ్చే వరకు పరాయి తల్లుల ఒడిలోనే పెరుగుతున్నారు. గతంలో (మధ్యయుగాల యూరపులో) కేవలం చర్చిల కోసం పిల్లలకు శిక్షణ ఇచ్చే స్కూళ్లు ఉండేవి. ఇక మిగిలిన సామాన్యుల పిల్లలతో పాటు కులీనులు, గౌరవనీయుల పిల్లలను కూడా పెద్దల ప్రపంచం వద్ద 'జనరల్ అప్రెంటిస్‌షిప్' చేస్తూ ఆయా విద్యావిషయాలు నేర్చుకోడానికి ఇంటికి దూరంగా పంపించేవారు. ఇప్పుడున్న లాంఛన విద్యా విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా కేవలం పెద్దింటి పిల్లలు మాత్రమే స్కూల్‌కు వెళ్లగలిగేవారు. పేద పిల్లలంతా కూడా పాత పద్ధతుల్లోనే విద్య నేర్చుకునే వారు. కేవలం ధనవంతుల, గొప్పవాళ్ల ఆడపిల్లలకు మాత్రమే ఇంట్లో మహిళాఉపాధ్యాయులు అందుబాటులో ఉండేవారు. మిగిలిన అందరూ కూడా తమ తల్లి దండ్రులతో కలిసి పనిచేస్తూ జీవన నైపుణ్యాలు నేర్చుకునే వారు. కానీ ఇతర బంధుమిత్రులను కలిసినప్పుడు లేదా ఎవరైనా ప్రముఖుల ఇళ్లలో ఉన్నప్పుడు మాత్రమే వారి జీవన విధానాలను గమనించి మంచి అలవాట్లు, కళాత్మక నైపుణ్యాలు నేర్చుకునేందుకు అవకాశం ఉండేది.
>
> నిజమే కానీ ఇలాంటి విధానాలు పిల్లలకు మంచివేనా అని ఎవరైనా అడగొచ్చు? కానీ దీనికి సమాధానం ఎలా చెప్పగలం? మానవ జాతి మనగలిగేందుకు అది అనుసరించిన విధానాలు మనకు ఇప్పుడు వింతగా

అనిపిస్తాయి. అలాగే, వివిధ సంప్రదాయాలు మనగలిగాయంటే అవి సామాజికంగా ఉపయుక్తంగా, మానసికంగా సంతృప్తికరంగా ఉండి తీరాలి.

*రిచర్డ్* III అనే తన జీవిత చరిత్ర గ్రంథంలో పాల్ ముర్రే కెండల్ ఒక చోట ఇలా రాశాడు. ఒక ఇటలీ పర్యాటకుడు ఇంగ్లండ్‌ను సందర్శించడానికి వచ్చినపుడు అక్కడ ధనవంతుల పిల్లలను ఎడెనిమిది సంవత్సరాలు రాగానే ఇంటికి దూరంగా పంపడాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. వారందరు పెద్దవాళ్లుగా ఎదిగే వరకు కూడా ఇతరుల ఇళ్లలో పనివాళ్ళుగా పనిచేసి ఆయా పనులు నేర్చుకునేవారు. రకరకాల నైపుణ్యాలను సంపాదించుకునేవారు. మధ్యలో పిల్లలు ఎన్నటికీ తిరిగి ఇంటికి వచ్చేవారే కాదు. కుమారులు వారి జీవితాలను వారు ఏర్పరుచుకునే వారు. కుమార్తెలకు వారు ఎవరితో కలిసి ఉంటున్నారో ఆ కుటుంబాల వారే పెళ్లిళ్లు కూడా కుదిర్చేవారు.

ఆధునిక బాల్యం ఆవిష్కరించబడనప్పుడు పిల్లలు చాలా సంతోషంగా ఉండేవారని నేను చెప్పడం లేదు. లేదా కొన్ని విధాలుగా అది కొంత మంది పిల్లల జీవితాలను మెరుగుపరచలేదని, లేదా అది ఇప్పటికీ సర్వకాల సర్వావస్థల్లో ప్రతి ఒక్కరికీ చెడ్డ చేస్తుందని కూడా అనడం లేదు. నేను చెప్పేది ఏమిటంటే, ఏ విధానం అయినా సరే అది అనేకమందికి సరిగా ఉపకరించడం లేదనుకున్నప్పుడు, అలాంటి వారిని మరో కొత్తవిధానం ప్రయత్నించి చూడడానికి అనుమతించాలి.

ఆధునిక బాల్యం కొత్తది కావడం వల్లే అది చెడ్డదని నేను చెప్పడం లేదు. అలాగని ఈ విధానం  పిల్లలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న విధానాలన్నింటి కంటే విప్లవాత్మకమైన ముందడుగు అని కూడా అనడం లేదు. పిల్లలు మనకు తెలిసినప్పటి నుంచి కూడా పెద్దల యాజమాన్యంలోనే, అదుపులోనే ఉన్నారు. ఇప్పుడున్న ఆధునిక బాల్యంలో కొత్తది చెడ్డది ఏమిటంటే, పిల్లలు పెద్దల ప్రపంచం నుంచి ఎంతో దూరం చేయబడ్డారు. పిల్లలపై  ఎప్పుడూ కూడా వారి తల్లిదండ్రులు అధికారం చెలాయిస్తునే ఉన్నారు. ఇప్పుడు కొత్త ఏమిటంటే వారి మీద వారి *తల్లిదండ్రులు మాత్రమే* అధికారం సాగిస్తున్నారు.  వారికి తమ తల్లిదండ్రులతో *మినహా* ఇతర పెద్దలెవ్వరితో దాదాపు సంబంధమే ఉండదు.

పిల్లలను పెద్దల ప్రపంచంలో భాగంగా పరిగణించిన పాత విధానం అంత జాగ్రత్తగా, ప్రణాళిక ప్రకారం రూపొందింది కాదు. ఇది సహజంగా జీవన పరిస్థితుల్లోంచి

పుట్టింది మాత్రమే. ఒక విషయం ఏమిటంటే ఏ సమాజంలోనైనా ప్రజలు చేసే దాని కంటే చేయవలసింది చాలా ఎక్కువ ఉన్నప్పుడు, పిల్లల నుంచి వీలైనంత తొందరగా, వీలైనంత ఎక్కువగా సహాయం అందాలని ఆశిస్తారు. అయితే, ఆ పిల్లలు మరీ చిన్నగా ఉంటే వారు ఎదిగి వచ్చేవరకూ వారిని బాగోగులు చూడటం తప్ప మరే వ్యాపకం లేని ప్రత్యేక వ్యక్తులు ఎవరూ అందుబాటులో ఉండరు. అప్పుడు మనం ఆందోళనతో బాధతో మనల్ని మనం " పిల్లలకు ఏది అత్యుత్తమం, ఏం చేస్తే వారికి మంచి జరుగుతుంది? పిల్లల కోసం మనం ఏం చేయగలం" అని ప్రశ్నించుకుంటూ ఉంటాం. ఈ ప్రశ్న ఆధునిక బాల్యానికి ఫలితం, కారణం రెండూ కూడా. కొత్త వ్యవస్థను రూపొందించుకోడానికి ముందు ఈ గుంజాటన లేదు. ఎందుకంటే పిల్లలకు ప్రత్యేకంగా ఏది మంచిది అనే ఆలోచన సమాజంలో ఉండేదే కాదు. అందరికి ఏది మంచిదో అది పిల్లలకూ మంచిదే అనే భావన ఉండేది.

*ది ఛేంజింగ్ నేచర్ ఆఫ్ ఏ మ్యాన్* అనే పుస్తకంలో జె.హెచ్.వాన్ డెన్ బర్గ్ బాల్యానికి పెద్దరికానికి మధ్య పెరిగిన దూరం గురించి చక్కగా అనేక ఉత్ప్రేక్షలతో వివరించాడు. పెద్దలు పిల్లలను తమ నుంచి వదిలించుకుంటున్నారు. వారిని దూరంగా తోసేస్తున్నారు. ఒక అగాధానికి అటూఇటూ వ్యతిరేక దిశల్లో నిలబడ్డట్టుగా పిల్లలు, పెద్దలు చెరో వైపు నిలబడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి చాలా కారణాలు ఉన్నాయి. కొంత వరకు పెద్దలే ఇలాంటి వాటికి కారకమవుతున్నారు. బిడ్డ ఎంతో విభిన్నమైన ప్రాణి అని, దానితో వ్యవహరించే తీరు కూడా అంతే విభిన్నంగా ఉండాలంటూ సూత్రీకరించిన రూసో (Rousseau) అనే తత్వవేత్త ప్రభావం కూడా ఈ అంశం మీద ఉంది. అందుకే పెద్దలు పిల్లలను తమ ప్రపంచం నుంచి తొలగించి వేశారు. అలా చేయడం వారికి మంచిదని పెద్దలు అనుకున్నారు. అయితే ప్రపంచం తనకు తానే పిల్లల నుంచి దూరంగా తొలగిపోయింది (అలాగే పెద్దల నుంచి కూడా). అది మరింత నిగూఢంగా, అపారదర్శకంగా మారింది. దాంతో అసలేం జరుగుతుందో, ఎవరు ఏం చేస్తున్నారో ఎందుకు చేస్తున్నారో తెలుసుకోడం లేదా చూడటం మరింత కష్టంగా మారింది.

ప్రపంచాన్ని పిల్లల నుంచి దూరం చేసిన వాటిలో ముఖ్యమైన అంశాల్లో పని స్వభావం ఒకటి. మనిషి జీవితం పొడవునా చేస్తుండే చాలా పనులు చాలా ప్రయాస భరితమైనవి, డస్సిపోయేలాంటివి, అప్పుడప్పుడు ప్రమాదకరమైనవి. అయితే వీటిలో చాలా వాటికి బలం, నైపుణ్యం, నిర్ణయం కూడా అవసరమవుతాయి. వీటిలో చాలా పనులు చెయ్యడాన్ని మనిషి గర్వకారణంగా కూడా భావిస్తాడు. వాటిని బాగా చెయ్యాలని ఆరాటపడతాడు కూడా. వ్యక్తులను వారి పని నుంచి విడదీసి చూడలేనంతగా దానితో

మమేకమైపోయారు. వారు ఏ పని ఎందుకు చేస్తున్నారనే అవగాహన కలిగి ఉంటారు. వాటిలో చాలా పనులు వారు వారి ఇళ్లకు దగ్గరలోనే చేస్తుంటారు. కానీ ప్రత్యేకీకరణ, పారిశ్రామీకీకరణ, కేంద్రీకరణ పెరిగిపోడం మొదలైనప్పటి నుంచి పని మరింత దూరం, మరింత అర్థరహితం, ఏహ్యకరం అయ్యింది. చాలామంది పెద్దలు చేస్తున్న పని ఎలాంటిదో పిల్లలు చూసే అవకాశం లేదు, వారికి అది అర్థం కూడా కాదు. చాలామంది పెద్దలు తాము చేస్తున్న పని పిల్లలు చెయ్యడానికి ఇష్టపడరు కూడా, చాలా సందర్భాల్లో వారికే ఆ పని చెయ్యడం ఇష్టం ఉండదు. మిస్ జేన్‌వే ఇంకా ఇలా అంటుంది;

... కంప్యూటర్ ప్రోగ్రామర్ల పని మామూలు మానవుడికి ఒక 'తాంత్రిక విద్య'లాగా అనిపిస్తుంది. అయితే పూర్వకాలంలోనూ 'వృత్తి రహస్యాల'ను గుప్తంగా ఉంచేవారు.. కాని ఇక్కడ రహస్యం ఏదీ ఉండదు, కానీ అదేమిటో ఎవరికీ బోధపడదు. వాస్తవానికి ఒక తరగతి జీవితానికి మరోదానికీ మధ్య నెలకొన్న దూరం ఫలితమే ఇది.

ఇక్కడ దూరం గురించి మరో అలంకారిక వివరణ–ఉత్ప్రేక్ష– గురించి చెప్పుకుందాం. ఈ రోజుల్లో జీవితం అనేక భాగాలుగా విభాజితమై ఉంది. జీవితంలోని ఈ భాగాలు ఒకదాని నుంచి మరొకటి వేర్పడి ఉంటాయి. మిస్ జేన్‌వే అన్నట్టు – జీవితంలోని వ్యక్తిగత పాత్రలు వారికి ఎంతో కీలకమైనవిగా తోస్తున్నాయి, ఎందుకంటే అవి తమకు మాత్రమే అర్థం అవుతాయి, అనుభవపూర్వకంగా తెలుస్తాయి. వారు తరచూ అంటుంటారు. "ఎక్కువ సమయం నేను ఏం చేస్తున్నానో నాకే అర్థం కాదు, కానీ నేను ఒక తల్లిగానో ఒక తండ్రిగానో నేను ఏం చేస్తున్నానో నాకు స్పష్టంగా తెలుస్తుంది." మరోచోట జేన్‌వే ఇలా అంటుంది: తమ స్వంత జీవితాలపై తమకు అత్యంత తక్కువ అదుపు ఉందని భావించే స్త్రీలే కచ్చితంగా తమ పిల్లల జీవితాలను అత్యంత అధికంగా అదుపు చేయవల్సిన అవసరం ఉందని భావిస్తారు.

సమాజం ఇంతగా సంక్లిష్టభరితం కావడం వల్ల, పెద్దలు ఇన్ని తరహాలుగా వ్యవహరిస్తూ ఉండటం వల్ల, ప్రజలు అనేక విభిన్న పాత్రలు పోషిస్తున్నట్లు కనబడటం వల్ల, పలు భిన్నమైన జీవన, పని విధానాల దృష్ట్యా చిన్న పిల్లలు తాము పెద్దయిన తర్వాత మరింత ఎక్కువ మంది, తక్కువ మందికి బదులు, పెద్దవాళ్లతో సంబంధం కలిగి ఉండాల్సిన అవసరం వల్ల... ఇలా జరుగుతోంది. సువిశాల సంక్లిష్ట సమాజంలో మాదిరిగా కాకుండా స్థిరమైన ఒక మామూలు సమాజంలోని ఒక వ్యక్తి అనేకమంది ఇతరులు ఎలా ఉంటారో అలానే ఉండే అవకాశం ఉంది. ఒక మామూలు సమాజంలో ఇంట్లో, పని ప్రదేశంలో తండ్రి ఏం చేస్తాడో అర్థం చేసుకోడం అంటే అందరు తండ్రుల

గురించి అర్థం చేసుకోడమే అనేది వాస్తవం. కాని మనంత సంక్లిష్టమైన వైవిధ్యభరితమైన సమాజంలో ఇది వాస్తవం కాదు.

అధిక అవసరాలు తీరే మార్గాలను అధిక సంఖ్యాకులు అవగాహన చేసుకున్నప్పుడే ఈ ప్రపంచాలు, ప్రపంచంలో జీవితం ఒక అర్థం కలిగి ఉంటాయి. అలా కానప్పుడు ఇవి అర్థం కోల్పోతాయి. మెక్సికోలో ఆఖరుకు ఒక ఫర్వాలేదనిపించే సుసంపన్నమైన, ఆధునిక పట్టణాలలో కూడా చాలా కొత్త భవనాలు ఒకే విధంగా నిర్మాణమవుతాయి.. ఇటుకలు కిటికీలు ద్వారాలతో గోడలు పెట్టి, కాంక్రీటు స్తంభాలు దూలాల ఆధారంగా కప్పు నిర్మిస్తారు. అలా నిర్మిస్తున్న భవనాన్ని గమనిస్తే, ఎవరికైనా సరే ఆ నిర్మాణ ప్రక్రియపై తేలికగా అవగాహన కలుగుతుంది. ఎవరైనా సరే తానూ ఆ నిర్మాణ పనిలో పాల్గొనదలచుకుంటే, అతడు ఆ ప్రక్రియను సులభంగా నేర్చుకోగలరు. అంటే, అక్కడ పెరిగిన పిల్లలకు అలాంటి గృహాలు, భవనాలు ఎలా కడతారో బాగా తెలిసి ఉంటుంది. ఆ భవనం కట్టడం తేలికని, తనకు తాను నిర్మించగలనని అదేం పెద్ద విద్య కాదని, ఆ నిర్మాణ ప్రక్రియ నేర్చుకోడం  సులభమని అర్థం చేసుకుని ఉంటారు. కానీ ఇప్పుడు నిర్మిస్తున్న ఆకాశ హర్మ్యాల నిర్మాణం విషయానికి వస్తే అది ఎలా జరుగుతుందనేది అక్కడ పనిచేసే వారిలో కూడా కొద్దిమందికి మినహా ఎవరికీ అర్థం కాదు. అటువైపుగా వెళ్ళేవారికైతే అది ఓ మిస్టరీలా అనిపించి ఆశ్చర్యపోతారు. ఆ ప్రక్రియ అర్థంచేసుకోవడానికి తమకు ఈ జీవితకాలం సరిపోదేమో అనుకుంటూ వెళ్తారు. చాలామందికి తమ జీవితాల్లో తాము గమనించే, తాము ఉపయోగించే ప్రతిదీ అలాగే తయారైంది  ఇప్పుడు.

పిల్లలకు పెద్దలకు మధ్య, పెద్దలకు వారి ప్రపంచానికి మధ్య  ఏర్పడిన దూరానికి ఒక ప్రాథమిక కారణం ఉందని వాన్ డెన్ బర్గ్ అంటున్నారు. మనం విషయాలను స్వీకరించే తీరుతో దీనికి సంబంధం ఉంది. చాలామంది విషయంలో ప్రపంచానికి ఉన్న అర్థం  –ముఖ్యంగా అతడి తత్వవేత్తలు కార్యకారణ సిద్ధాంతం ఆవిష్కరించినప్పటి నుంచి– చాలా వరకు నాశనమైపోయింది. కళ్లముందున్న వాస్తవం ఏమిటో తెలుసుకోడానికి చేసుకోడానికి గతం అవసరమయ్యింది. మానవ జీవితం అనునిత్యం శరవేగంతో  మార్పు చెందుతున్నందు వల్ల ఈ గతం సైతం తెలుసుకోనిదిగా, అర్థరహితంగా మారింది. చివరకు  మొత్తం వ్యవహారం అత్యంత సంక్లిష్టంగా తయారైంది. కార్యకారణ సిద్ధాంతం మనకు చెబుతున్నదేమిటంటే ఇది వరకు జరిగిన దాని మీద ఆధారపడే ప్రస్తుత సంఘటనలు జరుగుతుంటాయి అని. పిల్లవాడు అడుగుతాడు – ఈ మంట ఎందుకు

మండుతోంది ? అని అందుకు సమాధానంగా ఎవరో దాన్ని అగ్గిపుల్లతో వెలిగించారు అందుకని, మరి అగ్గిపుల్ల ఎలా వెలుగుతుంది ? ఎలాగంటే దాన్ని ఎవరో అగ్గి పెట్టె మీద గీయడం వల్ల వెలిగింది. ఎందుకు అలా వెలుగుతుంది? ఎందుకంటే దాని చివరన ఒక రకమైన రసాయనం ఉంటుంది అందుకే అది వెలుగుతుంది. అలా అగ్గిపుల్ల చివరన ఆ రసాయనం ఎందుకు ఉంది? ఎందుకంటే ఎవరో దాని చివరలను ఆ రసాయనంలో ముంచారు. ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా ప్రశ్నలు వస్తూనే ఉంటాయి. వాన్ డెన్ బర్గ్ దీనికి సంబంధించి చక్కటి ఉదాహరణ ఒకటి ఇచ్చాడు. చురుకైన తన ఎనిమిదేళ్ల పిల్లాడు ఒకసారి అతడిని 'ఆ చెట్టు మీద ఆకులు ఎందుకు ఎర్రగా మారుతున్నాయి, అలా ఎందుకు మారాలి?' అని ప్రశ్నిస్తాడు. దాని వల్ల ఒనగూరే ప్రయోజనం ఏమిటో, అసలు ఆ సంగతి ఏమిటో అందరి లాగే ఆ పిల్లాడూ తెలుసుకోవాలనుకున్నాడు. తండ్రి అది చెప్పేబదులు, అర్థరహితమైన జీవశాస్త్ర, రసాయన శాస్త్ర విషయాల పద్మవ్యూహంలోకి కుర్రాడిని తీసుకుపోయాడు. అయితే పిల్లవాడి నుంచి, అతడు వేసిన ప్రశ్న నుంచి, అతడి ఆసక్తి నుంచి తను దూరంగా వెళ్లిపోతున్నానని తండ్రికి తెలుసు కూడా. అయినా తను తీసుకున్న శాస్త్రీయ శిక్షణ తనతో అలా చెప్పించింది. దాని ద్వారా పిల్లవాడికి కావల్సిన సమాధానం దొరకదు. ఎందుకంటే, ప్రతిదీ గతంలో జరిగిన ఏదో ఒకదాని ఫలితమే అనడం వల్ల *ఇక దేనికీ ఏ పాయింటూ ఉండదు.*

ప్రజలు జీవితపు అర్థాన్ని దాని ప్రయోజనం రూపంలోనే చూస్తూ ఉండేవారు. స్వల్ప కాలంలో తమచుట్టూ జరిగే దాని ప్రయోజనం ఏమిటో మామూలు భావంలో వారికి తెలుసు, దాన్ని వారు గ్రహించగలిగేవారు. "ఎందుకిలా జరుగుతోంది?" అనే పిల్లవాడి ప్రశ్నకు సమాధానం గతంలో లేదు. నిన్న ఏదో జరిగింది కాబట్టి ఇవ్వాళ అలా జరిగింది, నిన్న అలా ఎందుకు జరిగిందంటే మొన్న ఏదో జరిగింది కాబట్టి అలా అలా చెప్పుకుపోవడంలో సమాధానం లేదు. మరొకటేదో జరిగేందుకు వీలుగా అలా జరిగింది అన్నదే అది. తన ఉండేందుకు ఒక ఇల్లు కట్టుకోడానికో లేదా భోజనం తయారు చేసుకోడానికి వంటచెరకుగా వాడుకోడానికో మనిషి చెట్టు నరుకుతాడు. జంతు చర్మాలను కత్తిరించి చెప్పులు తయారు చేస్తున్నాడు, వాటిని వేసుకుని సురక్షితంగా రాళ్లు రప్పలు ఉండే రోడ్ల మీద నొప్పి లేకుండా నడుస్తాడు. లోకంలోని ప్రతి పనికి ఒక కారణం ఒక ఉపయోగం ఉంటుంది. అలా విస్తృతార్థంలో ప్రపంచం, జీవితం రెంటికీ ప్రయోజనం కూడా ఉంది, అది "దేవుడి ప్రయోజనం" అయినప్పటికీ. సామాన్య మానవులు దీన్ని తెలుసుకోలేరు. దాన్ని మరీ ఎక్కువగా తెలుసుకోడానికి వారిని ప్రోత్సహించలేదు.

మనం నాశనం చేసిన ఈ అన్నీ, ప్రతిదీ ఒక కారణం కలిగి ఉంది, ఏదీ ఒక అర్థం కలిగి లేదు. మొత్తం విశ్వం ఒక పెద్ద యంత్రం. ఎంతోకాలం క్రితం అది అనూహ్యంగా తిరగడం ప్రారంభించింది. తర్వాత అది నిదానంగా వేగం కోల్పోయింది. దానిమీద ఉన్న చిన్న యంత్రాల వంటి మనం కూడా వేగం కోల్పోయాం. ఈలోగా మన చుట్టూ ఉన్న ప్రపంచం ఎప్పటికప్పుడు మరింత వేగంగా మారిపోతుంది. కాబట్టి గతం దానంతటదే అదృశ్యమవుతుంది. ఈ రోజుల్లో పిల్లలకు పెద్దల కంటే కూడా ఈ ప్రపంచం గురించి ఎన్నో విధాలుగా చాలా ఎక్కువ తెలుసు అని మార్గరెట్ మీడ్ కొద్దికాలం క్రితం చెప్పింది. పెద్దవాళ్లు తమ జీవితంలో ఎక్కువ భాగం ప్రపంచం గురించి తెలుసుకోడానికే గడిపేశారు. అలా తమకు తెలిసిన ఆ ప్రపంచం ఇప్పటికే అదృశ్యమైపోయింది. అయితే తమ చుట్టూ ఏం జరుగుతోందో తెలుసుకోడానికి మీ తాతలు మిమ్మల్ని అడిగి తీరాల్సిన పరిస్థితి ఉన్న ప్రపంచంలో పెరిగి పెద్దవటం అనేక విధాలుగా ఘోరమైన విషయం. ఈ లోకంలో ఒక స్థిరత్వ భావనను, మానవుడు మానవత్వం అనే భావనను మనం తిరిగి ఎలా ప్రవేశపెట్టబోతున్నాం? అలా చేసినప్పుడే, ఈ ప్రపంచం మన కోసం తిరిగి ఒక అర్థాన్ని సంతరించుకుంటుంది. అంతదాకా మనందరం, పెద్దా చిన్నా సహా, దారితప్పిన వారిలా గందరగోళంగా ఈ ప్రపంచంలో సంచరిస్తూ ఉంటాం.

# 4. కుటుంబం దాని లక్ష్యం

**చా**లామంది పిల్లలకు ఎక్కువ స్వేచ్ఛనివ్వడం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బ తింటుందని అనుకుంటారు. ఫ్యామిలి అంటే అమ్మా, నాన్న పిల్లలు అనేది ఇప్పటి కొత్త ఆవిష్కరణ. నిజానికి కుటుంబం అనే కాన్సెప్ట్ ఎప్పుడో వంద సంవత్సరాల క్రితమే అంతమైపోయింది. మూడు వందల సంవత్సరాల క్రితం యూరోపియన్ కుటుంబానికి ఇప్పుడున్న కుటుంబానికి చాలా తేడా ఉంది. అప్పుడు దేశమంతా ఒకే కుటుంబంగా ఉండేది, కుటుంబాన్ని ప్రత్యేకంగా వ్యక్తిగతంగా అప్పటికి ఇంకా ఆవిష్కరించలేదు. చాలా మందిలోని చాలా రకాల సమస్యలకు ఈ ఆధునిక కుటుంబ వ్యవస్థ కారణం కాకపోవచ్చు. కానీ సమస్యలు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి.

కుటుంబంలో బలమైన, అవసరమైన అంశాలకు నా ప్రతిపాదన వల్ల ఎలాంటి నష్టం ఉండదు. కానీ నిజం ఎంతో శక్తివంతమైనది. మతం పట్ల ప్రగాఢమైన విశ్వాసం కలిగిన వారితో దేవుడు లేడు అని వాదించినంత మాత్రాన వారిని దేవుడు లేడని ఒప్పించగలమా, అలాగే సంతోషంగా జీవితం గడుపుతున్న దంపతుల దగ్గరికి వెళ్ళి పెళ్లంటే కేవలం స్త్రీని దోపిడీ చేసే వ్యవస్థ మాత్రమే అని చెప్పడం వల్ల వారి అభిప్రాయం మారుతుందా ! ఎవరికైనా సరే, వారి అనుభవాలే వారికి జీవితంలో చాలా నేర్పిస్తాయి.

ఇంత కఠినమైన ప్రపంచంలో కుటుంబం అనేది ప్రేమానురాగాలతో అలరారే ఒక ద్వీపం లాంటిది. కానీ తరచుగా కుటుంబంలోని సభ్యులు వారి కోపాన్ని, ఆవేదనను ఒకరిమీద ఒకరు తీర్చుకుంటారు. ఇలా సమాజంలో మరెవరితోనూ వారు ప్రవర్తించలేరు. కుటుంబమంటే ఎలా తయారైందంటే మనకు ఎలాంటి శ్రమ లేకుండా స్నేహితులు,

సన్నిహితులను అందించడానికి బదులుగా ఎలాంటి శ్రమ లేకుండా బాధితులు, శత్రువులను అందజేసేదిగా తయారైంది. దయతో, ప్రేమతో నిండిన మాటలకు బదులుగా చాలా కఠినమైన పరుషమైన మాటమాట్లాడుకునే ప్రదేశంగా మారింది.

ఇది మనకు చాలా అసంతృప్తిని కలిగిస్తుంది. ఇది మనలో సంభ్రమాశ్చర్యాలు కలిగించడానికి బదులుగా భయపెడుతుంది. కుటుంబం అనేది పిల్లలు సంతోషంగా ఉండడానికి లేదా వారిలో రక్షణ భావన కల్పించడానికి లేదా మానసిక బలం పెంచడానికి ఏర్పాటు చేసింది కాదు. భద్రత లేని సంఘంలో మనిషి తన ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. వీలైనంత ఎక్కువ మంది పిల్లలు పుట్టాలి. వారిని వారి కాళ్ల మీద వాళ్లు నిలబడే వరకు సంరక్షించాలి. " ఫలించి అభివృద్ధి పొందుము" అనేది బైబిల్ వాక్యం. ఏ సమాజం లేదా కమ్యూనిటీ కూడా కరువు వల్ల లేదా క్షామం, యుద్ధం లేదా ప్లేగు వంటి వ్యాధుల వల్ల తుడిచిపెట్టుకుపోవడం జరగలేదు. ఈ సమాజంలోని నియమాలు అన్నీ కూడా సమస్య పరిష్కారానికి కొన్ని నైతిక సూత్రాలను పునాదిగా ఏర్పడ్డాయి. ఈ నియమాలే ఇప్పుడు మన అత్యంత ఆవశ్యక అవసరాలను కూడా వ్యతిరేకిస్తున్నాయి. యువతలో పెరిగే లైంగిక వాంఛకు ఇవి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. నియమాలు ఎంతవరకు వచ్చాయంటే మీరు పిల్లలు కనడానికి తప్ప లైంగిక చర్యకు ఉపక్రమించ కూడదు అనే వరకు. నువ్వు కచ్చితంగా నీ బిడ్డకు తల్లిగా ఉన్న స్త్రీ సంరక్షణ బాధ్యత తీసుకొని తీరాలి. పాపాయి పుట్టిన తర్వాత తప్పనిసరిగా నువ్వు ఆ పాప సంరక్షణ కూడా చూసుకోవాలి. ఇది చాలా పెద్ద బాధ్యత అవుతుంది. అందువల్ల చాలా మంది యువకులు వీలైతే దీన్ని తప్పించుకోవాలనే అనుకుంటున్నారు. మార్గాలన్నీ పకడ్బందీగా మూసేశారు. నియమాలు మరింత కఠినంగా అమలు చేశారు, ఇక లైంగిక వాంఛ తీర్చుకునే మార్గమే లేకుండా చేశారు. అయితే ఈ చేదుగుళికలకు కాస్త తియ్యదనాన్ని పూతపూసి స్త్రీని ఆమెకు కాబోయే బిడ్డను పురుషుడి ఆస్తిగా మార్చారు. వాళ్లు అతడి కోసం పనిచేయాలి, అతడి మాట వినాలి. మానవ వనరులు పెట్టుబడి వ్యవస్థలో అత్యంత కీలకమైనవి. ఎక్కువ మంది సభ్యులు కలిగిన కుటుంబ యజమానిని ఒక ధనవంతుడిగా ఒక అదృష్టవంతుడిగా పరిగణించడం మొదలైంది. ఈ ఆవిష్కరణ ఫలితాలు ఇవ్వడం మొదలుపెట్టింది. జన సంఖ్య రెట్టింపవడం మొదలైంది. కొద్దిరోజుల్లోనే కుటుంబం అనేది ఒకరి మీద మరొకరికి అధికారాన్ని ఇచ్చే వ్యవస్థగా

రూపాంతరం చెందింది. పురుషులు స్త్రీలకు యజమానులుగా మారారు, మగ పిల్లలు ఆడపిల్లలు తాము ఎలా యజమానులుగా మారాలో, ఎలా యాజమాన్యంలో ఉండాలో నేర్చుకున్నారు.

వీటితో పాటు కుటుంబానికి సంబంధించిన మరిన్ని విషయాలు కూడా అమలు లోకి వచ్చాయి. మనిషి సహజంగా సంఘజీవి. అతడికి ప్రేమాభిమానాలు కూడా కావాలి. ఎంత ఎక్కువ మంది తన చుట్టూ ఉంటే అంతటి భద్రతాభావన కలిగి ఉంటాడు. కానీ కుటుంబం ప్రేమకు బదులుగా అధికారాన్ని నెలకొల్పింది. ఇది ఎక్కడి వరకు వచ్చిందంటే కుటుంబం అంటే చిన్నపాటి రాజ్య వ్యవస్థగా మారింది. రోమన్ చట్ట ప్రకారం కుటుంబంలోని తండ్రికి అతడి ఆధ్వర్యంలో ఉన్న అతడి భార్యా పిల్లల జీవితం మీద బానిసల మీద ఉన్నట్టుగానే పూర్తి అధికారం ఉంటుంది. కొన్ని అరబ్ దేశాల్లో ఇప్పటికీ ఇలాంటి నియమాలు ఇంకా అమలులో ఉన్నాయి. కొంత కాలం క్రితం ఒక అరబ్ దేశంలో ఒక తండ్రి తన పదిహేను సంవత్సరాల కూతురు మగపిల్లలతో స్నేహంగా ఉంటుందన్న కారణంతో ఆమెను చంపేశాడు. ఆమె వారితో లైంగిక సంబంధాలు కలిగి ఉన్నదని కూడా ఆరోపణ చేయలేదు. ఇంత పెద్ద నేరానికి అతడు కేవలం ఏడు నెలలు జైల్లో గడిపాడు. తర్వాత అతడికి దేశాధినేత నుంచి క్షమాభిక్ష దొరికింది. ఇలాంటి క్షమాభిక్షలు అక్కడ సర్వసాధారణం. తల్లిదండ్రులే పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని ఈ మధ్య వార్తా పత్రికల్లో కథనాలు వచ్చాయి. 20 ఏళ్ల ప్రాయంలోకి వచ్చిన వారిని సైతం నిర్బంధంలో ఉంచుతున్నారు. కొన్నిసార్లు కొన్ని వారాల పాటు బంధిస్తున్నారు. కొన్ని మతాల ప్రభావం పడకుండా కాపాడాలన్న ఉద్దేశంతో ఇలా చేస్తున్నారట. ఇలాంటి వాటికి వ్యతిరేకంగా ఎలాంటి చట్టాలు లేవు. కిడ్నాప్ చేసింది అతడి తల్లిదండ్రులైతే ఓకే. పిల్లలు ఎంత వయసు వారైనా పర్లేదు.

ఇది కుటుంబపు చాలా భయంకరమైన ఒక రూపం. దీన్నే ఎంతో ఆవేశపడుతూ వెనకేసుకొస్తున్నారు. కాబట్టే కుటుంబం అంటే పిల్లల ఎదుగుదలకు, స్వేచ్ఛకు ప్రతీకగా కాకుండా బానిసత్వానికి, నియంతృత్వానికి (కొన్నిసార్లు దాన్నే 'ప్రేమ' అని సమర్థిస్తుంటారు) చిన్నపాటి ప్రతిరూపంగా చాలామంది భావించసాగారు. ఈ కుటుంబ వ్యవస్థలో ప్రశ్నించకుండా అధికారానికి ఎలా లోబడి ఉండాలో పిల్లలు నేర్చుకుంటారు. ఇది బానిసత్వానికి శిక్షణ ఇవ్వడం వంటిది మాత్రమే.

మరో వైపు కేవలం కుటుంబంలో మాత్రమే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని వాదిస్తుంటారు. ఎలిజబెత్ జేన్‌వే కింది విధంగా చెబుతున్నారు:

> "పిల్లలు పెంచి పెద్ద చేయాలి. అది వారికి అవసరమే. ఆ పెంపకం సాన్నిహిత్య వాతావరణంలో జరగాలి. వారికి ప్రేమ, సుస్థిరత, నిరంతరమైన మరియు సాటిలేని సంరక్షణ, వారి పట్ల తగినంత ఆసక్తి కనబరచి, శ్రద్ధగా, సున్నితంగా చూసుకునే వారితో ఎప్పటికీ కొనసాగే బాంధవ్యాలు అవసరం."

మరో వ్యాపకం ఏదీ లేని ఒక వ్యక్తి కనుసన్నలలో అనుక్షణం ఉంటేనే పిల్లలు సవ్యంగా పెరిగి పెద్దవారు అవుతారన్న భావన ఎంతో ఆధునికమైనది.

ఈ ఆధునిక పిడివాదం పేర్కొనే సంరక్షణ లేకుండానే అనేకమంది పిల్లలు పెరిగి పెద్దవుతున్నారని మిస్ జేన్‌వే తన పుస్తకంలోని ఇతర భాగాలలో పదే పదే ప్రస్తావిస్తారు. ఆమె పుస్తకం 180వ పేజీలో :

> "చాలామంది స్త్రీలు వారికి డబ్బు కావాలి కాబట్టి పనిచేస్తుంటారు. అవి ఆకర్షణ లేని ఉద్యోగాలే గానీ వృత్తులు కావు.
>
> స్త్రీ స్థానం ఇల్లే అనే మన కల్పిత భావనకు సంబంధించి ఈ వాస్తవం ఒక ఆసక్తికరమైన విషయం వెల్లడిస్తుంది. చరిత్ర పరిశీలిస్తే ఇది మధ్యతరగతి కల్పన అని మనకు అర్థమవుతుంది. 'ఉత్పత్తి చేయడానికి ఆడది, ఆ ఉత్పత్తిని అనుభవించడానికి మగాడు' (Veblenesque) అనే పరిస్థితి రాజ్యమేలుతున్నప్పుడు శ్రామిక విపణి నుంచి మహిళను దూరంగా ఉంచి ఇంటికి పరిమితం చేయగలిగిన స్తోమత ఉన్న ఒక సమాజాన్ని మాత్రమే ఈ కల్పన ప్రతిబింబిస్తుంది."

మరో ఆధునిక భావన ఏమిటంటే... పిల్లలు కుటుంబంలో నుంచే తమ భావి జీవితపు నమూనాలు రూపొందించుకుంటారు. పురుషుడుగా లేదా స్త్రీగా ఉండటం అంటే ఏమిటో ఒక అవగాహన ఏర్పరచుకుంటారు. సామాజిక శాస్త్రవేత్త టాల్కాట్ పార్సన్స్ మాటలు కూడా మిస్ జేన్‌వే ఇలా ఉటంకిస్తుంది : "పిల్లలు తాము నివసించే

ఈ ప్రపంచం గురించి, ఈ సంస్కృతి గురించి మనం న్యూక్లియర్ ఫ్యామిలీగా పిలిచే ఆ సంస్కృతి యొక్క ఉపవిభాగంలో పెరిగి పెద్దవారవుతూ నేర్చుకుంటారు… తర్వాత తన కుటుంబ సభ్యులు తాను నివసిస్తున్న ఇతర ప్రపంచంలో సర్వసామాన్యమైన సామాజిక సంబంధాలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలుసుకుంటారు.” నేడు ఈ వాదనలో అంతగా సత్యం కనిపించదు. తమ చుట్టూ సాగుతున్న పెద్దవారి జీవనం కట్టెదుట పరిపూర్ణంగా కనిపించేటప్పుడు, వయోజన జీవితం నడుమ తమ స్వంత జీవితాలు గడుపుతున్నప్పుడు, వారు తరచూ పెద్దవారితో కలిసి పని, ఆట, పండగ, ఆచారం, చావు, సంతాపం వంటి పనుల్లో పాల్గొంటున్నప్పుడు ఇలాంటి “నమూనాలు” పిల్లలకు అవసరమై ఉంటాయా? తన తండ్రి సాయంత్రం ఇంటికి వచ్చి, నింపాదిగా కూర్చుని, బహుశ పేపరు చదువుతూ, ఆ తర్వాత మిగిలిన సాయంత్రమంతా.. అలాగే వారాంతపు సెలవు దినాల్లో చాలావరకు.. టీవీ చూస్తూ గడిపే తండ్రి నుంచి లేదా ఇంటి పనులను చక్కబెట్టడంలో తీరిక లేకుండా ఉండే తల్లి నుంచి ఆధునిక పిల్ల లేదా పిల్లాడు ఎలాంటి ఆదర్శ వయోజీవనం పొందగలరు? అయితే ఇదేనా మగవారు ఆడవారు అంతా గడిపే జీవితం? ఇదొక అసమగ్రమైన, ఛిద్రమైన జీవనం. కాబట్టే ఇలాంటి ఈ ఆధునిక చిన్న కుటుంబం (న్యూక్లియర్ ఫ్యామిలీ) వయోజన సామాజిక జీవనానికి ఒక చెడు నమూనా మాత్రమే కాదు, ప్రపంచం నుంచి విడిపోయిన ఈ ఒంటరి కుటుంబం వల్ల సరికొత్త నమూనాలు అన్వేషించుకోవాల్సి వస్తోంది.

కానీ పిల్లలకు చాలా ఎక్కువమందితో సంబంధ బాంధవ్యాలు అవసరమవుతాయి. చిన్న కుటుంబం సహజంగా ఇందుకు ఉపయుక్తంగా ఉండదు. ఒక్కోసారి విధ్వంసకారిగా కూడా ఉంటుంది. ఇది చాలా చిన్నదిగా ఉంటుంది కాబట్టి ఇలా జరుగుతుంది. చిన్న కుటుంబంలో సభ్యుల మధ్య సంబంధాలు చాలా బలీయంగా ఉంటాయి, అందుకే అవి విచ్ఛిన్నమయ్యే రిస్కు కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు ఏ విషయం గురించైనా లేదు కాదు అని చెప్పడానికి ధైర్యం చెయ్యరు కారణం వారితో తమ ఆదర్శ సంబంధాలు చెడిపోతాయేమోనని భయపడతారు. ఏదైనా ‘కాదు’ అని చెప్పడానికి ముందు వారు కోపం తెచ్చుకుంటారు. దాంతో పిల్లలు తల్లిదండ్రులను నొప్పించడం ఇష్టం లేక తామే వెనక్కు తగ్గుతారు. కుటుంబం ఇలా చాలా బలమైన ఫీలింగ్స్ మీద ఆధారపడి ఉంటుంది. తన చుట్టూ తాను గిరి గీసుకుని ఉంటుంది. ఇతరులతో లేదా సమాజంతో కలయిక ఉండదు. ఇది చాలా బలహీనమైనది కూడా.

అంతర్గతంగా ఒక చిన్న గొడవ వచ్చినా తట్టుకోలేదు. కుటుంబం అనే భావనలో అనుభూతులు (ఫీలింగ్స్) మాత్రమే ఉంటాయి. కుటుంబంలో అనుభూతులు తప్ప మరేమీ లేనట్లయితే, అది కేవలం అనుభూతులకు వేదిక మాత్రమే అయినట్లయితే, అందులోని ప్రతి ఒక్కరూ ప్రతిఒక్కరి పట్లా మంచి అనుభూతులు కలిగి ఉండటం లేదా ప్రతి ఒక్కరినీ ప్రేమిస్తూ ఉండటం మీదే దాని మనుగడ ఆధారపడినట్లయితే, కుటుంబసభ్యులు ఒకరికొకరు ఉపయోగకరంగా ఉండడం మినహా మరో దారి లేనట్లయితే, ఆ కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న పరస్పర వాత్సల్యాలను ప్రమాదంలో పడేసేది ఏదైనా సరే నిరంతరం ఒక ముప్పుగా పొంచి ఉంటుంది. అతి సాధారణమైన విభేదాలు, కలహాలు అక్కడ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటాయి.

కొన్ని సందర్భాల్లో నేను నా ఏడేళ్ల స్నేహితురాలికి 'నో' అని చెబుతాను. (కొన్ని సార్లు ఆమె కూడా నాకు అదే చెబుతుంది) కానీ అలా చెప్పినపుడు ఆమె నాగురించి రేపు ఏమనుకుంటుందో అని కానీ అందువల్ల మా స్నేహం మీద ఏదన్నా దుష్ప్రభావం పడుతుందేమో అనే ఆలోచన గానీ నాకు రానే రాదు. ఎందుకంటే నాకు కానీ, ఆమెకు కానీ అలాంటి బెంగ లేదు. లేదని లేదా కాదని చెప్పడం అప్పుడు ఆ సందర్భానికి మాత్రమే చెందినది. అప్పుడు లేదని లేదా కాదని చెప్పడం ఆమెను తిరస్కరించడం కాదు. కాబట్టి ఆమె అప్పుడు నేను చెప్పిన కాదు లేదా లేదును అప్పటి వరకు మాత్రమే తీసుకుంటుంది. జీవితం ముందుకు సాగుతుంది. మేము ఒకరినొకరం తెలుసుకుంటూ, జరుగుతున్న మార్పుగుర్తిస్తాం. జ్ఞానం, సంతోషం ఒకరికొకరం ఇచ్చిపుచ్చుకుంటూనే ఉంటాం అవకాశాన్ని బట్టి.

తోడబుట్టిన వారి మధ్య వైరం ('sibling rivalry') అనేది మన కాలపు మాట. ఒక కుటుంబంలోని పిల్లలు తమ తల్లిదండ్రులు తమను పట్టించుకునేందుకు, వారి 'ప్రేమ'ను పొందేందుకు పరస్పరం ద్వేషించుకోవాలని, వెర్రిగా నిర్దాక్షిణ్యంగా పోటీపడాలని, అది చాలా మామూలు అన్నట్లుగా అది ఎంతో ఆరోగ్యకరమైనదిగా సవ్యమైనదిగా భావిస్తాం. పోటీ ఎందుకు అంత ఉన్మాదంగా ఉంటుంది? కారణం : వారికి ఎంతో అవసరమైన వారు ఎంతగానో కోరుకునే శ్రద్ధ, అభిమానం, సలహా, సాహచర్యం, సంరక్షణ చాలా కొరతగా ఉంటాయి. ఎందుకు అంత కొరత? తల్లిదండ్రులు మినహా మరెవరూ వాటిని పిల్లలకు అందించేవారు వేరెవరూ లేరు కాబట్టి.

కావాలనుకున్నప్పుడు వైదొలగే సులభ సంబంధాలు ఉండే వయోజన మిత్రులు పిల్లలకు చాలామంది అవసరం. ఇలాంటి బాంధవ్యాలు విస్తారిత కుటుంబంలోనూ వారికి లభిస్తాయి. ఇలాంటి ఉమ్మడి కుటుంబంలో అనేక మంది అమ్మమ్మలు, తాతయ్యలు, పిన్ని, బాబాయి, పెద్దమ్మ, పెదనాన్నలు, అత్తలు, మామయ్యలు, వాళ్ల పిల్లలు... ఇలా చాలామంది అందుబాటులో ఉంటారు. చెప్పాలంటే చిన్న పాటి స్థానిక సమాజాలలో (కమ్యూనిటీలలో) కూడా ఇలాంటి బాంధవ్యాలకు అవకాశం ఉంటుంది. ఇలాంటి అవకాశం న్యూక్లియర్ ఫ్యామిలీగా పిలిచే చిన్న కుటుంబంలో ఉండదు.

ఇప్పుడు మనకు కావల్సింది ఉమ్మడి కుటుంబాల పునరావిష్కరణ... లేదంటే పిల్లలకు వారికిష్టమైన రీతిలో వారికి నచ్చినట్టు వారే తమ స్వంత విస్తారిత కుటుంబాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛనివ్వాలి. పిల్లలు స్నేహం చేసే పెద్దవారు వారి తల్లిదండ్రుల స్నేహితులై ఉండాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులు సాధారణంగా వారి లాంటి వారినే వారికి స్నేహితులుగా ఎంచుకుంటారు. పిల్లలు స్నేహితుల ఎంపికలో చాలా వైవిధ్యం ప్రదర్శించవచ్చు. తద్వారా వారు ఒకరి నుంచి కొన్ని విషయాలు మరొకరి నుంచి మరికొన్ని విషయాలు గ్రహిస్తారు. మా సోదరి పెరుగుతున్న క్రమంలో తనకు ఒక మంచి స్నేహితురాలు ఉండేది. ఆమె ఒక పెద్దావిడ. అయినా ఆమె తనకు చాలా ముఖ్యమైన స్నేహితుల్లో ఒకర్తె. కానీ వారి స్నేహం ఆమె మా అమ్మానాన్నలకు నచ్చేది కాదు. ఇరవైముప్పైల వయసులో ఉన్న చాలామంది ఒకనాటి ఉమ్మడి కుటుంబాలను లేదా స్థానిక సమాజాలను ఏదో ఒక తరహా సంస్థల్లో పునర్ సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది వారికి మంచిదే కానీ చిన్న పిల్లలకు అంత మంచిది కాదు. ఎందుకంటే ఈ కమ్యూనిటీ సభ్యులంతా దాదాపు ఒకే తరహా మనుషులై ఉంటారు. ఏకారణం లేకుండానే మన చుట్టు ఉండే అందరూ లేదా పిల్లల చుట్టు ఉండే అందరూ దాదాపు ఒకేలా ఉంటాం. రాబర్ట్ ఫ్రాస్ట్ తన కవిత "డెత్ ఆఫ్ ద హైర్డ్ మ్యాన్"లో చాలా చక్కగా వివరించారు. వ్యవసాయదారులైన ఒక యువజంట వంట గదిలో ఒక బాడుగ మనిషి బాగా డస్సిపోయి కూర్చుని ఉంటాడు. అతడు వృద్ధుడైపోయాడు, పైగా అనారోగ్యం పీడిస్తోంది. కాబట్టి పని చేయలేకపోతున్నాడు. భర్తకు అతడి విషయంలో ఏం చేయాలో పాలుపోలేదు. అతడు చాలా ఆశ్చర్యపోయాడు.. దగ్గర్లో బంధువులు ఉన్నప్పటికి అతడు తమ ఇంటికి ఎందుకు వచ్చాడని! దానికి

సమాధానంగా అన్నట్లు భార్య అంటుంది:"నువ్వు వెళ్లాల్సి వచ్చినప్పుడు వాళ్లు నిన్ను లోపలికి అనుమతించేదైతేనే అది నీకు ఇల్లు."

అటువంటిదే ఈ సమస్య.. పిల్లలకు అలాంటి ఇళ్లు చాలా కావాలి. పిల్లల కంటే పెద్ద వారికి చాలా ఇళ్లు ఉన్న భావన ఉంటుంది. ఎంతో అవసరమైనప్పుడు, లేదా ఏదైనా సంక్షోభం ఎదురైనప్పుడు మనం వెళ్లగలిగే, కచ్చితంగా సహాయం పొందగలిగే, తల దాచుకోడానికి ఆశ్రయమిచ్చే అనేక ఇళ్లు అవసరమని పిల్లల కంటే చాలామంది పెద్దవాళ్లకే ఎక్కువగా అనిపిస్తుందనుకుంటా. సాధారణంగా సమాజం వ్యక్తుల కోసం ఇలాంటి ఇళ్లను అందించే స్థితిలో సమాజం లేదు. ప్రతి వ్యక్తి తనకు తానే అలాంటి ఇల్లును గుర్తించి ఏర్పాటు చేసుకోగలడు. చిన్న పిల్లలను కూడా అందుకు అనుమతించి వారికి తగు విధంగా సాయపడాలి.

# 5. పెద్దలకు అధికార భంగం

**పి**ల్లలు పెరుగుతున్న కొద్ది వారి మీద పెద్దలు  అధికారం  కోల్పోవడం సాధారణంగా మనం చూస్తుంటాం. పిల్లలతో పెద్దవాళ్ళు చాలా కలివిడిగా ఉండడం, వారితో చాలా మెతకగా వ్యవహరించడం, వారు అడిగిన దేనికీ కాదనకపోవడం వల్ల, వారిని భయపెట్టకపోవడం వల్ల వారికి అలుసుగా మారి ఇలా జరుగుతుందని అందరు భావిస్తారు. కానీ చిన్న వయసులోనే తప్పుదోవ పట్టిన వారిని గమనిస్తే వారునూ ఎంతో భయభక్తులతో పెరిగిన వారే కావడం మనం గమనించవచ్చు.

దీనికి సరైన సమాధానం మరో చోట ఉంది. నేను పిల్లల మీద పెద్దలు పట్టుకోల్పోవడం గురించి మాట్లాడినప్పుడల్లా నాకు ఒక సంఘటన గుర్తొస్తుంది. అది బహుశా 1959లో మాట. నా ఫిఫ్త్ గ్రేడ్ క్లాస్ రూంలో జరిగిన సంఘటన... అది ఫ్రీ టైం కావడంతో పిల్లలంతా క్లాస్ రూంలో ఒక చోటచేరి మాట్లాడుకుంటున్నారు. ఒక నలుగురైదుగురు పిల్లలున్న చిన్న గుంపులో నుంచి ఒకతను ఇలా అనడం వినిపించింది. “నేను పెద్దవాడినయ్యేట్లయితే...” అని అంటున్నాడు. ఏమిటీ సంభాషణ? “నేను పెద్ద వాడినయ్యేట్లయితే...”. పదేళ్ళ పిల్లలు ఎంత చురుగ్గా ఉంటారో తెలుసు గదా!  వెంటనే ఒక పిల్లాడు ఇలా ప్రశ్నిస్తాడు కాబోలు అనుకున్నా: “ఏంటిరా నువ్వు మాట్లాడేది? ‘నేను పెద్దవాడినయ్యేట్లయితే’ అంటే  ఏంటర్థం? నీకేమైనా బుర్ర ఉందా లేదా? మనం పెద్ద వాళ్లం కాక ఏమవుతాం? అసలు  నీకా అనుమానం ఎందుకొచ్చింది?” ఇలాంటిదే ఏదో ఒక కౌంటరు వస్తుందనుకున్నా. అయితే ఎవరూ అతడికి అడ్డు తగల్లేదు.  దానిక్కారణం కొద్దిసేపటికి అర్థమైంది. వాళ్లందరిలో మెదిలే ప్రశ్ననే ఆ పిల్లాడు లేవనెత్తాడు. వాళ్లందరిలో ఉన్న సందిగ్ధతనే అతడు వ్యక్తం చేస్తున్నాడు.

ఆ సంభాషణతో నా కాళ్ల కింద భూమి వణికినట్లయింది. "నేను పెద్దవాడి నయ్యేట్లయితే" పదేళ్లప్పుడు నా స్వీయ బాల్యానుభవాలు జ్ఞప్తికి వచ్చాయి. నా దిగుళ్లు, నా సమస్యలు, నా భయాలు నాకుండేవి. అయితే నేను పెరిగి పెద్దవాడినవుతానా లేదా అనే దిగులు మాత్రం కచ్చితంగా వాటిలో లేదు. ఏమైనా, నెనెటూ పెద్దవాడిని కాబోతున్నానని మాత్రం నాకు తెలుసు. నా ముందర విశాలమైన జీవితం పరుచుకుని ఉందని కూడా అనిపించేది. అయితే భవిష్యత్ గురించి ఎక్కువగా ఊహ ఉండేది కాదు. అప్పట్లో నాకు ఒకే ఒక అస్పష్టమైన ధ్యాస ఉండేది. అది... ఏదో ఒక రోజున కాలేజి ఫుట్‌బాల్ టీములో నేను ఆడతానన్న ఆశ. అప్పట్లో నా ఊహ నా ఆకాంక్ష అంతకు మించి పోలేదు. అంతకు మించి భవిష్యత్తు మీద నాకెలాంటి ఐడియా ఉండేది కాదు. ఆరేళ్ల తర్వాత కూడా భవిష్యత్తు అంతకంటే స్పష్టంగా ఏం ఉండేది కాదు. అయితే, నాకు భవిష్యత్తు ఉందనే విషయంలో మాత్రం నమ్మకం ఉండేది.

అక్కడున్న పిల్లలందరూ కూడా ఎగువ మధ్యతరగతి, సంపన్నవర్గాల పిల్లలే. అయినా వారికి భవిష్యత్తు గురించిన భద్రతా భావనలేవీ లేవు. కొన్ని సంవత్సరాల తర్వాత ఈ వయసు పిల్లల్లో చాలామంది ఆటంబాంబు నుంచి రక్షించుకోవడానికి డెస్క్ కింద ఎలా దాక్కోవాలో సాధన చేసిన వారున్నారు. వారిలో చాలామంది రాత్రి పూట ఆటంబాబు పడినట్టు, ప్రపంచం అంతమైపోతున్నట్టు పీడకలలతో బాధపడ్డట్టు సైకాలజిస్టులు, సైకియాట్రిస్టుల రిపోర్టులు తెలుపుతున్నాయి. నేనూ బాంబు దాడి గురించి ఆలోచిస్తూ గడిపాను అలాంటి పరిస్థితి వస్తే అని ఆలోచించాను కూడా. కానీ నాకు ఎప్పుడూ అణుబాంబు దాడితో ప్రపంచం అంతమైపోవడం వంటి కల రాలేదు. ఎందుకో తెలియదు కానీ ఆ బాంబులు పేలవు అని అనుకున్నా. కానీ చాలామంది పిల్లలు బాంబుపేలుళ్లను తలచుకొని చాలా బాధపడ్డారు. చిన్నపిల్లాడిగా ఉన్నపుడు నేను సంతోషంగా ఉన్నా లేకున్నా భవిష్యత్తు బావుంటుందన్న ఆశ మాత్రం ఉండేది. నా ఫిఫ్త్ గ్రేడ్ విద్యార్థులు తర్వాతి పది సంవత్సరాలలో అత్యంత అరాచకంగా తయారయ్యారు. నేను చాలామంది యువకులను అడిగాను... పొగతాగడం వల్ల ఆరోగ్యం చెడుతుందని, ఆయుష్షు తగ్గుతుందని తెలిసి కూడా ఎందుకు సిగరెట్లు తాగుతారు అని. దానికి వారు నలభై ఏళ్లు దాటిన తర్వాత తాము బతుకుతామని ఎటూ అనుకోడం లేదని చెప్పారు. చాలామంది యువకులతో మాట్లాడిన ఒకాయన – లూయిస్ మమ్ ఫోర్డ్ అనుకుంటా – చెప్పిందేమిటంటే చాలా మంది యువకులు వారి మనస్సులలో, హృదయాల్లో మూడో ప్రపంచ యుద్ధం మిగిల్చే వినాశనంలో జీవించారని, మనం భయపడే అలాంటి సర్వనాశనం అప్పటికే జరిగిపోయిందన్న భ్రాంతిలో ఉన్నారని! పత్రికల్లో వచ్చే విషయాలు, పుస్తకాల్లో చదివే విషయాల ప్రభావం వారి మీద చాలా ఎక్కువగా ఉంటుంది.

కచ్చితంగా ఈ రకమైన భావనలు పెద్దలు పిల్లల మీద నియంత్రణ కోల్పోవడం వల్ల కలిగేవే. అయితే ఈ నియంత్రణ బలవంతంగా రుద్దేది కాదు. పిల్లలు బలవంతపు నియంత్రణలో ఉంటే అది త్వరలోనే అంతరించి పోతుంది. నిజమైన నియంత్రణ అప్పుడప్పుడు కఠినంగా బయటపడుతుంటుంది, అది ఒక హెచ్చరికలా ఉంటుంది. పిల్లలు పెద్దలకు ఎదురుతిరగడం మన సంస్కృతిలో మాత్రమే మొదట రాలేదు. పెద్ద వాళ్లు వాళ్ల అనుభవం కొద్దీ కొన్ని పనులు చెయ్యకూడదని వారిస్తుంటారు. కానీ ఇదివరకటి సంస్కృతిలో పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన తాళం చెవి పెద్దల దగ్గర ఉందని పిల్లలకు తెలుసు. వారు సమాజాన్ని నడిపించారు. ఒక జీవన విధానం అనుసరించారు. పిల్లల పట్ల వారికి ఒక రకమైన బాధ్యత ఉండేది. పిల్లలు సమాజ బాధ్యత తీసుకోవడానికి సిద్ధపడగానే ఆ బాధ్యతలు పిల్లల చేతికి అప్పగించడానికి వారు సిద్ధంగా ఉంటారు. అలాంటప్పుడు పెద్దలు మేము చెప్పిన విధంగా చెయ్యండి అని చెబితే వారి మాట పాటించాలి. మాకు తెలుసు మీరు ఇంకా సిద్ధంగా లేరు ఇప్పుడే వద్దు అంటే ఊరుకోవాలి. ప్రపంచంలో కెల్లా అత్యంతగా ఇష్టపడే దేశంలో అత్యధికంగా కొనియాడే కుటుంబాలలోని పదేళ్ల పిల్లలు కూడా ఎదగడానికి భరోసాతో భవిష్యత్తును చూడటం లేదు. నాన్నకు బాగా తెలుసు అని చెప్పగలిగే ప్రపంచంలో మనం లేమన్నదానికి ఇదే నిదర్శనం.

పిల్లలు ముఖాలను ఇట్టే చదవగలరు. బానిసలందరి మాదిరిగానే, నిస్సహాయులందరి మాదిరిగానే తమ పాలకుల ముఖాలు చూసి చదవటం నేర్చుకుంటారు... ఎందుకంటే మరుక్షణం ఏం జరగబోతోందో తెలుసుకోవాలంటే అది అవసరం. చాలా ముఖాలు చూసి వారు చాలా అసౌకర్యానికి గురవుతారు. ఒక పెద్ద పట్టణంలోని ఒక నాలుగురోడ్ల కూడలి వద్ద సిగ్నల్ కోసం నిరీక్షిస్తున్న వారిని దూరం నుంచి వారికి తెలియకుండా ఫోటో తీసినపుడు వారి ముఖాలు గమనిస్తే వాటిలో వ్యక్తమైన భావాన్ని గురించి ప్రస్తావిస్తూ, ఒక ప్రతికలో ఎరిక్ ఫ్రామ్ ఇలా రాశాడు: వారి ముఖాల్లో భావాలు భయంకరంగా, బాధగా, భయంగా, చిరాకుగా ఉన్నాయి. అప్పుడే ఒక భయానక ప్రమాదం ఏదో చూసినట్టున్నాయి. నిజానికి వాళ్లు అక్కడ వేచి ఉన్నది కొన్ని క్షణాల్లో వారికోసం పడే గ్రీన్ లైట్ కోసం మాత్రమే. గొంతు, మాట కూడా అంత అందంగా ఏమీ లేవు. నవ్వు కూడా దారుణంగా ఉంది. ఇలాంటి మనుషులను ఎవరు ఇష్టపడతారు చెప్పండి. భవిష్యత్తును నిర్మించలేని, భవిష్యత్తు మీద నమ్మకాన్ని ప్రేమని ఇవ్వలేని తరం నుంచి భవిష్యత్తు తరానికి నేర్చుకోవడానికి ఏమీ ఉండదు. సమాజంలో ఉన్న వైవిధ్యాలన్ని కూడా సమాజ వ్యవస్థను, దాని సహజత్వాన్ని, వ్యవస్థలో నివసించే మనుషులను ప్రతి ఒక్క అంశంలోనూ అదుపుచెయ్యడానికే సమయం సరిపోతోంది. మనకు కావల్సింది సమాజంలో మార్పు, అభివృద్ధి, కొత్తగా వచ్చినదేదైనా సరే పాతదానికంటే మెరుగ్గా ఉండాలి. మనం ఏదైనా

మార్చి మెరుగ్గా తయారు చేసుకోవచ్చు. అయితే ప్రతిసారీ మనం అనుకున్న ఫలితాలే రావు.

సాటర్డే రివ్యూ ఆఫ్ సైన్స్ ఈ మధ్య తమ పత్రికలో 'అన్ స్పాయిల్డ్ ప్లేసెస్ ఆఫ్ ద వరల్డ్' అనే ఒక వ్యాసం ప్రచురించింది. ప్రపంచంలో చాలాభాగం ఇప్పటికే పాడైపోయింది. ఇకపాడైపోనీ ప్రదేశాలుంటే అవి హిందుమహా సముద్రంలో షేషెల్స్ వంటి మారుమూల ద్వీపాలు మాత్రమే. ఆ వ్యాసకర్త ఇలా అంటాడు... ప్రపంచం నలుమూలల నుంచి తండోపతండాలుగా ప్రజలు – వారిలో అధిక భాగం సంపన్నులు – ఆయా ప్రదేశాలు కూడా పాడైపోకముందే వాటిని చూసేందుకు వెళ్తున్నారు. ఇది ఆధునిక మానవుడిని వర్ణించే అసాధారణమైన ప్రకటన. ఒక విధంగా చెప్పాలంటే ఆధునిక మానవుడు తన శక్తులు దేవుడి తరహావేనని అనుకుంటున్నాడు... అతడు ఎలాంటి యంత్రాన్నైనా తయారు చెయ్యగలడు. ఏ పదార్థం నుంచైనా శక్తిని తయారు చెయ్యగలడు. విశ్వంలో ఎక్కడికైనా ప్రయాణం చెయ్యగలడు. కానీ ప్రపంచం అని అతడు భావించే ఈ గ్రహం మీద మాత్రం దాదాపు అన్నింటిని నాశనం చేశాడు. ఇప్పటికి ఇంకా నాశనం కాకుండా మిగిలున్న ప్రదేశాలు కూడా ఇక నాశనం చెయ్యకూడదన్న స్పృహ కూడా కనీసం లేని వాడు. తాము నివసిస్తున్న ప్రాంతం అది నగరం, పట్టణం, లేదా దేశం వచ్చే పదేళ్లలో మెరుగైన ప్రదేశంగా మారగలదని ఎంతమంది విశ్వసిస్తున్నారు. ఇలా జరగొచ్చని ప్రజలు ఊహించడం కూడా లేదు. మరి భరించలేని సమయం వచ్చే వరకు ఇక్కడుందాం, అలాంటి సమయం వచ్చినపుడు మరో మెరుగైన చోటుకి వెళ్లి అక్కడ కొంత కాలం అది నాశనం అయ్యే వరకు బతుకుదాం అని అనుకుంటున్నారు.

మనమొక అర్థంలేని కలగంటూ దాన్నే అభివృద్ధిగా భావిస్తున్నాం. ఇప్పుడిప్పుడే తెలుస్తోంది ఆ కల నిజం కాదని. దాంతో విపరీతమైన నిరాశకు లోనవుతున్నాము. ఎందుకంటే అంతకంటే ఎక్కువ ఊహించడం మన వల్ల కావడం లేదు మరి. మంచి జీవితాన్ని సాధించడానికి జీవితానికి కొత్తగా ఏదీ చేర్చలేకపోవడం వల్ల మనం ఇక మనకు మంచి జీవితం ఉందన్న నమ్మకం కలగడం లేదు. చెయ్యడానికి మనకేమీ మిగిలి లేదు కాబట్టి ఈ ట్రెడ్‌మిల్ మీద ఇలా పరుగెత్తడం తప్ప చెయ్యగలిగిందేమీ లేదని అనుకుంటున్నాం.

# 6. జీవితంలోని అనేక 'సంక్షోభాలు'

**బా**ల్యానికి మిగిలిన జీవన దశలకు మధ్య మనం సృష్టించిన అంతరం రోజురోజుకు పెరుగుతోంది. ఇది జీవితంలో మనం సృష్టించిన అనేక అంతరాల్లో ఒకటి. ఈ రోజుల్లో వయసు మళ్లిన వారు ఎలా సమాజానికి దూరం అవుతున్నారో ఒకసారి చూద్దాం. ఇప్పుడు మన మొత్తం చర్చ వయోవృద్ధుల గురించే. వృద్ధాప్యం అనేది జీవితంలోని అత్యంత నిరుపయోగమైన దశ. వీరు ఎవరికి వద్దు, వీరిని ఎవరూ పట్టించుకోరు, వీరి వల్ల ఇబ్బంది, అసౌకర్యం, వీరు ఏమీ చెయ్యలేరు, వీరికేమి తెలియదు లేదా వీరికి తెలిసిన దానితో లోకానికి పెద్దగా పనేమీ లేదు.

అందువల్ల దీన్ని మనం జీవితంలో అత్యంత సంక్షోభ సమయం లేదా పనికి రాని సమయంగా భావించనవసరం లేదు. జీవితాన్ని విజయవంతంగా గడుపుతున్న ఎంతో మంది నాతో చెప్పారు వారి నలభయ్యో పుట్టిన రోజు వారికి భయంకరమైన షాక్‌లా అనిపించిందని, నలభైయేళ్లు వచ్చాయంటే జీవితంలోని శ్రేష్ఠమైన స్థాయి దాటిపోతున్నామని అనిపించిందని. నిజానికి మానవ జీవితమే సంక్షోభమయం. యుక్త వయసు సంక్షోభం, కౌమారం సంక్షోభం, తర్వాత మధ్య వయసు సంక్షోభం, ఆ తర్వాత వృద్ధాప్య సంక్షోభం. ఇక అసలు సిసలు జీవితం కేవలం ఇరవై ఒకటి నుంచి ముప్పై ఐదు సంవత్సరాల మధ్య కాలం మాత్రమే అని దీని ప్రకారం అనుకోవాల్సి వస్తుంది.

పై విషయాలన్ని నేను రాసిన కొద్దిరోజులకే షికాగో వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ షికాగో ట్రిబ్యూన్ (మార్చ్ 6, 1973)లో నేను ఒక కథనం చదివాను. దాని పేరు "Weathering the Storm of the Middle Years", రచయిత రిడ్జ్‌లీ హంట్. ఇది అమెరికన్ మెడికల్ అసోసియేషన్ సదస్సు ప్రారంభ సందర్భంగా ప్రచురించినది. ఇందులో రచయిత వ్యక్తం చేసిన అభిప్రాయం ఇలా ఉంది: పెద్దలకు వారి మధ్య వయసులో అంతా సాఫీగా జరిగిపోతున్నప్పుడు కాలుష్యం గురించి కమ్యూనిటీ స్కూళ్ల నాణ్యత గురించి ఇంకా అలాంటి ఇతర విషయాల గురించి కానీ ఆలోచించి ఆందోళన చెందడానికి

తీరిక ఉండదు. ఇక తీరుబడి రోజులు వచ్చేసరికల్లా వారిలో చాలామందికి తమ ఉద్యోగాల పట్ల, పిల్లలతో అనుబంధం పట్ల, తమ లైంగిక జీవితం పట్ల విసిగిపోయి నిరాశానిస్పృల్లో మునిగిపోతారు. కాబట్టి, రాబోయే మూడు రోజుల్లో ఏఎంఏ ఈ మధ్య వయసు జీవితం మీద దృష్టి సారించాలని హంటర్ కోరాడు. ఇప్పుడు మనం ఆలోచించాల్సిందల్లా... ఎందుకు చాలా మంది తమ జీవితాల్లో కష్టాలు ఎదుర్కొంటున్నారు, వాటిని అధిగమించాలంటే ఏం చెయ్యాలి అనేదే అని ఆయన సూచిస్తాడు.

మూడు వ్యాఖ్యలు: 'సాఫీగా సాగే రోజులలో' 'మధ్య వయసు' లాంటి పదాల గురించి ఎవరైనా ఎందుకు ఆలోచిస్తారన్నది నా సందేహం. ఇక అస్పష్టమైన అరూపమైన 'జీవిత నాణ్యత' గురించి ఎవరూ అంతగా ఆలోచించరు.

సమస్య ఎదురైనప్పుడు మాత్రం వారేమిటో వారు తెలుసుకుంటారు. ఏ అగ్ని ప్రమాదమో లేదా చీడపీడలో పంటను నాశనం చేస్తాయి. ప్లేగు వల్ల అనారోగ్యం కలుగుతుంది, పాలకులు వెన్ను విరిచేలా పన్ను విధిస్తుంటారు, యుద్ధాలు వారిని చంపేస్తుంటాయి, వాళ్ల భూములు నాశనం అవుతాయి... ఇలాంటి వాటిని పరిష్కరించుకోవడానికి ఏం చెయ్యాలో వారికి తెలుసు. అయితే వారు ఆ పనులు అమలు చెయ్యలేకపోవచ్చు. అది వేరే విషయం.

చివరగా, మన కాలం ఎంతో విలక్షణమైంది. మనం మన జీవితాలు సరిగ్గా జీవించలేకపోతున్నాం, లేదా ఎలా జీవించాలో తెలుసుకోలేకపోతున్నాం, ఈ సమస్యను కొంతమంది 'నిష్ణాతులు' కలిసి సరిచేయాలని మనం అనుకుంటాం. ఈ భ్రమ, ఈ ఆధునిక భ్రమ, మన సమస్యలకు దాదాపు మూలమని చెప్పాలి.

ఈ సదస్సు ఏర్పాటు చేసిన ఏఎంఏ అధికారి డాక్టర్ ఎఫీ ఎలీస్ ప్రకారం, ఈ మధ్యవయసు అనేది ఒక 'అన్‌చార్టెడ్ టెరిటరీ' (సముద్రపటంలో గుర్తించని భూభాగం). ఎవరితో గుర్తించబడనిది అని నేను అడుగుతున్నాను. నడి వయసులో జీవిస్తున్న వారెవరికీ కూడా ఎవరో ఒక నిష్ణాతుడు వచ్చి చెప్పేదాకా దాని గురించి ఏమీ తెలీదని ఆయన భావిస్తున్నారా?

చాలా మంది తమ ఉద్యోగాల్లో పడి నలిగి పోతూ రాత్రిళ్లు నిద్ర కూడా పోవడం లేదని డాక్టర్ ఎలీస్ భావిస్తున్నారు. అంతే కాదు ఆయన ఇంకా ఏమంటారంటే: పూర్వకాలంలో కేవలం 'మనుగడ పోరాటం' లోనే మనిషి శక్తిలో అధిక భాగం హరించుకుపోయేది, అందువల్ల అతడికి ఇతర సమస్యల గురించి ఆలోచించేంత సమయం ఉండేది కాదు. కానీ ఇప్పుడు అతడు తనకు లభించిన 'తీరిక సమయంలో సుఖపడుతూ' విడాకుల మీద, కాలుష్యం మీద, జాత్యహంకారం మీద, వయసు మీద పడుతుండడం

మీద, పిల్లలు మాట వినకపోవడం మీద, తగ్గుతున్న అతడి లైంగిక సామర్థ్యం మీద ఇంకా ఎన్నో విషయాల మీద వ్యాకులపడుతున్నాడు. ఈ దిగుళ్లన్నీ కూడా అతడిని ఊబకాయుడిగా మార్చేస్తున్నాయి. కడుపులో అల్సర్లను (పేగుపూతలను) కలిగిస్తున్నాయి, రక్తపోటు పెంచుతున్నాయి, గుండెజబ్బులకు కారణమవుతున్నాయి. వీటి వల్ల చివరకు అతడికి దుఃఖం మిగులుతోంది. ఊరట కోసం ఆక్రోశిస్తున్నాడు.

కానీ డాక్టర్ ఎలీస్ ఇలాంటి జీవితాన్ని వర్ణించడానికి "తీరిక సమయంలో సుఖపడుతూ" అనే మాటలను ఎందుకు ఉపయోగించారు? మనలో చాలా మంది ఇలాంటి మాటలు ఎందుకు అలాగే అంగీకరిస్తాం? ఆధునిక వ్యవస్థలు మనకు సమకూర్చిన జీవితం మంచిదేనని, కానీ మందమతులమై గందరగోళంలో పడిన మనకు అసలు జీవించడం ఎలానో చెప్పడానికి ఈ నిష్ణాతులందరూ సమావేశం కావల్సిన అవసరం ఏర్పడిందని ఈ మాటలు సూచిస్తున్నాయి.

ఈ ప్రపంచంలో చాలా మంది తమకు కావల్సిన తిండి, గుడ్డ, గూడు కోసం, సమాజంలో ఒక స్థానం సంపాదించడం కోసం పనులు చేస్తారు. కాని వారు దీన్నంతా 'మనుగడ కోసం చేసే పోరాటం'గా భావిస్తారా? ఒక మనిషి తను తినే ఆహారం పండించడానికి, బట్టలు ఉత్పత్తి చేయడానికి, ఇల్లు కట్టడానికి 'పోరాడుతున్నటు లేదా పెనుగులాడుతున్నట్లు' భావించాలా? ఈ ఆలోచనే అర్థరహితం. కానీ దేశంలో ఏదైనా విపత్తు సంభవించినపుడు అంటే ఏదైనా సంక్షోభ సమయంలో ఆహారం, ఇంధనం కొరత ఏర్పడినప్పుడు, యుద్ధ సమయాల్లో, లేదా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించి ఆవాసాలన్ని నాశనమైన సందర్భాల్లో వాటిని తిరిగి సమకూర్చుకోడానికే మనిషి తాను 'పెనుగులాడుతున్నట్లు' భావిస్తాడు. ఆధునిక మానవుని సమస్య అంతా కూడా అతడు తనకు తెలియని తన అదుపు లేని వ్యవస్థల మీద ఆధారపడాల్సి రావడమేనని నాకు అనిపిస్తుంది. రాను రాను అతడు తన ప్రాథమిక అవసరాల తనకు తాను తీర్చుకునేందుకు కావల్సిన సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు లేదా అందుకు అతడికి అనుమతి ఉండటం లేదు. ఆఖరుకు స్థూలకాయం.. కొవ్వు పెరగటం.. రాకుండా జాగ్రత్త పడటం కూడా తెలియని స్థితికి వచ్చాడు. దానికి ఒక నిపుణుల కమిటీ ఆ జాగ్రత్త ఎలా తీసుకోవాలో చెబుతుంది.

ఈ ఆలోచనలు పిల్లల సమస్యల నుంచి చాలా దూరంగా పోతున్నట్లు అనిపించే అవకాశం ఉంది, కాని అది సరికాదు. పిల్లలు తమ స్వంత పరిరక్షకులను ఎంచుకునేందుకు, లేదా తమను తామే పరిరక్షించుకునేందుకు వారికి ఉన్న హక్కు గురించి మాట్లాడేప్పుడు నేను ఈ అధ్యాయం గురించి మళ్లీ ప్రస్తావిస్తాను. మనకే సరిగా జీవించడం చేతకానపుడు వారు ఇలా జీవించాలంటూ పిల్లల కెలా చెప్పగలం అనేది ఇక్కడ ప్రశ్న. అలా మనం చెప్పినపుడు వాళ్లు వినాలని ఎలా ఆశిస్తాము?

మనం మాట్లాడుకుంటున్న 'ఏఎమ్ఏ'కు అధ్యక్షుడు డాక్టర్ జేమ్స్ ప్రైస్. ఆయన నిర్వహించే 'ఏ వెల్ చైల్డ్ కాన్ఫరెన్స్'కు చాలామంది తమ శిశువులను తీసుకువస్తుంటారు, అలాగే పెద్దలు కూడా మామూలు చెకప్‌లకు వైద్యపరీక్షలకు వస్తుంటారు. హంట్ మాటల్లో ఆయన చెప్పేదిది : నా పేషంట్లలో ఒక 20 శాతం మందికి ఏ సమస్య ఉండదు. వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, ఇప్పుడున్న సంతోషకరమైన పరిస్థితిని మెరుగుపరచుకోడానికి వస్తారు. 40 శాతం మందికి కొద్దిపాటి చిన్న చిన్న లోపలి అవయవాలకు సంబంధించిన రుగ్మతలు ఉంటాయి. వాటిని నయం చేయడానికి డాక్టర్ ఏదో ఒకటి చేయగలడు. ఇక మిగిలిన 40 శాతం మంది జీవితంలో నాణ్యత కొరవడిన బాధితులు అని చెప్పాలి. వీరిలో సగం మందికి అల్సర్లు, ఆస్తమా, చర్మ సమస్యల వంటి సమస్యలు ఉంటాయి. ఇవన్నీ రకరకాల ఆందోళనలతో కొనితెచ్చుకున్నటువంటివి. మిగిలిన సగం మంది కూడా నిజంగా బాధ మాట మాత్రం వాస్తవమే అయినా వారికి గుర్తించగలిగిన ఎలాంటి వ్యాధీ ఉండదు.

దీనిపై నా వ్యాఖ్య : మనం ముందుగా తెలుసుకోవలసింది అసలు ఈ ' వెల్ చైల్డ్ కాన్ఫరెన్స్' అంటే ఏమిటి? మనకు ఆరోగ్యం సరిగాలేదని అనిపించగానే డాక్టర్ దగ్గరికి వెళ్లాలని ఎటూ అనుకుంటాం. కాని మనకు ఏ సమస్యా లేకపోయినా డాక్టర్ దగ్గరకు వెళ్లాలా? 'వెల్ చైల్డ్ కాన్ఫెరెన్స్'లో ఏం జరుగుతుంది? దానికి ఎంత ఖర్చవుతుంది (నేను విన్న దాన్ని బట్టి 8 డాలర్ల నుంచి 25 డాలర్లు. చాలా స్కూళ్లు ఏడాదికి ఒక్కసారైనా పిల్లల్ని వీటికి పంపిస్తాయి). అక్కడ ఒక డాక్టర్ 'రొటీన్ చెకప్' చేస్తాడు. ఇది కొద్దిగా నేర్చుకుంటే మనకు మనం చేసుకోవచ్చు, లేదా మన నివాసానికి దగ్గర్లో ఉండే మామూలు డ్రగ్ స్టోర్ లేదంటే ఒక మామూలు క్లినిక్‌లో చేయించుకోవచ్చు. ఏదైనా మూత్ర లేదా రక్త పరీక్ష అవసరమైనపుడు ల్యాబ్‌లలో చేస్తారు. ఈ పని చేసే వారు సాధారణంగా డాక్టర్ అయి ఉండరు. దీనికి కూడా మనం డాక్టర్ ద్వారా వెళ్తాం. మనకు మనంగా ల్యాబ్‌కు గానీ ఆ టెక్నిషియన్ దగ్గరకు ఎందుకు వెళ్లం? ఈ చెకప్ మనకు మనం చేసుకోడానికి వీలుగా కొద్ది వారాల్లో నేర్చుకోడానికి వీల్లేనంతటి సంక్లిష్టమైన ప్రక్రియా? (చక్కెర వ్యాధిగ్రస్తులు మూత్రంలో చక్కెర స్థాయి గుర్తించే పరీక్ష ప్రతిరోజూ స్వయంగా తామే చేసుకుంటారన్న విషయం ఇక్కడ గుర్తు చేసుకోవాలి). ఈ విషయాలు గమనిస్తే మన ఆరోగ్యం మన జీవనశైలి మీద కాకుండా, కేవలం డాక్టర్ కు ఉన్న నిగూఢమైన జ్ఞానం మీదే ఆధారపడి ఉందన్న భావన కలగక తప్పదు. ఈ భావన మన బతుకుదెరువు వ్యవహారాన్ని పోలి ఉంటుంది. మనలో చాలా మందికి బతుకుదెరువు మూలాలు మనం చేసే పనిలో కాకుండా మనకు అర్థం కాని ఒక 'ఆర్థిక వ్యవస్థ' లోపల ఉన్నాయి. ఆ 'ఎకానమీ'ని అర్థం చేసుకోవడం ఎవరి వల్ల కాదు, అది ఎప్పుడు ఎలా మారుతుందో తెలీదు, అదే మనకు పనిలేకుండా చేస్తుంది, దరిద్రంలోకి తోస్తుంది.

# 7. పిల్లల పెంపకం భారమా

**బా**ల్యం అనే తోట చుట్టూ ఎత్తైన ప్రాకారాలతో ఎంత దుర్భేద్యంగా ఉన్నా అది మంచి ఫలితాలు ఇవ్వడం లేదు. దీనికి ఒక కారణం ఎవరైతే దీనిని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారో వారు అందులో ఉండలేరు. దీంతో ఎవరి సంరక్షణ కోసమైతే ఈ తోట నెలకొల్పబడిందో వారూ ఈ తోటను ఇష్టపడరు. పెద్దలు తరచూ తమ పిల్లల జీవితాలతో తమ జీవితాలను పోల్చి చూస్తుంటారు. "మేము ఎంతో కష్టపడుతున్నాం, వీళ్లు హాయిగా గడిపేస్తున్నారు" అని పెద్దలు ఎన్నిసార్లు అనుకోరు? తరచూ వారు తమ మనసులోని ఈ మాటను బయటకే అనేస్తుంటారు. దాంతో మొదలవుతుంది.. బయటి కఠోర వాస్తవాల నుంచి పిల్లల సంరక్షణ కోసం ఆ బాల్యపు తోట వేసినవారే, అదే కఠోర వాస్తవం పేరుతో స్వయంగా దాన్ని కలుపు మొక్కలు, రాళ్లు రప్పలు, పగిలిన గాజు ముక్కలతో నింపేస్తారు. 'బయటి ప్రపంచం వాస్తవంగా ఎలా ఉంటుందో వారికి తెలిసి వస్తుంది, ఇప్పటి నుంచే ఆ కాఠిన్యాల నుంచి రక్షణ పొందడం ఎలాగో బాగా నేర్చుకుంటారు' అని బుసలు కొడతారు. కానీ ప్రపంచం ఎలా ఉంటుందనే విషయం పెద్దలు తెలియజేయటానికి ముందే పిల్లలు తెలుసుకుని ఉంటారు.

చాలా ఏళ్ల నుంచి అన్ని రకాల ప్రదేశాల్లో పరిసరాల్లో ఉంటూ నేను ఎందరో పెద్ద వాళ్లను చూశాను. వారు పిల్లలతో ఉన్నపుడు వారికిష్టమైన వారితో ఉన్నట్టుగా ప్రవర్తించనే ప్రవర్తించరు, చెప్పాలంటే అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంటారు. చాలా ఆత్రంగా, చిరాకుగా, అసహనంగా ఏదో తప్పు వెతికి పట్టుకోవాలన్నట్టుగా! చెప్పాలంటే అలా వెతికి పట్టుకుంటారు కూడా. ఇలాంటివన్నీ పిల్లలకు నచ్చవు. అలసట, ఉద్రిక్తత, సంఘర్షణ, తెచ్చిపెట్టుకున్న సహనం – ఇదెప్పుడూ స్నేహశీలకంకాదు, కోపాన్ని అణిచిపెట్టడం తప్ప మరొకటి కాదు – ఇవన్నీ పెద్దల పరిసరాల్లో నిండి ఉంటాయి. ఎంతో ముచ్చటగా ముద్దుముద్దుగా ఉండే చిన్నారి బాలికలు తప్ప సాధారణంగా బహిరంగ ప్రదేశాలలో ఒంటరిగా కనిపించే ఇతర పిల్లలను ఒక శత్రుభావన నిండిన చూపులతో చూస్తారు.

ఆ చూపుల్లో ఎన్నో ప్రశ్నలు కనిపిస్తుంటాయి – "ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావు ఇక్కడ? మీ పెద్దవాళ్లేమయ్యారు? ఒంటరిగా ఎందుకున్నావు?"

ఈ కోపం, అయిష్టతలకు అనేక కారణాలున్నాయి. ఇటీవలి వరకు కూడా పిల్లల పెంపకం అంత ఇబ్బందికరం అనిపించేది కాదు. పిల్లలు తమ తొలి సంవత్సరాలను గట్టెక్కగలిగారంటే, వారు చాలా ఉపయోగకరంగా ఉండేవారు. వారి సంపాదన వారి పెంపకం ఖర్చులకు మించి ఉండేది. ఆ రోజుల్లో ఎక్కువమంది పిల్లలున్న వ్యక్తి అదృష్టవంతుడిగా చలామణి అయ్యేవాడు. పిల్లలు విలువైన ఆస్తి. వారు పెరుగుతున్న కార్మికశక్తి.

వారు ఉపయోగపడని, వారి పని అవసరం లేని సందర్భాలలో కూడా వారిని కనిపెట్టుకొని ఉండనక్కర్లేదు. ఇదివరకు పట్టణాలు, నగరాలు కూడా పెద్దగా జనసమ్మర్ధం లేకుండా ఉండేవి. ప్రమాదాలు కూడా తక్కువగా ఉండేవి, ఇన్ని కార్లు కూడా ఉండేవి కావు, ఇప్పటి కంటే చాలా సురక్షితంగా ఉండేవి. పిల్లలు ఆడుకోవడానికి, తిరగడానికి తగినంత చోటు ఉండేది. నేను మన్‌హట్టన్ నగరంలో తొలిసారి ఉన్నప్పుడు అంటే 1920ల ఆఖరు వరకు కూడా ఇప్పుడున్నంత ట్రాఫిక్ జామ్ ఉండేది కాదు, ఎప్పుడో ఒకసారి మిడ్‌టౌన్ ప్రాంతంలో ముఖ్యంగా సెలవు రోజుల్లో అప్పుడప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతుండేది. నగరంలోని 86 స్ట్రీట్‌లో అప్పుడప్పుడు జనం రద్దీ కనిపించేది. బ్రూక్లీన్‌లో పెరిగి పెద్దవాడైన నాస్నేహితుడొకతను చెప్పాడు అతడు తన స్నేహితులతో కలిసి పొద్దంతా కూడా రోడ్ల మీద ఫుట్‌బాల్, స్టిక్ బాల్, హాకీ వంటి ఆటలు ఆడుతూనే ఉండే వారమని. వాళ్ల అమ్మకూడా ఎలాంటి సంకోచం కానీ బెంగ కానీ లేకుండా వారిని బయటికి ఆడుకోవడానికి పంపేదని అంటాడతను. కనెక్టికట్ శివారు ప్రాంతం నుంచి మా కుటుంబం నగరంలోకి మారినపుడు నేను నా స్నేహితులం ఎక్కడికైనా సరే ఒంటరిగా నడిచిపోతూ ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ మాత్రం దూరాలకు కూడా పిల్లల్ని ఎవరో ఒకరు పెద్ద వాళ్ల తోడు లేకుండా పంపటానికి సిద్ధంగా లేము. మేమంతా పల్లెల్లో పెరిగిన వారిమేమీ కాదు. స్కూల్‌కు బస్‌లలోనే వెళ్ళేవాళ్ళం. వాతావరణం బావున్నపుడు ఒక స్నేహితుడిని కలుసుకోవడానికో, ఏదన్నా సినిమా చూడడానికో మాత్రం ఒకటి రెండు మైళ్ల దూరం నడిచే వెళ్లేవాళ్లం.

బాలారిష్టాలతో చిన్నపిల్లలు ఎక్కువగా చనిపోయే ఆ రోజుల్లో, ఏదైనా ప్రమాదంలో పిల్లలు గాయపడినప్పుడు లేదా మరణించినపుడు కూడా తక్కువగానే బాధపడేవారు. అంతేకాదు వారి మరణానికి పరోక్షంగా తామే కారణమని తమని తాము నిందించుకునే వారు కూడా కాదు. బహుశా వారికి బాధపడేంత తీరిక కూడా ఉండేది కాదేమో. కానీ ఈ రోజుల్లో పిల్లలను పెంచడం చాలా మందికి ఒక తీరని బెంగగా మారింది. ఒక పెద్ద కుటుంబంలోని తల్లి నాకు చెప్పింది... నా మొదటి సంతానం

పుట్టినప్పటి నుంచి చివరి సంతానానికి  పెరిగిపెద్దయ్యే వరకు కూడా నిరంతరం భయంతోనే గడిపాను. అన్నేళ్లూ కూడా రాత్రిపూట కంటి నిండా నిద్రపోయి ఎరగను, చాలా అలసటగా ఉండేదాన్ని. గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని అలా వాపోయిందామె. ఒకే పాప కలిగిన తల్లి పాపతో పాటు ఒక కునుకు తియ్యడానికి అవకాశం ఉంటుంది. కానీ ప్రకృతిలో అదేదో నియమం ఉన్నట్టు ఇద్దరు పిల్లలు ఒకేసారి నిద్రపోవడం జరగనే జరగదు. ఈ యాతన గురించి  ఇతర తల్లులు నాకు చెప్పారు.

ఆగస్ట్ 4, 1973లో న్యూయార్క్ టైమ్స్‌లో "విత్ ఆల్ మై లవ్ , (సైన్డ్) మామా" అనే వ్యాసంలో మార్గరెట్ డాబ్లె అనే నవలా రచయిత్రి పిల్లలు ఉండడం వల్ల స్త్రీకి మద్దతుగాను ప్రశంసాపూర్వకంగాను మాట్లాడుతూ  ఇలా చెబుతుంది :

> పసిపిల్లలను పెంచడమనేది చాలా అలసటతో కూడుకున్నపనే. అయితే, ఆ దశలోని అనేక సంతోషకర సందర్భాలు వారిని పెంచడంలో ఉండే కష్టాలను మరపిస్తాయి. కానీ ఒకసారి గతంలోకి వెళ్లి ఆలోచిస్తే ఎలా వాటన్నింటిని ఎలా అధిగమించగలిగానా అని ఆశ్చర్యంగా ఉంటుంది. మనం పిల్లలకు ఎంతగా అలవాటై పోతామంటే దేన్నైనా అధిగమించాలనుకుంటాము. పిల్లలను పెంచడంలో ఉన్న మధుర క్షణాలను గుర్తు చేసుకోడం బాగానే ఉంటుంది కానీ మరి నిస్త్రాణ, అనారోగ్యం, చిరాకు, కోపం, అన్నిటికంటే ముఖ్యంగా ఎడతెగని ఆందోళన.. ఇలాంటి చేదు అనుభవాల మాటేమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే ఒక్కసారి పిల్లల్ని కన్నామంటే ఇక మనం జీవితంలో ఒక్క క్షణంగా ఏమరుపాటుగా  నిశ్చింతగా ఉండటానికి వీలుండదు.  జీవితంలోని ప్రతి ఆనందం వారి కోసం వదులుకోవలసి వస్తుంది. నేను పిల్లలు పుట్టక ముందు చాలా కేర్‌ఫ్రీగా, సాహసోపేతంగా ఉండేదాన్ని. ఇక ఇప్పుడు నేను పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండడం, స్కూలు బస్సులో సీట్ బెల్ట్‌లు సరిగ్గా పెట్టుకున్నారో లేదో అనే భయం, భూమికి దగ్గరగా ఎగురుతున్న ఏ విమానమో వారి స్కూల్ మీద పడిపోతుందేమో అన్న ఆందోళన వాళ్లు ఇంటికి వచ్చేవరకూ మనసులో ఏ మూలో ఎప్పుడూ పీకుతూ ఉంటుంది.

ఈ మాటలు చెబుతున్న మహిళ డబ్బులేనామె కాదు, చాలా స్వతంత్రంగా ఆలోచించగలిగే స్త్రీ, నచ్చిన పనిచేసే స్వేచ్ఛ ఆమెకు ఉంది, జీవితంలో విజయాలు సాధించిన మహిళ. ఆమె ఈ విధంగా మాట్లాడుతుంటే ఇక పేదరికంతో బాధపడుతున్న మహిళ, డబ్బుకోసం ఇబ్బంది పడుతున్నవారు, కొద్దిపాటి డబ్బు కోసం పనిచేసే వారు ఇంకెలా బాధపడతారో ఊహించవచ్చు. కొద్దిరోజుల క్రితమే నాకు మరో తల్లి తన అభిప్రాయాన్ని తెలుపుతూ కింది విధంగా లేఖ రాసింది :

"పూర్తిగా మన మీదే ఆధారపడి ఉండే ఒక పాపాయిని పెంచడం అనేది తీవ్రమైన మానసిక సంఘర్షణ కలిగించే విషయం. ముఖ్యంగా వాళ్లు ఆడుకోవడానికి ఒక సురక్షితమైన ప్రదేశం లేకపోవడం, వారిని చూసుకోవడానికి కుటుంబంలో మరొకరు లేకపోవడం వంటివి చాలా ఇబ్బంది కలిగించే విషయం. తన పిల్లలను చూసుకోవడానికి తనకంటే మంచి ప్రత్యామ్నాయం మరోటి లేదని ప్రతి తల్లి భావిస్తుంది. అందుకే పిల్లలను అంటిపెట్టుకొని ఉంటుంది. ఒక మూడు సంవత్సరాల పాటు నేను 'కే' కు దూరంగా ఒక్కనిమిషం కూడా ఉండలేదు. సంవత్సరకాలంలో ఒకటి రెండు గంటలకు మించి పాటు విడిచిపెట్టి వెళ్లలేదు – అదీ ఏడాదికి నాలుగు సార్లు. దీంతో కొన్ని విషయాల్లో తప్పనిసరిగా నేను నా భర్తమీద ఆధారపడాల్సి వచ్చింది. అది నిజానికి అతడి మీద భారం మోపడమే. నాకు ఇలా ఉండి ఉండి ఒకరకమైన విసుగు వచ్చేది. కొన్ని సార్లు నేను 'కే' తో కూడా అసహనంగా ప్రవర్తించేదాన్ని. అలాంటపుడే నాకు అర్థమైంది పిల్లలను తమ తల్లిదండ్రులు ఎందుకు కొడతారనేది, ఒకటి రెండు సార్లు నేనూ అలాంటి స్థితికి దగ్గరగా వెళ్లాను. అప్పుడు నేను ఆమె గదిలోకి వెళ్లినా తనని తాకినా ఏదైనా హాని కలిగించి ఉండేదాన్నేమో కూడా. నేను చాలా అలసిపోయాను, నాకు చాలా విసుగ్గా ఉంది. ప్రతి రోజు 12 గంటల పాటు రెండేళ్ల వయసు వారితో గడపడమనేది నిస్సత్తువ కలిగించే విషయం. ఎందుకంటే పాపాయి నావేపు చూడటమే గానీ బయటకు వెళ్లి ఆడుకోలేదు. ఆమె ఎంతో శక్తితో ఎప్పుడూ నావైపు ఎగదన్నుతుండేది. ఇలా అనుకోవడం అసలు బాగాలేదు, కానీ నాకు నరకం మరెక్కడా లేదు ఒకరో ఇద్దరో పిల్లలతో కలిసి అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా ఉండటం కంటే అనిపిస్తుంది."

పై విషయాలన్నీ విన్న తర్వాత పిల్లలను పెంచడం అపారమైన ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా అనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో బోస్టన్ గ్లోబ్‌లో ప్రచురితమైన కథనం ప్రకారం 'పుట్టినప్పటి నుంచి బీఏ వరకు' ఒక బిడ్డపై దాదాపు 40 వేల డాలర్లు ఖర్చు అవుతుంది. పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించడం వంటి సౌకర్యాలు కల్పించాలనుకున్నప్పుడు లేదా పిల్లల ఆరోగ్యం సరిగా లేనప్పుడు లేదా పిల్లలు ఏదైనా ప్రమాదంలో పడినప్పుడు ఈ వ్యయం మరింత ఎక్కువ కూడా కావచ్చు. కానీ నిజానికి ఇది ఎవరికైనా చాలా పెద్ద భారమే. అత్యంత పేద వారు కూడా దీన్ని తప్పించుకోలేరు. స్కూళ్లు తెరిచే సమయంలో చిన్న చిన్న పట్టణాలు, నగరాల నుంచి మొదలుకొని పెద్ద పెద్ద పట్టణాల వరకు అన్ని చోట్ల ప్రతి డిపార్ట్‌మెంటల్ స్టోర్, ప్రతి బట్టల దుకాణం కూడా స్కూల్స్ తెరిచే

సమయంలో కిటకిట లాడుతూ కనిపిస్తాయి. టీవీలో రేడియోలో ఎక్కడ చూసినా ఒకే ఒక ప్రకటన కొనండి, కొనండి, కొనండి అని. నోటు పుస్తకాలు, లంచ్ బాక్స్‌లు, ఆట సామాగ్రి వంటి వాటికి సంబంధించిన ప్రకటనలు. పేద ప్రజలు స్తోమత లేకపోయినా కొనాల్సిన పరిస్థితి. కేవలం డబ్బున్న పిల్లలు మాత్రమే వారికి నచ్చినట్టు ఉన్న బట్టలు వేసుకొని వారికి నచ్చినట్టు స్కూల్‌కు వెళ్లగలుగుతారు. ఎందుకంటే డబ్బున్న వారంతా కూడా చుట్టు పక్కల డబ్బున్న వారుండే ప్రాంతంలోనే ఉంటారు. స్కూల్లో కూడా దాదాపుగా అందరు డబ్బున్న పిల్లలే ఉంటారు. కాబట్టి వారు చదువుకునే స్కూల్ టీచర్లకు కూడా తెలుసు వారంతా డబ్బున్న వారి పిల్లలని. కానీ పేద పిల్లలు, మధ్యతరగతి పిల్లలు చదువుకునే స్కూళ్లలో పేద పిల్లలు కూడా వీలైనంత మధ్యతరగతిగా, డీసెంట్‌గా కనిపించేందుకు ప్రయత్నించాలి. అలా కనిపించినపుడు మాత్రమే టీచర్ వారి తప్పులు క్షమిస్తుంది, విద్యార్థితో టీచర్ ప్రవర్తించే తీరు అతడు కనిపించే దాన్ని బట్టే ఉంటుంది. ఎంత బాగా కనిపిస్తే టీచర్ అంతగా అతడిని ఇష్టపడుతుంది, బాగా చదివే పిల్లల మధ్య ఉంచుతుంది. అందుకే పేదవాళ్లు కూడా తమ పిల్లలకు మంచి బట్టల్లోనే స్కూల్‌కు పంపేందుకు ప్రయత్నిస్తారు.

ఆధునిక బాల్యం ఒక సెంటిమెంట్ పరంగానే కాకుండా ఆర్థికంగా కూడా భారం అయిపోయింది. ఇక ఈ భారం ఎవరూ ఊహించలేనంతగా భరించలేనంతగా పెరిగిపోయింది. తల్లిదండ్రులు తమ పిల్లలను, పిల్లలు తమ తల్లిదండ్రులను తప్పనిసరిగా ప్రేమించడం అనేది ఒక బాధ్యతగా, నియమంగా మారినట్లు సమాజం తీరు తయారైంది. ఇలా ఒక అసాధారణమైన ఉద్రిక్తపూరిత, సమస్యాత్మక బాంధవ్యంలో పెద్దవారిని పిల్లలను కట్టిపడేస్తాం. ఆ తర్వాత వారిని మీరు ఈ బాంధవ్యాన్ని ఇష్టపడాల్సిందే అని వారికి చెబుతాం. దీన్ని ప్రేమించాలని కూడా ఉద్బోధిస్తాం. ఇలా ప్రేమించకపోతే, ఇష్టపడకపోతే వారు చెడ్డవారి కింద లేదా తప్పు చేస్తున్నవారుగా లేదా ఏదో లోపం ఉన్నవారిగా సమాజం పరిగణిస్తుంది. ఈ భారం నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒక మార్గం అంటూ తల్లిదండ్రులకు లేదు, తమ ఇంట్లో తమతోపాటు ఉంటున్న పిల్లలు ఇష్టం లేదని ఎలాంటి సిగ్గూ పడకుండా అపరాధభావన లేకుండా తల్లిదండ్రులు చెప్పుకోలేరు, వారి కోసం చచ్చేదాకా పనిచేయడం వచ్చిన డబ్బులో ఎక్కువ భాగం వారికే ఖర్చుపెట్టడం నచ్చడం లేదని అనడం కుదరదు. అసలు వాళ్లను కనడమే తాము చేసిన పెద్ద తప్పని, మరోలా ఆలోచించి ఉండాల్సిందని అనలేరు. ఇక పిల్లల విషయానికి వస్తే, వారు కూడా వారి వంతుగా తాము అడగని దానికి, చాలా మంది విషయంలో తాము కోరుకోని దానికి బదులుగా తమ తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతాబద్ధులై ఉండాల్సి వస్తుంది.

ఒకప్పుడు, పిల్లలు పెరుగుతున్న కొద్దీ ఎక్కువ సహాయకరంగా తక్కువ సమస్యాత్మకంగా ఉండేవారు. ఇప్పుడు అలా కాదు. పిల్లలు ఎదుగుతున్న కొద్దీ పెద్దలకు

వారి నుంచి తక్కువ సాయం ఎక్కువ కష్టం ఉంటున్నాయి. వారికి అవసరమైనదీ, వారు వాడేదీ, కోరేదీ ప్రతిదీ వారి వయసు పెరిగిన కొద్దీ మరింత అధికవ్యయంతో కూడుకుని ఉంటున్నాయి. వారిని బడికి పంపాలి, బట్టలుకొనాలి, అవసరాలన్ని చూడాలి. ఇక అతడు పెద్దవాడయ్యేసరికి అతడికి కూడా సమస్యలు ఎక్కువవుతాయి, తన తల్లిదండ్రులను చూసుకోవాల్సి ఉంటుంది. అలా చూసుకోవడం అతడి బాధ్యతగా మారుతుంది. అలా చూసుకోని కొడుకు గురించి కొంత మంది తల్లిదండ్రులు "వాడిని పెంచడానికి మేము మాకు వీలైందల్లా చేశాము, వాడికి ఏకష్టం కలగకుండా చూసుకున్నాము, వాడిని ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు ప్రయత్నించాము, మరి తప్పు ఎక్కడ జరిగిందో అర్థం కావడం లేదు" అంటుంటారు.

పిల్లలను కనడం, పెంచడం అనేది ఎందుకు ఒక పెద్ద భారం అవుతుందనేదానికి సమాధానం మన వైఖరిలో లేదా మన నమ్మకంలో ఉంది. ఈ విషయాన్ని ప్రతిబింబించే ఒక వాణిజ్య ప్రకటన సెప్టెంబర్ 9, 1973లో న్యూయార్క్ టైమ్స్‌లో ప్రచురితమైంది.

> ఆ ప్రకటనలో ఒక చిన్న పాపాయి, ఎర్రని జుట్టుతో, అందంగా, హుందాగా, తెలివిగా కనిపిస్తోంది. ఆ ఫోటో కింద ఇలా రాసుంది:
>
> "ప్రతి సాధారణ పాపాయికి విజయవంతంగా ఉండడానికి ఎంత అవకాశం ఉందో అపజయం పాలవడానికి కూడా అంతే అవకాశం ఉంది" అదే ప్రకటన పరోక్షంగా చెబుతున్నదేమిటంటే– కొంత మంది పిల్లలు పుట్టినప్పటి నుంచే తృప్తిగా జీవించే అవకాశం కలిగి ఉంటారు.....
>
> కానీ చాలా మంది అలా కాకుండా సంతోషం లేకుండా, అసహనంగా ఉంటారు. ప్రతి పిల్లవాడి భవిష్యత్తు అతడి తల్లిదండ్రుల చేతుల్లో ఉంటుంది. మీరు గీసే బొమ్మ మీ చేతి కుంచె కదలిక మీద ఆధారపడి ఉంటుంది,
>
> మీరు తయారు చేసినట్టు మీ పాపాయి తయారవుతుంది. అందుకే మీరు మంచివన్నీ మీ పిల్లలకు అందించండి,
>
> ఆరోగ్యంగా ఉండే పాపాయి మీరు తయారు చేయబోయే అందమైన బొమ్మ వంటిది.

ఇలాంటి భావన వల్ల... సమాజంలో మీ స్థానాన్ని మీ పిల్లల విజయాలను బట్టి నిర్ధారిస్తుంటారు. ఒక తల్లి తన పిల్లాడితో కలిసి ఏ సూపర్ మార్కెట్ లేదా ఏదైనా ఒక పబ్లిక్ ప్లేస్‌లో ఉంటుంది. ఆమె తనకు కావాల్సినవి చూసుకోవడంలో తీరికలేకుండా

ఉంటుంది. పిల్లాడు సంతోషంగా అటూ ఇటూ పరుగెడుతూ ఆడుకుంటు వస్తువును ఆసక్తిగా చూస్తూ ఎలాంటి నష్టం కలగకుండా ఆడుకుంటు ఉంటాడు. మరో స్త్రీ ఆమెను ఆమె బాబును గమనించడాన్ని చూసి తన పిల్లాడి మీద అధికారం చెలాయించడం మొదలు పెడుతుంది "ఏయ్ ఇలారా.. అలా పరుగెత్తకు.... అదెందుకు ముట్టుకుంటున్నావు..." అనడం మొదలు పెడుతుంది. కొన్నిసార్లు బలంగా చెయ్యి పట్టుకొని లాక్కొస్తుంది కూడా. ఇలాంటి దృశ్యాన్ని నేను చాలాసార్లు గమనించాను. ఇది ప్రపంచంలో అన్ని ప్రదేశాల్లోను జరుగుతుంది. లెలియా బెర్గ్ అనే రచయిత్రి తన పుస్తకం "లుక్ ఎట్ కిడ్స్"లో ఇలా అంటుంది: లండన్‌లోని బస్సులలో, ఇతర బహిరంగ ప్రదేశాలలో చాలామంది పెద్దవాళ్లు పిల్లలు ఆడుకుంటూ ఆనందిస్తూ ఉంటే వారిని కోపంగా లేదా విసుగ్గా చూస్తుంటారు. ఒక్కోసారి కోపంగా అరుస్తారు కూడా. బ్రిటన్‌లో పిల్లల కోసం ఆటస్థలాలు, ఆడుకోవడానికి ఉపయోగపడే స్థలాలు నిర్మిస్తున్న వారికి ఒక సిఫారసు చెయ్యాలి. వారికోసం నిర్మించే స్థలాలు పూర్తిగా ఎవరు గమనించడానికి వీల్లేకుండా పూర్తిగా మూసివేసి ఉండాలి. పిల్లలకు వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ) ఉండేందుకు అవకాశం కల్పించాలి. ఇలాంటి ప్రదేశాలు పిల్లల కోసం ఉండడం చాలా మంది పెద్దలకు ఇష్టం ఉండకపోవచ్చు.

ప్రస్తుతం ఉన్న స్కూల్స్‌లో కూడా ఇలాంటి బెరుకు, అసౌకర్యంతోనే పిల్లలు ఉండాల్సి వస్తోంది. డాక్టర్ చార్లెస్ సిల్బర్‌మన్ ఫార్చ్యూన్ పత్రికకు చాలా సంవత్సరాలు ఎడిటర్‌గా పనిచేశారు. అమెరికాలోని పబ్లిక్ స్కూళ్ల గురించి పరిశోధన చేసే బాధ్యతను కార్నెగి ఫౌండేషన్ ఆయనకు అప్పగించింది. ఆయన "క్రైసిస్ ఇన్ ద క్లాస్ రూమ్"అనే పుస్తకం ద్వారా తన పరిశోధనాంశాలు వెలువరించారు. ఆ పుస్తకంలో పేర్కొన్న ఆయన పరిశీలనలు ఇలా ఉన్నాయి...

> మనం పబ్లిక్ స్కూళ్లలో పిల్లల స్వేచ్ఛకు భంగం కలుగుతున్న తీరు దిగ్భ్రాంతికరంగా ఉంది. వాళ్లు నేర్చుకోడంలో పొందుతున్న ఆనందానికి, ఏదైనా తయారు చేయడంలో పొందుతున్న ఆనందానికి, లేదా ఆత్మవిశ్వాస భావనకు ఇలా అడుగడుగునా ఏదో రీతిలో భంగం వాటిల్లుతోంది. ఎందుకంటే స్కూల్స్‌ను పెద్దవాళ్లు తమ ఇష్టానుసారం నడిపిస్తున్నారు. అమెరికాలోని చాలా స్కూళ్లు పిల్లల పాలిట చాలా భయంకరంగా ఉన్నాయి. అక్కడి నియమాలు మేధాపరంగా కానీ సృజనాపరంగా కానీ ఎంత బీడుబారి పోయి ఉన్నాయో చెప్పలేం. అక్కడి టీచర్లు, ప్రిన్సిపల్స్‌లో సభ్యత లోపించింది.

ఇవి చాలా ఘాటైన మాటలు. చార్లెస్ సిల్బర్‌మెన్ ఏ రాజకీయ విప్లవకారుడు కాదు, కాల్పనిక ప్రపంచంలో విహరించేవాడు కాదు, పిల్లల పట్ల 'సెంటిమెంటల్'గా ఆలోచించేవాడు కూడా కాదని మనం గుర్తించాలి. స్కూళ్లు నడుస్తున్న తీరు గురించి ఆయన గమనించిన విషయాలు వివరించారు అంతే. ఆయన అభిప్రాయంలో స్కూళ్లు మరింత మెరుగుపడాల్సి ఉంది. మనం పత్రికలలో చదువుతూ ఉంటాం... చాలా స్కూళ్లలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని. స్కూళ్లు మరింత ఆసక్తికరంగా, మానవీయంగా మారాల్సి ఉంది. కొన్ని స్కూళ్లయితే చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. డేనియల్ ఫేడర్ 'ద నేకెడ్ చిల్డ్రన్' అనే పుస్తకంలో వివరించిన స్కూలు లాగానే చాలా మార్పులు ప్రవేశపెట్టి తర్వాత వాటిని వదిలేసే స్కూళ్లను గురించి మనం ఎక్కడా చదవం. కానీ చాలా స్కూళ్ళు పెద్దగా ఏం మారలేదు. పాఠ్య పుస్తకాలు, బోధనా సామాగ్రి నవీకరించబడ్డాయి. చాలా కొత్త బిల్డింగులు నిర్మించారు కానీ ఆత్మ మాత్రం పాతదే. అందుకు కారణం జనం కూడా బిల్డింగులు మాత్రమే కోరుకుంటున్నారు. నేను గమనించిందేమిటంటే, చాలా కచ్చితమైన నియమాలతో, భయపెడుతూ శిక్షిస్తూ బోధించడం వల్ల పిల్లలు క్రమశిక్షణతో నేర్చుకుంటారని సాధారణంగా భావిస్తారు.

సురక్షితంగా పెంచడమే పరమావధిగా నాలుగు గోడల మధ్య బాల్యాన్ని ఉంచి బయటి ప్రపంచం కంటే కూడా భయంకరమైన విధానాలను అనుసరించడం వల్ల క్రూరంగా తయారవుతోంది పిల్లల పెంపకం.

బయటి ప్రపంచం ఎలా ఉందో తెలియజేయడం చాలా అవసరం వారికి. రేపు ఈ ప్రపంచంలోనే వారు బతకాల్సి ఉంటుంది, కాబట్టి మంచీ చెడూ నేర్పాలి కదా అని అంటారు ఇలాంటి నిర్బంధ బాల్యపు తోటలను నిర్వహిస్తున్న వారు. వారిని సురక్షితంగా ఉంచడం కంటే వారికి బయటి ప్రపంచం గురించి నేర్పడమే ముఖ్యమనుకున్నపుడు వారిని బయటి ప్రపంచంలోకే వదిలి ఎలా ఉందో చూసి దానికి అనుగుణంగా నేర్చుకునే వెసులుబాటు కల్పించడం మంచిది కదా!

# 8. బాల్యంతో ఒక ఉపయోగం

**పి**ల్లలు, బాల్య వ్యవస్థ అనేవి పెద్ద భారం, చాలా పెద్ద గొడవ మాత్రమే కాదు కొద్దిపాటి ఉపయోగాలు కూడా ఉంటాయి. పిల్లలు కుటుంబం కోసం పనిచేసి రాబడి పెంచలేకపోవచ్చు. కానీ ఇంట్లో పెద్దవాళ్లకు కొన్ని అవసరాలు తీర్చగలుగుతారు. అవేమిటంటే పెద్దవారికి అధికారం చూపడానికి, వారికి పనుల్లో సాయం చెయ్యడానికి, ప్రేమించడానికి పిల్లలు అందుబాటులో ఉంటారు.

మనుషులు సమాజాలుగా రూపొందిన కాలం నుంచే ఎవరో ఒకరిమీద అధికారం చెలాయించడం ఆనవాయితీ అయిపోయింది. మనుషుల ఈ అవసరాన్నీ పిల్లలు చాలా బాగా తీర్చగలుగుతున్నారు. ఎంత తక్కువ వాడైనా, ఎంత అధికారం లేనివాడైనా అతడు తండ్రైతే చాలు... అధికారం చెలాయించడానికి, బెదిరించడానికి ఒకరు ఉంటారు. అధికారం చెలాయించడానికి ఒకరు లేనివారు ఎవరూ ఉండరు. అతడు బానిసైనా సరే అతనికి చెందిన బానిసలు తప్పనిసరిగా ఉంటారు, వారు అతడి పిల్లలు! నేడు కూడా 'స్వేచ్ఛా'మానవులు బానిసల్లాగా ఫీలవుతున్నారు. అందుకే, తమ ఇంట్లో కొందరు బానిసలు ఉండటం వారికి తృప్తి కలిగిస్తుంది. వారు లేకుండా చాలామందికి జీవితం కష్టమైపోతుంది.

కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటన నాకు గుర్తొస్తుంటుంది ఎప్పుడు. ఒక అతను తన ఎనిమిదేళ్ల కొడుకుతో కలిసి బస్‌లోకి వచ్చాడు. చాలా సీట్లు ఖాళీగా ఉన్నాయి. కాని అతడు నిలబడే ఉండాలని అనుకున్నాడు. తన కొడుకు మాత్రం కూర్చోవాలి అనుకున్నాడు. అతడి వైపు కూడా చూడకుండా అతడి ముఖంలో కానీ మాటలో కానీ ఎలాంటి భావం కనిపించకుండా ఒక స్థిరమైన గొంతుతో "కూర్చో" అన్నాడు. అలా చెబుతూ తన చేతిని కొంచెం కూడా పైకి ఎత్తకుండా తర్జని చూపించాడు. సాధారణంగా ఇలా కుక్కకు సూచన చేస్తుంటారు. అయితే తన కుక్కలతో కూడా ఇంత కఠినంగా

ప్రవర్తించే వ్యక్తులను నేను చాలా తక్కువ మందిని చూశాను. ఇప్పుడు ఇతడు తన కొడుకుతో అలా ప్రవర్తిస్తున్నాడు. ఆ పిల్లాడు వెంటనే సీట్లో కూర్చున్నాడు. అక్కడున్న అందరూ ఆ తండ్రి గొంతులోని కోపం హింసలతో కూడుకున్న బెదిరింపును గుర్తించారు.

చాలామంది పిల్లలు పెరుగుతున్న క్రమంలో తమ తల్లిదండ్రులు తమతో మాట్లాడినంత అధికారయుక్తంగా ప్రపంచంలో మరెవరితోనూ మాట్లాడలేరనే విషయాన్ని గ్రహిస్తారు. మనం ఇలా ప్రవర్తించడానికి తమ మీద మన మనసుల్లో అవ్యాజమైన ప్రేమ ఉందన్న సాకు చూపుతుంటాము. మనం అలా ప్రవర్తించడానికి కారణం మనకు వాళ్లంటే చాలా ప్రేమ అని  సమర్థించుకుంటుంటాం. 'నీతో అలా ప్రవర్తించడం వల్ల నీకంటే నేనే ఎక్కువ గాయపడుతుంటాను' అని పిల్లలతో అనని తల్లిదండ్రులు ఉండరు. ఇది అతి పురాతనమైన  అబద్ధం.

ఒక ఫ్రెండ్  ఆ మధ్య తను చూసిన ఓ టీవీ కామెడీ షో గురించి  చెప్పింది. తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడినట్టుగా అతిధులతో మాట్లాడే వ్యంగ్య ప్రదర్శన దానిలో ఒక భాగం. ఆ సీన్‌లో కొంతమంది వ్యక్తులు ఒక జంటను భోజనానికి ఆహ్వానిస్తారు. ఆ వచ్చిన అతిధులతో వారు ఇలా మాట్లాడతారు : "నా కుర్చీలో నుంచి లే, రోజంతా పనితో చచ్చిపోతున్నాను. చివరకు నాకిష్టమైన కుర్చీలో కూర్చునేందుకు కూడా వీలు కాదు ఈ ఇంట్లో" అని అంటుంది. "ఎన్నిసార్లు చెప్పాలి నీకు,  తినేముందు నీ దరిద్రపు చేతులను కడుక్కొమని?" ఇలా సాగే వారి మాటలతో, ప్రవర్తనతో వచ్చిన అతిధులు నిర్ఘాంతపోతారు.

ఇంటిలోనూ ఇదే పరిస్థితి. కుటుంబ సభ్యులు పరస్పరం మంచిగా ప్రేమతో మాట్లాడుకునే ప్రదేశం ఇల్లేనని అంటారు. మనం ఎంతో ప్రేమిస్తాము అని చెబుతున్న మన పిల్లల పట్ల చాలా క్రూరంగా, అవమానకరంగా, నిందాపూర్వకంగా ప్రవర్తిస్తుంటాము. ఇలా ప్రపంచంలో ఎవరితోనూ మాట్లాడలేరు, ప్రవర్తించలేరు. ఇది పిల్లల పాలిట చాలా ప్రమాదకరమైన ప్రదేశంగా పరిణమించింది. ప్రపంచంలో మరెక్కడా అనుభవించలేని కష్టాలు సమస్యలు వారు ఎవరి మీదైతే ఆధారపడ్డారో వారి వల్ల  ఎదుర్కోవాల్సి వస్తోంది.

# 9. సహాయం - సహాయం చేసేవారు

కొన్ని సంవత్సరాల క్రితం నేను సహాయం గురించి, సహాయం చేసే వారి గురించి ఒక గొప్ప సత్యం విన్నాను. అదేమిటంటే : 'సాయం చేసే చెయ్యి మళ్ళీ చేస్తుంది!'

ఈ మాట మొదట విన్నవారు ముందుగా ఆశ్చర్యంతో నవ్వేస్తారు. తర్వాత వివరణ అడుగుతారు. సహాయం అవసరమున్న వారికి సాయం చెయ్యడంలో తప్పులేదు. గుడ్ సామరిటన్ మంచి వాడు, గాయపడి గోతిలో కనిపించిన ప్రయాణికుడికి సాయం చేశాడు. ఆ దారి ప్రమాదకరమని, తనను తాను సంరక్షించుకునే స్థితిలో లేడని భావించి అతడిని పూర్తిగా కోలుకునే వరకు తన వద్దే ఉంచుకున్నాడు కూడా. ఆ విషయం అతడికి చెప్పడు. తర్వాత ప్రయాణికుడు తన దారిన తాను వెళ్ళిపోతాడు. సామరిటన్ అతడిని ఆపడు. ఇక్కడ అతడికి సంబంధించిన పూర్తి బాధ్యత సామరిటన్ తీసుకోలేదు, కేవలం కళ్లముందు ఒక వ్యక్తి బాధపడుతుండడం చూసి సాయం చేశాడు అంతే. లేదంటే అతడి పని అతడు చూసుకునేవాడు. ఇది సాయం చెయ్యడానికి ఒక మంచి ఉదాహరణ మాత్రమే.

ఈ రోజుల్లో సాయపడడం అనే ప్రక్రియ చాలా కలుషితమైపోయింది. అంతేకాదు ఒక విధ్వంసకరమైన దోపిడీగా కూడా మారింది. మానవ సహాయ చర్య కూడా ఒక సరుకులా ఒక వ్యాపారంలా, ఒక గుత్తాధిపత్యంలా తయారైంది. కానీ వచ్చే సమస్యల్లా కేవలం అడగకుండానే సాయం చెయ్యడానికి సిద్ధపడేవారితోనే, తాము సహాయపడే గుణం కలవారిమని చెప్పుకునే వారితోనే సమస్య. ఇలాంటి వారు తమ సాయం లేకుండా ఇతరులకు పనులేవీ కావంటూ తమను తాము గొప్ప సహాయం చేసేవారిగా ప్రకటించుకుంటారు. తమ సాయం తీసుకొమ్మని ఎదుటివారికి నచ్చచెబుతుంటారు. ఎదుటి వారు కూడా వీరి సాయం లేకుండా కష్టమని భావించి సాయం తీసుకోవడానికి సిద్ధపడతారు. చెప్పాలంటే అతడి మీద ఆధారపడతారు.

ఇలా ఇతరులకు సహాయం చెయ్యడమే జీవన విధానంగా ఉన్న వ్యక్తికి తప్పకుండా తన సహాయం తీసుకునే వారు కూడా ఉండాలి. సాయం చేసే వారు ఇలా సహాయం ఆశించే వారి మీద ఆధారపడి బతుకుతుంటారు నిజానికి. దేవుళ్లుగా భావించబడుతూ వీరి సాయం లేకుండా జీవితం నడవదని భావించే టీచింగ్, సైకియాట్రీ, సైకాలజీ, సోషల్ వర్క్ రంగాలకు చెందిన వారి వల్ల సమస్య. వారిలో కొంతమంది, చెప్పాలంటే ఎక్కువ మంది చాలా ఉదారంగా దేవుడి మాదిరిగా ప్రవర్తిస్తుంటారు. మరి కొంత మంది ఇందుకు విరుద్ధంగా క్రూరంగా, కఠినంగా ఉంటుంటారు తమకు తెలియకుండానే. ఇప్పటికే దేవుడున్న స్థానంలో తాము ఉండాలని ప్రయత్నిస్తుంటారు. ఈ రెండు రకాల మనుషుల వల్ల కలిగే ప్రభావం ఒకేలా ఉంటుంది. ఇతరులను తోలుబొమ్మలు చేసి ఆడించగలిగితేనే తాను దేవుడినని నమ్మించగలడు. క్రిష్టియన్లకు తెలుసు దేవుడ్ని దయ్యంగా మార్చడానికి జనం ఎక్కువగా నిస్పృహ చెందనక్కర్లేదని.

ఆ చక్రం మళ్లీ మళ్లీ పునరావృతం అవుతూనే ఉంటుంది. ఇలా సాయం చేసే వారు సాధారణంగా అంటుంటారు “నేను ఇది నీ కోసం చేస్తాను. నాకు దీని గురించి ఎక్కువగా తెలుసు, నీకంటే ఇది నేను మరింత మెరుగ్గా చెయ్యగలను’ అని. తర్వాత కాలంలో “వద్దు నువ్వా పని చెయ్యకు అది చెయ్యడం నీ వల్ల కాదు” అంటుంటారు. ఆ తర్వాత “ఈ పని చేసే ప్రయత్నం కూడా నేను చెయ్యనివ్వను నిన్ను, నీవల్ల ఏదైనా పొరపాటు జరిగితే నీకు లేదా ఇతరులకు ఏదైనా హాని జరగొచ్చు” అని అంటారు. ఒకవేళ అతడి సహాయాన్ని నిరాకరించి ఆ పని పూర్తి చేసే ప్రయత్నం చేసి ఏదైనా తప్పు జరిగితే ఇక అది పెద్ద పాపం లేదా నేరంగా పరిగణించబడుతుంది.

నిజానికి ఎవ్వరూ కూడా అంత నిస్సహాయంగా ఉండరు, చెప్పాలంటే తమకు ఎవరు సాయం చెయ్యాలనే విషయాన్ని నిర్ణయించుకోలేని వారు లేదా సాయం చేసే వారిని తప్పించుకోలేని వారే నిస్సహాయులు నాకు తెలిసి. అలాంటి సందర్భాన్ని వివరించే ఒక ఉదాహరణగా ఒక విషయం చెబుతాను. ఇక్కడ న్యూయార్క్ స్టేట్ ఆధ్వర్యంలో ఒక మానసిక వికలాంగుల హోమ్ నడుస్తోంది. రాబిన్ రేయిసిక్ ‘విలేజ్ వాయిస్’ అనే పత్రిక డిసెంబర్ 28, 1972లో ప్రచురితమైన ఆర్టికల్ ‘అనదర్ అన్ హాప్పీ ఈయర్ ఎట్ విల్లోబ్రూక్’లో జీవితం ఎలా ఉంటుందో పేర్కొంటూ ఇలా వివరించారు.

ఒక సంవత్సరం క్రితం క్రిస్మస్ రోజున డేవిడ్ (హోమ్‌లో ఉండే ఒక రిటార్డెడ్ పిల్లవాడు) అతడి ముఖం, చెవి, ఛాతి, చేయి కాల్చుకున్నాడు. ఈ సంవత్సర కాలంలోనే అతడి ముక్కు విరిగిపోయింది (రెండు రోజుల తర్వాత గానీ ఆ విషయం గుర్తించి ఎక్స్‌రే తీయించలేదు), ఒక వేలు కూడా విరిగిపోయింది. కనీసం ఆరుసార్లన్నా తలకు కుట్లు పడ్డాయి. అతడికి పది సంవత్సరాల వయసున్నపుడు అతడికి టాయిలెట్ ట్రెయినింగ్ ఇచ్చారు. సరిగ్గా తినేవాడు, తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడేవాడు. హెూమ్‌లో రెండేళ్లు ఉంచిన తర్వాత ఆ పిల్లాడు పక్కలోనే అన్ని విసర్జనలూ చేస్తున్నాడు. తనలో తనే మాట్లాడుకుంటున్నాడు. అతని పక్కన కూర్చోవాలంటే తానే అసహ్యించుకునే పరిస్థితి ఉందని అతడి తల్లి చెప్పింది.

పోయిన వారం ఫెడరల్ జడ్జ్ ఓరిన్ జుడ్ ముందు ఒక తండ్రి చెప్పాడు... పోయిన వారం కలుసుకోవడానికి వెళ్లినపుడు తన కొడుకు స్టెవీస్ ముఖం ఎలా వాచిపోయింది, కళ్లు ఎలా మూసుకొని పోయింది వివరించారు. తన కొడుకుని ఒక డాక్టర్‌కు చూపించమని ఆయన కోరారు. తర్వాత వారం వచ్చినపుడు కూడా ఆవిషయాన్ని మళ్లీ ప్రస్తావించారు. చివరకు రాతపూర్వకంగా అభ్యర్థించారు తన కొడుకుకు వైద్య సహాయం అవసరముందని. మొత్తానికి డాక్టర్ వచ్చి స్టీవ్‌ని పరీక్షించి అతడికి ఆపరేషన్ చేశారు. చాలా ఆలస్యం చేశారు అని డాక్టర్ స్టీవ్ ఆ తండ్రితో వ్యాఖ్యానించాడు. అప్పటికే స్టీవ్‌కు ఒక కన్ను పోయింది.

మరో తల్లి ఒకటి తర్వాత ఒకటిగా ఫోటోలు చూపుతోంది తన కూతురు ఎలా గాయపడిందో, ఎన్ని కుట్లు పడ్డాయో పెదవులు ఎలా వాచిపోయాయో, తలకు ఎలా దెబ్బలు తగిలాయో వివరిస్తూ. ఇక మరొక తల్లి వాపోతుంది... తన కూతురు ఎలా ఒంటరితనంలోకి వెళ్లిపోయిందో. ఆమె ఎలా కేవలం ఒక పైజామా, చొక్కా ధరించి చల్లని కటిక నేలమీద అలా పడుకొని వారాల తరబడి ఉండిపోవడం వల్ల ఆమెకు న్యుమోనియా ఎలా సోకిందో వివరించింది.

కొంతమంది హోమ్‌లో నివసించేవారి గాయాలకు సంబంధించిన కొన్ని ఫోటోలు చూసినపుడు కొన్ని గాయాలు తాళం చెవుల ఆకారంలో ఉన్నాయి. ఒక ఫిజిషియన్ ఈ గాయాలు పరిశీలించి నిర్ధారించారు. అయితే అక్కడ

నివసించేవారికి తాళం చెవులు అందుబాటులో ఉండవు. కేవలం అక్కడి సిబ్బందికి మాత్రమే తాళం చెవులు అందుబాటులో ఉంటాయి.

అయితే డిఫెన్స్‌లో భాగంగా ప్రభుత్వం వాదించిందేమిటంటే ఫెడరల్ కోర్టులకు దీనిపై ఎలాంటి తీర్పు చెప్పే అధికారం లేదని, విల్లోబ్రూక్‌లో జరిగిన సంఘటనలు "క్రూరమైనవి, అసాధారణమైన పనిష్‌మెంట్లు" అని నిర్ణయించలేమని, అక్కడుండే వారంతా కూడా వారంతట వారే చేసుకున్న గాయాలు అవని వాదించారు.

వ్యాసకర్త అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు కూడా ఉన్నాయి ఇలాంటి పిల్లల కోసం. అక్కడ పిల్లలకు చాలా మంచి సదుపాయాలు, ప్రేమ, ఆదరణ దొరుకుతాయి. అలాంటి చోట నాకు తెలిసిన వారి పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఇక్కడ ఉంచుకోవడానికి వారు ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టించుకుంటారు. విల్లోబ్రూక్ వంటి ప్రభుత్వ హోములన్నీ కూడా డబ్బు ఎక్కువగా ఖర్చుపెట్టే స్తోమత లేని వారి పిల్లల కోసం. అయితే తమ పిల్లలను అంతగా హింసిస్తున్నప్పటికీ వారిని అక్కడి నుంచి బయటికి ఎందుకు తీసుకురారో నాకు అసలు అర్థం కాలేదు. దానికి సమాధానం ఒక్కో కుటుంబంలోని వారు ఒక్కో రకంగా చెప్తారు. అలాంటి పిల్లలకు కొద్దిగా ప్రత్యేకమైన శ్రద్ధ కావాలి. తల్లిదండ్రులిద్దరు పనిచేసే వారు కావడం మూలాన అలాంటి శ్రద్ధ వారు అందించలేరు. మానసిక వికలాంగులైన పిల్లలను ఇతర స్కూళ్లలో చేర్చుకోరు, లేదంటే ఇలాంటి ఇన్‌స్టిట్యూషన్ కేర్ అవసరమనే నిపుణుల సలహా మేరకు అక్కడ చేర్చి ఉంటారు. లేక ఒక మానసిక వికలాంగుడైన పిల్లవాడిని ఇంట్లో పెట్టుకోవడం పరువు తక్కువనో లేక భరించలేమనో భావించి ఉండడం వల్ల ఇలా రకరకాల కారణాలతో మానసిక వికలాంగులైన పిల్లలను విల్లోబ్రూక్ లాంటి హోమ్‌లలో ఉంచుతుంటారు. ఏది ఏమైనా ఇలాంటి హోమ్‌లలో పిల్లలను ఉంచడం ఏ తల్లిదండ్రులకైనా బాధగానే ఉంటుంది. ఇక్కడ ఉంచడానికి సిద్ధపడ్డారంటే ఇక వారికి మరో దారేది లేదని అర్థం. వాళ్లు తమ పిల్లలతో హెూమ్ వాళ్ళు కొద్దిపాటి మర్యాదగా వ్యవహరించాలని కోరుకుంటారు.

కేవలం వికలాంగులైన పిల్లలు మాత్రమే కాదు తమ సంరక్షకులను ఎంచుకునే స్వేచ్ఛ లేని లేదా వారి సంరక్షకుల నుంచి తప్పించుకోలేని పిల్లలందరికి ఇలాంటి సమస్యలు తప్పవు.

చాలా రోజుల క్రితం నేను ఒక కథ చదివాను, ఆ కథ రాసిన రచయిత్రి తల్లి ఇటీవలే ఆమె డబ్బు చెల్లిస్తున్న ఆసుపత్రిలో ఏదో చికిత్స లేని వ్యాధి వల్ల చనిపోయింది. అనారోగ్యంగా ఉన్న ఆమెకు ఆకలి పోవడంతో ఆసుపత్రి వారు ఇచ్చే ఏ ఆహారం తీసుకునేది కాదు. అయినా వాళ్లు ఆమె ఆహారం తీసుకుని తీరాలని చెప్పేవారు, వారికి తెలుసు ఆమె

కోలుకోవడం సాధ్యం కాదని, ఆమె ప్రాణాలతో ఆసుపత్రి నుంచి వెళ్లడం జరగదని కూడా వారికి తెలుసు. ఆమె తినడానికి నిరాకరిస్తే వారంతా కలిసి ఆమెకు ముక్కు ద్వారా పైప్ వేసి బలవంతంగా ఆమెకు ఆహారం ఇచ్చేవారు. ఇది అమర్యాదపూర్వక ప్రవర్తన మాత్రమే కాదు, చాలా అసౌకర్యంగా కూడా ఉంటుంది. అందువల్ల ఆమె అప్పుడప్పుడు తీసి పారేసేది. తన జీవితాన్ని ఇంకా కొనసాగించడం ఇష్టంలేని ఆమెకు ఆహారం అందించడానికి ప్రతిసారీ దీన్ని అమర్చడం నర్సులకు మరింత అదనపు పనిగా మారేది. ఇలా ఆహారం అందించాల్సిన ప్రతిసారీ ఆమె చేతులు మంచానికి కట్టేసేవారు. ఆమె మెలకువగా ఉన్న సమయమంతా కూడా తనను ఈ కష్టం నుంచి ఎవరు కాపాడుతారా అని మాత్రమే చూసేది.

ఇలాంటి విమర్శ అన్ని సంస్థలకు వర్తించకపోవచ్చు. అమెరికాలోని కొన్ని సంస్థలకు, మరికొన్ని దేశాల్లోని కొన్ని సంస్థలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. చాలా దేశాల్లో ఇలాంటి నిస్సహాయ స్థితిలో ఉన్నవారితో మరీ ఇంత క్రూరంగా ప్రవర్తించడం జరగదు. కొన్ని సంస్థలు ఇలాంటి వారి పట్ల చాలా అంకిత భావంతో వారికి సహాయం చేస్తాయి. యూరోప్ లోని కొన్ని దేశాల్లో ఇలాంటి సామాజిక కరుణ, సామాజిక బాధ్యత కొంచెం ఎక్కువగానే కనిపిస్తుంది. అవి చిన్న దేశాలు, పాత దేశాలు అయి వుండొచ్చు, బహుశ వాళ్లు రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీల చేతిలో హింసను అనుభవించిన వారై ఉండొచ్చు, అందువల్ల వారంతా ఒకటిగా నిలబడి బాధను దాడిని ఎదుర్కోవడం వల్ల ఒకరి పట్ల ఒకరు బాధ్యతగా ఉండడం, బాధలు పంచుకోవడం వల్ల వారంతా ఒక పెద్ద కుటుంబంగా ఏర్పడ్డారు. కానీ ఆ భావన ఎక్కువకాలం పాటు అంత బలంగా ఏమీ ఉండదు. కాలం గడుస్తున్న కొద్దీ బలహీనపడుతుంది.

భవిష్యత్తు ఒక పీడకలగా కనిపిస్తోంది. ప్రభుత్వాన్ని అదేపనిగా విమర్శించే వారిని 'మెంటల్ హాస్పిటల్స్'లో చేర్పించి వారు దారిలోకి వచ్చేవరకు 'స్పెషల్ ట్రీట్‌మెంట్' ఇప్పించే కొన్ని దేశాలు ఉన్నాయి. అలాంటి చిన్నపాటి పోలీసింగ్ ప్రభుత్వాల వంటి మన స్కూళ్లలో కూడా పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికంటూ 'రిటాలిన్' వంటి ఎక్కువ ప్రభావం గల మందులు ఉపయోగించడం పెరిగిపోతోంది.

ఇలాంటి పరిస్థితి సర్వత్రా ఒక నిర్బంధంగా మారే రోజు కూడా ఎంతో దూరంలో లేదు. మనం దీని గురించి కూడా కొద్దిగా తెలుసుకుందాం. మెదడుపై ప్రభావం చూపే చిన్నపాటి ఎలక్ట్రోడులు పిల్లల మెదడులో అమర్చుతారు. టీచర్ బల్ల మీద లేదా ఆమె చేతిలో వాటి కంట్రోల్ సిస్టం ఉంటుంది. సందర్భాన్ని బట్టి అనుకూలమైన లేదా ప్రతికూలమైన (నొప్పి) సంకేతాలు పంపి పిల్లలను అజమాయిషీ చేస్తుంది! ఇలాంటి పద్ధతుల మీద శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు.

ఒక పనిచెయ్యవలసిందని బలవంత పెట్టేవారిలో లేదా భయపెట్టే వారిలో చాలా తక్కువ మంది 'ఈ పని చెయ్యడం వల్ల నాకు బావుంటుంది నీకు కాదు' అని ఒప్పుకునే నిజాయితీ కలిగి ఉంటారు. చాలా మంది తాము బాధిస్తున్న వారిని ఏదో కష్టం నుంచి కాపాడడానికే అలా ప్రవర్తిస్తున్నామని నిరూపించడానికి ప్రయత్నిస్తుంటారు. భవిష్యత్తులో జరగబోయే ఏదో గొప్ప మంచి కోసం ఇప్పుడిలా ప్రవర్తిస్తున్నామని తాము పెడుతున్న బాధను సమర్థించుకుంటారు కూడా.

ఎవరైనా ఏదైనా పనిచేస్తూ ఇది నేను నీ మంచి కోసమే చేస్తున్నాను అనడాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు. అతడు చెయ్యబోతున్నది ఎలాంటి మంచి? ఎప్పుడో జరగబోయే మంచి ఇప్పుడెందుకు ఇంతలా బాధిస్తుంది? సహాయం చేస్తున్నవారే తాము చేస్తున్న మంచేమిటో నిరూపించుకోవాల్సి ఉంటుంది.

అది మాత్రమే కాదు, హెల్పర్లు కచ్చితంగా కరుణ కలిగి, సామర్థ్యం కలిగి, నిస్వార్థంగా ఉంటారని చెప్పలేము. ఇక వారు చేసే సాయం నిజంగా ఉపయోగకరంగా ఉంటుందని, దాని వెనుక ఎలాంటి దురుద్దేశ్యం లేదని, లేదా ఏదైనా అదుపు సంపాదించే దిశగా ఉండదని చెప్పడానికి లేదు. అందుకే సాయం పొందే వారికి ఎప్పుడు, ఎంతకాలం పాటు, ఎలాంటి సాయం ఎవరి నుంచి తీసుకోవాలో ఎంచుకునే అవకాశం ఉండాలి.

సాయం చేసే ప్రతి ఒక్కరూ వేధించేవారే అయి ఉండకపోవచ్చు. వారు చేసే ఎలాంటి పనులు ఎంత అపాయకరంగా మారతాయన్న దాన్ని బట్టి ఉంటుంది. ఇతరులు చేసే తప్పు వల్ల నష్టం కలుగుతుందని భావించే వారి వల్లనే ఎక్కువ నష్టం జరుగుతుంది. వారు చాలా తెలివిగా ఎలాంటి తప్పు జరగకుండా కాపాడడానికే తాము అలా ప్రవర్తిస్తున్నామని అంటుంటారు. ఇది వారి అపోహ మాత్రమే. నిజంగానే మనకు అలాంటి శక్తి ఉంటే అలా ప్రవర్తించడంలో ఏదైనా లాభం ఉండొచ్చు. ఎవరి సాయం తీసుకోని వారు తప్పుచెయ్యకుండా ఉండలేరని వాదించేవారు కూడా ఉన్నారు. జీవితంలో అందరు ఏదో ఒక రకమైన తప్పుచేసే వారే. నేనైతే అలా తప్పుచేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉండాలంటాను. ఇలాంటి అవకాశం కల్పిస్తే మరెవరో నిపుణులు వచ్చి బాగు చేసే దానికంటే కూడా ఎవరి జీవితం వారు చాలా చక్కగా చక్కదిద్దుకోగలుగుతారు. ఒక వేళ తప్పుజరిగినా అతడు అందులో చిక్కుకుపోనంత వరకు అతడే మిగతా వారి కంటే ముందు గుర్తించి చాలా సమర్థవంతంగా దాని నుంచి బయటపడగలుగుతాడు.

మనం తెలుసుకోవాల్సిందేమిటంటే మనం ప్రేమిస్తున్న వారి జీవితాలమీద మన అధికారానికి చాలా పరిమితులుంటాయి. దానికి మించి మనం అతడి జీవితంలో కల్పించుకోవడం వల్ల, అతడికి ఎలాంటి తప్పుచేసే అవకాశం లేకుండా చెయ్యడం వల్ల అతడిని మనం ప్రపంచం ముందు బానిసగా నిలబెట్టడం మినహా చెయ్యగలిగేదేమి ఉండదు.

# 10. పిల్లల సామర్థ్యం

**బో**స్టన్‌కు తిరిగి వచ్చిన తర్వాత నేను ఎయిర్ టెర్మినల్ గుండా నడుస్తున్నపుడు నా కంటే ముందు ఒక తల్లీ కొడుకూ కూడా అదే దారిలో నడుస్తున్నారు. ఆ బాబు పసుపు పచ్చ రంగు పఫ్డ్ స్నో సూట్ వేసుకుని ఉన్నాడు. అతడి వయసు ఒకటిన్నర రెండు సంవత్సరాలు ఉంటుందేమో. అతని తల్లి అతడి చెయ్యి పట్టుకొని ఉంది. వాళ్ల అమ్మ ఆ చెయ్యిని చాలా గట్టిగా పట్టుకున్నట్టు, అతడు దాన్ని విడిపించుకోవాలనుకుంటున్నట్టు అనిపించింది. చెయ్యిని లాక్కుంటూ ఆమె చేతి నుంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపించాడు. అతడు తనంతట తాను నడవాలని అనుకుంటున్నాడని చూస్తే అర్థమవుతోంది.

అతడి తల్లి కూడా అలవాటుగా పట్టుకుందే తప్ప మరోటి కాదు. నాకు ఆశ్చర్యంగా అనిపించింది ఆమెలో అతడి చేతిని వదలాలన్న ఆలోచన ఎందుకు రావడం లేదు, అతడు కోరుకుంటున్నట్టు అతడి దారి వెంట అతడిని నడవనివ్వండి అని ఆమెను అడిగాను ఆమె అయ్యో అలాగే, తప్పకుండా అని ప్రయత్నించి చూసింది. "నేను అతడి చెయ్యి వదలలేను. అతడికి కనీసం రెండేళ్లు కూడా లేవు, ఎవరన్నా తగిలితే పడిపోవచ్చు, ఏదైనా సమస్య రావచ్చు, దెబ్బతగలవచ్చు, మరేదైనా పిచ్చి పనిచేయవచ్చు, ఏదైనా ప్రమాదంలో పడొచ్చు, నేను అంత రిస్కు తీసుకోలేను," చెయ్యి వదిలిన మరుక్షణం నుంచి అలా ఆలోచిస్తుంది  లేదా అంటుంది. అలా జరిగే అవకాశం ఉండొచ్చు కానీ తప్పకుండా జరుగుతుందని చెప్పలేము. ఆ పిల్లాడు కేవలం మిగతా జనంతో పాటు కలిసి అందరిలాగే స్వేచ్ఛగా నడవాలని కూడా అనుకుంటూ ఉండొచ్చు. అతడిని ప్రయత్నం చెయ్యనివ్వవచ్చు కూడా. ఒకవేళ బాబు ఏదైనా తప్పు చెయ్యబోతుంటే ఒకటి రెండు అడుగుల్లో అతడిని పట్టుకోవచ్చు కూడా. ఇది చాలా చిన్న విషయమే ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఆ పిల్లవాడు స్వేచ్ఛను అనుభవించే, తనపై తనకు విశ్వాసం ఏర్పరచుకునే అవకాశం కోల్పోయాడు. అందరిలా అతడు చెయ్యలేక పోయాడు.

మరోసారి మరో ఎయిర్‌పోర్టులో నేను ఈసారి ఒక తండ్రిని చూశాను. ఒక చిన్నపిల్లవాడితో కలిసి ఉన్నాడు. వారి విమానం కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ పిల్లవాడు అక్కడ అటూ ఇటూ తిరగాలని అనుకుంటున్నాడు, అలా ఆడుకోవాలని ఆశపడుతున్నాడు. ఆ తండ్రి కూడా అందుకు అంగీకారంగానే ఉన్నాడు. పిల్లవాడు నెమ్మదిగా నడుచుకుంటూ వెయిటింగ్ ఏరియా దాటి కారిడార్ దాటి వెళ్లగానే తండ్రి కూడా అతడి వెంట వెళ్లాడు. ఆ పిల్లవాడు తనను ఎవరో వెంబడిస్తున్నారని భావించేంత దగ్గరగా కాకుండా, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటే వెంటనే చేరుకునేంత దగ్గరలో ఉండి తండ్రి అతడిని గమనిస్తున్నాడు, అదే సమయంలో బాబు ఆడుకుంటూ మధ్యలో అప్పుడప్పుడు నాన్న ఏడి? అని చుట్టూ చూసుకుంటున్నాడు. అతడికి ఏదో ఒక తెలిసిన ముఖం కనిపించాలి మరి. కనిపించగానే ఆనందంగా తిరిగి ఆడుకుంటున్నాడు. ఈ పర్యవేక్షణ ఎంతో అందంగా ఎంతో ముచ్చటగా ఎంతో సున్నితంగా ఉంది. పిల్లాడు చాలా సంతోషంగా చుట్టుపక్కలంతా తిరిగాడు. అది గొప్ప దూరమేమి కాదు కానీ చాలా ఆనందంగా ఆడుకున్నాడు. మామూలుగా చిన్న పిల్లలు కాస్త అలసిపోయేదాకా ఇలా ఆడతారు. ఒకసారి అలసిపోతే వారికి విశ్రాంతి అవసరముంటుంది. ఆట ఆపేస్తారు.

లగేజి తీసుకునే చోట నేను ఇలాంటిదే మరో దృశ్యం కూడా చూశాను. ఇక్కడొక తల్లి తన ఇద్దరు పిల్లలతో ఉంది. ఒక పాప ఆరేడు ఏళ్ల వయసుంటుంది, మరో పాప నాలుగైదు సంవత్సరాలుంటుందనుకుంటా. కన్వేయర్ బెల్ట్ అప్పటికే కదులుతోంది. కానీ దానిమీద ఎలాంటి బ్యాగులు లేవు. అది పిల్లలకు చాలా మనోహరంగా అనిపిస్తోంది. వాళ్లు దానికి దగ్గరగా వచ్చి చూస్తున్నారు. అక్కడ గోడకు ఉన్న రంధ్రం నుంచి కనిపిస్తున్న బ్యాగులను కూడా ఆసక్తిగా చూస్తున్నారు. వాళ్ల ఆసక్తి చూస్తే అలాంటిది వారు చూడడం ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. కానీ వెంటనే వాళ్ల అమ్మ "దూరంగా ఉండండి దానికి, దాన్ని ముట్టుకోవద్దు" అని కఠినమైన గొంతుతో చెప్పడం విన్నాను నేను. వాళ్లు దాన్ని ముట్టుకోవాలని ఏమీ కదిలినట్టు అనిపించలేదు నాకు, వాళ్లు బ్యాగులు ఎలా వస్తున్నాయో చూడాలని మాత్రమే అనుకున్నారు. బ్యాగు తీసుకోవడం కోసం ఎదురు చూస్తున్నవారి కంటే కొంచెం దూరంలోనే నిలబడి ఉన్నారు. వారికి చాలా ఆసక్తిగా ఉంది, పెద్ద వాళ్లందరిని తోసుకొని చూస్తున్నారు, వారు ఎప్పుడూ చూడని ఆ విచిత్రం చూడాలన్న ఆత్రుత వారిలో చాలా ఎక్కువగా ఉంది. ఆ సమయంలో వాళ్లమ్మ అదే అధికారయుతమైన గొంతుతో అవి ముట్టుకోవద్దని, దూరంగా ఉండమని ఆదేశిస్తునే ఉంది (వాళ్లసలు ముట్టుకోవడం కానీ దగ్గరకు వెళ్లడం గానీ చెయ్యడమే లేదు). ఇది నా బ్యాగ్ వచ్చి నేను అది తీసుకొని వెళ్లిపోయే వరకు జరుగుతూనే ఉంది.

నేను ఈ కథ తల్లులను నిందించడానికి చెప్పడం లేదు. చాలా రకాల ఆందోళనలు ఆమెను అలా ప్రవర్తించేలా చేస్తున్నాయి. దీనంతటికీ పిల్లలు అంతకు ముందెప్పుడో విపరీతమైన అల్లరి చేసి ఉండటం లేదా ఏదో ఒక తుంటరి పనిచేసి ఏదైనా ప్రమాదం తెచ్చుకొని ఉండడం కారణమై ఉంటుంది. అయితే పెద్దవాళ్ల అలాంటి ఆందోళన ప్రభావం పిల్లల మీద ఎలా ఉంటుంది, మనం వాళ్ల గురించి మిగతా ప్రపంచం గురించి వాళ్లకు ఏం తెలియ చెబుతున్నాం అనేదే ఇక్కడ విషయం. మనం ఏం చెబుతున్నామంటే 1. ఈ ప్రపంచం చాలా ప్రమాదకరమైంది, బాధాకరమైంది, ఊహకందనిది 2. నువ్వు అలా ఒంటరిగా దాన్ని ఎదుర్కోలేవు కాబట్టి కచ్చితంగా నువ్వు నామీద ఆధారపడాల్సిందే. లేదంటే నీకు చాలా కష్టాలు ఎదురవుతాయి.

ఇప్పుడు ఇలా వాళ్ల ఆసక్తికి అడ్డుకట్ట వేస్తున్న ఈ తల్లి తర్వాత కాలంలో వారి చదువు గురించి స్కూలింగ్ గురించి వారిని ఎలా సన్నద్ధం చెయ్యాలో అని కూడా బెంగపడుతుందనుకుంటా. కొన్నాళ్లకి ఈమె కూడా మా పిల్లలకు అసలు దేనిమీద ఆసక్తి ఉండనే ఉండదు అని వాపోయే పెద్దల్లో చేరిపోతుంది. పిల్లల ఆసక్తిని ఎప్పటికప్పుడు అణచి వేస్తుంటే కొన్నాళ్లకి పిల్లలు ఎలా తయారవుతారంటే వారికి ఏదైనా ఆసక్తికరంగా అనిపించినా అది అమ్మకు తెలియకుండా దాచాలని అనుకుంటారు. కానీ మనం ఎంత కాలం అని అలా వారి ఆసక్తిని చంపుతూ ఉంచగలం. వారికి అలా ఆసక్తిని చూపడం వల్ల వారికి సమస్యలు ఎదురవుతాయని నష్టమే జరుగుతుందని నేర్పిస్తూ ఉండగలం. మనమే వారి ఆసక్తికి అడ్డుతగులుతూ వచ్చి తర్వాత వారు దేనిమీద ఆసక్తి చూపడం గానీ నేర్చుకోవడం కానీ చెయ్యడం లేదని  ఫిర్యాదు చెయ్యడం సమంజసమేనా?

తర్వాత కాలంలో నేను ఉపన్యాసాలు ఇస్తూ, పర్యటిస్తున్నపుడు ఒక తెలివైన స్త్రీని కలుసుకోవడం జరిగింది. ఆమె నన్ను ఒక మీటింగ్ నుంచి మరో మీటింగ్‌కు తీసుకువెళ్ళేది. ఒకసారి మా సంభాషణల మధ్యలో ఆమె తన తొమ్మిది సంవత్సరాల కూతురు గురించి చెప్పింది. వాళ్ల అమ్మాయి తనతో పాటు వంటలో పాలు పంచుకుంటుందని, వంట నేర్చుకుందని చాలా పదార్థాలను స్వయంగా వండడం నేర్చుకునే వరకు తినేది కాదని  చెప్పింది. ఆ తల్లి తన కూతురి వంట ప్రావీణ్యం గురించి కొద్దిగా చెప్పింది. తర్వాత తనే అంది "ఆమె వంట చేస్తాననన్న ప్రతీసారీ నాకు చాలా భయంగా ఉంటుంది, ఎక్కడ కాల్చుకుంటుందో, గాయపడుతుందేమో అని."

చిన్నపిల్లల్లోని నేర్చుకునే తత్వం మీద మనకు నమ్మకమే ఉండదు. వారిని మనం ఎప్పుడూ తక్కువ అంచనా వేస్తుంటాము. కొన్ని సంవత్సరాల క్రితం ఎస్క్వయిర్ మ్యాగజైన్‌లో "మైక్రో–హాపర్స్" మీద, అంటే 'టీనీ–బాపర్స్' (టీనేజ్ మధ్య వయసులో

ఉన్న పిల్లలు) కంటే చిన్నవారైన పిల్లల మీద ఒక ప్రత్యేక సంచిక వేసింది. వీళ్లు అప్పట్లో ఎక్కువగా వార్తల్లో ఉండేవారు. పన్నెండు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల మీద ఎక్కువ వ్యాసాలు ప్రచురితం అయ్యేవి. ఒక రేడియో కేంద్రాన్ని పన్నెండు సంవత్సరాలలోపు పిల్లలు దాదాపు పూర్తిగా నడిపేవారని పేర్కొంటూ దాన్ని గురించి ఒక వ్యాసం వివరించింది. ఈ స్టేషన్ స్థానిక స్కూళ్లతో అనుసంధానం చెయ్యబడి ఉండేది. కార్యక్రమాలు నడిపిస్తున్న వారు ఆ వయసు దాటిపోతే ఇక వారు దాని నుంచి తప్పుకొని ఆ వయసు కలిగిన మరొకరికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. ఆ వ్యాసంలో రాసిన దాన్ని బట్టి చాలా విస్తృతమైన కార్యక్రమ ప్రణాళిక తయారుచేసి చాలా రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించారు.

చిన్నపిల్లలకు మనం ఏం నేర్పించినా నేర్చుకుంటారు. ముఖ్యంగా వారితో మనం ఎలా ప్రవర్తిస్తాం అనేదాని మీద అది ఆధారపడి ఉంటుంది. వారిని ఎప్పుడూ కూడా అమాయకులుగా, బాధ్యతలేని వారిగా, తెలివితక్కువ వారిగా పరిగణించే నిరుపయోగులుగా జమకట్టకూడదు. బాల్యం అంటే ఏమిటనేది చాలా ముఖ్యం ఇక్కడ. సాధారణంగా సమాజంలో మనం ఆ వయసులో చెయ్యలేనివి ఇప్పుడున్న పిల్లలు చెయ్యగలరని నమ్మడానికి సిద్ధంగా ఉండము.

న్యూయార్క్ రేడియో స్టేషన్ డబ్ల్యూబీఏఐ లో ఒక ఇంటర్వ్యూ ప్రసారమైంది. అందులో నేను బాల్య వ్యవస్థ, పిల్లల్లోని అసాధారణమైన సామర్థ్యం గురించి చెప్పడం జరిగింది. దాన్ని మనం ఎప్పుడూ గుర్తించడం కానీ పరిగణనలోకి తీసుకోవడం కానీ జరగనే జరగదు. ఆ కార్యక్రమం జరుగుతున్న సమయంలో చాలా ఫోన్ కాల్స్ వచ్చాయి. నేను స్టూడియో నుంచి బయటికి రాబోతున్న సమయంలో ఒకతనికి కాల్ దొరికింది. ఆయన తప్పనిసరిగా నాతో మాట్లాడాలని డబ్ల్యూబీఏఐ వారిని అభ్యర్థించాడు నేను మాట్లాడిన అంశం గురించి తాను మాట్లాడదలచుకున్నానని. నేను మాట్లాడడానికి ఒప్పుకున్నాను. అతడు ఒక ఆసక్తికరమైన కథ చెప్పాడు. అతడొక డెంటల్ టెక్నీషియన్. న్యూయార్క్ పట్టణంలో ఉన్న ఒక డెంటల్ హాస్పిటల్‌కు అనుసంధానం చేసిన ల్యాబ్ నడిపిస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి పది పన్నెండు సంవత్సరాల పిల్లలు వచ్చినపుడు వారితో మీ అమ్మ లేదా నాన్న ఇక్కడ మరో రెండు గంటలపాటు ఉంటారు. మీరు ఇక్కడ ఊరికే కూర్చుని ఉండే బదులుగా మా లేబొరేటరీ అంతా తిప్పి చూపుతాం వస్తారా అని అడగమని చెప్పి అతడి ఫ్రంట్ ఆఫీస్ సిబ్బందికి సూచనలు ఇచ్చి పెట్టారు. దాదాపుగా ప్రతి పిల్లవాడు అందుకు అంగీకరిస్తాడు. ఇక అతడిని ల్యాబ్ అంతా తిప్పి అక్కడ ఎలాంటి పనులు జరుగుతాయో చూపిస్తారు. ఆ పిల్లవాడు అక్కడి పనుల పట్ల ఆసక్తి కనబరిస్తే

"నేను చేస్తున్న పనిలో నాకు సాయం చేస్తావా?" అని అడిగినపుడు దాదాపు అందరూ చేస్తామని అంగీకరించారు. ఇక అతడికి కొద్దిగా పని నేర్పించడం మొదలు పెడతారు. ఇక్కడ విషయం ఏమిటంటే అలా ప్రతి చిన్న పిల్లవాడు ఎంతో కొంత పనిచేశాడు. ఇదంతా చెప్పి ఆ ల్యాబ్ హెడ్ ఏమన్నాడంటే "నాకు పది సంవత్సరాల పిల్లవాడిలా ఆసక్తితో త్వరగా నేర్చుకునే వారిని నేను ల్యాబ్‌లో పనికి పెట్టుకునే వీలుంటే బావుండేది. అందుకు చట్టంలో వెసులుబాటు కల్పించాలి, ఎందుకంటే పిల్లలు మరింత ఆసక్తితో, ఆత్మవిశ్వాసంతో, నమ్మకంతో పనిచేస్తారు" అని.

నాతో పాటు పనిచేసే నా సహోద్యోగులతో కలిసి తొమ్మిదో తరగతి చదివే ఒక విద్యార్థిని కూడా పనిచేసింది ఒక వారం పాటు నా ఆఫీసులో. నగరంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు తిరిగి తమ కోసం నగరంలో ఒక ఆటస్థలం నిర్మాణానికి సహకరించాలని ఉత్తరాలు రాసింది, ఫోన్ కాల్స్ చేసింది, నగరంలోని రకరకాల ఆఫీసులకు వెళ్లింది, చాలామందితో మాట్లాడింది, ఎన్నో రకాల పనులు చేసింది. అవ్వన్నీ కూడా తర్వాత చాలా ఉపయోగపడ్డాయి. వారం తర్వాత ఆమె తిరిగి స్కూల్‌కు వెళ్ళిపోతూ తాను ఇలాంటి పనులన్ని చేయడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి పనులు ఎన్నైనా సరే చేస్తానని, ఆమె చేసిన పనులన్ని కూడా చాలామంది చేసే పనుల కంటే కూడా చాలా ఆసక్తికర మైనవన్నది మాత్రం నిజం. ఆమె ఆ పనులన్నీ చాలా సమర్థవంతంగా చేసిందనేది ఇక్కడ విషయం.

జె. హెచ్. వ్యాన్ డెన్‌బెర్గ్ పదహారు సంవత్సరాల పిల్లవాడు. యుద్ధ సమయంలో అతడిని హాలెండ్‌లోని ఒక ప్రదేశానికి విధులు నిర్వర్తించాల్సిందిగా పంపించారు. నేను ఎన్‌ఆర్‌ఓటీసీలో నావికా చరిత్ర చదివినపుడు తెలుసుకున్న విషయాలు ఆశ్చర్యం కలిగించాయి. విప్లవాత్మకమైన ఆ యుద్ధంలో పద్నాలుగు సంవత్సరాల పిల్లలు మిడ్‌షిప్‌మెన్ – దిగువ ర్యాంక్ నావికా అధికారులు – గా వ్యవహరించారు. మరో పిల్లాడి వయసు పదహారు సంవత్సరాలు. అతడు ఏకంగా ఒక నౌకను కమాండ్ చేస్తున్నాడు. ఇది చాలా బాధ్యతాయుతమైన మరియు కష్టమైన పని. చాలామంది తమ జీవితకాలంలో ఒక్కసారి కూడా అలాంటి అవకాశం పొందలేరు. ప్రస్తుత వాయవ్య ప్రాంతంలో నివసిస్తున్న ఎడ్వర్డ్ హాల్ అనే ఆంత్రోపాలజిస్ట్ హాలెండ్ చరిత్ర పట్ల చాలా ఆసక్తి ఉన్నవాడు. ఆయన చెప్పిన విషయాలు చాలా ఆశ్చర్యం కలిగించాయి. ఒక పెద్ద వ్యాగన్ ట్రెయిన్ రికార్డు చదివినపుడు ఆయన దృష్టికి వచ్చిన విషయం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక శతాబ్దం క్రితం యూఎస్ నుంచి న్యూమెక్సికో వచ్చిన ఆ భారీ వ్యాగన్ ట్రెయిన్‌ను పధ్నాలుగేళ్ల కుర్రాడు కమాండ్ చేశాడు.

కొంతమంది పూర్వకాలపు పిల్లల 'ఈడుకు మించిన బుద్ధికుశలత' గురించి చదివినప్పుడు మనకు అనుమానాలు రేకెత్తుతాయి. భయపడతాం కూడా. ఈ 'బాలప్రౌఢిమ' (ప్రికోసిటీ) అనే మాట ఏదో జబ్బు పేరులా అనిపిస్తుంది. చాలా మంది పిల్లలు ఇలా చెయ్యలేరని అనుకుంటారు. కొంతమంది అసహజమైన పిల్లలు మాత్రమే ఇలా చెయ్యగలరని అనుకుంటారు. నాలుగేళ్ల బాలుడు లేదా బాలిక లాటిన్, గ్రీక్ భాషలు మాట్లాడుతున్నపుడు వింటే వారిని చూసి దడుచుకుంటారు. ఎక్కువ మంది జనాలతో మాట్లాడే అవకాశం ఉన్న పిల్లలు ఒక భాష ఎంత సునాయసంగా నేర్చుకుంటారో ఒకటి కంటే ఎక్కువ భాషలు కూడా ఒకటే భాష నేర్చుకున్నంత సునాయసంగా నేర్చుకుంటారు. యూరపు దేశాలకు చెందిన పన్నెండు అంతకంటే తక్కువ వయసు పిల్లలు చాలా మంది మూడు కంటే ఎక్కువ భాషలు మాట్లాడడం నేను చూశాను. ఎవరికీ పెద్దగా ఆశ్చర్యంగా కనిపించదు కూడా.

పిల్లలు సంగీతం కూడా చాలా త్వరగా నేర్చుకుంటారు. దాన్ని కూడా మనం అంత త్వరగా అంగీకరించము. అలా నేర్చుకుంటున్న పిల్లలు కూడా అసహజమైన వారని, కాబట్టే నేర్చుకోగలిగారని అనుకుంటారు. కానీ జపాన్‌కు చెందిన సంగీత కళాకారుడు, ఉపాధ్యాయుడు అయిన సుజుకి ఇప్పటికే మూడు అంశాలు రుజువు చేశాడు : 1. ఆరు, ఐదు, ఇంకా చెప్పాలంటే నాలుగేళ్ల పిల్లలు కూడా ఆశ్చర్యం గొలిపే రీతిలో వయోలిన్ నేర్చుకోగలుగుతారు; 2. చాలామంది సగటు స్థాయి పిల్లలకు ఈ సామర్థ్యం ఉంటుంది; 3. పిల్లలు వయోలిన్‌కే జీవితం అంకితం చేయకుండానే, వారు తమ బాల్యాన్ని ఎంత మాత్రం కోల్పోకుండానే అద్భుత ప్రావీణ్యం సాధించగలరు. ఎన్నోసార్లు సుజుకీ తన శిష్యులతో కలిసి యూఎస్ వచ్చి ప్రదర్శనలు కూడా ఇచ్చి ఇక్కడి ప్రజల మెప్పు కూడా పొందారు. నేను మొదటిసారి వారి సంగీత విభావరికి వెళ్లినప్పుడు సుజుకీతో మాట్లాడడం జరిగింది. అప్పుడు ఆయనను అడిగాను ఇంతమంది ప్రతిభ గల పిల్లలను ఎలా గుర్తించగలిగారు అని అడిగాను. అందుకు తాను ప్రత్యేకంగా గుర్తించిందేమీ లేదని, ఈ పర్యటన ఖర్చు భరించగలిగిన స్తోమత ఆ పిల్లల తల్లిదండ్రులకు ఉండడం వల్ల వాళ్ళు ఇక్కడిదాకా వచ్చి ప్రదర్శనలో పాల్గొనగలిగారని సమాధానం చెప్పాడు. జపాన్‌లో ఇలా వాయించగలిగే పిల్లలు ఇంకా వేలమంది ఉన్నారని చెప్పాడు. ఆ తర్వాత నేను ఆమె చెబుతున్నది నమ్మడం నేర్చుకున్నాను. కొన్నేళ్ల క్రితం బోస్టన్‌లో పాడిన ఈ పిల్లలు చాలా ఆరోగ్యంగా, సంతోషంగా, ఎలాంటి భయం లేకుండా వాళ్ళు చేస్తున్న పనిని చాలా ఆనందిస్తూ ఉన్నారు.

దీనికి సుజుకి వంటి శిక్షణ ఇచ్చేవారు కూడా ముఖ్యమే. జపాన్‌కు చెందిన పిల్లలు అంతా సంక్లిష్టమైన జపాన్ భాష నేర్చుకుని మాట్లాడగలుగుతున్నారు. అలాంటపుడు

వయోలిన్ మాత్రం ఎందుకు వాయించలేరు? వయోలిన్‌నే అతడు ఎందుకు ఎంచుకున్నాడంటే అది పిల్లల ఆకారానికి ఎత్తుకు తగినట్టుగా ఉంటుంది. దాన్ని వాయించడానికి అతడి శక్తి సరిపోతుంది. చిన్న చిన్న జాగ్రత్తలతో అపశృతులు లేకుండా వయోలిన్ వాయించడం వీలవుతుంది.

దీనికి విరుద్ధంగా చాలా అమెరికన్ ప్రీస్కూల్స్ తరహా ఒక స్కూల్ గురించి ఇక్కడ ప్రస్తావిస్తాను. నాలుగైదు ఏళ్ల పిల్లలతో ఒక 'రైమ్ బ్యాండ్' గ్రూప్ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఉన్న పిల్లలకు చిన్న డ్రమ్స్, బెల్స్ వాయించడానికి ఇస్తారు. టీచర్ వాయించే వాయిద్యం మీద వాయించే ఒక చిన్న రైమ్‌కు అనుగుణంగా వారు వాటిని వాయిస్తుంటారు. టీచర్ కొన్ని రైమ్స్ వాయించి చూపుతుంటుంది. వారు ఇప్పుడు వాయిస్తున్నదే వారు చెయ్యగలిగిన దాంట్లో ఉత్తమమైనదని టీచర్లు నమ్ముతున్నారు. అంతేకాదు తమ ఆధ్వర్యంలో జరుగుతున్న పిల్లల ప్రదర్శనను మనం మెచ్చుకోవాలని కూడా ఆశిస్తారు. అదే సమయంలో జపాన్‌లోని పిల్లలు చాలా సహజంగా నిజమైన వయోలిన్‌ను వాయిస్తున్నారు.

నేను ఆన్ ఆర్బర్‌లోని 'చిల్డ్రన్స్ కమ్యూనిటీ'ని కలుసుకున్న తర్వాత, నన్ను డెట్రాయిట్‌లోని ఎయిర్‌పోర్టులో దించడానికి బయలుదేరే ముందు బిల్‌ఏయర్స్ నన్ను అడిగారు ఎంత మంది పిల్లలు మనతో రావడానికి సిద్ధంగా ఉన్నారు అని. అందులో ఐదుగురు వస్తామంటున్నారు, వారంతా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు వారే. తాము చేస్తామని అన్నారు. మేము వెళ్ళేసరికి ముగ్గురు వెనుక కూర్చున్నారు, ఒకరు నాకు బిల్‌కు మధ్య కూర్చోగా ఒకరిని నేను నా ఒళ్లో కూర్చోబెట్టుకున్నాను. కారు బయలు దేరిన తర్వాత నేను రేడియో పెట్టాను. అందులో బ్లూస్, రాక్, మోటౌన్ వంటి జనరంజక సంగీతం వినిపిస్తున్నారు. నాతో పాటు ఉన్న పిల్లలు ఆ పాటతో పాటు ప్రతి మాటను ప్రతి నోట్‌ను వదలకుండా పాడుతున్నారు. ఒక స్కూల్‌లో చెప్పే రిథమ్ కంటే కూడా దాదాపు ఇరవై రెట్లు కష్టమైనవి ఇవి.

ఒకప్పుడు మీడియాలో చాలా ప్రచారం జరిగింది అప్పటి జోయి అల్ఫిదీ అనే ఎనిమిది సంవత్సరాల బాల మేధావి గురించి, అతడి పియానో వాయిద్య నైపుణ్యం గురించి. అంతేకాదు తన స్వంత ఆర్కెస్ట్రా కోసం తను స్వయంగా రాసుకునే వాడు, రికార్డింగ్ కూడా స్వయంగా చేసుకునే వాడు. ఇలా చిన్న పిల్లలు కూడా సంగీతంలో అద్భుతాలు చేస్తుంటారు. మన కాలపు బాల మేధావులైన కచేరీ నిర్వాహకుడు (కండక్టర్) లోరిన్ మాజెల్, వయోలినిస్ట్ ఏహుది మెనుహిన్ అందరికి తెలిసిన ఉదాహరణలే. కొంత మంది పిల్లలు ఇలా సంగీతంలో రాణించడానికి కారణం వారి తల్లిదండ్రులు వారిచేత చేయించిన

సాధన ఒక్కటే అని నేను అనుకుంటున్నాను. బలవంతంగా సాధన చేయించిన పిల్లలు అంతగా రాణించలేరు; కానీ వారి చుట్టూ ఉండే వారు సంగీతాన్ని ఇష్టపడేవారు, సంగీతాన్ని సాధన చేసేవారు. ముఖ్యంగా పిల్లలు కూడా సంగీతాన్ని సాధించగలరని నమ్మేవారు అయితే ఆ పిల్లలు కచ్చితంగా విజయం సాధిస్తారు. నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు కూడా.

పిల్లల గురించి రాసేవారు చాలా మంది ఆశ (ఎక్స్‌పెక్ట్), ఆశించడం (ఎక్స్‌పెక్టేషన్) అనే మాటలను చాలా తప్పుగా ఉపయోగిస్తున్నారు. చాలామంది వీటిని దబాయించి అడగటం లేదా పట్టుబట్టడం లేదా బలవంతపెట్టడం వంటి మాటలకు బదులుగా వాడుతున్నారు. వారు పిల్లల మీద ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు అంటే దాని అర్థం వారు పిల్లల నుంచి ఎక్కువగా ఆశిస్తున్నారని. వారి ఆశ నెరవేర్చుకోవడానికి పిల్లలను కొన్ని పనులు దబాయించి చేయిస్తారు. చేయకపోతే శిక్షిస్తామంటూ బెదిరిస్తారు. నేను ఎక్స్‌పెక్టింగ్ అనే మాటను ఉపయోగించినపుడు మాత్రం వారు చెయ్యగలిగిన దానిలోనే ఉత్తమమైనది నేను ఆశిస్తున్నానని అర్థం. నా దృష్టిలో వారు చెయ్యగలుగుతారు కాబట్టి వారు తప్పనిసరిగా చేసి తీరాలని కూడా కాదు, కొన్ని పనులు వారికి అసంతృప్తిని కలిగించవచ్చు, లేదా కొన్ని పనులు వారు చెయ్యలేకపోవచ్చు అవి చెయ్యడం వారికి భయం కూడా కావచ్చు. మనం వారి ఎదుగుదలకు ఏవిధంగానూ అడ్డుపడకూడదు. ఇలా ఈ మాటలను సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారా ఇప్పుడు మనం పిల్లల నుంచి ఎక్కువగా ఎక్స్‌పెక్ట్ చెయ్యవచ్చు. ఇక వారు కూడా అనుకున్నదాని కంటే త్వరగా వారి చుట్టూ ఉన్న ప్రపంచం గురించి మరింత త్వరగా నేర్చుకుంటారు. మూడేళ్ల లోపు పిల్లలను కాస్త వైవిధ్యంగా ఆలోచించి పెంచగలిగితే ఈ మూడేళ్ల వయసు వచ్చే సరికి వారు చాలా అద్భుతాలు చెయ్యగలుగుతారు.

నేను నా జీవితంలో ఎక్కువ కాలం పాటు ప్రయాణికుడిగానే ఉన్నాను డ్రైవర్‌గా కంటే. నేను ప్రయాణించే కారును ఎక్కువగా వేరెవరో నడిపేవారు. అందువల్ల నేను కార్లో కూర్చుని పరిసరాలు చాల ఎక్కువగా గమనించే అవకాశం దొరికింది చిన్న పిల్లవాడికిలా. కానీ నేనే కారు నడపాల్సిన పరిస్థితి ఉన్నపుడు లేదా వెళ్లిన ప్రదేశం నుంచి నేనే స్వయంగా కారు నడుపుకుంటూ రావాల్సి ఉన్నపుడు నేను దారిమీద ఎక్కువగా దృష్టి నిలిపేవాడిని ఎక్కడ ఏమున్నాయి వంటివన్నీ గమనించేవాడిని.

పిల్లలు సమాజం గురించి త్వరగా నేర్చుకోలేకపోతే వారికి సమాజంలో జీవించడం కష్టంగా మారొచ్చు. వారికి వారంతట వారే నేర్చుకునే అవకాశం కల్పించాలి. ఉదాహరణకి మనం నివసిస్తున్న ప్రాంతంలోనే చుట్టుపక్కల తిరగడానికి వెళ్లినపుడు మనకు ఏమీ తెలియనట్టు దారి వాళ్లనే వెతికి పట్టుకొమ్మని చెప్పాలి. ఎక్కడ ఏ మలుపు తిరగాలి. ఎటునుంచి వెళితే ఇల్లు వస్తుంది వంటి చిన్న చిన్న ఆటలు వారితో ఆడవచ్చు. ఇలా

చెయ్యడం వల్ల వారికి చుట్టుపక్క ప్రాంతాల్లో తిరగడం ఎలాగో, ఏదైనా తెలియకపోతే అడిగి తెలుసుకోవడం ఎలాగో నేర్చుకుంటారు.

కొద్ది రోజుల క్రితం ఒక సంఘటన జరిగింది. కోపెన్‌హెగన్ ఎయిర్ పోర్టులో ఒక వేసవి కాలపు ఉదయం నేను నా విమానం కోసం రెండుగంటలుగా ఎదురుచూస్తున్నాను మెయిన్ బిల్డింగ్‌లోని వెయిటింగ్ హాల్‌లో. బ్యాంక్ తెరిస్తే కొంత డబ్బు మార్చుకోవాల్సి ఉంది. అలా ఎదురు చూస్తూ అక్కడున్న వారిని గమనిస్తున్నాను. కొద్ది మందితో కూడిన ఒక గ్రూప్  వారిలో ఉన్నారు. వారంతా ఒక పెద్ద లైన్‌గా నిలబడ్డారు లగేజ్ అందరూ ఒకరి నుంచి ఒకరు  మార్చుకుంటూ. వారిలో ఒకరు లగేజితో పాటు ఇద్దరు పిల్లలతో ఉన్నారు. పెద్ద పిల్లవాడు నాలుగేళ్లవాడేమో, చిన్నవాడు రెండూ మూడేళ్లవాడై ఉంటాడు. వాళ్లు చాలా ఉత్సాహంగా, ఆసక్తిగా  ఉన్నారు. వారిని గమనించడం నాకు చాలా బావుంది. వారు వారి గ్రూప్ వారు ఉన్న వరుస పరిసరాల్లో పరిగెడుతూ ఆడుతున్నారు. ఇద్దరిలో చిన్న వాడు సాహసవంతుడిగా కనిపించాడు. తరచుగా తల్లి చూపులకు అందకుండా వెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. ఇద్దరు ఒకరి వెంట మరొకరు పరుగెడుతున్నారు కాసేపు తర్వాత తిరిగి తల్లి దగ్గరకు వెనక్కి తిరిగి వస్తున్నారు. కాసేపు ఏదో మాట్లాడుకుని తిరిగి పరుగెడుతున్నారు. వాళ్లమ్మ తన స్నేహితులతో మాట్లాడుతూ పెద్దగా పట్టించుకోవడం లేదు అనే కంటే ఆత్మవిశ్వాసంతో ఉంది అనవచ్చు. మాటల్లో పడి ఆమె పిల్లల మీద ఒక కన్ను కూడా వేసి ఉంచలేదు. ఆమె ఆత్మవిశ్వాసానికి నాకు ముచ్చటేసింది, తన పిల్లలు ఆ రద్దీ ప్రదేశంలో అలా దూరంగా పరుగెత్తి మళ్లీ వెనక్కి వచ్చే దారి సరిగా గుర్తుంచుకోకపోతే సమస్య అవుతుందన్న బెంగ ఆమెలో ఏ కోశానా కనిపించలేదు. ఇక వాళ్లు అలా అస్సలు తప్పిపోలేదు కూడా. వారు ఆమె కోసం వెనక్కితిరిగి చూడడంలోనూ ఎలాంటి ఆందోళన కనిపించ లేదు. వాళ్లు చాలా సాధారణంగా, క్రమశిక్షణతో కనిపించారు.

కొంత సమయం గడిచేసరికి వారిలో ఎయిర్‌పోర్ట్‌లోని పరిసరాలు, షాప్‌ల పట్ల మరింత ఆసక్తి  పెరిగింది. అక్కడున్న దుకాణాలు, రెస్టారెంట్లను మరింత ఆసక్తిగా గమనిస్తున్నారు, ప్రతిసారీ వారికి నచ్చిన చోటుకి పరుగు పెడుతున్నారు తిరిగి వాళ్ళ అమ్మ దగ్గరికి వస్తున్నారు. కొంత సేపటికి చిన్న వాడు బిల్డింగ్ చివరి వరకు పరుగెత్తడం మొదలుపెట్టాడు. దాదాపుగా 200 అడుగుల దూరం దాకా. మరొకడు వాడిని అనుసరిస్తున్నాడు. ఈసారి కొద్దిగా నెర్వస్‌గా కనిపించాడు. నాక్కూడా కొద్దిగా నెర్వస్‌గానే అనిపించింది అంత దూరంగా ఎందుకు వెళ్తున్నారు వాళ్లు అమ్మ వద్దకు తిరిగి రావడానికి ఇబ్బంది అవుతుందేమో కదా. అందుకే నేను కూడా వాళ్ల వెనకాలే వెళ్లాను వాళ్లకు ఒక వేళ సాయం అవసరమవుతుందేమో అని. కాని ఆ అవసరమే రాలేదు. చిన్నవాడు పరుగెత్తుకు వెళ్లి కొన్ని తలుపులు తోసుకు వెళ్తున్నాడు తిరిగి వస్తున్నాడు. వాడిని పెద్దవాడు

అనుసరిస్తున్నాడు. కొద్ది సెకండ్ల పాటు వాళ్లు వాళ్ల అమ్మ దగ్గర ఉండి తిరిగి పరుగెత్తి వస్తున్నారు. ఈసారీ వాళ్లు ఎంట్రెన్స్ దగ్గరున్న ఆటోమెటిక్ స్లైడింగ్ డోర్స్‌ను పరిశోధించడం మొదలు పెట్టారు. మనుషులు వచ్చిపోతున్నపుడల్లా ఆ తలుపులు ఎలా తెరచుకుని మూసుకుంటున్నాయో కొంత సమయం ఆసక్తిగా గమనించారు. ఒకటి రెండుసార్లు అవి తెరచుకొని మూసుకుంటున్న తీరును కాస్త ప్రయోగం చేశారు. కాసేపు అలా పరిశోధిస్తూ ఉండిపోయారు. ఇక చిన్న వాడికి బయటేముందో పరిశోధించాలన్న ఆలోచన వచ్చింది. బయట ఒక పెద్ద బస్ వచ్చింది. దాన్ని దగ్గరినుంచి చూడాలని స్లైడింగ్ డోర్ నుంచి బయటికి వెళ్లాడు. నేను డోర్స్ లోపలి నుంచే ఇదంతా గమనిస్తున్నాను. నాకు మళ్ళీ కొద్దిగా నర్వెస్‌గా అనిపించడం మొదలైంది. బస్‌లో నుంచి ప్రయాణికులు దిగడాన్ని కొద్ది సమయం పాటు ఆసక్తిగా గమనించాడు. అకస్మాత్తుగా పక్కకు తిరిగి అటు పక్కగా వెళ్లడం మొదలుపెట్టాడు. “వీడు చాలా ఎక్కువ చేస్తున్నాడు” అని మనసులో అనుకున్నాను నేను. వెంటనే బయటికి వెళ్లి వాడి మీద ఒక దృష్టి పెడదామని వెళ్లాను. అతడికి కనిపించకుండా జాగ్రత్త పడ్డాను. నెమ్మదిగా ప్లాట్‌ఫాం దగ్గరిదాకా వెళ్లి మరిన్ని బస్‌లు చూస్తున్నాడు. తర్వాత ఏం చేస్తాడో చూద్దాం అని ఆశ్చర్యంగా చూస్తున్నాను. వాళ్లమ్మను మరిచిపోయాడా ఏంటి? తిరిగి వాళ్లమ్మ దగ్గరికి వెయిటింగ్ రూమ్‌కు వెళ్లడానికి దారి దొరుకుతుందా ఇతడికి అని చూస్తున్నాను. బహుశా డానిష్ మాట్లాడే వాళ్లు ఎవరైనా దారి చూపాల్సి వస్తుందేమో అనుకున్నాను.. కానీ ఆ అవసరమే లేకపోయింది. చూడాలనుకున్నంత సేపు బస్‌లు చూసిన తర్వాత ఎలాంటి భయం కానీ, కన్ఫ్యూజన్ కానీ లేకుండా అతడు నేరుగా ఎంట్రెన్స్ దగ్గరకు వచ్చాడు. ఆ తలుపు గుండా లోపలికి ఆ తర్వాత వాళ్లమ్మ దగ్గరకు వెళ్లిపోయాడు. కాసేపటికి వాళ్లు వెళ్లిపోయారు అక్కడి నుంచి.

ఈ పిల్లవాడు మనం కాస్త పెద్దవారైతే తప్ప చెయ్యలేరని అనుకునే పనులన్నీ కూడా చేస్తున్నాడు. పరిసరాల్లో ఉన్న అంశాలన్నీ గుర్తుపెట్టుకొని ఏ దారి వెంట వెళ్తే తాను అమ్మ దగ్గరకు చేరుకోగలనో కచ్చితంగా అతడికి తెలుసు. వాళ్లమ్మ అతడికి ఆ స్వేచ్ఛ ఎప్పుడూ ఇస్తుందనుకుంటా. అందుకే అతడికి అలా తిరగడం, తిరిగి రావడం చాలా అలవాటున్న పనిలా చేసుకుపోయాడు. బహుశ మొదట్లో వాళ్లమ్మ కూడా నాలాగే అతడిని అనుసరించి చూసి ఉంటుంది. తర్వాతే ఆమెకు అతడి పట్ల అలాంటి నమ్మకం ఏర్పడి ఉంటుంది. అందువల్ల అతడు మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుని ఉంటాడు అనిపించింది. ఇంత చిన్నపిల్లవాడు అంతటి నైపుణ్యాన్ని ఎలా సంపాదించగలిగాడో అర్థం కాలేదు. అయితే అలాంటి స్వేచ్ఛనిస్తే ఏ పిల్లలైనా దాన్ని సంపాదించగలరు. దీనికి మనం చెయ్యాల్సిందల్లా కేవలం పిల్లల్లోని ఆసక్తిని, స్వేచ్ఛని చంపకపోవడం. వారిలో ఆత్మవిశ్వాసం పెంచడానికి ఆ రెండింటిని వారికి కల్పించే ప్రయత్నం చెయ్యాలి.

# 11. ప్రేమకు చిహ్నంగా పిల్లలు

కొన్నేళ్ల క్రితం నా స్నేహితురాలొకామె ఒక హాస్యాస్పదమైన, ఇబ్బందికరమైన కథ ఒకటి చెప్పింది. న్యూయార్క్‌లోని ఒక పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో స్పెషల్ డిస్కౌంట్ సేల్ ఉందన్న వార్త విని ఇతర అందరు మహిళల్లాగే  ఆమె వీలైనంత త్వరగా అక్కడకు వెళ్లింది. త్వరగా వెళ్తే మంచి వస్తువులు తక్కువ ధరకు పొందవచ్చని ఆమె ఆలోచన. స్టోర్ తలుపులు తెరచిన వెంటనే చాలామంది జనంతో పాటు కలిసి ఆమె కూడా లోపలికి ప్రవేశించింది. ఆమెతో పాటు ఇద్దరు అబ్బాయిలు ఆమె ఛాతి ఎత్తు వరకు ఉన్న పిల్లలు కూడా నడుస్తున్నారు. వారి తల మీద ప్రేమగా ఒకసారి చేయి వేసి వారితో పాటు ఒకటి రెండడుగులు నడిచింది. ఇంతలో వారిద్దరు కోపంగా ఉన్న పెద్ద వారి ముఖాలు పెట్టుకుని ఆమె వైపు తిరిగి ఆమెను చూస్తూ చాలా కఠినంగా మాట్లాడారు. వారిద్దరిలో ఒకరు ఏంటీ ఏం చేస్తున్నావు నువ్వు ? అని గట్టిగా గద్దించాడు. వారు పిల్లలు కాదు పెద్దవారే. కొన్ని సంవత్సరాల పాటు ఆమె ఈ కథ చెబుతూనే ఉంది. చెప్పిన ప్రతిసారీ అందరు పగలబడి నవ్వుతారు కూడా. ఎందుకంటే ఆమె చర్య వారు చిన్న పిల్లల విషయంలో ఫర్వాలేదు కానీ పెద్దవారైతే మాత్రం అభ్యంతరకరం. ఆమె చేసిన చర్య పిల్లలను ఇష్టపడే మనం అందరం చేసేదే. మనకు నవ్వెందుకు వస్తుందంటే మనం వెంటనే ఆమె స్థానంలో మనల్ని ఊహించుకుంటాం కాబట్టి. చిన్నపిల్లల తల మీద చేతులు వేసి సంతోషించినట్టు, తమ చర్య చిన్న పిల్లలతో కాదని తెలిసి దడుచుకోవడాన్ని ఊహించడం వల్ల అలా అనిపిస్తుంది. కానీ మనకు తెలియని చిన్నపిల్లల తల మీద చేతులు వేసి నడిచే అధికారం మనకు ఎవరిచ్చారు? మనం అలా చెయ్యడాన్ని వారు కూడా ఇష్టపడతారని మనమెలా అనుకుంటాం?

మనం మన అవసరం కోసం వాడుకుంటున్నపుడు పిల్లల్ని వస్తువులుగా చూస్తాం. మనం మన లక్ష్యాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని ప్రవర్తిస్తాం తప్ప అది అతడికెలా అనిపిస్తుందనే విషయాన్ని అసలు ఆలోచించం. మన ప్రవర్తన వారికి ఎలా ఉంటుందన్న విషయాన్ని కూడా మనం అడిగి తెలుసుకునే ప్రయత్నం చెయ్యం. చాలామంది మహిళలు, పురుషుల గురించి ఫిర్యాదు చేస్తుంటారు. వాళ్లు తమను ఉపయోగించుకుంటున్నారని, కేవలం లైంగిక వస్తువుగా పరిగణిస్తున్నారని అంటుంటారు. అలాంటి పురుషులు స్త్రీలను –నిజానికి కాకపోయినా కనీసం వారి ఊహలోనైనా సరే– తమను లైంగికంగా తృప్తి పరిచేవారిగానే భావిస్తారు. చాలా మంది పురుషులు ముఖ్యంగా యువకులు కనిపించిన ప్రతి అమ్మాయి వైపు ఆశగా చూస్తుంటారు. అలా చూస్తూ ఈమె బట్టలేకుండా ఎలా ఉంటుంది. తనతో గడిపితే ఎలా ఉంటుంది అన్న ఆలోచన చేస్తారు. అలా స్త్రీని చూస్తూ వారిని జడ్జ్ వేస్తుంటారు, అద్భుతంగా ఉంది, హాట్‌గా ఉంది, నాట్ సో హాట్ అలా. వారికి ఆమె నచ్చితే ఒకటి రెండు క్షణాల పాటు ఊహలో ఆమెతో సంగమిస్తుంటారు. కొంత మంది అలాంటి ఊహను నిజం చేసుకునేందుకు కూడా ప్రయత్నిస్తారు. ఒకవేళ వారికి నచ్చకపోతే ఆలోచనల్లోంచి ఆమెను తీసేస్తారు. ఇక మరెలా కూడా ఆమెకు వారి ఊహల్లో స్థానం కల్పించరు. ఇక వారి పట్ల ఎలాంటి ఆసక్తి కూడా కనబరచరు.

పురుషులు స్త్రీని (ఒక్కోసారి స్త్రీ కూడా పురుషులను) లైంగిక వస్తువుగా ఉపయోగించుకుంటారు. కొన్నిసార్లు ఊహల్లో, కొన్నిసార్లు వాస్తవంలో కూడా. దానికి వారు ఆమె దగ్గర అనుమతి తీసుకోరు. అతడు ఆమె అనుమతి లేకుండానే ఆమెతో తన అవసరాన్ని తీర్చుకుంటుంటాడు. మన సంస్కృతిలో ఇలా స్త్రీని లైంగిక వస్తువుగా ఉపయోగించుకోవడం, ప్రచారంలో వాడుకోవడం వంటి వన్నీ కూడా ఆమె చుట్టు ఉన్న సమాజంలో చాలా సాధారణంగా జరిగిపోతున్నాయి. చాలా మంది స్త్రీలు ఇందుకు అనుమతి కూడా ఇస్తారు. ఇలా లైంగిక వస్తువుగా ఉండడానికి సహకరిస్తారు. అది డబ్బు కోసం కావచ్చు, కొన్నిసార్లు కోరుకున్న పురుషుడిని పొందడానికి కావచ్చు. అది భర్త, బాయ్ ఫ్రెండ్, ప్రేమికుడు ఇలా ఎవరైనా కావచ్చు. కానీ స్త్రీని చూపించి, అంటే స్త్రీని లైంగిక వస్తువుగా ప్రదర్శించి, పెద్ద ఎత్తున పురుషుల చేత పురుషుల కోసం వ్యాపారం నడపబడుతోంది.

ఇలా స్త్రీని లైంగిక వస్తువుగా ప్రచారం చెయ్యడం వల్ల పొడవుగా జుట్టు పెంచుకొని కనిపించే మగవాళ్లని చూస్తే కొంతమందికి అకారణంగా కోపం వస్తుంది. ఇలా పొడవైన జుట్టుతో వారిని మోసం చేస్తున్నట్టు భావిస్తారు. పొడవైన జుట్టును చూసి వారు అమ్మాయి

అనుకొని వారితో ఊహల్లో శృంగారానికి దిగుతారు కానీ తీరా చూస్తే వారు పురుషులు. దాంతో చాలా చికాకు పడతారు. ఒకసారి నేను ట్యాక్సీలో ప్రయాణిస్తున్నపుడు రోడ్డు మీద వెళ్తున్న అలాంటి ఒక యువకుడిని చూసి ట్యాక్సీ డ్రైవర్ చాలా విసుగుగా "అమ్మాయో అబ్బాయో తేడా ఉండక్కర్లేదా?" అన్నాడు. అప్పుడు నేను ఆ తేడా "ఆ తేడా వారికి తెలిస్తే చాలు కదా" అన్నాను. "చాలుకదా, చావనీ" అని అన్నాడు కోపంగా. స్త్రీ పురుషుల మధ్య తేడా కచ్చితంగా తెలిసేలా ఎందుకుండాలని అడగడానికి అది సరైన సమయం కాదనిపించి నేను అడగలేదు. మరొక ట్యాక్సీ డ్రైవర్ ఇలాంటి మరో సందర్భంలోనే ఇలాంటి వారిని కాల్చి పారెయ్యాలి అని తీవ్రమైన విసుగు ప్రదర్శించాడు. ఎందుకు ఒకే ఒక చూపులో ఒక వ్యక్తి స్త్రీనా పురుషుడా అనేది తెలిసి పోవాలి? అలా తెలిస్తేనే కదా వారితో శృంగారాన్ని ఊహించి ఆనందించగలుగుతారు. అలా ఊహిస్తున్న వ్యక్తి స్త్రీ కాదు పురుషుడు అని తెలిసినపుడు ఒక్కసారిగా అవాక్కవుతాడు కదా.

స్త్రీ పురుషుల ఈ ఆలోచనా విధానాన్ని అందరూ అర్థం చేసుకుంటారు. ఇక నేను చెప్పాలనుకునేదేమిటంటే దాదాపు అందరు పెద్దవాళ్లూ పిల్లల్ని ప్రేమను పంచే వస్తువులుగా భావిస్తారు. పిల్లల మీద ప్రేమ కురిపించడానికి తమకు హక్కు ఉందని అది తమ బాధ్యత అని అనుకుంటారు. ఆ ప్రేమను తమకు నచ్చినట్టు తమకు కావల్సినట్టు, కావల్సిన సమయంలో వారికి ఇష్టమున్నా లేకపోయినా వ్యక్తపరుస్తుంటాం. దాని కోసం వారిని ఉపయోగించుకుంటారు. తమ తృప్తి కోసం వారిని ఉపయోగించుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే బాల్యాన్ని, చిన్న పిల్లలను ప్రేమ పంచడానికి ఉపయోగపడే వస్తువులుగా వాడుకుంటున్నారు. అందుకే మనం బాల్య వ్యవస్థను ఒకటి ఏర్పాటు చేసి దాన్ని కాపాడుతూ వస్తున్నాము. అందుకు ప్రతిగా పిల్లలు ఎన్నో ఇబ్బందులను సమస్యలను ఎదుర్కొంటున్నారు.

పిల్లల్ని ఇలా వాడుకోవడానికి ఒక కారణం మనలో చాలా మంది ప్రేమ దొరకక అల్లాడుతున్నారు. చాలామంది మనుషులకు ప్రేమించడానికి, బాహాటంగా వ్యక్తం చెయ్యడానికి, తాకి వ్యక్తపరచడానికి చాలా తక్కువ మంది అందుబాటులో ఉంటారు. ఈ విషయంలో పురుషుల కంటే స్త్రీలు కాస్త ఫర్వాలేదు, కానీ వారు తమని తాము లైంగిక వస్తువుగా భావిస్తుంటారు. వీరికి పురుషుల కంటే కొంచెం ఎక్కువ ఆమోదం ఉంటుంది ఇతరులను తాకడానికి. పురుషులైతే తప్పనిసరిగా తనకు చాలా దగ్గరి వారైన స్త్రీలను మాత్రమే తాకడానికి అనుమతించబడతారు. ఇక పర పురుషులైతే ప్రేమపూర్వకంగా తాకనే తాకలేరు.

మనం మన స్నేహితులను ప్రేమించడానికి వీల్లేదు. ఎవరైనా పురుషుడు మరో పురుషుడి గురించి మాట్లాడుతూ నేను అతడిని నిజంగా ప్రేమిస్తున్నాను అంటే అతడి వైపు అనుమానాస్పదంగా చూస్తారు. ఒకవేళ ఇదే మాట మరో స్త్రీ గురించి స్త్రీ చెప్పినా కొంత వరకు ఒప్పుకుంటారేమో. మనకు మన దగ్గరి రక్తసంబంధీకులను తప్ప మరెవరినీ ప్రేమించేందుకు అనుమతి లేదు. మన పిల్లలు, తల్లిదండ్రులు, పితామహులు, మాతామహులు, మనుమలు, అత్త, పిన్ని, మామ, బాబాయి ఇలా ఎవరో ఒకరై ఉండాలి తప్పనిసరిగా. అందుకోసమని మనకు అన్ని సమయాల్లో ప్రేమించే వీలు ఉండేలా, అది కూడా బాహాటంగా, శారీరకంగా, ఎక్కడైనా ఏ సమయంలోనైనా మనకు అనిపించిన వెంటనే సమాజం అంగీకరించేలా ప్రేమ వ్యక్తపరచగలిగే ఒకే ఒక అవకాశం కలిగించే వ్యక్తులు కావాలి. మనకు ఇలా ప్రేమ వ్యక్తపరిచే వస్తువు తప్పనిసరిగా కావాలి. మన దగ్గర మనం ఎంతమందికైతే పంచగలమో అంతకంటే ఎక్కువ ప్రేమ ఉండడం నిజంగానే బాధాకరం కదా. ఇలా వ్యక్తపరచలేని ప్రేమ మనసును చాలా బాధిస్తుంది. మనలో అవ్యాజమైన ప్రేమ ఉంది. కాని మనమిచ్చే ప్రేమ అవతలి వారికి అవసరంలేదు. వారు దాన్ని స్వీకరించడానికి సిద్ధంగా లేరు. మనం మనలోని అత్యద్భుతమైన భావనను అందించడానికి సిద్ధంగా ఉంటాము కానీ అది ఎవరికీ అవసరం లేదు. ఎంత నిస్సహాయమైన పరిస్థితో కదా.

నేను చాలామంది దగ్గర నుంచి విన్నాను వారిని చిన్నపుడు తనకు ఎంత మాత్రమూ నచ్చని వారు ముద్దుపెట్టుకున్నపుడు కలిగిన చిరాకును గురించి చెప్పడం. చాలామంది పెద్దవారు పిల్లలను ముద్దు పెట్టుకోవడానికి తమకు అన్ని రకాలుగా హక్కు ఉన్నట్టు భావిస్తారని నా స్నేహితులలో ఒకరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు మనం పిల్లలను ఎలా ఉపయోగించుకుంటున్నామనే విషయాన్ని. ఒక నాలుగేళ్ల పిల్లవాడికి, ఒక ఆరవై ఏళ్ల వృద్ధుడికి వారి వారి అవసరాలపరంగా పోటీ ఏర్పడినపుడు ప్రతిసారీ పిల్లాడే సర్దుకోవాల్సి వస్తుంది ఎందుకు? దీనికి పెద్ద కారణమేదీ లేదు, కేవలం అతడు చిన్నవాడు అంత బలమైనవాడు కాదు అన్నది తప్ప అని అనుకోవాలా? ఇలా పిల్లల భావాలతో సంబంధం లేకుండా అతడిలో కలిగే అసహ్యాన్ని, భయాన్ని లక్ష్య పెట్టకుండా పెద్దలు పిల్లలను తాము ప్రేమను ఒలకబోసే వస్తువుగా వాడుకుంటున్నారు. ఇక్కడ పెద్దలు లక్ష్యపెట్టనిది ఒక పిల్లాడి భావాలు కాదు, మొత్తం బాల్యాన్ని వారు లక్ష్యపెట్టడం లేదు.

పిల్లలను ప్రేమించే మన తత్వం తప్పని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. మనకు సహజంగానే పిల్లల అద్భుతమైన, అందమైన, ముద్దొచ్చే లక్షణాలు చాలా నచ్చుతుంటాయి. వారిలోని శక్తి, ఆసక్తి, ఆరోగ్యం, చురుకుదనం, తెలివితేటలు, సందర్భోచిత ప్రవర్తన, వారిలోని జీవం, అన్ని మనల్ని వారి పట్ల విపరీతమైన ఆకర్షణ కలుగజేస్తాయి. మనకలాంటి భావన కలగడం సహజమే. కానీ వాళ్ల బలహీనత, అల్పత్వం, అనుభవ రాహిత్యం, అమాయకత్వం, వంటి లక్షణాలు మనల్ని వారిమీద జాలి కూడా కలిగిస్తాయి. వాళ్లను దగ్గరకు తీసుకోవడం మనకు బావుంటుందన్న కారణంతో వారి ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా వారిని ముద్దాడడానికి కానీ, దగ్గరకు తీసుకోవడానికి కానీ మనకు ఎలాంటి హక్కు లేదు. మన భావనను ముందుగా పిల్లవాడికి ఏదో ఒక రకంగా చేరవేయడం అవసరం. అతడికి మన పట్ల నమ్మకం కలిగితే మనల్ని స్వాగతిస్తాడు. అతడితో ముందుగా ఆడడం, సరదాగా ఉండడం, దాగుడుమూతల వంటి ఆటలా ఆడడం వంటివి చెయ్యడం ద్వారా అతడి దగ్గర ముందుగా చనువు సంపాదించిన తర్వాత అతడికి నచ్చితే దగ్గరికి తీసుకోవడం కానీ ముద్దుపెట్టడం కానీ చెయ్యడం వల్ల మనం అతడి భావాలకు గౌరవం ఇచ్చినవాళ్లం అవుతాము.

ఈ మధ్యకాలంలో ఒకసారి నేను ఆరు సంవత్సరాల నా స్నేహితురాలు ఒకమ్మాయిని వాళ్లింట్లో కలుసుకున్నాను. ఆమె మనం చదువుకుందామా అని అడిగింది. నేను సరే అన్నాను. అప్పుడు ఆమె వెళ్లి పుస్తకం తీసుకొని వచ్చింది. నాకు, తనకు సౌకర్యంగా ఉండే విధంగా కూర్చుంది. అప్పటికి ఆ పుస్తకం ఎన్నోసార్లు చదివిందే. ఆమె ముందుగానే చాలాసార్లు చదివి ఉంది కాబట్టి అందులోని కథ, చాలా పదాలు ఆమెకు తెలిసినవే. అయినప్పటికి కొన్ని విషయాలు ఆమెకు తెలియనివి ఉన్నాయి అందులో. కొన్నిసార్లు ఆమె తనకు అర్థం కానిదాన్ని గురించి ముందుగానే ఊహించే ప్రయత్నం చేస్తోంది. అవునా అని నన్ను అడుగుతోంది. చాలాసార్లు తను ఊహించింది నిజమే అవుతోంది కూడా.

కొంత సమయం తర్వాత మరింత సౌకర్యవంతమైన భావనకు వచ్చింది. మరింత ప్రేమగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. నా పక్కన కూర్చున్న ఈ పాప తల నేను నిమిరాను. ఒకసారి తల తిప్పి నావైపు ఆశ్చర్యంగా చూసి అడిగింది "చదువుతుండగా ఎందుకు అలా తల నిమురుతున్నావు?" అని నేను వెంటనే "క్షమాపణ అడిగాను" తర్వాత చదవడం కొనసాగించింది.

పిల్లలు మన దగ్గర కూర్చోవడానికి లేదా నిలబడడానికి వారికి మనకు మధ్య వాళ్లు ఎంత దూరాన ఉంటున్నారో చూసి గమనించి దాన్ని మనం గౌరవించాలి. మనం మిగిలిన పెద్దవారితో ఎలా ప్రవర్తిస్తామో పిల్లలతో కూడా అలాగే మర్యాదగా ప్రవర్తించాలి. అతడి అనుమతి లేకుండా అతడి పరిధిలోకి వెళ్లే హక్కు ఎవరికీ ఉండదు. మనం మన ప్రేమ వ్యక్తం చేసే వస్తువులాగా ఉపయోగపడడం పిల్లలకు నచ్చదు. వారికి నచ్చిన వారు కూడా తమని అలా ఉపయోగించుకోవడాన్ని పిల్లలు ఇష్టపడరు. వారికి అలాంటి ప్రేమను తిరస్కరించే హక్కు కూడా వారికి ఉండాలని కోరుకుంటారు. అలాంటపుడు మాత్రమే వారితో ఒక ఆరోగ్యకరమైన సంబంధం కొనసాగే అవకాశం ఉంటుంది.

ఒక పదమూడేళ్ల అమ్మాయికి ఆమె తల్లికి మధ్య జరిగిన ఒక సంభాషణ ఈ సందర్భంగా నాకు గుర్తొస్తోంది. ఆ అమ్మాయి తన తల్లితో తనకు అత్యంత ముఖ్యమని భావిస్తున్న విషయం గురించి చాలామంచి ఉద్దేశంతో చెబుతోంది. ఆ తల్లి కూడా చాలా సున్నితమైన, గౌరవప్రదమైన మహిళ, అందుకే ఆమె ఎప్పుడూ తన కూతురు చెప్పే విషయాలు చాలా ఓపికగా వింటుంది. ఆమె మాటలు వింటున్న తల్లికి ఒక్కోసారి చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంటుందని ఆమె వ్యాఖ్యానించింది. "ఇది ఆ చిన్న పసిపిల్లేనా.. ఇప్పుడు ఇంత గంభీరమైన అభిప్రాయాలు ఇలా వ్యక్తం చేస్తోంది? నిన్న మొన్నటి దాకా నా చేయి పట్టుకొని నడవడం నేర్చుకున్న ఈ చిన్న ప్రాణి ఇప్పుడు ఈ తనకంటూ కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలతో ఈ ప్రపంచంలో ముందుకు సాగుతోంది" ...అని సంభ్రమంగా తన ఆశ్చర్యాన్ని నా దగ్గర వ్యక్తం చేసింది. ఆమె చాలా ఉద్వేగభరితంగా కనిపించింది. ఆమె తన కూతురు వైపు ఒక రకమైన సున్నితమైన, గర్వం తొణికిసలాడే వాత్సల్యంతో చూసింది. అందులో ఆమెకు మరో ఉద్దేశ్యం ఏమీ లేదు ప్రేమ తప్ప. దాంతో ఆ అమ్మాయి అక్కడి నుంచి వెళ్లిపోయింది. తన తల్లితో చర్చించడం మానేసింది. ఎందుకంటే ఆమె తన తల్లి దగ్గర కేవలం ఆమె కూతురిగా మాత్రమే ఉండాలని అనుకుంటుంది. ఆమె తల్లితో పాటు నేను కూడ చాలా ప్రయత్నించాను ఆమెను తన తల్లితో ముందులా మాట్లాడించడానికి. కానీ వారిద్దరి మధ్య సంబంధం తెగిపోయింది. ఆమె తిరిగి అలా ముందులా మాట్లాడడానికి ఇష్టపడలేదు. కానీ అది కొద్దిసేపు మాత్రమే. తర్వాత తను తెలుసుకుంది ఒక వ్యక్తిగా తనంటే తన తల్లికి చాలా గౌరవమనే విషయాన్ని, ఒక గంట తర్వాత ఆమె మళ్లీ వచ్చి మాతో పాటు చర్చలో వచ్చి కూర్చుని మాటల్లో పడింది.

అందరు పిల్లలకు ఈ అమ్మాయికి ఉన్నంత అదృష్టం ఉండదు. వారు చాలా త్వరగానే నేర్చుకుంటారు ప్రేమ పంచడాన్ని, అందుకోవడాన్ని , నవ్వులు, సంతోషాలు పంచడాన్ని, పరిహసించడం, ప్రశంసించడం, కౌగిలించుకోవడం, ముద్దుపెట్టకోవడం వంటివన్నీ నేర్చుకుంటారు. సందర్భోచితంగా తమ భావాలను వ్యక్తీకరిస్తారు. చాలా త్వరగానే కౌగిలింతలకు, ముద్దులకు అర్థాలు కూడా తెలుసుకుంటారు. తల్లిదండ్రులు తమను ఇంకా పూర్తి స్థాయి వ్యక్తులుగా గుర్తించడం లేదని అర్థం అయిన తర్వాత వారు తమకు తెలిసినదాన్ని పూర్తిగా పంచుకోవడానికి ఇష్టపడరు. ఇలా పంచుకోకపోవడం వల్ల వారు మనతో అనుకున్నంత ప్రేమగా ప్రవర్తించలేరు. పిల్లల మీద అతి ప్రేమ ప్రదర్శించడం – వారికి అది ఇష్టం ఉన్నా లేకున్నా – అనేది వారిని ప్రేమపూర్వకంగా ఉండేట్లు తయారు చెయ్యదు. అందుకు పూర్తి వ్యతిరేకంగా తయారు చేస్తుంది. తిరస్కరించే స్వేచ్ఛ ఉన్నపుడే పూర్తిగా అంగీకరించేందుకు కూడా అవకాశం ఉంటుంది. ఎవరికైనా ఎవరి ప్రేమనైనా సరే ఎలాంటి మీమాంస లేకుండా తిరస్కరించడానికి పూర్తి అవకాశం ఉన్నప్పుడు మాత్రమే ఆ ప్రేమను పూర్తిగా ఆస్వాదించడానికి అస్కారం ఉంటుంది. ఎలాంటి సంకోచం లేకుండా ప్రేమను వదిలేయగలిగే అవకాశం ఉన్నవాడికే పూర్తి స్థాయిలో ప్రేమను పంచే గుణం ఉంటుంది.

స్త్రీని లైంగిక వస్తువుగా భావించే, ఆ విధంగా ఉపయోగించుకునే పురుషులు సహజంగానే ఒక సిద్ధాంతాన్ని రూపొందించారు. ఆ సిద్ధాంత ప్రకారం వారి వాదనను సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తునే ఉన్నారు. దాని ప్రకారం : పురుషులు తమను అలా ఉపయోగించుకోవడం లేదా భావించడం స్త్రీలకు ఇష్టంగా ఉంటుంది. ప్లేబాయ్ థియరీ ఈ విధంగానే ఆలోచిస్తుంది. దాని ప్రకారం స్త్రీ ప్రపంచంలో అతిగా ఇష్ట పడేది ఏదైనా ఉంది అంటే అది కేవలం శృంగారం మాత్రమే. దాన్ని ప్రతి స్త్రీ ఒప్పుకొని తీరాలి. అంటే ఒక పురుషుడు తమను ఒక లైంగిక వస్తువుగా ఉపయోగించుకున్నా లేక ఊహించుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదు ఎందుకంటే అతడు అలా చేయడం ద్వారా తమకు సాయం చేస్తున్నట్టు వారు భావించాలి, వారికి కావల్సింది అతడు వారికి అందిస్తున్నట్టుగా అనుకోవాలి. కాబట్టి అలా వారు ఆలోచించడం సిగ్గు పడాల్సిన విషయమేమీ కాదు, ఇది చాలా సహజమైన విషయం.

సహజంగానే మనం పిల్లలను మన ప్రేమను వ్యక్తపరచడానికి ఉపయోగపడే వస్తువుగా వినియోగించుకుంటున్నాము. పిల్లల ప్రేమ అవసరం అనే కథ అలా తరతరాలుగా కొనసాగుతోంది. వారు అది ఎవరి నుంచి వస్తోంది, ఎలా వస్తోంది, తమకు కావాలా

వద్దా అనేది నిర్ణయించుకోలేరు. వారికి కావల్సింది ప్రేమ.. ప్రేమ.. ప్రేమ. అంతే. బహుశ పుట్టిన మొదటి సంవత్సరం ఇలా ఉంటుందనడంలో కొంత నిజం ఉంది. ఎందుకంటే నా అనుభవాలు ఇతరుల అనుభవాల ప్రకారం కూడా ఈ వయసు పిల్లలు ఎవరో ఒకరి సాన్నిహిత్యాన్ని కోరుకుంటూ ఉంటారు. తగినంత అందుబాటులో లేకపోతే బాధపడతారు కూడా. కానీ మనం పిల్లలు పెరిగిన తర్వాత కూడా అలాగే ఆలోచిస్తూ, భావిస్తూ ఉంటాము. చాలా మంది పిల్లలు వారితో ఎవరో ఒకరు ఉండాలని, ఆడుకోవాలని కోరుకుంటారు. కానీ అందరు పిల్లలు, అన్ని సమయాల్లో ఒకే విధంగా ఉంటారని అనుకోవడానికి లేదు. ఆరునెలల వయసు వచ్చే సరికల్లా కొంత మందిలో మరింత ముందుగానే వారికి వారి  సొంత ఆలోచనలు, అవసరాలు, ప్రాధాన్యతలు వారికి ఉంటుంటాయి. కొన్ని సార్లు వాళ్లు వాళ్ల ఆటలో లేదా ఆలోచనలతో తీరిక లేకుండా ఉంటారు, వారిని ఎవరూ డిస్టర్బ్ చెయ్యడం ఇష్టం ఉండకపోవచ్చు. కొంత మంది పిల్లలకు ఇతరులు దగ్గరగా ఉండడం ఎక్కువగా నచ్చుతుండొచ్చు, కొంత మందికి తక్కువగా నచ్చుతుండొచ్చు, మరికొంత మంది పిల్లలకు అసలు నచ్చకపోవచ్చు. ఇక కొంత మంది పిల్లలకు వారితో ఆడుకోవడం నచ్చుతుంది కానీ వారు తమను ఎత్తుకోవడం నచ్చకపోవచ్చు, వారి మీద ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి కొన్ని రకాల ఆటలు ఆడుతుంటారు, ఇలాంటివి అందరితో ఆడడం వారికి ఇష్టం ఉండకపోవచ్చు. మనం చిన్న పిల్లల ఆలోచనలు వారి భావాలు వారు అందించే సూచనలు, సంజ్ఞలు గమనిస్తూ వాటికి గౌరవం ఇస్తూ వారి ఆలోచనానుసారం నడుచుకోవాల్సి ఉంటుంది.

# 12. పిల్లలను 'క్యూట్' గా భావించడం

**చి**న్నపిల్లలను 'క్యూట్'గా భావించడం అనే అలవాటు నుంచి కూడా మనం బయటికి రావాల్సి ఉంటుంది. ఇక్కడ కొంతవరకు నా ఉద్దేశం ఏమిటంటే, పసిపిల్లలలోని ఏ లక్షణాలకు మనం ప్రతిస్పందిస్తున్నామో మరింత స్పృహ కలిగి ఉండాలని, వారి పట్ల మనకు కలిగే భావాలలో ఏవి సరైన స్పందనలో, గౌరవించదగినవో ఏవి సెంటిమెంట్‌కు సంబంధించినవో, అంతగా పట్టించుకోనవసరం లేనివో గుర్తించాలని నా అభిప్రాయం చెప్పడమే. మనం పిల్లల పట్ల అధికారయుతంగా లేదా నియంతృత్వంగా వ్యవహరించే భావాలు కచ్చితంగా అంత ఆరోగ్యకరమైనవి కాదు. కొన్ని మనం పిల్లల పట్ల తప్పనిసరిగా నెరవేర్చవలసిన బాధ్యతలుగా భావిస్తాం, అవి నిజానికి సెంటిమెంట్‌కు సంబంధించినవి.

పిల్లలను ముద్దు (క్యూట్) గా భావించే ముందు వారిలోని ఇతర లక్షణాలు కూడా గుర్తించి గౌరవించడం అనేది తప్పనిసరిగా పెద్దలందరు అలవరుచుకోవాలి. పిల్లల్లో అందంతో పాటు కనిపించే ఇతర లక్షణాలు ఆరోగ్యం, శక్తి, చైతన్యం, జీవం, ఆసక్తి, తెలివి, నమ్మకం, క్షమ – వారికి కోపం కూడా వస్తుంది, కానీ మనలా మాత్రం కాదు. కోపాన్ని మనసులో చాలాకాలం పాటు ఉంచుకుంటారు కూడా. వీటన్నిటితో పాటు గొప్పగా ఆనందించగలిగే, బాధపడే సామర్థ్యం కూడా కలిగి ఉంటారు. మనం వీటన్నింటిని బాల్యపు అపరిపక్వ విషయాలుగా పరిగణనలోకి తీసుకుంటూ ఉంటాం. కానీ ఇవి మానవ లక్షణాలు. మనం ఇలాంటి లక్షణాలు ఏ వయసు వారిలో కనిపించినా తప్పనిసరిగా గౌరవించి తీరాలి. మనం ఇవన్నీ బాల్యపు లక్షణాలని, కేవలం పిల్లల్లో మాత్రమే కనిపిస్తాయని అనుకుంటే మనం వాటికి పెద్దగా విలువ ఇవ్వలేము. ఇవన్నీ కూడా పెరుగుతున్న కొద్దీ కనుమరుగయ్యే విషయంగా పరిగణనలోకి తీసుకుంటాం.

మనం అతి జాగ్రత్తగా గమనిస్తూ పిల్లలలో పెంపొందించాల్సిన అంశాలను కూడా మనం చాలా అజాగ్రత్తగా  నిర్లక్ష్యం చేస్తుంటాం. మొదటి పది సంవత్సరాల్లో వారు ప్రశ్నలు వేయడాన్ని నిరుత్సాహపరుస్తూ ఉంటాము. నాకు తెలిసినంత వరకు పదేళ్ల లోపు పిల్లలు మాత్రమే అతి చిలిపి ప్రశ్న కూడా అడుగుతూ మన చుట్టూ తిరుగుతారు తప్ప పది సంవత్సరాలు దాటిన పిల్లల్లో ఇలాంటి ఆసక్తిని మనం అప్పటికే కట్టడిచేసి పెట్టి ఉంటాం. పెరిగి పెద్దవటం అనేది చాలా ప్రశాంతంగా, భావరహితంగా, చీకూ చింతా లేకుండా, తాకకుండా, చెక్కుచెదరకుండా జరగాలి.

కానీ పిల్లల్లోని చాలా భావాలకు మనం యథార్థంగా ప్రతిస్పందించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా  ఉదాసీనంగానో, ఉద్వేగపూరితంగానో స్పందిస్తాము.  వారి చిన్నతనం, బలహీనత, నైపుణ్యలేమి, అమాయకత్వం, అనుభవలేమి, అసహనం, అసహాయత, ఆధారపడే తత్వం ఇలాంటి గుణాలన్నింటి పట్ల సానుభూతితో వ్యవహరిస్తాం. వారి సంతోషం, నిశ్చింత, అమాయకత్వం, స్వచ్ఛత, అలైంగికత, మంచితనం, ఆధ్యాత్మికత, జ్ఞానం వంటి లక్షణాల  పట్ల సెంటిమెంట్‌తో వ్యవహరిస్తాం. ఇలాంటి ఆలోచనా విధానం పూర్తిగా అర్థంలేనిది. పిల్లలు ఎప్పుడూ సంతోషంగా, శ్రద్ధారహితంగా ఉంటారని అనడానికి లేదు. వారికి కూడా పెద్దవారికి ఉన్నట్టుగానే ఎన్నో భయాలు, బాధలు ఉంటాయి. అయితే వారిలోని శక్తి, వారి ఆసక్తి వారిని సంతోషంగా ఉంచుతాయి. తీవ్రమైన ఆలోచనలతో వారు సమయం వృథా చేయరు. ఇక ఆధ్యాత్మికత అనే దానికి అత్యంత దూరంలో ఉండేది పిల్లలే. వారిది అమూర్తులు కాదు, వాస్తవ స్వరూపులు. వారు జంతుప్రాణులు, ఇంద్రియజ్ఞానులు.  వారికి ఏది మంచి అనిపిస్తుందో అదే మంచి, వారు తమ గురించిన ధ్యాసతోనే ఉంటారు, స్వార్థపరులు కూడా. వారికి ఎదుటి వారిని అర్థం చేసుకునే సామర్థ్యం చాలా తక్కువగా  ఉంటుంది. అందువల్ల తరచుగా వారు కాస్త సానుభూతి లేనివారిగా, క్రూరంగా కనిపిస్తారు. కానీ వారు కరుణ కలిగిన వారైనా, క్రూరులైనా, వారు ఉదారంగా ప్రవర్తించేవారైనా, దురాశాపరులైనా, ఎలా ఆలోచించినప్పటికీ వారు మాత్రం అప్పుడు ఆ సందర్భంలో అలా ప్రవర్తిస్తారు తప్ప ముందుగా వేసుకున్న ప్రణాళికలు మాత్రం వారికి ఉండవు. చాలా విషయాలు వారు స్కూల్లో నేర్చుకోరు, ఎవరూ చెప్పరు, కానీ పెరుగుతున్న కొద్ది అర్థం చేసుకుంటూ జీవన నైపుణ్యాలు అలవరచుకుంటారు. కొన్ని విషయాలు అర్థం చేసుకోవడం, జ్ఞానం సంపాదించడం సమయానుసారంగా జరుగుతుంటాయి. అందుకే పిల్లలు వారి భావాలు అర్థం చేసుకొని వాటిని గౌరవించే పెద్దల వైపు ఆకర్షితులవుతారు.

పిల్లలతో సెంటిమెంట్‌గా వ్యవహరిస్తే తప్పేంటి, అది వారి కోసమే కదా, దాని వల్ల నష్టమేముంది అని కొంతమంది అడుగుతారు. చాలా సంవత్సరాల క్రితం లండన్‌లో సెకండ్ హ్యాండ్ పుస్తకాలు అమ్మే ఒక దుకాణంలో స్టీవీ స్మిత్ రాసిన నావెల్ ఆన్ ఎల్లో పేజెస్ అనే పుస్తకం దొరికింది. ఇది నాకు నచ్చిన పుస్తకాలలో ఒకటి. అది చదువుతున్నపుడు నేను ప్రత్యేకంగా ఒక పాసేజ్ కోసం వెతుకుతున్నాను. నేను ఆ పేరాగ్రాఫ్ చదువుతూ వెళ్లిపోయాను కానీ దాన్ని గుర్తించనే లేదు, పూర్తిగా మరచిపోయాను. నేను మొదటిసారి చదివినపుడు అది నా మనసును ఏ రకంగాను తాకలేకపోయింది, నేను అలా చదువుతూ వెళ్లిపోయాను. ఈ సారి మాత్రం అది నన్ను చాలా కదిలించింది. పిల్లలను అందమైన వస్తువుగా చూడడం, ఆ విషయాన్ని సెంటిమెంటుకు ముడిపెట్టడం అంటే వారి పట్ల చాలా నిర్దయగా, క్రూరంగా వ్యవహరించడమే. ఇదే అందులో నాకు నచ్చిన అంశం.

ఒక మధ్యాహ్నం నేను కొన్ని వందల మంది మధ్య ఒక జూనియర్ కాలేజికి చెందిన ఒక ఆడిటోరియంలో ఉన్నాను. ఆ సమయంలో బయటి నుంచి ఒక చిన్నపిల్లాడి ఏడుపు వినిపించింది. దాదాపు అందరూ నవ్వారు. ఒక్క నిమిషం పాటు కూడా ఆ పిల్లాడి బాధ గురించి ఆలోచించలేదు. దీని వెనుక పెద్దల్లో దాగిన ఒక దారుణమైన ఆలోచనా విధానం ఉంది, పిల్లల భావాలు, వారి బాధలు వంటివన్నీ నిజం కాదని వాటి గురించి అంత గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం లేదనే భావనే అది. బాధతోనో లేదా కోపంతోనో కూడిన పెద్దవారి ఏడుపు అయి ఉంటే ఇలా నవ్వి ఉండేవారు కాదు. అందరూ ఆశ్చర్యం లేదా భయంతో అటువైపు చూసేవారు. పిల్లల ఏడుపు మనకు అటంకం, లేక ఇబ్బంది కానంత వరకు మనకు పిల్లల ఏడుపు చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది. లేదా దాన్ని పట్టించుకోము. ఎందుకంటే పిల్లలు ప్రతిదానికి ఏడుస్తారు. అయితే పిల్లల ఏడుపులో ఎలాంటి హాస్యం లేదు. వారు తమ బాల్యాన్ని, తమ ముద్దొచ్చే లక్షణాన్ని అడ్డం పెట్టుకుని ఇలాంటి ట్రిక్కులకు పాల్పడటం పెద్దవారి నుంచి నేర్చుకునే వరకు వారు ఉపయోగించలేరు. కాబట్టి ఆ చిన్నబిడ్డ ఏడుస్తున్నదంటే దానికి తప్పనిసరిగా ఏదైనా అవసరమో, బాధ లేదా నొప్పి కారణమై ఉండి ఉంటుంది.

ఒకసారి ఎయిర్‌పోర్టులోకి వస్తుండగా ఒక ఏడెనిమిది సంవత్సరాల పాప నా ముందు నడుస్తూ వెళ్తోంది. త్వరత్వరగా నడిచే ప్రయత్నంలో కింద పడిపోయింది. ఆమెకు దెబ్బతగలలేదు, వెంటనే లేచి నిలబడి తిరిగి నడుస్తూ వెళ్లిపోయింది. కానీ ఆ సమయంలో అక్కడున్న అందరి ముఖాల్లో ఒక చిన్న చిరునవ్వు నేను గమనించాను. అందరిలోనూ ఎంత ముచ్చటగా ఉంది అనే భావం కనబడింది. ఇదే ఒక పెద్దవారికి జరిగి ఉంటే ఇలా అనుకునే వారు కాదు. అందరు కూడా అతడికి దెబ్బతగిలిందేమో అని ఆలోచించేవారు.

అందుకే అన్నాను పిల్లలను అందమైన వస్తువుగా చూడడంలో క్రూరత్వం ఉందని. అది పూర్తిగా నిజమే కదా. పిల్లల జీవితాలు, వారి భావాలు మనం రంగ స్థలం మీద హాస్యనటుల నటనలా భావిస్తాం, వారి ఏడుపు బాధ మన పనులకు ఆటంకం కానంత వరకు. అందువల్ల వాళ్ల బాధ  కానీ మరే భావన కానీ పెద్దవారి దృష్టిలో అంత సీరియస్ విషయం కాదు, నిజమూ కాదు. మనం కలిగించే బాధ కూడా వాస్తవం కాదు. కేవలం మన అవసరాలు మాత్రమే నిజం. ఎవరైనా పెద్దవారు వాళ్ల సంతోషం కోసం పిల్లలను ఎత్తుకోవాలనుకున్నా, దగ్గరకు తీసుకోవాలనుకున్నా, ముద్దుపెట్టుకోవాలనుకున్నా అది ఆ పిల్లవాడికి ఇష్టమున్నా లేకున్నా దాన్ని లక్ష్య పెట్టనవసరం లేదు.  కేవలం పెద్దవాళ్లకు చెందిన భావాలు, అవసరాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా పెద్దలు పిల్లలను ప్రాణమున్న బొమ్మలుగా ఉపయోగించుకుంటున్నారు, వారికి నచ్చినట్లు వారితో ప్రవర్తిస్తున్నారు. ఆడుకునే సమయంలో బొమ్మను కింద పడేస్తారు, తిరిగి పైకి లేవదీసి తీసుకుంటారు, కౌగిలించుకుంటారు, మనసు బాలేకపోతే కసురుకుంటారు, ఇలా బాలదేవతలుగా కనిపించిన వారే పిల్ల దయ్యాలుగా కూడా మారిపోతారు.

ఒకే కుటుంబంలో పుట్టిన ఇద్దరు పిల్లల మధ్య ఎలాంటి ఈర్ష్యాద్వేషాలు లేకుండా, ప్రేమ కోసం పోటీ లేకుండా ఆరోగ్యకరంగా పెరిగిన కుటుంబాల్లో వారి మధ్య ఎంత మంచి స్నేహం ఉన్నప్పటికీ వారు ఒకరినొకరు ముద్దులు మూటగట్టే అందమైన బొమ్మలుగా భావించరు. వారికంటే చిన్నవారిని కూడా అలా చూడరు. చెప్పాలంటే పెద్ద పిల్లలు చిన్న వారి పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరించడం  కనిపిస్తుంది. కానీ ఆ పిల్లలు తమకంటే చిన్న పిల్లల గురించి చెప్పే మంచితనం, స్వచ్ఛత వంటి మాటలు అసలు నమ్మనే నమ్మరు. కానీ వారికి తెలుసు వారికంటే చిన్నవారైన ఈ పసిపిల్లలు చిన్నగా ఉన్నారు, అమాయకంగా ఉన్నారు, బలహీనంగా ఉన్నారు, వారికి తప్పనిసరిగా మరొకరి సాయం అవసరం, కొంత తెలివితక్కువగా ఉన్నారు, కొన్నిసార్లు వారు ఇబ్బంది  పెడతారు కూడా అని. ఎందుకంటే

పిల్లలు ఒకరినొకరు 'క్యూట్'గా ఉన్నారని అనుకోరు. కానీ మనం అలా అనుకుంటాం. వారు చాలా నిక్కచ్చిగా ఉంటారు. ఈ మొత్తం విషయంలో మనకు కనిపించేది కేవలం ఎదుటి మనిషి వయసుతో సంబంధం లేకుండా పూర్తి వ్యక్తిగా గుర్తించడం మాత్రమే. ఒక్కోసారి ఒకరికి మరొకరి మీద ఆరాధన ఉన్నప్పటికి అది మనం వాళ్లమీద చూపే శ్రద్ధలా వారికి హాని చెయ్యదు.

మనం పిల్లలతో ప్రవర్తించే విధానం అంత బలమైంది కాదు ధర్మబద్ధమూ కాదు. నిజము కాదు అబద్ధమూ కాదు కేవలం ఒక బలహీనత మాత్రమే. మనల్ని మనం బలవంతులుగా లేక వాళ్ల కంటే గొప్ప వారిగా భావించుకునే లక్షణం మాత్రమే. అందుకే మనం వారిని ముద్దుగా చూస్తాం – కేవలం వారు చిన్నగా ఉన్నారన్న కారణం చేత. అయితే చిన్నగా ఉండడంలో ఉన్న అందమేమిటి అసలు? మరుగుజ్జులు అందంగా ఉంటారా? కాదు కదా. మరుగుజ్జులు చిన్నగా ఉండడాన్ని మాత్రం బాధగా లేదా భారంగా భావిస్తాం. ఇదంతా పిల్లలకు చాలా బాగా అర్థం అవుతుంది. తాము చిన్నగా ఉండడాన్ని వారు సెంటిమెంట్‌గా అసలు భావించరు. అందుకే వారు చిన్నగా ఉండాలని అనుకోరు, వీలైనంత త్వరగా పెద్దగా పెరగాలని కోరుకుంటారు.

పిల్లలు పుట్టిన ఒకటి రెండేళ్లలో వారు పూర్తి స్థాయి మనుషులుగా పెరిగిపోతే మనం వారితోఎలా ప్రవర్తిస్తాం? మనం అప్పుడు వారిని ప్రేమ పంచే వస్తువుగానో, బానిసగానో, ఆస్తిగానో పరిగణించలేము కదా. మనం వారిని అసహాయులుగా, ఆధారపడే వారిగా, చిన్న పిల్లలుగా భావించలేము కదా. వారు భౌతికంగా పెద్దవారు అయ్యేలోగా అన్ని విషయాల్లో వారు ఎదగాలని అనుకుంటాము. ఇక వారు వీలైనంత త్వరగా స్వేచ్ఛగా, చురుకుగా, స్వతంత్రంగా, బాధ్యతగా ఉండాలనికోరుకుంటారు. వారు ఒకసారి పూర్తిగా ఎదిగారంటే ఇక వారిని జీవం ఉన్న బొమ్మగా చూడలేము. వారు అలా ఎదగడానికి మనం ఏం చెయ్యాలో అవన్నీ చేస్తాము కూడా.

పిల్లల పరిమాణంలో ఎక్కువ తేడా లేకుండా ఉంటే అప్పుడు మన ఆలోచన విధానంలో మార్పు ఉండేదేమో. అప్పుడు పిల్లలు మనకు 'క్యూట్'గా అనిపించే వారు కాదేమో. అప్పుడు అది కేవలం ఒక స్థితి మాత్రమే అయ్యేది, జుట్టు ఉండడం లేదా బట్టతల ఉండడం మాదిరిగా లేదా సన్నగా ఉండడం లేదా లావుగా ఉండడం మాదిరిగా. ఎవరన్నా చిన్నగా ఉన్నారంటే అది వారితో మనకుండే సంబంధాలు, ఇతర భావాలన్నింటిని కూడా మార్చాల్సిన అవసరం లేదు కదా.

పిల్లల్లో ఉండే మరో లక్షణం కూడా మనం వారిని 'క్యూట్' అనుకునేలా చేస్తుంది. అది వారి నవ్వు, నవ్వుతున్నపుడు వారి కళ్లలో తొణికిసలాడే భావాలు వారి అమాయకత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఇక్కడ చెప్పాల్సింది వారి అజ్ఞానం, ఇంకా అనుభవ లేమి గురించి మాత్రమే. కానీ అజ్ఞానం అనేదేమి వరం కాదు అదొక దురదృష్టం. పిల్లల అజ్ఞానం కంటే కూడా వారి ఆకృతే ఎక్కువగా సెంటిమెంట్‌గా అలోచించేలా చేస్తుంది. వారు వాళ్ల అజ్ఞానాన్ని పారద్రోలడానికి చాలా రకాలుగా ప్రయత్నిస్తుంటారు. అందరిని అన్నిరకాల ప్రశ్నలు అడిగి తెలుసుకుంటూ ఉంటారు. మనం కూడా వారికి వీలైనంతగా దానికి సహాయపడాలి కూడా. పిల్లల అమాయకత్వం కంటే మించినది వారిలో మరొకటుంది. అది వారి కోసం ఈ ప్రపంచం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుందన్న నమ్మకం, ఆత్మ విశ్వాసం. జీవితంలో ఎన్నో అవకాశాలు ఉంటాయన్న నమ్మకం, వారికి  తెలియని విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్న నమ్మకం, వారికి చెయ్యడం రాని  పనులు తాము నేర్చుకోగలనన్న నమ్మకం. ఈ లక్షణాలు దాదాపుగా అందరిలోనూ ఉంటాయి. మనం తెలియనితనం అనే మాటను కేవలం చిన్న పిల్లలకు మాత్రమే ఆపాదిస్తాం.. ఏదో వారికి అసలు నేర్చుకోవడమే చేతకాదేమోననే విధంగా మాట్లాడుతాం. అది మన నిస్సహాయత. అంతకు మించి మరేమీ కాదు.

నేను బోస్టన్ పబ్లిక్ గార్డెన్‌లో తరచుగా గమనిస్తుంటాను. అక్కడ చాలా మంది పసి పిల్లలు, ఇప్పుడే నడక నేర్చుకుంటున్న వారు కనిపిస్తారు. నాకు వారి నైపుణ్యలేమి, ఆ తడబాటుతో నడుస్తున్న తీరు చాలా 'క్యూట్'గా ఉంటుంది. నేను ఇప్పుడు దాన్ని మరో దృష్టి కోణంతో చూడడం మొదలు  పెట్టాను. ఇలా నడవడం చేతకాని పెద్దవారిని మనం వికలాంగులు అంటుంటాము. మనం వారిని చూసి ముసిముసి నవ్వునవ్వము. అలా ప్రయత్నిస్తున్నందుకు, ప్రయత్నంలో  సఫలమైనందుకు మనం అతడిని అభినందించము. పిల్లలను చూస్తూంటే నాకు ఇలాంటి ఆలోచన కలిగింది. చిన్న పిల్లలు ఇలా ప్రయత్నిస్తుండగా చూసి 'క్యూట్' అనే భావన కలగడం కంటే మంచి ప్రయత్నం అన్న అభినందనభావం మాత్రమే కలగాలని అనుకున్నాను. ఆ బాబు 'క్యూట్'గా ఉండడం కోసం ఇదంతా చెయ్యడం లేదు. తనని తాను 'క్యూట్' అని అనుకోవడం లేదు కూడా, అతడికి తాను 'క్యూట్'గా కనిపించడం పెద్దగా ఆసక్తి లేని విషయం కూడా. మిగతా అందరు మనుషులు చేస్తున్న పని తానూ చేసే ప్రయత్నం చేస్తున్నాడు. దాన్ని అందరూ కూడా గంభీరంగా చూడాలనే ఆశిస్తున్నాడు  కూడా.

కానీ పిల్లలు నడకనేర్చుకుంటున్న క్రమాన్ని గమనించడం అందరికి ఇష్టంగానే ఉంటుంది. మనమెంతో సునాయసంగా చేసే ఆ పనిని వారు చాలా గంభీరంగా చేస్తుంటారు.

అది వారికి కాస్త అపాయంతో కూడుకున్నది కూడా. కిందపడిన ప్రతిసారీ దెబ్బతగలకపోవచ్చు, కానీ ప్రతి సందర్భంలోనూ తగలకుండా కూడా ఉండదు కదా. చాలా మంది పెద్దవాళ్లు కాస్త పెద్ద పిల్లలు కూడా కొత్తగా నడవడం నేర్చుకుంటున్న పిల్లల మాదిరిగా ఏవిషయాన్ని కూడా అంతగా సాధన చేయరు. కానీ పసి పిల్లలు మాత్రం నడక సరిగ్గా వచ్చే వరకు సాధన చేస్తూనే ఉంటారు. అతడు చాలా అంకితభావంతో ఉంటాడు. చాలా కష్టించి పనిచేస్తుంటాడు, అతడు చాలా ఆసక్తితో పనిచేస్తుంటాడు, నడక నేర్చుకోవడం పిల్లలకు ఒక పోరాటం, ఒక సమస్య మాత్రమే కాదు. అది వారికి ఆనందాన్నిచ్చే ఒక గొప్ప సాహసం కూడా. ఈ సాహసాన్ని చూసినపుడు ఇది అద్భుతమైన దానికంటే తక్కువేమీ కాదు. నేను ఆరాధించేది అతడి అంకిత భావాన్ని, అతడిలోని ఉత్సాహాన్ని, ఇంకా ఆనందాన్ని కానీ అతడు పరిమాణంలో చిన్నగా ఉండడాన్ని, అతడి దుర్బలత్వాన్ని, చేతకానితనాన్ని కాదు. "ఓహ్ అతడిని పైకి ఎత్తి గట్టిగా కౌగిలించుకొని, చిన్నబాబూ నాకో ముద్దివ్వు" అని అడగమంటుంది నా మనసు. కానీ నేను దానికి సమాధానంగా నేనంటాను "లేదు, లేదు, ఆ బాబు నేను ఎత్తుకోవాలని కానీ కౌగిలించుకోవాలని కానీ, ముద్దుపెట్టుకోవాలని కానీ కోరుకోవడం లేదు, అతడు కేవలం నడవాలని మాత్రమే కోరుకుంటున్నాడు. అది నాకు నచ్చుతుందా, ముద్దొస్తుందా అనేది అతడికి సంబంధం లేని విషయం, అతడు నన్ను సంతోషపెట్టడానికో లేదా నా అభినందన కోసమో లేదా వారి తల్లిదండ్రుల సంతోషం కోసమో నడవడం లేదు. కేవలం అతడి కోసమే నడుస్తున్నాడు. అది అతడి కోసమే నడుస్తున్న సాహసకృత్యం, అతడిని నీ ప్రదర్శనలో నటుడిని చెయ్యకు, అతడిని ఒంటరిగా వదిలి అతడి పని అతడిని చేసుకోనివ్వు" అని.

మనకు తరచుగా పిల్లలు చాలా గంభీరంగా, ఏకాగ్రతతో ఏదైనా చేస్తున్నపుడు చాలా 'క్యూట్'గా కనిపిస్తుంటారు. "నువ్వు చేస్తున్నది నీకు చాలా ముఖ్యమైందిగా అనిపిస్తోందా? నాకు తెలుస్తుంది అంత ముఖ్యమైంది కాదని, మిగతా అన్ని విషయాల్లాగే ఇది కూడా చాలా చిన్న విషయం." పిల్లవాడు తన పిచ్చుక గూడును చాలా ఏకాగ్రతతో నిర్మిస్తుంటాడు. మనకు అనిపిస్తుందది పిచ్చిపని అని. అనవసరంగా బోల్డు కష్టపడిపోతున్నాడని కూడా (పైకి మాత్రం తేనెలూరే గొంతుతో పిచ్చుకగూడు చాలా అందంగా ఉంది అని అంటాము). కానీ అతడి అమాయకత్వం వల్ల అది చాలా ముఖ్యమైనదే అతడికి. మనల్ని మనం తృప్తిపరచుకోవడం ఎలాగో మనకు బాగా తెలుసు. అలాగే వాడికి అది.

పిల్లలు వారి అమాయకత్వాన్ని, తెలియని తనాన్ని ఎంత ఎక్కువ ప్రదర్శిస్తే మనకు అంత 'క్యూట్'గా కనిపిస్తారు. మనం వారి ఆధారపడే తత్వాన్ని, వారి నిస్సహాయ పరిస్థితికి విలువనిస్తాం. వారు మనం సాయం చేసే వస్తువులు(హెల్ప్ ఆబ్జక్ట్స్). ఇంకా మనం ప్రేమ పంచే వస్తువులు (లవ్ ఆబ్జక్ట్స్). పిల్లలు మనకు తెలివిగా కనిపిస్తే అంత 'క్యూట్'గా కనిపించరు. వారు అలా ప్రవర్తించినపుడు మనకు వారు ఒక పజిల్‌లా కనిపిస్తారు. మనం పిల్లలను తక్కువ చేసి చూడగలిగే అవకాశం లేని, వారిని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితిలో చూడడం మనకు ఇష్టం ఉండదు. ఇలా ఎక్కువగా మనం స్కూళ్లలో చూస్తుంటాం. టీచర్లకు తెలియని విషయాలు పిల్లలకు తెలిసుంటే అది సమస్య వారికి. మనం ఒక చిన్న పిల్లవాడు ఏదైనా పని బాగా చెయ్యగలుగుతున్నాడంటే మనం అతడు సహజత్వానికి భిన్నంగా ఉన్నాడనుకుంటాము. అతడు చాలా అసాధారణంగా ఉన్నాడు. సమయానికి కంటే ముందుగా ఎదుగుతున్నాడు, కచ్చితంగా ఏదో సమస్యలో పడబోతున్నాడు, ఇలా చాలా మంది అభిప్రాయపడ్డారు. వయోలిన్ వాయించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన జపనీస్ పిల్లల గురించి వారి టీచర్ సుజుకీ దగ్గర నాకు ఇంకా గుర్తు. ఒక సోషియాలజిస్టు ఒమర్ కే. మూర్ చెప్పారు నాకు. మూడు సంవత్సరాల వయసున్న కొంతమంది పిల్లలకు ప్రత్యేకమైన టైప్ రైటర్లను అందజేయడం ద్వారా ఒక కొత్త ప్రయోగం చెయ్యాలనుకున్నాడు. అలా ఇచ్చిన వారు త్వరగా నేర్చుకుంటారని నిరూపించదలచుకున్నాడు. కానీ అతడికి ఉత్తరాలు వెల్లువలా వచ్చాయి. అతడు పిల్లల బాల్యంతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.

పిల్లలు చేతకానివారిగా లేదా అమాయకులుగా ఉండడానికి సిద్ధంగా ఉండరు. వారు త్వరగా విషయాలన్ని నేర్చుకోవాలనుకుంటారు. పనులన్నీ సరిగ్గా చెయ్యాలని అనుకుంటారు. పెద్దలంతా చేస్తున్న పనులన్నీ కూడా తాము చెయ్యాలని ఆశిస్తారు. ఇలా ఆశిస్తునే వారు స్కూల్‌కి వెళ్తారు. అక్కడ కూడా వారికి అసంతృప్తే ఎదురవుతుంది. వారికి ఏదైనా ముఖ్యమైనవి నేర్చుకునే అవకాశం చాలా అరుదుగా వస్తుంది. కానీ స్కూల్ బయట కూడా చాలామంది బాల్యాన్ని పరిరక్షించే వారు ఉంటారు. పిల్లలంటే ఏదీ చేతకాకుండా నిస్సహాయంగా ఉండాలని ఆశించేవారు అందరూ కూడా పిల్లలను పిల్లల్లాగే ఉండనివ్వాలి అని అంటూ ఉంటారు.

# 13. పిల్లలు క్యూట్‌గా ఉండడాన్ని ఎలా ఉపయోగించుకుంటారు?

**ఒ**కసారి ఒకరు నాతో "నాకు ఇద్దరు చిన్న పిల్లలున్నారు, వారు నాకు క్యూట్‌గానే కనిపిస్తారు. వారిని అలా చూడడంలో నష్టమేముంది" అని అడిగారు. అతడు పిల్లలతో కలిసి గడుపుతున్నంత కాలం వారికి ఎలాంటి నష్టం ఉండకపోవచ్చు. కానీ పిల్లలను వేరుగా అతడిని వేరుగా చూసినపుడు మాత్రం నేను అది నష్టం లేనిదని చెప్పలేను. కానీ ఇలా వారిని క్యూట్‌గా భావించడంలో చాలా పెద్ద ప్రమాదం ఉంటుంది.

ఆ దృష్టి మనలో ఉన్నంత కాలం వారి ఎదుగుదలకు అది అడ్డంకిగా ఉంటుంది. ఈ అడ్డంకి నిజానికి అర్థం చేసుకోవడానికి, దయకు, ప్రేమకు చాలా పెద్ద శత్రువు.

ఒక వ్యక్తి మరొక వ్యక్తితో ప్రవర్తించే ముందు అతడి మనసులో అతడి గురించి ఒక ప్రత్యేకమైన అభిప్రాయం ఉంటుంది అంటే వారు సెలబ్రిటి అనో, లేక నలుపనో, సెక్సీ అనో, గొప్పవారు అనో, మేధావి అనో, కళాకారుడు, సన్యాసి ఇలా ఏదో ఒక అభిప్రాయం ఏర్పరుచుకుంటారు. ఇక అలా అనుకున్న తర్వాత వారితో సహజమైన సంబంధం ఏర్పరుచుకోవడం కష్టం. పిల్లల పట్ల ముందుగానే క్యూట్ భావనతో ఉంటే జరిగేది కూడా అదే. మనం పిల్లలు అనగానే ఒక అభిప్రాయం ఏర్పరుచుకొని ఉంటాం. వారితో అలాగే ప్రవర్తిస్తుంటాము. మనం వాళ్లకు కొన్ని ప్రత్యేక లక్షణాలను ఆపాదిస్తాము. కొన్ని సార్లు అవి చెడుగాను, కొన్నిసార్లు అవి మంచిగానూ ఉండొచ్చు.

కొన్ని సమాజాల్లో భౌతికమైన అందాన్ని ఆరాధిస్తారు. బయటికి ఎలా కనిపిస్తారన్న దాన్ని బట్టే కదా మనం మనుషులను అంచనా వేస్తాము. సాధారణంగా స్త్రీలు అందంగా కనిపించాలని పురుషులు ఆశిస్తారు. స్త్రీలు కూడా తాము అందంగా ఉన్నట్లు పురుషులు భావించాలని కోరుకుంటారు. అందంగా ఉన్న యువతి వైపు చూసిన యువకుడు ఆమె చాలా తెలివి కలదై ఉంటుందని, ప్రేమించే మనసు ఇలా చాలా లక్షణాలు ఆమెలో ఉంటాయని మిగతా యువతులతో పోల్చి అంచనా వేస్తాడు. కానీ అందంగా ఉన్నంత మాత్రాన ఆమెలోని ఇతర లక్షణాలు అంత ప్రత్యేకంగా ఏమీ లేవన్న సంగతి ఆమెతో ప్రేమ లాంటి ఏదైనా సంబంధం ఏర్పడితే కానీ అతడికి అర్థం కాదు. అలాంటి సందర్భాల్లో అసంతృప్తికి లోనవుతాడు. మోసగించబడినట్టు భావిస్తాడు, కొన్నిసార్లు బయటికే బాధను కూడా వ్యక్తంచేయొచ్చు కూడా. 'నువ్వు ఇతరుల కంటే చాలా మెరుగ్గా ఉంటావని అనుకున్నాను, నువ్వు నా నమ్మకాన్ని ఇలా ఎలా వమ్ము చెయ్యగలవు' అని.

కొద్దిరోజుల క్రితం సైకాలజి టుడే పత్రికలో ఒక వ్యాసం ప్రచురితమైంది. ఒక పరిశోధనలో భాగంగా కొంతమంది అపరిచితుల ఫోటోలను చూపించి మీరు వారి గురించి ఏమనుకుంటున్నారని కొంతమందిని ప్రశ్నించడం జరిగింది. (ఈ పరీక్షలో పాల్గొన్న వారిలో కొంతమంది ఈ ప్రతిపాదన చాలా హాస్యాస్పదంగా ఉందని అన్నట్టు వ్యాసంలో అయితే రాయలేదు) మనం అనుకున్నట్టుగానే అందంగా కనిపిస్తున్న వారి పట్ల వారు మంచి అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఇదే సిద్ధాంతం టీచర్లకు కూడా ఆపాదించవచ్చు. టీచర్లు అందంగా కనిపించే పిల్లలు తెలివి తేటలు కలిగి ఉంటారని భావిస్తారు. వారి తప్పులను ఎక్కువ సందర్భాలలో క్షమిస్తారు. ప్రతి స్కూల్‌లోనూ కూడా క్యూట్‌గా కనిపించే అమ్మాయికి, హోమ్లీగా కనిపించే అమ్మాయి కంటే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంటుంది.

ఆదర్శనీయమైన ప్రత్యేక బాలుడుగా ప్రతి పిల్లవాడిని అతడి తల్లిదండ్రులు టీచర్లు మార్చేస్తారు. ఇక వారు చంద్రుడి మీదకు పంపిన అంతరిక్ష నౌకను క్షణ క్షణం మానిటర్ చేసే హ్యూస్టన్ రాకెట్ సెంటర్‌లా మారిపోతారు. అది ముందే మ్యాపింగ్ చేసిన ప్రకారం కక్ష్య (జీవితం)లోకి ప్రవేశిస్తుందో లేదో పర్యవేక్షిస్తూ, ఒకవేళ అవసరమైతే రాకెట్ (సైకాలజిస్టు) సాయంతో దాని దిశను చక్కదిద్దడం చేస్తారు.

ఈ చిన్న పిల్లాడు ఇప్పుడు ఏం చేస్తున్నాడు, ఎలా ఆలోచిస్తున్నాడు అనేది పరిశీలించాలి, అర్థం చేసుకోవాలి అని ఇతరులు అంటారు. "పిల్లలు పెద్దవాళ్లలా

శక్తిమంతులు కారు, ఏమైనా వారు పిల్లలే" అనటంలో చాలావరకు వారి ఉద్దేశం ఇదే. నేను కూడా అంగీకరిస్తాను. అయితే దురదృష్టవశాత్తు బాల్యాన్ని వెనకేసుకొచ్చే చాలా మంది ఉద్దేశంలో మాత్రం పిల్లలు అలా ఉండరు. పిల్లలంటే ఎలా ఉండాలనే విషయంలో ముందే వారికి కొన్ని భావనలు ఉంటాయి. వారి పట్ల దయతో కూడిన ఒక సెంటిమెంటాలిటీ ఉంటుంది. పిల్లలు పెద్దలకంటే తెలివైనవారు, అందమైనవారు, మానవత్వం కలిగినవారు, సంతోషంగా ఉంటారు, విచక్షణ కలిగినవారు, పవిత్రమైనవారు అని కూడా మళ్లీ వారే అంటుంటారు. ఇలాంటి మాటలు పిల్లలను నిరుత్సాహపరిచేవిగా, నష్టం చేసేవిగా ఉంటాయి. ఎవరైనా సరే శక్తి లేకుండా, అమాయకంగా, ఆత్రంగా, గందరగోళంగా ఉన్న పెద్దవారు తమ జీవితంలో ఇది చాలా మంచి సమయం అని అనుకోగలరా?

నేను ఇది రాస్తున్న రోజున ఎండగా ఉన్న ఏప్రిల్ నెలలోని ఒక ఉదయాన నేను బోస్టన్ పబ్లిక్ గార్డెన్‌లో నడుస్తున్నాను. నేను అక్కడ పిల్లలతో పాటు ఉన్న చాలా మంది తల్లులను చూశాను. వారిలో చాలా మంది పిల్లలు పసివారు. వారిలోని శక్తిని, ఆసక్తిని, చుట్టు ఉన్న ప్రపంచంలోని ఆనందాన్ని పంచుకునే తీరును నేను గమనిస్తున్నాను. ప్రకృతి ఒక జీవిని సృష్టించి అది రెండు మూడేళ్లలో పూర్తి ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంగా ఎదిగే ఏర్పాటు చేసి ఇస్తే దాన్ని ప్రపంచంలోని అత్యుత్తమమైన పెంపుడు జీవిగా వాడుకుంటున్నాము. వారు జీవితమంతా అలా చిన్న పిల్లలుగా ఉండబోవడం లేదు. అలాంటపుడు వారిని అలా భావించడం అంత సమంజసం కాదు. చిన్న పిల్లలు మూడేళ్ల వయసులో ఉన్నట్టుగా క్యూట్‌గా, నిర్మలంగా, ఆధారపడుతూ ఉండబోరు. భవిష్యత్తులో వారికోసం విస్తృతమైన జీవితం ఉంది. వారు గొప్పవారుగా ఎదిగే అవకాశం ఉంది. వారి జీవితపు తొలి రోజుల్లో వారిని ఇబ్బంది పెట్టడానికి కానీ, లేక వారిని అగౌరవ పరచడానికి కానీ మనకు ఎలాంటి అర్హత లేదు. "పిల్లలంటే పిల్లలే పెద్దలతో సమానం కాదు" అనే వాదనకు రెండు మార్గాలున్నాయి. ఒకటి మనచేత పొరపాటు చేయిస్తే మరోటి, అసలెంత మాత్రం అభిలషణీయం కాదు. పిల్లలంటే శిశువులు మాత్రమే కాదు రేపటి పరిపూర్ణ మానవులు కూడా. అతడి భవిష్యత్తు గురించి ఏ మాత్రం పట్టనట్టు అతడికి భవిష్యత్తే లేనట్టు ప్రవర్తించడం న్యాయం కాదు. కాని కేవలం అతడి భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచించడం అది తప్పుగా అనిపించవచ్చు. భవిష్యత్తు లేనట్టుగా ప్రవర్తించడం కంటే

మేలే కదా. 1940ల చివరలో పిల్లల వంటి పెట్స్ గురించి ఎవరో ఒక కథ రాశారు. న్యూట్రాయిడ్స్ అనే పిల్లల వంటి జీవులను శాస్త్రవేత్తలు తయారు చేస్తారు. పిల్లలు కావాలనుకునే వారు వీటిని తెచ్చుకునే వారు. అంటే పిల్లల వంటి ప్రియమైన వస్తువన్న మాట. నాకు ఇప్పటికీ మనం పిల్లలను పూర్తిస్థాయి వ్యక్తిగా గుర్తించకపోవడానికి కారణం వారిని న్యూట్రాయిడ్స్‌లా మాత్రమే చూస్తున్నామన్న మాట.

మనం ముందుగానే పిల్లలంటే ఇలా ఉండాలి, వారితో మనం ఇలా ప్రవర్తించాలనే ఒక అంచనా వేసి పెట్టుకుంటాము. అది సంపూర్ణ వ్యక్తిగానా లేదా న్యూట్రాయిడ్స్ వలెనా అనేది పక్కన పెడితే మన అంచనాల్లో వాళ్లు ఒదిగి పోవాలని మాత్రం కోరుకుంటాము. అలా వారు ప్రవర్తించినపుడు మనం సంతోషిస్తాం. అలా జరగకపోతే మనం బాధపడతాం లేదా అసంతృప్తికి లోనవుతాం లేదా కోపగించుకుంటాం. ఇలాంటి పరిస్థితి పిల్లల మీద ఎక్కువ ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల్లో చాలా ఎక్కువగా కనిపిస్తుంది. వారు విజయం సాధించడం ద్వారా వచ్చే కీర్తిని తమకు ఆపాదించుకొని వారి జీవితం సఫలమైందని భావిస్తుంటారు. పిల్లలు క్యూట్ అని భావించడమే దీని వెనుక ఉన్న అసలు కారణం.

మనం పిల్లలను క్యూట్‌గా భావించడం వల్ల మనం వారి 'క్యూట్‌నెస్' మనకు ఆనందాన్ని ఇస్తుందనుకుంటాం. అలాంటి పిల్లలు ఉండడం గర్వంగా భావిస్తుంటాము. ఇది నిజంగానే అంత మంచిది కాదు. కానీ ఈ క్యూట్‌గా ఉండడమనే లక్షణాన్ని ఉపయోగించుకోవడం రెండు వైపుల నుంచి ఉంటుంది. మనం వారిలోని క్యూట్‌గా ఉండే లక్షణాన్ని మన ఆనందానికి ఉపయోగించుకుంటూ, దాన్ని ఉపయోగించుకోవడం గురించి వారికి నేర్పిస్తాము. అతడు అలా క్యూట్‌గా ప్రవర్తించినపుడు మనం ఆనందంగా కనిపిస్తాము. అలా లేనపుడు మనం బాధపడతాము లేదా కోపంగా ఉంటాం. అలాంటి ప్రవర్తన తినడం, వస్తువులేవీ పగలగొట్టకుండా ఉండడం, లేదా పిల్లి తోక పట్టి లాగడం వరకైతే ఫర్వాలేదు. కానీ అది అంత సాధారణంగా ఉండదు. కానీ పిల్లలకు తెలుసు మనం వారి నుంచి ఏదో ఆశిస్తున్నామని కానీ అదేమిటనేది మాత్రం అంత కచ్చితంగా తెలియదు. అతడు స్వతంత్రంగా ప్రవర్తించే వాడైతే అలాంటి ఆలోచనకు పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వడు. లేదంటే పెద్దవాళ్లను తన ఆటలో భాగస్వాములను చెయ్యడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటాడు.

పెద్దలకు కూడా అదే కావాలి. ఇదే పిల్లలను మన ప్రేమ పంచే వస్తువులుగా చేస్తోంది. అందులో భాగంగానే అతడు మనం కోరినట్టు క్యూట్ పిల్లాడిగా ప్రవర్తిస్తుంటాడు. పిల్లలను తాము ఎంత ప్రేమిస్తామో చెప్పే వ్యక్తులు పిల్లల నుంచి కూడా సాధారణంగా అంతే ప్రేమను ఆశిస్తున్నారన్న మాట. ఏమీ ఆశించని, ఎలాంటి సందర్భంలోనైనా, ఎలాంటి ఒత్తిడి పెట్టని ప్రేమను బిడ్డ తల్లి నుంచి ఎలా అయితే ఆశిస్తాడో అలాంటిదే పిల్లల దగ్గర నుంచి కూడా ఆశిస్తుంటారు. తల్లిదండ్రులు పిల్లల నుంచి పిల్లలు తల్లిదండ్రుల నుంచి పరస్పరం ఇలాంటి ప్రేమను ఆశిస్తుంటారు. తల్లిదండ్రులు పిల్లల్లో తమ కలల ఆదర్శ ప్రేమికుడిని చూస్తారు.

ఇక ఇక్కడి నుంచి అధికారం కోసం పోరాటం మొదలవుతుంది. పెద్దవాళ్లు ఆశించింది ఇచ్చేసి వారికి కావల్సిన మెచ్చుకోలు వారు పొందాలి. ఈ పరిస్థితిని ఇలాగే కొనసాగించాలని అనుకుంటాడు. ఎందుకంటే పెద్దలు తమ నుంచి ఆశించేది ఇవ్వక పోతే తర్వాత ఏం జరుగుతుందో అతడికి తెలుసు. అతడు కులుకు చూపడం మొదలుపెడతాడు. ఎంత చేసినా పిల్లలను ప్రేమ పంచే వస్తువులుగా వాడుకుంటున్న పెద్దలంత మాత్రం కాదు. పెద్దలు ఇక నెమ్మదిగా వాదిస్తారు, బుజ్జగిస్తారు, బేరాలాడతారు, ఒక్కోసారి బెదిరిస్తారు కూడా. పిల్లలు చాలా త్వరగానే అర్థం చేసుకుంటారు ఎంత ఎక్కువ కాలం దీన్ని కొనసాగించగలిగితే అంత ఎక్కువ ప్రశంసలు దొరుకుతాయన్న విషయం. ఎంతకాలం ఇలా కొనసాగుతుంది? ఎంత కాలం పాటు పెద్దవాళ్లు తనవైపు చిరునవ్వుతో చూసేలా చేసుకోగలడు? ఇలాంటి అంచనాలన్నీ కూడా మనకు తెలియకుండానే జరుగుతుంటాయి. భావావేశపరంగా రకరకాల స్థాయిలలో ఇవి ఉంటాయి. ఒకవేళ ఇలా ఎక్కువ కాలంపాటు కొనసాగితే ఇలా ఒకరినొకరు ఉపయోగించుకునే ఈ ఆటనుంచి త్వరగా బయటపడక పోయినట్టయితే పిల్లవాడి వ్యక్తిత్వం తప్పకుండా దెబ్బతింటుంది.

పిల్లలు క్యూట్‌గా ఏమేమి చేసి పెద్దలను మెప్పించవచ్చు అనేది చాలా త్వరగానే నేర్చుకుంటారు. లేదా చుట్టు ఉన్న పెద్దవారిని ఎంతవరకు ఉపయోగించుకోవచ్చునేదైనా నేర్చుకుంటాడు. చాలా స్వార్థంగా, టక్కరిగా, అంచనాలు వేస్తూ, తిమ్మినిబమ్మి చేసే విధంగా తయారవుతాడు. ఇతరులకు తానెలా కనిపిస్తున్నానే దాని మీద ఎక్కువ శ్రద్ధ చూపడం ప్రారంభిస్తాడు. ఎరిక్ ఫ్రామ్ దీని గురించి చాలా బాగా చెప్పారు, పిల్లవాడు వ్యాపార దృక్పథాన్ని అలవరుచుకోవడం మొదలు పెడతాడు, తన ప్రవర్తనను మార్కెట్‌లో పెడతాడు. తన వ్యక్తిత్వాన్ని, తనను ఇలా మెచ్చుకోలు కోసం అమ్మకానికి పెడతాడు. స్కూల్లో మన

పొగడ్తలు పెరిగే కొద్దీ మన మీద ఎక్కువగా ఆధారపడుతుంటాడు. కానీ ఈ చిట్కాలన్నీ కూడా అతడు స్కూల్లో చేరడానికి ముందే నేర్చుకుంటాడు.

పిల్లలు కృతకంగా నవ్వడం, ఏడవడం, చిరునవ్వులు చిందించడం తరచుగా చూస్తుంటాం. నెమ్మదిగా మానవ సంబంధాలు నెరపడంలో ఆరితేరిపోతాడు. అవతలి వారి నుంచి వీలైనంత ఎక్కువ పొందడం ఎలాగో నేర్చుకుంటాడు.

నా క్లాస్‌లో ఒక పదేళ్ల పాప ఈ విధంగానే పెరిగింది. చిన్నపుడు ఆమె డాన్స్ స్కూల్‌కు వెళ్ళేదని, అక్కడ చిన్నపిల్లలకు అందంగా ఉండే బట్టలు వేసి డాన్స్ నేర్పించి పెద్దల కోసం వారి చేత ప్రదర్శనలు ఇప్పిస్తారు. తర్వాత రోజు నేను ఇలాంటి సంస్థల గురించి నేను బోస్టన్ గ్లోబ్‌లో చదివాను ఆర్ట్ లిస్లేటర్స్ యంగ్ వరల్డ్‌లో :

> (అక్కడి డైరెక్టర్  గోడకు వేలాడ దీసిన ఫోటో ఫ్రేములను చూపిస్తూ ప్రతి ఒక్క ఫోటో గురించి వివరిస్తూ అక్కడున్న అవర్ గర్ల్స్ అనే పేరుతో ఉన్న ఫోటోగ్రాఫ్‌లను గురించి చెబుతూ  "అమ్మాయిలు చాలా ఆత్మ విశ్వాసంతో ఉంటారు. ఎందుకంటే మేము వారితో చాలా ప్రేమగా, దయగా ఉంటాము. మా డాన్స్ టీచర్లంతా కూడా వారితో అలాగే ప్రవర్తిస్తారు. ఎప్పుడూ పిల్లలతో చేతులు కలుపుతూ, బుగ్గలు పుణుకుతూ, బుజ్జగిస్తూ చాలా గారం చేస్తాం. నాకు వాళ్లను చూస్తే చాలా అందంగా కనిపిస్తారు. వాళ్లతో గడపడం చాలా బావుంటుంది కూడా. చిన్నారి దేవతలు వాళ్లు. ఒక తల్లి నా దగ్గరికి వచ్చి నేను పాపను ఏం చెయ్యాలి అని అడిగింది. ఆ అమ్మాయి ఎక్కువగా సిగ్గుపడేది. అయితే నేను తనను తీసుకొని వెళ్లి స్టేజి మీద వెయ్యిమంది ఎదుట తన పాట పాడించాను. ఎలాంటి సంకోచం లేకుండా తను చక్కగా చిలకలా పాడగలుగుతుంది. ఆమె పాట, ఆట చూసి ఆమె తల్లి, తండ్రి మాత్రమే కాదు ఆమె డైరెక్టర్ కూడా ఆనందంతో ఏడ్చేస్తారు).

ఈ పాప నా క్లాస్‌లో ఉన్నది. ఆమె చిన్నపుడు చాలా ముద్దుగా అనిపించి ఉండొచ్చు. ఆమె టీచర్లంతా కూడా ఆమె చాలా అద్భుతంగా ఉంటుందని దాదాపు అందరూ ఆమెను ఇష్టపడుతున్నట్టుగా చెప్పారు. కానీ నేను చూసిన ఆ వయసు పిల్లల్లోకెల్లా సంతోషంగా లేని, కోపం ఎక్కువగా ఉన్న, మొండిగా, తనమీద తనకే జాలి (సెల్ఫ్ పిటీ) ఉండే అమ్మాయిలా

తయారైంది. ఆమె తన చుట్టు ఉన్న పిల్లలందరితో అధికారయుక్తంగా మాట్లాడేందుకు ప్రయత్నించేది. ఆమె ఇలాంటి ప్రవర్తన వల్ల విసిగిపోయిన పిల్లలు ఆమె మాట వినకపోయినా, లేదా పట్టించుకోకపోయినా, లేదా ఆమె చెప్పిన పని చెయ్యకపోయినా ఆమె అలిగేది, కోపంగా ఉండేది, కొన్ని సార్లు ఏడ్చేది. నాకు తెలిసి ఆమె జీవితంలో ఎప్పుడూ కూడా పరస్పరం ఒకరినొకరు ఉపయోగించుకోని లేదా దుర్వినియోగపరచుకోని మానవ సంబంధాలను ఆమె ఊహించలేదు. ఆమె తన డాన్స్, తన క్యూట్‌నెస్, అందమైన కళ్లు, తన చిన్నతనాన్ని ఎరగా వేసి డాన్స్ డైరెక్టర్లు, తల్లిదండ్రులు, టీచర్లు అందరి దగ్గర ఆమెకు కావల్సింది సాధించుకుంది. ఆమెకు ఇతరులను సమ్మోహన పరిచి తన పనులు చేయించుకోవడం మాత్రమే తెలుసు. అది పనిచేయనపుడు నిస్సహాయంగా మారి ఏడ్చేస్తుంది. ఇప్పుడు తను అంత క్యూట్‌గా లేదు కానీ షుగర్‌కు ఎడిక్ట్ అయిపోయింది. చాలా లావుగా, బద్ధకంగా, స్తబ్దుగా తయారైంది. సమ్మోహన పరచడంలో సహజంగానే విఫలమవుతూ వస్తోంది. ఆమెకు అది మినహా మరేమీ తెలియదు.

అటువంటి పిల్లలు ఎలాంటి పెద్దలుగా ఎదగగలరు? వారు ఎలాంటి సమాజాన్ని నిర్మించగలరు? ఇతరులను మెప్పించేందుకు వారు ఏమేమీ చెయ్యాల్సి ఉంటుంది?

ఇలాంటి ప్రవర్తన కలిగిన వారిని చిన్న పిల్లల తత్వంగా అభివర్ణిస్తుంటారు. ఇది పిల్లలకు వేసే అతి భయంకరమైన ముద్ర. పిల్లలు అంతగా చిన్నపిల్లల తత్వాన్ని కలిగి ఉండరు. ఒక సంవత్సరం వయసు వచ్చేసరికి వారిలో గాంభీర్యం చోటు చేసుకుంటుంది. వారికి నవ్వడం ఇష్టముండొచ్చు, కానీ వారు కూడా గంభీరంగా సూటిగా ఉండగలరు. వారు కుట్రలు చెయ్యలేరు, సమ్మోహన పరచలేరు, చిన్నగా ఉండడం, కొద్దిపాటి నిస్సహాయంగా ఉండడం మినహా వారు ఎదిగిన వారిలానే ఉంటారు. వారికి తెలిసినంత వరకు ఎదిగిన వారిలాగానే ప్రవర్తిస్తారు. తర్వాత నెమ్మదిగా చిన్నపిల్లల తత్వాన్ని నేర్చుకుంటారు. కొంతమంది ఇంట్లో నేర్చుకుంటారు. ఒక తల్లి దీని గురించి మాట్లాడుతూ నాతో చెప్పింది. ఆమె మాత్రమే కాదు అందరు అంటారు పిల్లలు ఇలాంటి అసహజ విషయాలను స్కూల్‌కు వెళ్ళేవరకు నేర్చుకోలేరు అని. అక్కడ ఇతర పిల్లలను చూసి నేర్చుకుంటారు. చాలా కొద్దిమంది పిల్లలు ఇలాంటివన్నీ పెద్దగా నేర్చుకోరు. అలాంటి

పిల్లలను మొండి పిల్లలు అంటుంటారు. వీళ్ల వల్ల సమస్య అని అనుకుంటుంటారు. వీరిలో కూడా చాలా మంది దార్లోపడతారు.

నేను పాఠాలు చెప్పిన వారిలో దాదాపు అందరూ మధ్యతరగతికి చెందిన బాలబాలికలు. వారిలో చాలా మంది చిన్నపిల్లల తత్వంతో ప్రవర్తిస్తూ పెద్దలందరిని ఫూల్స్‌ని చేస్తుంటారు. సమస్యల నుంచి దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. వారికి కావల్సినవి పొందుతుంటారు. వారికి నావల్ల ఏదైనా ఒత్తిడి వచ్చినట్టు అనిపించినపుడు లేదా ఏదైనా పని పూర్తి చెయ్యనపుడు లేదా తమకేమి కావాలో వారికి అర్థం కానపుడు వారు చాలా నెమ్మదిగా ఉంటారు. నేను వారి అలాంటి ప్రవర్తనను ఒప్పుకోవడం లేదని త్వరలోనే అర్థం చేసుకొని నాతో అలా ప్రవర్తించడం దాదాపు తగ్గించారు, ఎప్పుడో ఒకసారి నన్ను ఆటపట్టించడం మినహా. మనం వారి గురించి క్యూట్ అనే భావనలో ఉన్నంత వరకు వారి ఎదుగుదలకు అది అడ్డంకిగా తయారవుతుంది. వారిని మనం మోసగించడం, వారు ఇలాగే ఉండాలని నిర్ణయించడం, ఇక అన్నింటికంటే ముఖ్యంగా వారికి మనలను ఎలా మోసం చెయ్యాలో నేర్పడం, ఒకరికొకరం మోసం చేసుకోవడం, నవ్వులు, మెచ్చుకోళ్లు పొందటం కోసం వారిని వారు బేరానికి పెట్టడం జరుగుతూనే ఉంటుంది. ఇది ఏ విధంగానూ వారితో కలిగి ఉండే సంబంధానికి గానీ వారి వ్యక్తిగత జీవితానికి గానీ అస్సలు మంచిది కాదు.

# 14. ప్రేమ అన్నింటికి పరిష్కారం కాదు

ఆట స్థలాలు, క్యాంపుల వంటి చోట్ల కూడా పిల్లలు తరచుగా కొంత మంది సాటి పిల్లల నుంచి సమస్యలు ఎదుర్కొంటారు. వారు ప్రతిసారి విసిగిస్తూ, ఆటపట్టిస్తూ, పరీక్షిస్తూ, వేధిస్తూ, బాధపెడుతూ ఉంటారు. ద లైవ్స్ ఆఫ్ చిల్డ్రెన్‌లో జార్జ్ డెన్నిసన్ అలాంటి ఒక అబ్బాయి గురించి రాశారు. అతడి పేరు స్టాన్లీ, అతడి వయసు పన్నెండు సంవత్సరాలు, అతడు ఎక్కడికి వెళ్లినా సమస్యలు సృష్టించేవాడు, స్కూల్ అధికారులు విసిగిపోతారు. స్టాన్లీకి కనుక ఇకమీదట కూడా బుద్ధి రాకపోతే అతడిని ఏదో ఒక జైలుకు పంపడం మినహా చేసేదేమి లేదు అనే నిర్ణయానికి వస్తారు. ఇతర పిల్లలంతా కూడా అతడిని లోపలికి రానివ్వ కూడదని పెద్దవారిని వేడుకున్నారు. కానీ అతడిని లోపలికి అనుమతించారు అక్కడ ఇతర పిల్లలతో కలిసి నేర్చుకుంటాడని. కానీ పిల్లలు చెప్పిందే నిజమైంది. అతడికి కావల్సిన సాయం అక్కడ దొరకలేదు. ఇక చివరకి అతడిని వెళ్లిపొమ్మని చెప్పారు. అతడు ఆ ప్రదేశాన్ని దాదాపుగా నాశనం చేసేశాడు.

టుడే ఈజ్ ఫర్ చిల్డ్రెన్, నంబర్స్ కెన్ వెయిట్ అనే పుస్తకంలో హెర్బ్ స్నిట్జర్ చెప్పారు, ఇలాంటి సమస్యలను సృష్టించే పిల్లలు ఆయనకు లూయిస్ వాథమ్స్ స్కూల్లో నలుగురు దొరికారని. వారు స్టీవ్, డోనాల్డ్, టిమ్, జాన్సన్. వారిలో స్టీవ్ ఎవరూ ప్రేమించని, ఎవరకీ అక్కర్లేని ఒక లావుగా ఉండే పిల్లాడు, ఎప్పుడు ఇతరులను గేలి చేస్తూ ఆటపట్టిస్తూ ఉండేవాడు. డోనాల్డ్ ఆత్రుత కలిగిన తల్లిదండ్రుల పిల్లవాడు. చాలా చురుకుగా, చిన్నగా ఉంటాడు. అతడికి ప్రతిక్షణం ప్రేమ కావాలి, అన్నింటికీ అనుమతి కావాలి. అతడు చెప్పింది జరగాలి. దానికోసం ఇతరులతో చాలా దర్పంగా, అధికారయుక్తంగా ప్రవర్తించేవాడు, టిమ్ ఎంత మాత్రం ఆకర్షణీయంగా లేని ఇబ్బందికరమైన పిల్లవాడు, ..."చాలా ఆచరణాత్మక ధోరణి కలిగిన తల్లి, ముగ్గురు అక్కలు. తండ్రి దాదాపుగా ఎప్పు

డూ ఇంట్లో ఉండేవాడు కాదు, ఒకవేళ ఉన్నప్పటికీ పరధ్యానంగా ఏదో ఊహలో ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఆయన చాలా విజయాలు సాధించిన సైంటిస్ట్." ఇక జాన్సన్ ఆరుగురు ఉన్న ఒక టెర్రరిస్ట్ గ్యాంగ్ లీడర్. జాన్సన్ సమస్యేమిటనేది ఎవరికి తెలియదు. కానీ ప్రతి సారి ఇతర పిల్లల జీవితాలను దుర్భరం చేసేవాడు. ఇక్కడ అతడి గురించి పిల్లలు మాట్లాడుకుంటుండగానే మరొకరు అక్కడ అతడి వేధింపులకు గురయ్యేవారు.

నాకు తెలిసి వేధించడం అంటే ఎదుటి వారిని బలిపశువు చెయ్యడం. ఎవరైనా ఇలా ఎందుకు మారతారు?

ఇలా ఎదుటి వారిని బలిపశువులుగా మార్చే పిల్లలు మరెక్కడో తాము బలిపశువులుగా మారిన వారే అయిఉంటారు. ఇక్కడ కూడా తాము బలిపశువు కాకూడదని ఇలా ప్రవర్తిస్తుంటారు. వారి పట్ల ఎవరూ శ్రద్ధ తీసుకోరని ప్రేమగా వ్యవహరించరని అనుకుంటూ ఉంటారు. ప్రతిసారీ ఎవరో ఒకరిని కొడుతూ వేధిస్తూ ఉండే వారిని ఎవరైనా ఎలా ప్రేమిస్తారు.

ఎవరినైనా కొడుతున్నపుడు అందరు చుట్టు నిలబడి నవ్వుతూ ఉండడం, ఎవరినైనా ఏడిపించడం జరుగుతున్నపుడు అతడి పక్షం తీసుకొని అతడితో కలిస్తే మరోసారి మనవంతు రాకుండా ఉంటుందని భావిస్తారు.

నేను అలా నవ్వుతూ వస్తున్న ఒక పిల్లవాడిని చూశాను. నవ్వుతున్నాడు చాలా అన్యాయంగా. నాకైతే అది చాలా బాధగా అనిపించింది. అలా వేధింపులకు గురైన పిల్లవాడికి ఎంతో బాధ కదా అనిపించింది. మిగతా వాళ్లంతా కూడా అతడి బారి నుంచి తమను తాము కాపాడుకోడానికి అతడిని ఇష్టపడినట్టు నటిస్తారు. లేదా ఎక్కడో దాక్కుంటారు ఎవరి కంట పడకుండా.

ఏమైనా అలాంటి పిల్లలు కూడా ఈ సమాజంలో భాగమే కదా. నాకైతే వాళ్లు అసలు నచ్చరు. అయితే ఇప్పుడు మనం చెయ్యాల్సింది ఏమిటంటే వారి పట్ల మనందరి శ్రద్ధ ఉందని చెప్పడం అంటే మనపట్ల మనకు కూడా శ్రద్ధ ఉందని అర్థం. మనం వారిపట్ల కూడా శ్రద్ధ వహించాలి.

ఇలా వారిని అర్థం చేసుకోవడం, క్షమించడం వంటి ప్రవర్తన ద్వారా మనం తప్పు చేస్తున్న పిల్లలను పెద్దవారిలాగే సరిదిద్ద వచ్చు. మరో వైపు జాన్సన్‌ను బహిష్కరించడానికి పిల్లలంతా ఓటు వేశారు. ఇలాంటి సందర్భంలో జాన్సన్ ఆలోచనలు తన తోటి విద్యార్థుల పట్ల ఎలా ఉంటాయి? అతడేమి చెప్పాడంటే హెర్బ్ స్నిట్జర్‌ను సాధ్యమైనంత గట్టిగా కొట్టదలచుకున్నాడు. అలా చేసి అతడిని బాధ పెట్టాలని అనుకున్నాడు, అలా చెయ్యనిస్తే అతడు వేధించడం మానేసి ఉండేవాడేమో.

కొన్ని సంవత్సరాల క్రితం నా స్నేహితుల్లో ఒకరు క్లాడ్ క్రొఫర్డ్, ఆయన మిషిగాన్ లోని డగ్లస్‌లో ఒక పబ్లిక్ ఎలిమెంటరీ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అతడి స్కూల్‌లో పూర్తి సంప్రదాయబద్ధమైన ఓపెన్ క్లాసెస్ ఉండేవి.

ఆయన నాకు తన స్కూల్‌లో ఫిఫ్త్ గ్రేడ్‌లో ఉన్న ఒక పిల్లవాడి గురించి చెప్పాడు. సదరు అబ్బాయి కొంచెం పేద కుటుంబం నుంచి వచ్చాడు. అతడు, అతడి కుటుంబం ఈ మధ్య కాలంలోనే మిషిగాన్ నుంచి ఆప్లేషియాకు వచ్చారు. అంతేకాదు అతడు అంత విజయవంతమైన విద్యార్థి కూడా కాదు అప్పటి వరకు. అతడు ఒకటి రెండు తరగతుల్లో తప్పడం కూడా జరిగింది. అందువల్ల క్లాస్‌లో అందరికంటే వయసులో పెద్దవాడు మాత్రమే కాదు పెద్దగా కనిపించేవాడు కూడా. అతడు తరగతిలో చేరిన వెంటనే అతడు సమస్యలు సృష్టించడం, వేధింపులు మొదలుపెట్టాడు. మిగతా పిల్లలెవరు అతడిని ఇష్టపడేవారు కాదు, భయపడే వారు. కొంత కాలం పాటు టీచర్ తాను చెయ్యగలిగేదంతా చేసింది. తర్వాత ఇతడిని ప్రిన్సిపాల్ దగ్గరకు పంపడం ప్రారంభించింది. క్రొఫర్డ్ అతడితో చాలాసార్లు మాట్లాడిన తర్వాత ఒకరోజు అతడిని ఒప్పించగలిగాడు. ఇతర పిల్లలు అతడిని ఇష్టపడకపోవడానికి కారణం అతడు పేదవాడు కావడం వల్ల లేదా అతడు మాట్లాడుతున్న విధానం భిన్నంగా ఉండడం వల్ల కాదు. వారు అతడిని అర్థం చేసుకోకపోవడం వల్ల అని. మరింత స్నేహంగా ఉండడం వల్ల వారు కూడా నీతో స్నేహంగా ఉండడానికి ఇష్టపడతారు అని చెప్పాడు. అందుకు అతడు ప్రయత్నించి చూస్తాను అన్నాడు. కొంతకాలానికి పరిస్థితులు కాస్త మెరుగు పడ్డాయి. ఇక ప్రిన్సిపాల్ ఆఫీసు చుట్టు ప్రదక్షిణలు తగ్గాయి. టీచర్ కూడా ఇతర పిల్లలతో అతడెంత స్నేహంగా ఉంటున్నాడో ఆయనకు వివరించసాగింది. ఇక తర్వాత మరో నెల రోజుల తర్వాత అతడు తిరిగి మునుపటి విధంగానే ప్రవర్తించడం ప్రారంభించాడు. మళ్లీ ఆఫీస్‌కు రావాల్సి వస్తోంది అతడు. క్రోఫర్డ్ అన్నాడు "నువ్వు ఇతర పిల్లలతో స్నేహంగా ఉండడం ప్రారంభించావనుకున్నాను. అందరు నీతో స్నేహంగానే ఉంటున్నారు కదా, నువ్వు కూడా వారితో స్నేహం చేస్తున్నావు కదా, ఇక నువ్వు ఇప్పుడు

అందరితో మునుపటిలానే ప్రవర్తించి అందరికి శత్రువుగానే ఉండాలని అనుకుంటున్నావట, అది నిజమేనా?” అని. అతడు అప్పుడు అవునని అన్నాడు. క్రోఫర్డ్ ఎందుకలా అని అడిగాడు, అప్పుడు ఆ పిల్లవాడు కొంచెం సమయం పాటు  ఆలోచించి “నాకు ఇదే శ్రేయస్కరంగా ఉంది” అని సమాధానం చెప్పాడు.

ఈ కథలో నాకు తెలిసింది చాలా తక్కువ. లేదా క్రొఫర్డ్‌కు తెలిసింది చాలా తక్కువ. ఇతర పిల్లలతో స్నేహం చెయ్యడంలో అతడికి అధిగమించలేని అడ్డంకులేవో ఎదురై ఉంటాయి. బహుశ వాటిని అతడు దాటలేకపోయి ఉంటాడు. ఇకవాటిని ఎప్పటికీ దాటలేనని అనుకొని ఉంటాడు. బహుశ ఇతర పిల్లల గురించి పూర్తిగా తెలుసుకొని ఉంటాడు. వారితో పోల్చుకున్నపుడు ఎన్ని రకాలుగా తాను భిన్నంగా ఉన్నాడో గుర్తించి ఉంటాడు. మనందరి మాదిరిగానే అతడికి కూడా భిన్నంగా ఉండడం నచ్చడం లేదేమో. అతడికి తన పేదరికం చాలా నామోషీగా అనిపించి ఉండొచ్చు. ఇతర పిల్లల తల్లిదండ్రులు వారితో వయసులో పెద్దవాడైన ఈ పేద పిల్లవాడు ఆడుకోవడానికి మంచి సహచరుడు కాదని చెప్పి ఉండొచ్చు. పేదరికం ఇచ్చిన జ్ఞానం మాత్రమే కాకుండా తాను వయసులో పెద్దవాడవడం వల్ల మిగతా పిల్లలకు ఇతడికి మధ్య ఏర్పడిన అఘాతం మరింత పెద్దదైంది తప్ప చిన్నదై ఉండదు. అతడు మరింత ఆత్మవిశ్వాసంతో, ఓపికతో ప్రవర్తించినపుడు పరిస్థితులు కాస్త మెరుగైన మాట వాస్తవమే అయివుండొచ్చు. ఈ పిల్లవాడు పదేపదే అపజయం పాలవడం వల్ల కొంత విసిగిపోయి ఉండొచ్చు, ఇది చాలా మంది స్కూల్ వయసు దాటిన పెద్ద వారికి కూడా జరుగుతుంది. వారికి నిర్ధేశించబడిన గమ్యం చేరుకోవడంలో విజయం సాధించలేని వారు తమకు ఎలాంటి అవమానం ఎదురవుతుందో అని లేదా లోపల  పేరుకుపోయిన అసంతృప్తిని అధిగమించడానికి లేదా ఇతరులు తమను చులకన చేయడం నుంచి తప్పించుకోవడానికి, ఇలాంటి అన్ని పరిస్థితుల నుంచి తమను తాము కాపాడుకోవడానికి ఇలా ప్రవర్తించే అవకాశం ఉంది. చాలా సంవత్సరాలుగా అతడు అలా వేధిస్తూనే వస్తున్నాడు, అతడికి తెలిసింది అదే ఇతరులను వేధించడం, భయపెట్టడం, వీలైనంత మంది శత్రువులను తయారు చేసుకోవడం, ఇది వరకు ఎప్పుడు కూడా ఆచరించని స్నేహం చెయ్యడం, అందరు తనను ఇష్టపడేలా ప్రవర్తించడం వంటివన్నీ అతడెప్పుడు చేయలేదు, అలాచేయడం బావుంటుందని అతడు నమ్మడానికి కారణం లేదు అతడి దగ్గర.

సమ్మర్‌హిల్‌లో 1965లో ఒక వసంత కాలంలో సాధారణ స్కూల్ మీటింగ్ జరుగుతోంది. ఒక ఎనిమిది సంవత్సరాల పిల్లాడు మరో పదకొండు సంవత్సరాల పిల్లవాడి మీద వేధింపుల ఆరోపణ వచ్చింది. ఆ పెద్ద అబ్బాయి ఈ చిన్నపిల్లాడిని ఎప్పు డూ వేధిస్తున్నాడని చెబుతున్నారు, అతడినే అనుసరిస్తూ, వెనక తిరుగుతు హేళన చేస్తున్నాడని, అవమానిస్తున్నాడని, తోసేస్తున్నాడని, అతడు ఆరోపిస్తున్నాడు. ఇక పెద్ద పిల్లవాడు మీటింగ్‌లో మిగతా అందరికి కాస్త దూరంగా గోడదగ్గర నిలబడి ఉన్నాడు. ఛైర్మన్ అడిగాడు ఆ చిన్న పిల్లవాడు చెప్పింది నిజమేనా అని. ఆ పెద్ద పిల్లవాడు దాన్ని తిరస్కరించలేదు. అప్పుడు ఛైర్మన్ అడిగాడు, "నువ్వు చిన్న పిల్లవాడితో అలా ప్రవర్తించడం తప్పే కదా? ఇది వరకు కూడా ఒక సారి నీమీద ఆరోపణలు వచ్చాయి" అన్నాడు. అందరు అలాగే అడిగారు అలా ఎందుకు చేస్తున్నావని, ఆ పెద్ద పిల్లవాడు చిన్నపిల్లవాడి గురించి కొద్ది పాటి ఆరోపణలేవో చేశాడు. కొద్దిపాటి వాదన తర్వాత "నువ్వు అతడికి దూరంగా ఉండు, అతడు నీ దగ్గరకు రాడు, నువ్వు కూడా అతడి దగ్గరకు వెళ్ళొద్దు, నీకు అతడు నచ్చకపోతే దూరంగా ఉండు" అని చెప్పారు. ఇప్పటికే చాలాసార్లు ఈ అంశం తెర మీదికి వచ్చిందని అంటున్నారు. అతడు అలా వేధించకుండా ఉండాలంటే మరో మార్గమేదన్నా ఆలోచించాలి. రకరకాల శిక్షల గురించి ప్రస్తావన వచ్చింది. కానీ అవన్నీ కూడా తిరస్కరించబడ్డాయి ఎందుకంటే శిక్షించడం వల్ల మంచి కంటే చెడే ఎక్కువగా జరిగే అవకాశం ఉంది కాబట్టి. పెద్ద పిల్లవాడు మళ్ళీ అలాగే వేధింపులకు గురిచేస్తే అప్పటికప్పుడు స్కూల్ జనరల్ మీటింగ్‌కు దరఖాస్తు చేసుకొని వారి దృష్టికి తీసుకురావాలని చిన్నపిల్లవాడితో చెప్పారు. ఇలా వేధింపులు ఆగినట్టు నేను ఎక్కడా వినలేదు. ఆ సమయంలో స్కూల్ ఒక సమస్య పరిష్కారానికి ఒక తెలివైన పద్ధతిని అనుసరించింది అంతే. అయితే ఇక్కడ వేధింపులకు పాల్పడిన పిల్లవాడు అక్కడున్న అందరి చూపును తనవైపు తిప్పుకోగలిగాడు, అది అతడు తెలిసి చేశాడా లేక తెలియక చేసాడా అనేది తర్వాత విషయం, అతడికి శిక్ష పడలేదు కానీ అతడికి కావల్సింది అతడికి దొరికింది. తను ఏం ఆశించి వేధింపులకు పాల్పడ్డాడో అది అతడికి దొరికింది. అది తనపై శ్రద్ధ. అవును అందరి దృష్టిలో తాను ఉండాలి. అది అతడికి దొరికింది.

ఇలాంటి పిల్లలు; ఈ స్టాన్లీ, స్టీవ్, ఈ జాన్సన్ వీరందరూ కూడా తమకు తాము ఒక మాట చెప్పుకుంటారు – నేను మంచివాడిని కాదు; నేను ఎవరికి నచ్చను; నేను స్నేహం చెయ్యడానికి ప్రయత్నిస్తే నన్ను అందరు తిరస్కరిస్తారు; నన్నో తెలివి తక్కువ వాడిగా చూస్తారు; కాబట్టి నేను అలాంటి ప్రయత్నమే చెయ్యను; ఇక నేను అప్పటి నుంచి అసంతృప్తి, అపజయంతో బాధపడుతూ బతకాల్సి ఉంటుంది, నేను వారికి నన్ను తిరస్కరించే సంతృప్తి అసలు మిగలనివ్వను; నా దృష్టిలో వారి స్నేహానికి ఎలాంటి విలువా లేదని

తెలియజేయాలి; నేను ఎంతచేసినా కూడా వీరంతా కచ్చితంగా ఎప్పుడో ఒకప్పుడు నాకు వ్యతిరేకంగా మారే వారే; అందుకే నేనే ముందుగా వారితో ఆడుకుంటాను; ఎంత కఠినంగా ఉండడానికి వీలైతే అంత కఠినంగా వారితో ఉంటాను; ఇలా పదేపదే ఎదురైన అపజయాల నుంచి తనను తాను కాపాడుకోవడానికి ఒక రక్షణ విధానాన్ని రూపొందించుకుంటారు. ఇలా వాళ్ల మీద వాళ్లకు ఏర్పడిన ద్వేషం ఇలాగే ఆలోచించేలా చేస్తుంది. ఇలా నాతో నేను పంచుకోవడమే నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని వారు భావిస్తారు. ఇలా చెడ్డ పిల్లల గురించిన చర్చ స్కూల్ మీటింగులలో పదే పదే జరగడం వల్ల వారు అన్యాపదేశంగా ఆశిస్తున్న శ్రద్ధ, అందరి దృష్టి తమ మీదకి మరల్చుకోవడం వంటివన్నీ సాధ్యపడతాయి. నాతో ప్రేమగా ఉండండి, నాతో స్నేహంగా ఉండండి అంటూ అతడు అందరిని ప్రాధేయపడడానికి బదులుగా అందరు "మేము నీకు ఎలా సాయం చేయగలం? మేము నీ గురించి చాలా శ్రద్ధ తీసుకుంటున్నామని నిన్నెలా నమ్మించాలి?" అని అతడినే ప్రాధేయపడుతున్నారు. అతడు అడిగితే తిరస్కరించే అవకాశం ఉన్నవారే అతడి అనుమతిని అడుగుతున్నారు, అతడు తిరస్కరించగలిగే, గర్వం ప్రదర్శించగలిగే పరిస్థితులలో గర్వపడే ఒక రాజకుమారుడి స్థానంలో ఉన్నాడు. ప్రేమిస్తున్నానని వెంటబడితే కాదన్న వారే ఇప్పుడు వచ్చి తమను ప్రేమించమని వేడుకుంటుండగా, ఇతడు గర్వంగా "లేదు, పో! నీకు ఒక సారి అవకాశం ఇచ్చాను, అది నువ్వు చేజార్చుకున్నావు" అని తనే తిరస్కరిస్తున్నట్టు పగటికల కంటూ ఆనందించే వారిలా ఉంటారు వీళ్లు. స్కూల్ మీటింగులలో జరిగేది ఇదే ప్రతిసారీ వీళ్లు సమస్యలు సృష్టిస్తారు, ప్రతిసారీ వీరికి మరోసారి అలాగే ప్రవర్తించే అవకాశం కూడా దొరుకుతుంది. వారిచేతిలో ఉన్న శక్తి అలాంటిది మరి.

సమ్మర్‌హిల్స్, లూయిస్ వాడమ్స్, ఫస్ట్ స్ట్రీట్ స్కూల్ వంటి సంప్రదాయవాద స్కూళ్లు ఈ విషయంలో అపజయం పాలవుతూనే ఉంటాయి. ఎందుకంటే ఇక్కడ నేర్పేది ఏమిటంటే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడమే. మంచి మార్కులు తెచ్చుకోని వారు ఓటమి పాలైనట్టే. కానీ స్కూల్‌లో నేర్పాల్సింది అందరు సంతోషంగా ఉండడానికి ఎలా సాయపడాలి; ఇతరులను ప్రేమించడం, ఇతరుల ప్రేమ సంపాదించడం ఎవరు సమర్థవంతంగా చేస్తే వారు విజయం సాధించినట్టు. ఇక ఇక్కడ ఓటమి కూడా అంత బాధ పెట్టదు, ఎందుకంటే స్కూల్ ఉద్దేశం ప్రేమించడం, సంతోషపరచడం, అందరూ ఒకరికొకరు సాయంగా ఉండడమే. ఇక ఇక్కడ విజయం సాధించకపోవడానికి కారణం కేవలం వారికి వారు మాత్రమే, మరెవ్వరూ కారేరు కూడా.

ఇలా టిమ్, జాన్సన్, డోనాల్డ్, స్టీవ్ వంటి పిల్లలు తయారు కాకుండా ఉండాలంటే వారికి వారు ప్రేమపూర్వకంగా కనిపించాలి. కనీసం వారు ప్రేమపూర్వక వ్యక్తులు అవునా కాదా అనే విషయాన్ని వారు కాసేపు మరచిపోయే పరిస్థితి మనం కల్పించగలగాలి.

కొలారాడో రాకీ మౌంటెయిన్ స్కూల్లో మొదటి గ్రాడ్యుయేటింగ్ క్లాస్‌లో డీన్ పాల్ రాబర్ట్స్ ఇచ్చిన ఉపన్యాసం నేను విన్న లేదా చదివిన అన్ని ఉపన్యాసాల్లోకి చాలా ఉత్తమమైందని చెప్పవచ్చు. ఆ క్లాసులో ఉన్న పిల్లల్లో సంతోషంగా లేని విద్యార్థులు కూడా ఉన్నారు. కొంత మంది వారి పట్ల వారికి అసహ్యం ఉన్న వారు కూడా అందులోనే కలిసి ఉన్నారు. ఆయన వారందరిని ఉద్దేశించి మాట్లాడుతూ – 1)మిమ్మల్ని మీరు ఉన్నదున్నట్టుగా అంగీకరించండి 2) మీ గురించి మీరు మరచిపోండి 3) ఏదైనా మీకు అత్యంత ఇష్టమైనది – మీ కంటే కూడా – ఏదైనా ఉంటే అలాంటి దాని గురించి ఆలోచించండి. ఈ సంప్రదాయబద్ధమైన మాటలు అక్కడున్న కొంతమంది ఆవులిస్తూ వింటున్నారు. వారిని వారు అంగీకరించమని తర్వాత మరచిపోమ్మని చెప్పడం ద్వారా డీన్ రాబర్ట్స్ చెబుతున్నదేమిటంటే అప్పటికే మనసులో ఏర్పరుచుకున్న 'మనం ఇతరులకు ఎలా కనిపిస్తున్నాము, మనం ఎంత చెడ్డగా కనిపిస్తున్నాము' అనే దాని గురించే ఎక్కువగా ఆలోచిస్తారు, ఇలాంటి వాటిని వదిలేయమని అన్యాపదేశంగా చెబుతున్నారు. అయితే అతడు అసలు ఎంత మాత్రం అందంగా కనిపించని వారిలో ఒకడు. అతడి ముఖం గాయాల వల్ల లేదా ఏదైనా జబ్బు చేయడం వల్ల అయితేనేమి పూర్తిగా రూపు మారిపోయింది. ఇలా పూర్తిగా వికృతంగా తయారైన తన రూపాన్ని అతడు అంగీకరించడం మాత్రమే కాదు తర్వాత దాని గురించి పూర్తిగా మరచిపోయాడు. అతడితో మాట్లాడడం ప్రారంభించిన తర్వాత కొద్ది సమయంలోనే మనం అతడి వికృత రూపాన్ని పట్టించుకోవడం మానేసి అతడిలోని స్నేహగుణం, దయాగుణం కలిగిన వ్యక్తిని గుర్తిస్తాము. అతడు మాట్లాడుతూ అతడి గురించిన ఒక జోక్ చెప్పాడు. దాన్ని ఎంత బాగా చెప్పాడంటే ఏమాత్రం అతడు సానుభూతిని ఆశిస్తున్నట్టు కనిపించలేదు. అంతేకాదు మనం కూడా మనస్ఫూర్తిగా అతడితో పాటు నవ్వుతాము అంతే. పాల్ రాబర్ట్స్‌కు రెండు ముఖాలున్నాయి. కానీ ఆయన వాటిలో ఒకదాన్ని ఎప్పుడూ ధరించే ప్రయత్నమే చెయ్యడు అని అందరు అంటుంటారు అని అతడు చాలా హాస్యాస్పదంగా ఈ విషయాన్ని చెప్పాడు. అతడు పీడకల మాదిరిగా చాలా వికృతంగా ఉన్నప్పటికీ తనను తాను అసలు ఎంత మాత్రం అసహ్యించుకోవడం కానీ, బాధపడడం కానీ లేదు. తమ పట్ల తమకు అసహ్యం, నిరసన కలిగిన విద్యార్థులు ఆయనను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

ఎవరిని వారు అంగీకరించి ఆ తర్వాత మరచిపోవడం అనే సూత్రాన్ని అమలు చేయడానికి ప్రయత్నించి చూసినా కూడా అది అంత సులభమేమీ కాదు, అతడి మాటల్లోని అర్థం చాలా గొప్పది- ఏం చెయ్యాలో తెలుసుకోవాలి, అందులో మిమ్మల్ని మీరు లీనం చేసుకోవాలి, మీకు అది మీకంటే కూడా ముఖ్యమైందిగా మారాలి. నేను నా ఇరవైలలో అడుగుపెట్టినపుడు నేను ఎవరికి పెద్దగా నచ్చనని నన్నెవరు ప్రేమించరని, అసలు అలాంటి అర్హతలేవీ నాలో లేవని అనుకునే వాడిని. నాలో నాకు చాలా వరకు నచ్చని విషయాలే ఉండేవి. నా చుట్టు ఉన్నవాళ్లు నువ్వు ఫర్లేదు అని పదేపదే చెప్పడం, నాతో ప్రేమగా నడుచుకోవడంతో కొద్దిగా ఆ భావం నుంచి బయటపడగలిగాను, అంతేకాదు నా అదృష్టమేమిటంటే నేను చేపట్టిన పనులు నా శక్తిని, నా తెలివితేటలను నా పూర్తి శ్రద్ధను పెట్టి చెయ్యాల్సి వచ్చినందు వల్ల నేను దృష్టిని నా మీద నుంచి పని మీదకు మరల్చాల్సి వచ్చింది. నేను మొదట చేరిన ఉద్యోగం రెండో ప్రపంచయుద్ధంలో పాలుపంచుకున్న సబ్ మెరైన్ యూఎస్ఎస్ బార్బెరో (ఎస్ఎస్317)లో ఆఫీసర్‌గా. తర్వాత యుద్ధం ముగిసిన ఆరు సంవత్సరాల తర్వాత ప్రపంచ ఫెడరల్ గవర్నమెంటు కోసం జరిగిన ఉద్యమంలో పనిచేశాను. ఈ రెండు ఉద్యోగాల్లో రెండో ఉద్యోగం మరింత ఏకాగ్రతతో చెయ్యాల్సి వచ్చింది. చాలా మందితో కలిసి పనిచేయడం వల్ల మనకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు వస్తుంది. కాబట్టి మనకు తెలియకుండానే మన పూర్తి శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు ఉపయోగిస్తాము. అందువల్ల నన్ను నేను మరచి పోయాను, కనీసం మరచిపోయే అవకాశం దొరికింది. ఒక ఆరు సంవత్సరాల పాటు నేను ప్రయాణాలు చేస్తూ చాలా మందిని కలుసుకున్నాను. వారితో కొంత సమయం గడిపాను, ప్రపంచ ప్రభుత్వం గురించి మాట్లాడాను, రాశాను, ప్రపంచ ప్రభుత్వం అంటే ఏమిటో వివరించాను, దాన్ని సాధించడానికి ఏం చెయ్యాలో సూచించాను. వేం వెళ్లిన చోట స్థానికులతో మాట్లాడాలనుకున్నపుడు వారంతా డబ్బు సంపాదించడంలో ఉరుకులు పరుగుల్లో ఉండేవారు. ఎక్కువ మందిని పోగుచేయడం, మంచి మీటింగు ఏర్పాటు చెయ్యడం, ఎక్కువ ప్రచారం చెయ్యడం, ఎక్కువ మందికి మా ప్రచారాన్ని చేర్చడం వంటి పనుల్లో చాలా తీరిక లేకుండా ఉండేవాడిని. మాకు తెలియకుండానే మా సమూహంలో అందరం ఒకరికొకరం మంచి స్నేహితులుగా మారిపోయాము. వారంతా నిజంగానే నన్ను ఇష్టపడడం మొదలుపెట్టారు. డీన్ రాబర్ట్స్ చెప్పిన మాటవిన్న తర్వాత అనిపించింది నాకు తెలియ కుండానే నేను దాన్ని పాటించాను అని. నేను నా సమస్య నుంచి బయటపడాలన్న ఉద్దేశ్యంతో నేను రెండో ప్రపంచ యుద్ధంలోనూ, ప్రపంచ ప్రభుత్వం ఉద్యమం లోనూ పనిచెయ్యలేదు. ఆ పనులు పనికి వచ్చేవనే ఉద్దేశ్యంతోనే చేశాను.

ఆనందంగా లేని పిల్లల సమస్యలో ఇదొక భాగం. పిల్లలు సమాజానికి పనికివచ్చే ఏదైనా ఒక పనిలో వారిని తీరికలేకుండా ఉంచితే వారి పూర్తి శక్తిసామర్థ్యాలు ఏకాగ్రత అందులో ఉండడం వల్ల వారికి వారి గురించి ఆలోచించేంత సమయం దొరకదు. పనులు చేసుకునే వారు చాలా మంది ఎలాంటి మార్పు లేకుండా జీవితం విసుగ్గా ఉన్నట్టు కనిపిస్తారు. మేము ప్రపంచ ప్రభుత్వం కోసం పనిచేస్తున్న రోజులు చాలా ఉత్సాహవంతంగా ఉండేవి. మేము సరిగ్గా పని చేసినట్టయితే ఒకరోజు మేము ఆశిస్తున్న ప్రపంచ ప్రభుత్వాన్ని సాధించే అవకాశం ఉంటుందనే ఆశ కలిగేది.

విధ్వంసకర ఆలోచనలున్న వారికి సంతోషం లేని తమ బాల్యాలను పునర్జీవించడం కాదు కావల్సింది, వాటి నుంచి బయటపడి పూర్తిగా కొత్తదైన మరో తరహా జీవితం జీవించడం. బహుశ మనలాగే వారికీ ఒక్కోసారి ఒక అతి చిన్నదైన సురక్షితమైన ప్రపంచం కూడా అవసరమవుతుంది. అందులో వారు దాక్కొని, విశ్రాంతి తీసుకొని, తిరిగి శక్తి కూడ గట్టుకునేందుకు వీలవుతుంది. అయితే ఈ  ఆశ్రయం, ఈ చిన్న సంరక్షిత ప్రపంచం ఎప్పుడో ఒకసారి గడిపేందుకు మాత్రమే. సంతోషం కొరవడిన చిన్నవారు లేదా పెద్దవారు ఎవరైనా సరే ఎక్కువ సమయం గడిపేందుకు మాత్రం విశాలమైన ప్రపంచం అందుబాటులో ఉండాల్సిందే. వారికి తమను తాము  మరిచిపోగలిగే పని ఏదైనా దానిలో దొరికే అవకాశం ఉంటుంది.

నాకు తెలిసిన ఒక పిల్లాడు ఒక చిన్న స్కూల్‌కు వెళ్ళేవాడు. అది లూయిస్ వాడామ్స్ లేదా సమ్మర్‌హిల్స్ లాంటి పెద్దదేమి కాదు కానీ ఫర్వాలేదు బానే ఉండేది. అతడికి పది పన్నెండు ఏళ్లు వచ్చేసరికి అక్కడ అతడికి సంతోషంగా లేదు. అక్కడున్న పెద్దవారంతా చుట్టు చేరి ఏమైంది ఏం కావాలి, ఏం జరిగింది, మేము నీకు ఏదైనా సాయం చెయ్యగలమా అని అడిగేవారు. ఇవేవి అతడికి సంతోషంగా అనిపించేవి కాదు. అంతేకాదు అతడికి వీలైనంత త్వరగా ఎవరి పనులు వారు చేసుకునే ఏదైనా కొత్త ప్రదేశం కనిపెట్టి అక్కడికి వెళ్లి బతకాలని అనిపించేది. అతడు సంతోషంగా లేడనే విషయాన్ని ఎవరు పట్టించుకోకుండా ఉన్నా అతడికి బావుండేది. కానీ అలా జరగలేదు.

చాలామంది సంతోషంగా లేని పిల్లలు, సహాయం అవసరమున్న వారందరి గురించి పీటర్‌మాన్ ఇలా అన్నాడు: వారు "ప్రాణమున్న, పనికివచ్చే, అవసరమున్న వారు." లిన్ కాన్వర్స్ ఒక సాహస కార్యక్రమం చేపట్టింది. ఆమె ఒక ప్లేగ్రౌండ్ నిర్మాణం చెయ్యాలని అనుకుంది చార్లెస్‌టౌన్‌లో (ఇది బోస్టన్‌లో ఒక ప్రాంతం). ఆమె కొంతమంది పిల్లలను సమస్యలు సృష్టించేవారిని, సంతోషంగా లేని పిల్లలను ఈ ప్రాజెక్టులో భాగం చేసింది.

వారిలో ఇద్దరు చాలా బాగా ఉన్న, జీవం నిండిన, చాలా తెలివైన ఎనిమిది తొమ్మిది సంవత్సరాల పిల్లలు. వారు చాలా సహాయకరంగా చాలా సహకారంగా ఉత్సాహంగా సంతోషంగా పనుల్లో భాగం పంచుకున్నారు. అది నిజంగానే కష్టమైన పని. ఇది వారిని వారి సమస్యల నుంచి దూరంగా ఉంచడానికి తయారు చేసిన ప్రాజెక్ట్, ఆమె దీనిని ఎలాంటి సహాయం లేకుండా పూర్తిచెయ్యగలిగేది కూడా కాదు, ఆమెకు ఏదైనా బరువైన లేదా కష్టమైన పనిచెయ్యాల్సిన అవసరం వచ్చినపుడు ఈ పిల్లలు ఆమెకు సాయం చేసేవారు, చాలా తెలివిగా, అలుపు లేకుండా ఆపకుండా పని పూర్తి చేసేవారు. తర్వాత కొద్ది సమయం విశ్రాంతి తీసుకొని తర్వాత తిరిగి సమస్యలు సృష్టించడం మొదలుపెట్టేవారు.

ఒక కొత్త ప్రదేశంలో కొత్త పని. పరిస్థితులు సరిగా లేనపుడు అదేకదా మనమంతా కోరుకునేది. చిన్న పిల్లలు ఏదైనా చెయ్యాలని అనుకున్నపుడు అది సరిగా లేనపుడు “ఆగండి” అని చెబుతాము. ఎవరు ఆ మాట చెప్పేది? అది ఆ సమయంలోనే చెయ్యాలని వారు అనుకుంటారు, వెనక్కి తిరిగి మరొక్క అవకాశం కావాలని అంటారు. అలాంటి సందర్భాలు నా జీవితంలో గుర్తుచేసుకున్నపుడు ప్రతిసారీ నాకు మరో అవకాశం దొరికింది. నాకు పెద్దగా నచ్చని నా కాలేజి అయిపోయిన వెంటనే నేను కీ వెస్ట్‌లో ఉన్న సబ్ మెరైన్ స్కూల్‌లో మూడునెలల పాటు శిక్షణ తీసుకున్నాను. అ తర్వాత నేను న్యూ లండన్ వెళ్ళాను. తర్వాత కనెక్టికట్‌లోని సబ్‌మెరైన్ ఆఫీసర్స్ స్కూల్‌లో రిపోర్ట్ చెయ్యడానికి వెళ్లాను. అక్కడ చాలా బావుండేది చల్లగా. మేము కొండమీద ఉన్న బ్యాచిలర్ ఆఫీసర్స్ క్వార్టర్స్ వరకు నడిచి వెళ్లాల్సి ఉండేది. నాకు సాహసోపేతంగా అనిపించేది అక్కడ. కొత్త జీవితం ముందుందన్న నమ్మకం కలిగేది. అంతే కాదు ఇక అప్పటి నుంచి ప్రతి పరిస్థితి నా అదుపులో ఉంటుందని కూడా అనిపించేది. నాకు ఇక్కడ రెండో అవకాశం దొరికినట్టు అనిపించడానికి కారణం ఇక్కడ నాకు తెలిసిన వారు ఎవరు లేకపోవడం వల్ల నా గురించి ముందుగానే ఒక అభిప్రాయం ఏర్పరుచుకున్న వారు ఎవరూ లేరు. ఇది నిజంగా బాల్యాన్ని పూర్తిగా ఆనందించడమంటే, చెప్పాలంటే ప్రేమను పూర్తిగా ఆస్వాదించడం, ఇదే చాలా మంది సంతోషంగా లేని పిల్లలకు అవసరం.

# 15. పిల్లలకు కావల్సినవన్నీ మనకూ కావాలి

**పి**ల్లలను చాలా బాగా అర్థం చేసుకోగలమని చెప్పేవారి వాదనలు అంగీకారయోగ్యంగా ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ ఆలోచిస్తే అవి గందరగోళంగా, సెంటిమెంటల్‌గా, భ్రమ కల్పించేవిగా అనిపిస్తుంది. వాళ్ల దృష్టిలో పిల్లల్ని పిల్లల లాగా ఉండనివ్వాలి, లేదా పిల్లలను స్వతంత్రంగా ఉండనివ్వాలి, లేదా బాల్యాన్ని అనుభవించనివ్వాలి, పిల్లలకు ఎదిగేందుకు సమయం ఇవ్వాలి అని అంటుంటారు. లేదా పిల్లల ప్రపంచంలో ఉండనివ్వాలి, అందువల్ల మనిషిగా అతడి హక్కులేంటో పిల్లలు తెలుసుకుంటారు అని అభిప్రాయపడుతుంటారు. పిల్లల బాల్యానికి నష్టం కలగడం, లేదా అతడి బాల్యం నుంచి అతడిని దూరం చెయ్యడం వంటి మాటలు మాట్లాడుతుంటారు.

ఇలాంటి మాటలు, ఇలాంటి భావాలు నిజానికి పిల్లలకు లేదా బాల్యానికి వర్తించవనేది నిజం. పిల్లలు కూడా పెద్దల వంటి వారే. ఏవైతే పిల్లలకు అవసరమని మనమంతా అనుకుంటున్నామో అవన్నీ నిజానికి పెద్దలైనా పిల్లలైనా అందరికి అవసరమే. మనం అందరం నివసిస్తున్న ఈ సమాజం, ఈ సంస్కృతి దేన్నైనా తిరస్కరించిందంటే దాన్ని పిల్లలు కూడా తప్పనిసరిగా తిరస్కరించాల్సిందే. మనం పిల్లల అవసరాల గురించి మాట్లాడుతున్నపుడు, వారి సద్గుణాలు కేవలం వారికి మాత్రమే చెందుతాయి. మనం వాటిని చాలా అల్పమైన విషయాలుగా భావిస్తాము. వాటికి పెద్దగా విలువ కూడా ఇవ్వము. ఇక్కడ చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇక్కడ సమాజం పెద్దల కోసం ఇచ్చే దాని కంటే మరింత నాణ్యమైన జీవితాన్ని తన పిల్లలకు ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం ఉంటుంది. మనం మన కంటే మంచి జీవితాన్ని పిల్లలకు అందించడానికి మార్గాలు ఎల్లప్పుడు అన్వేషిస్తుంటామని చెప్పి ఆత్మవంచన చేసుకుంటూ ఉంటాము.

పిల్లల ప్రపంచం, పిల్లల బాల్యాన్ని అనుభవించనివ్వాలి, పిల్లలను పిల్లల్లా ఉండనివ్వాలి లాంటి మాటలన్ని కూడా బాల్యం అనేది మిగిలిన జీవితంతో పోల్చినపుడు భిన్నమైందనే భావన కలిగిస్తాయి. అది జీవితంలో అన్నింటి కంటే మేలైన భాగం అనిపించేలా చేస్తాయి. అలా కాదన్న విషయం పిల్లలకు తప్ప మరెవ్వరికీ అర్థం కాదు. పిల్లలు త్వరగా ఎదగాలని మాత్రమే కోరుకుంటారు. వారు ఎదుగుతున్న తరుణంలో వారి చుట్టూ ఉన్న వారిని ఎదిగిన వారిగా గుర్తించగలిగేలా, ఎదగడం అంటే ఒక సాహసం ఒక అన్వేషణ అని భావించే పెద్దల సమక్షంలో ఉండాలని కోరుకుంటారు, అంతేకాని ఈడెన్ గార్డెన్‌లో ఎవరో తరుముతున్నట్టుగా ఉండకూడదని అనుకుంటారు. వారికి పెద్దవాళ్ల మాట వినడం నచ్చదు. ప్రత్యామ్నాయ పాఠశాల ఉద్యమంలో ఉన్నవారు తరచుగా అంటుంటారు – "ఇవి మీ జీవితంలో ఉత్తమమైన సంవత్సరాలు; మేము వీళ్లను మీకోసం కాపాడి ఉంచుతాం... ఈ పాడు ప్రపంచం వీరిని పాడుచెయ్యకుండా." వారిని నిరుత్సాహ పరచడమెందుకు? వారు ఆశించినా ఆశించకున్నా వారు ఎదుగుతూనే ఉంటారు. వారు ఈ మార్పు వారిని ముందుకు నడిపిస్తుందని భావిస్తారు. వాళ్లు పెద్దవారి నుంచి అంతా మంచే జరుగుతుందని చెప్పాలని ఆశిస్తుంటారు. నా పదమూడో పుట్టినరోజున నా బెస్ట్ ఫ్రెండ్ పంపిన మెసేజ్ లాంటి వాటిని వారు పెద్దవారి నుంచి ఆశిస్తుంటారు. అది ఏమిటంటే "ముందున్నవన్నీ మంచి రోజులే!" అతడు చెప్పింది నిజమే. నేను ఇప్పటికీ అలాగే భావిస్తున్నాను.

టీనేజ్ చివరిలో, ఇరవైల మొదట్లో ఉన్న చాలా మంది యువకులు తమ చదువు అయిపోయిన వెంటనే పిల్లలతో కలిసి పనిచెయ్యాలని ఆశిస్తుంటారు. అలా ఎందుకని వారిని అడిగినపుడు "ఎందుకంటే పిల్లలు చాలా నిజాయితీగా ఉంటారు, చాలా పారదర్శకంగా ప్రవర్తిస్తారు, చాలా ప్రేమగా ఉంటారు, మీరు పిల్లలతో మీలాగే ఉండొచ్చు, అబద్ధం చెప్పే పనిలేదు, ఎవరినీ మోసం చెయ్యక్కర్లేదు, ఎలాంటి నటన అవసరముండదు, మీ భావాలు మీరు స్వేచ్ఛగా వ్యక్తం చెయ్యడానికి వీలవుతుంది" అని చెప్పారు. కొద్ది సమయం పాటు మీరు కూడా పిల్లల్లా గడిపే అవకాశం దొరుకుతుంది. కానీ పిల్లల్లా గడపడం అంటే ఇదికాదు, పిల్లల్లో కూడా చాలా మందికి ఇలా ఉండడం నచ్చదు. ఓ ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయసున్న పిల్లవాడు కూడా పెద్దవారి మాదిరిగానే చాలా గంభీరంగా, తనను తాను రక్షించుకుంటూ, అంచనా వేస్తూ, తన భావాలు వెల్లడి చెయ్యడానికి భయపడుతూ, నవ్వడంతో సహా అన్ని పెద్దవారిలాగానే ఆలోచించి చేస్తుంటాడు. కిండర్ గార్డెన్ వంటి చిన్న మానవ సమాజంలో కూడా ఇలాంటి పోకడలు కనిపిస్తాయి. అది సమూహంలో అయినా సమూహం బయటైనా, చాలా ఒంటరిగా భావించే ప్రేమరాహిత్యంలో పడికొట్టుకుంటూనే ఉంటారు. చిన్న పిల్లల జీవితాలు కూడా

సమాజంలో పెద్దలతో పోల్చినపుడు పెద్ద తేడాగా ఏమీ ఉండవు. మనం అనుకుంటున్నట్టుగా పిల్లల ప్రపంచం స్వర్గధామమేమీ కాదు.

అయినప్పటికీ చిన్నపిల్లల సాంగత్యం చాలా ఆసక్తికరంగా, ఉత్సాహభరితంగా ఉంటుంది. వారి స్కూలు అనుభవాలుండగా వారు అంత తప్పుగా ఎందుకు ఊహించగలుగుతున్నారో అర్థం కాదు. బాల్యం నీడలో నమ్మకం, ఆరోగ్యాలు అందుకోవాలని ఆశపడుతున్నారు. నేను ఒక సందర్భంలో ఇలా ఆశిస్తున్న వారిని అడిగాను... పిల్లలకు ఆనందంగా, ఆసక్తిగా అనిపించే జ్ఞానం ఏదైనా వారితో పంచుకోవడానికి మీ దగ్గర ఉందా; ఉంటే వారంతట వారే మీ దగ్గరకు వచ్చేలా చేసుకోగలరా అని. కొన్ని సార్లు వారి దగ్గర చాలా మంచి సమాధానాలు దొరికాయి. తరచుగా వారిదగ్గర సమాధానం లేదు. పిల్లలతో కలిసి పనిచేద్దామన్న ఆలోచన ఉన్న యువకులు చాలా మంది చాలా సంప్రదాయబద్ధమైన స్కూలు టీచర్లే. అతడు చెప్పేది నిర్బంధంగా వినే పిల్లలు తమకు కావల్సిందాని కోసం సమాజం మీద ఆధారపడతారు.

"పిల్లల్లా బతికే స్వేచ్ఛ" అనే మాట చాలాసార్లు వింటుంటాము. ఈ మాట ఎలా ఉంటుందంటే ఏం చేసినా పిల్లలే, అదే పని వేరేవారు చేస్తే అది కాదు. సందర్భానుసారం పిల్లలు ఒక్కోసారి శక్తివంతంగా కనిపిస్తారు, ఒక్కోసారి కోపంగా, ఒక్కోసారి బాధగా, ఒక్కోసారి దిగులుగా, ఒక్కోసారి ఉత్సాహంగా కనిపిస్తారు. ఏమైనా వారు ఎలా కనిపించినా చివరకు వారు పిల్లలే. నా స్వంత అనుభవంలో నేను ఎదుగుతున్న క్రమంలో నాకు కొంతమందితో విసుగ్గా, కొంతమందితో ఆందోళనగా, కొంతమందితో సంతోషంగా, కొంతమందితో ఆత్మవిశ్వాస భావనతో గడిచేది. అప్పుడైనా ఇప్పుడైనా నాకు మంచి ఎక్కువగా చెడు తక్కువగా కావాలి. ఏది ఏమైనా ఈ ఏ ఒక్క భావన కూడా పిల్లల్లా జీవించే స్వేచ్ఛ అనే మాటలకు సంబంధించినట్టు అనిపించదు. నా చిన్నపుడు నేను పిల్లవాడిగా ఉన్నాను, అంతకంటే నేను పొందిందేమిటి?

"బాల్యాన్ని అనుభవించే అవకాశం ఇవ్వాలి" కొంత వరకు ఈ మాటనిజమే, ఏ వయసులోనైనా, మనకు ఆ వయసు అనుభవాలుంటాయి. నిజానికి ఈ మాటలకు మరో అర్థం ఉంటుంది. బాల్యాన్ని అనుభవించే అవకాశం అంటే ఏదైనా చెయ్యగలిగే స్వతంత్రం ఉండాలి. అది నిషేధించబడినదైనా సరే. నేను అనేదేమిటంటే పిల్లలు ఏమనుకుంటున్నారన్న అభిప్రాయాన్ని అడక్కుండానే పిల్లల గురించిన నిర్ణయాలు వారే తీసుకుంటారు. అయితే వాటిలో కొన్ని మాత్రమే పిల్లలకు నచ్చుతాయి. అంటే పిల్లల కోసం పెద్దలే నిర్ణయాలు తీసేసుకొని ఫలానా నువ్వు చెయ్యాలి అని నిర్దేశిస్తారు. అయితే ఇక్కడ గమనించాలి పిల్లలందరికి మనం ఏదైతే మంచిది అని భావిస్తామో అలాంటి అనుభవాలు మాత్రమే ఉంటాయి. వాటిని మాత్రమే వారికి అందుబాటులో ఉంచుతాము.

వారికి విస్తృతమైన అనుభవాలకు అవకాశం ఉండాలి, అప్పుడే వాటిలో నుంచి వారు వారికి నచ్చిన వాటిని ఎంచుకోగలరు.

"పిల్లలకు ఎదగడానికి సమయం ఇవ్వాలి." చెప్పాలంటే ఈ మాటలకు అర్థం లేదు. ఎవరైనా మరొకరికి సమయం ఎలా ఇవ్వగలుగుతారు? మనం ఎవరితోనైనా పనికి మాలిన మాటలు మాట్లాడటం మానేసి సమయం వృధా కాకుండా ఆపగలం, కానీ అదేమీ మనం వారికి సమయం ఇచ్చినట్టుకాదు. పిల్లలకు సమయం ఇచ్చినా ఇవ్వక పోయినా పిల్లలు కచ్చితంగా ఎదిగి తీరుతారు. పిల్లలు ఎదగడం అంటే కేవలం వయసుపరంగా, ఎత్తుగా, బరువుగా, బలంగా తయారవడం మాత్రమే కాదు. అర్థం చేసుకోవడం, అవగాహన కలిగి ఉండడం, దయాగుణం పెరగడం, ఆత్మవిశ్వాసం, పోటీ తత్వం అన్ని విషయాల్లోనూ అనుభవాలు రావాలంటే కాలం గడవాల్సి ఉంటుంది. ఇవ్వన్నీ నేర్చుకోవడానికి సమయం కావాల్సి ఉంటుంది. అతడికి అన్నింటిని అనుభవంలోకి తీసుకునే హక్కు ఉండాలి అలా ఉన్నపుడు మాత్రమే ఇలాంటి అవకాశం ఉంటుంది. కానీ ఏది వారికి మంచిదని మనం భావిస్తామో అలాంటి అనుభవాలు మాత్రమే వారికి అందుబాటులో ఉంటాయి. దాదాపుగా పిల్లలందరికి ఒకేరకమైన అనుభవాలు ఉంటాయి. అందరి అనుభవంలో భయం, అవమానం, ధిక్కారం, అపరిమితమైన ఆందోళన, మోసం, విశ్వాసరాహిత్యం, ఎంపిక అవకాశం లేకపోవడం వంటివే ఎక్కువగా ఉంటాయి.

మనం తరచుగా అంటుంటాం పిల్లలు తమను తాము మనుషులుగా గుర్తించగలగాలి అని. అవును ఇది పిల్లలు మాత్రమే కాదు, ఏ వయసు వారికైనా వర్తిస్తుంది. సమగ్రమైన ప్రమాణాలు లేకుండానే పిల్లల గురించి నిర్ణయాలు జరుగుతుంటాయి. ఇది వారి హక్కుకు విఘాతమే. ఒకరి పనుల గురించి అంచనా వెయ్యగలమేమో కానీ మనిషినే అంచనా వెయ్యడం సరికాదు. మనుషులెవరైనా సరే పూర్తిగా తెలిసే అవకాశం లేదు, వారు అంచనాలకు అందేవారు కాదు, ఏ వ్యక్తినైనా సరే పూర్తిగా అంచనా వేయడమనేది సాధ్యమయ్యే పనికాదు. సాధారణంగా మన టీచర్లు, సైకాలజిస్టులు తరచుగా ఇలా అంచనావేసే ప్రయత్నం చేస్తుంటారు. వారు నిపుణులైనా సరే మరొకరు మన గురించి మనం ఫలానా అని నిర్ణయం చేస్తే దాన్ని అంగీకరించాల్సిన అవసరం లేదు. అది ఏవిషయానికి సంబంధించి అయినా సరే... హోదా కావచ్చు, జాతి కావచ్చు, రంగు కావచ్చు, ఆదాయం కావచ్చు ఇలా ఏ విషయంలో నైనా సరే. ఇలాంటి తిరస్కరించే అధికారం మనం పిల్లలకు కూడా కొంతవరకు ఇవ్వాలి. అందరికి ఉన్నట్టుగానే ఒక గౌరవం తప్పకుండా వారికి కూడా ఉండాలి.

# 16. హక్కు అనే మాట

**ఈ** మధ్యకాలంలో ఎక్కువగా పిల్లల హక్కులు అనే మాట వినిపిస్తోంది. చాలా మంది ఇది మనందరం ఒప్పుకోవాల్సిన అంశం అని, పిల్లలందరికి తప్పనిసరిగా ఈ హక్కులు వర్తించాలని అన్నట్టుగా మాట్లాడతారు. మంచి ఇంట్లో ఉండే హక్కు, లేదా మంచి విద్య పొందే హక్కు. నా ఉద్దేశంలో మనం ఏవైతే హక్కులని అనుకుంటున్నామో అవి వారికి ఉండాలని అనుకుంటున్నాం అంతే. చట్టంలో పెద్దలకు ఎలాంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండేందుకు వీలుందో పిల్లలకు అలాంటి అవకాశం ఉండాలి. కొన్ని రకాల పనులు చేసుకునే వెసులుబాటు ఉండాలి, కొన్ని బాధ్యతలు నిర్వర్తించే అవకాశం ఉండాలి. అంటే పిల్లల హక్కులకు భంగం కలిగించేవారి మీద చట్టం చాలా కఠినమైన చర్య తీసుకోవాలి. పిల్లలకు ఓటేసే హక్కు ఉన్నపుడు ఇలాంటివన్నీ సాధ్యమవుతాయి. దీని అర్థం తప్పని సరిగా ఓటెయ్యాలని కాదు, ఓటేసే అవకాశం ఉంటే పిల్లల హక్కులకు సంబంధించిన చట్టాలు సరిగ్గా అమలవుతాయని నా భావన. హక్కులు కల్పించిన రాజ్యాంగం నేను చెయ్యాల్సిన విధుల గురించి కూడా తప్పకుండా చెప్పాల్సి ఉంటుంది. అది కేవలం ఈ విషయాల్లో నీకు ఎవరూ అడ్డు చెప్పడానికి కానీ అభ్యంతర పెట్టడానికి కానీ వీల్లేదని మాత్రమే చెబుతుంది.

ఒక స్థిరమైన రాబడి ఉండడం తప్పనిసరి. దీని కోసం ప్రభుత్వం లేదా రాజ్యం ఏదైనా చెయ్యాల్సి ఉంటుంది. అంటే దేశంలోని ప్రజలందరికి ఇంత మొత్తంలో స్థిరమైన రాబడి ఉండడం అంటే రాజ్యాంగంలో ప్రతి పౌరుడి కనీస రాబడి ఇంత మొత్తంలో ఉండాలని నిర్దేశించాలి. ఈ హక్కు పిల్లలకు కూడా కల్పించాలి. అంటే పెద్దలకు ఎంత మొత్తంలో రాబడి అందే అవకాశం ఉంటుందో పిల్లలకు కూడా అంతే అవకాశం ఉండాలి.

రాజ్యం మనకు కల్పించలేని సౌకర్యాల గురించి చెప్పడం వల్ల ఉపయోగమేమీ ఉండదు. రాజ్యం దగ్గర డబ్బుంది. కాబట్టి రాజ్యం సమకూర్చగలుగుతుంది. రాజ్యం తన

పౌర హక్కులకు భంగం కలిగించడం, లేదా కావల్సిందాన్ని ఎంచుకునే హక్కును నిరోధించడం చెయ్యకూడదు. అయితే రాజ్యం మంచి కుటుంబం, మంచి ఇంటి గురించి వాగ్దానం చెయ్యలేదు. ఇవి అందించడం రాజ్యం పరిధిలో మాట కాదు, దీన్ని రాజ్యం నేరుగా అందించలేదు, ప్రతి పిల్లవాడికి అందే విధంగా చెయ్యడం కూడా సాధ్యం కాదు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు మంచి ఇంటిని అందించాలన్న నిబంధన విధించడానికి అవకాశాలు ఏమిటి? నిజానికి మంచి ఇల్లు అనేదానికి ప్రమాణాలు ఏమిటి? లైఫ్ మ్యాగజైన్ లో ఒక కేస్ స్టడీ ఇచ్చారు. రాజ్యం పిల్లలను తమ తల్లి దండ్రులకు ఎడంగా ఉంచేట్లయితే, వారు ఎవరిని ప్రేమిస్తారు ఎవరితో ఉంటారు? కొంతమంది తల్లిదండ్రుల ప్రవర్తన, జీవన విధానం సరిగ్గా లేదని ఇరుగు పొరుగు వారు, సమాజంలోని వారు చెప్పడం వల్ల వారి పిల్లల బాధ్యత రాజ్యం తీసుకొని వారిని తల్లిదండ్రులకు దూరంగా పెడుతుంది. ఇలాంటి వాటికి రాజ్యం చాలా అసాధారణమైన కారణాలు చెబుతుంది. సరే రాజ్యం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఇప్పుడు పిల్లలు ఉంటున్న ఇల్లు బాగా లేనపుడు రాజ్యం తర్వాత చేసేది ఏమిటి? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఆ పిల్లల కోసం మరో మంచి ఇంటిని ఏర్పాటు చేస్తుందా? ఒకవేళ రాజ్యం ప్రమాణాల ప్రకారం తల్లిదండ్రుల ఇల్లు మంచిది కాకపోయినా పిల్లలు దాన్ని వదలడానికి సిద్ధంగా లేకపోతే..? లేదా రాజ్యం మంచిదని భావించి పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఇంటిలో ఉండడానికి పిల్లలకు ఇష్టం లేక పదేపదే పాత ఇంటికే వెళ్లిపోవాలని అనుకుంటే? అప్పుడు ఆ పిల్లవాడి వెనుక రాజ్యం పోలీసులను పెట్టి బలవంతంగా తీసుకొని వచ్చి రాజ్యం నిర్ణయించిన ఇంటిలోనే ఉంచాలా? లేక రాజ్యం ఏ ఇల్లయితే బాలేదో ఆ ఇంటిని పరిశీలించి పిల్లలకు ఇది అంత మంచిది కాదు కాబట్టి వారి తల్లిదండ్రులను పిలిచి ఈ ఇల్లు బాలేదు ఇల్లు చక్కదిద్దుకోండి అని తల్లిదండ్రులను ఆదేశించగలదా? ఒకవేళ వారు మార్చుకోదలచుకోనట్లయితే లేదా మార్చలేని పరిస్థితిలో ఉంటే రాజ్యం ఏం చేస్తుంది? వారిని శిక్షిస్తుందా? ఇది ఇంటిని చక్కదిద్దుతుందా?

రాజ్యం చెయ్యాల్సిందేమిటంటే పిల్లవాడు ఇప్పుడు ఉంటున్న ఇల్లు అతడికి నచ్చకపోతే మరో మంచి చోటుకు వెళ్లే విషయం అతడి నిర్ణయానికే వదిలేయ్యాలి. దీని కోసం రాజ్యం అతడికి కావల్సిన సాయం చెయ్యొచ్చు కూడా, మరిన్నీ అవకాశాలు కూడా అతడికి చూపించవచ్చు. కానీ వీటిలో దేనిని కూడా తప్పనిసరిగా పాటించాలన్న నిబంధన విధించకూడదు. పిల్లలకు ఎప్పుడు ఒకటికి మించిన అవకాశాలు అందుబాటులో ఉంచాలి. రాజ్యం సూచన తోసిపుచ్చే హక్కు పిల్లవాడితో పాటు అతడి తల్లిదండ్రులకు కూడా ఉండాలి.

నేను పిల్లలకు ఉండాల్సిన మరో హక్కు గురించి చెప్పదలచుకున్నాను, అది డబ్బు కోసం పనిచేసే హక్కు. ఈ మాట వినగానే, పిల్లలు దోపిడీకి గురవుతారంటూ ఆందోళన వ్యక్తం చేస్తారు. దీని గురించి నేను తర్వాత విస్తృతంగా చర్చిస్తాను. మహిళలు ఇతర అల్పసంఖ్యాక వర్గాలు ఎదుర్కొనే వివక్ష పిల్లలు కూడా ఎదుర్కొంటున్నారు. వారిని ఈ వివక్ష నుంచి కాపాడటం మరింత కష్టమైన పని. చాలా ప్రాంతాల్లో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం, యాజమాన్యాలు జాతి, లింగ, పుట్టిన ప్రదేశం వంటి ఆధారంగా నియామకాల్లో పదోన్నతుల్లో వివక్ష చూపించరాదు. అయితే దీన్ని అమలు చేయడం ఎంతో కష్టమైన విషయం. ఒకవేళ అలాంటి పక్షపాతాలతో నియామకాలు పదోన్నతులు చేసినా, లేదా అలాంటి వివక్షలతో ఉద్యోగాల నుంచి తొలగించినా వాటిని రుజువు చేయడం క్లిష్టమైన పని. పిల్లలను పనిలో పెట్టుకోకపోవడానికి కూడా యాజమాన్యాల వారు చాలానే కారణాలు వెతుకుతుంటారు. కొంత మంది బీమా పథకం పిల్లలకు వర్తించదు కాబట్టి పిల్లలను పెట్టుకోలేము అని చెబుతారు. బీమా కంపెనీలు కూడా ఇలాంటి నిబంధనలన్నింటినీ తమ కాంట్రాక్టుల్లో చేరుస్తున్నారు. ఇలాంటి వాటన్నింటిని అరికట్టడానికి చట్టం చర్యతీసుకోవాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే, పిల్లలకు కూడా పనిచేసే హక్కు కల్పించాలన్న డిమాండును మేము నెగ్గించుకోగలిగితే, ఇది కేవలం పేరుకే చట్టంగా ఉండకుండా చూడటం మరీ కష్టమైన సమస్య. దారిద్ర్యం, నిరుద్యోగం, వివక్ష రాజ్యం ఏలుతున్న సమాజంలో ఇలాంటి చట్టాలు కళ్ల జూస్తామని అయినా అవి అమలు అవుతాయని మేం అనుకోవడం లేదు.

కొన్ని హక్కులు అమలు చెయ్యడం వల్ల మరికొన్ని హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఏదో ఒక హక్కును మాత్రమే కాపాడేందుకు వీలుంటుంది. కొన్ని హక్కులు ఇలా ఇతర హక్కుల మీద ఆధారపడి ఉంటాయి. కానీ కొన్ని మాత్రం ఎలాంటి అభ్యంతరాలు లేకుండా కూడా ఉంటాయి. నేను సూచించిన అన్ని హక్కులు కూడా అందుబాటులోకి వస్తే, చాలామంది పిల్లలు వాటన్నింటిని ఏకకాలంలో వినియోగించుకోవాలని అనుకోకపోవచ్చు. ఒకటి రెండు కంటే ఎక్కువ హక్కులు ఎంచుకోక పోవచ్చు. వారికి అందుబాటులో ఉన్న అన్ని హక్కులు వారు అంత ప్రభావవంతంగా ఉపయోగించుకోలేక పోవచ్చు, వారికి ఏదైనా సమస్య ఎదురైనప్పుడు తప్ప వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అనుకోకపోవచ్చు కూడా.

ఉదాహరణకు ఇష్టమున్నపుడు ఇంటి నుంచి బయటికి వచ్చే హక్కు లేదా ప్రయాణం చెయ్యగల హక్కు, లేదా తన సొంత ఇంటిని ఏర్పాటు చేసుకునే హక్కునే

తీసుకోండి, ఈ అన్నీ హక్కులున్నప్పటికీ ఆ పిల్లవాడికి డబ్బు సంపాదించే హక్కు లేకపోతే అది వ్యర్థమే. అతడికి రాజ్యం నుంచి చట్టబద్ధంగా కొంత రాబడి ఉండాలి. ఆర్థికంగా అతడి బాధ్యత అతడే తీసుకోగలగాలి. బ్యాంకులో ఒక అకౌంట్ ఉండాలి, చెక్కు రాయగలిగే హక్కు ఉండాలి. కానీ ఒక చిన్నపిల్లవాడు మోసాన్ని కానీ, అతడి పరిస్థితిని అడ్డం పెట్టుకుని దోపిడీ చేసే వారిని కానీ తప్పించుకోవడం చాలా కష్టం. ప్రస్తుత కాలంలో పెద్దవాళ్లకు కూడా కష్టమే. అతడికి చట్టం నుంచి పూర్తి రక్షణ కల్పిస్తే తప్ప అలా జరగకుండా కాపాడడం చాలా కష్టం. ఇదంతా కూడా అతడు ఓటు వెయ్య గలిగితేనే సాధ్యమవుతుంది. అందుకని ఓటు వేసే హక్కు అన్నింటి కంటే ముందుగా కల్పించాలి. మిగతా అన్ని హక్కులు సాధించాలంటే తప్పనిసరిగా ముందుగా దీన్ని సాధించుకోవాల్సి ఉంటుంది. ఈ హక్కు కూడా అతడు సరిగ్గా వినియోగించుకోవాలంటే తల్లిదండ్రులు లేదా ఇతర పెద్దల ఒత్తిడికి అతడు లొంగకుండా తనను తాను కాపాడుకోగలిగి ఉండాలి. దీనికి సమాజం లేక చట్టం అతడికి ఏ విధంగా సాయం చేయగలవో నేను వేరే చోట పేర్కొన్నాను. అయితే అతడు ఇంటి బంధం నుంచి తప్పించుకోలేనంత కాలం, తాను వెళ్లేందుకు మరే ఇతర ప్రదేశం లేనంత కాలం ఇవి అంత ఉపయుక్తంగా ఉండవు.

ఇదే విధంగా ఒక పిల్లవాడు తన విద్య గురించిన నిర్ణయం కూడా అతడు స్వయంగా తీసుకోగలగాలి. ఇతరులెవ్వరి ప్రభావానికి లోను కాకుండా అతడు నేర్చుకోవాలనుకున్నది నేర్చుకునే స్వేచ్ఛ ఉండాలి. పిల్లలు అన్ని విషయాల్లోను తల్లిదండ్రుల మీద ఆధారపడి బతకాలని అనుకోవడానికి ఒక కారణం లేదు. అలా వారి మీద ఆధారపడి ఉన్నంత కాలం వారు స్వయంగా వారికి ఏం కావాలనే దాన్ని నిర్ణయించుకోలేరు. అంతే కాదు ఏ స్కూల్లో , ఏం నేర్చుకోవాలి, స్కూల్లో ఎంత సమయం గడపాలి వంటి విషయాలన్నీ కూడా అతడు నిర్ణయించుకునే వీలు ఉండాలి. ఈ హక్కు కూడా తల్లిదండ్రుల ఒత్తిడి నుంచి తప్పించుకునే అవకాశం ఉన్నపుడు మాత్రమే సాధ్యమవుతుంది. సమాజం ఇప్పటికిప్పుడు హక్కులకు సంబంధించిన ఒక ప్యాకేజి పిల్లల కోసం ప్రకటించాలని అనడం లేదు. కానీ ఇలా కొన్ని హక్కులు పిల్లలకు కల్పించినప్పటికి ఒకదానితో ఒకటి అనుసంధానించి ఉండడం వల్ల అతడు ఒక్క హక్కును సమర్థంగా ఉపయోగించుకోవాలన్నా కూడా మిగతా హక్కులన్నీ కల్పించాల్సి ఉంటుంది. కానీ పిల్లలకు ఈ హక్కుకల్పించడం కోసం పనిచేసే వారంతా కూడా వీటి గురించిన పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఇవి పిల్లల జీవితాల్లో చాలా పెద్ద మార్పును ప్రభావాన్ని చూపగలుగుతాయి. ఒక వేళ మనం వీటిలో ఒకదాని కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్నట్టయితే మనం మిగతా వాటి గురించి కూడా తెలుసుకొని కొద్దిపాటి సమయం వాటికి కూడా కేటాయించాల్సి ఉంటుంది.

# 17. ఓటు హక్కు

**చి**న్నవాళ్లందరికీ అందుబాటులో ఉండాల్సిన ముఖ్యమైన హక్కు ఓటు హక్కు. ఈ హక్కు మరే ఇతర దానిమీద ఆధారపడి ఉండదు. ఇంకో మాటలో చెప్పాలంటే ఒకరి మీద ఆధారపడి బతుకుతున్నా సరే ప్రతి పిల్లవాడికి కూడా సమాజంలో ఎవరి మీదా ఆధారపడకుండా బతుకుతున్నపెద్దలందరికి ఉన్నట్టుగానే ఓటేసే హక్కు ఉండాలి.

అయితే ఓటేసే వయసును మనం బహుశ దఫాకు ఒకటి రెండు సంవత్సరాలు వంతున మాత్రమే తగ్గిస్తూ పోతాము. నేనైతే ఏ వయసు వారికైనా సరే ఓటేసే హక్కు ఉండాలని అంటాను. ఎవరూ కూడా ఓటు వేయకుండా మిగిలి పోకూడదు. కొంత మంది మేధావుల వర్గం కంటే సామాన్య ప్రజానీకమే అన్నిసార్లూ తమకు ఒక మంచి ప్రభుత్వం ఎంపిక చేసుకుంటారని భావించలేం. అయినా వారికి ఆ హక్కు ఉండటం అనేది న్యాయానికి సంబంధించిన అంశం. మీ నిర్ణయం నామీద ప్రభావం చూపేదైతే కచ్చితంగా అందులో నాక్కూడా భాగం ఉండాలి. నా మీద నీకు కొంత అధికారం ఉంటుందంటే తప్పకుండా నాక్కూడా నీ మీద కొద్దిపాటి అధికారం ఉండాలి. ఆదిమ అమెరికన్లు తమకు ప్రాతినిధ్యం లేనందువల్ల పన్నుల విధింపులో అన్యాయం జరుగుతోందని అనేవారు. కాని అప్పుడు ఇప్పుడు కూడా ప్రాతినిధ్యం అనేది పన్నుల కంటే పెద్ద విషయం. సామాజిక చట్టాలకు సంబంధించి అవి ఎలా ఉండాలో చెప్పే హక్కు లేదా మార్గం లేనప్పుడు అది అత్యంత తీవ్రమైన అన్యాయం అవుతుంది. దాని వల్ల లంచగొండి తనం పెరుగుతుంది, పాలనలో పారదర్శకత నశిస్తుంది. నిరంకుశతకు దారితీస్తుంది. అధికారంలో ఉన్న వారు తరచుగా తమ పాలనాపరమైన విధానాల గురించి ఇతర అంశాల గురించి

ఓటర్లకు ఒక నివేదిక రూపంలో అందించడం, వారు చేసిన పనులకు, చెయ్యబోయే పనులకు తప్పనిసరిగా ఆమోదం తీసుకోవడం వంటివి వారిమీద పెద్ద పర్యవేక్షణ ఏమీ కాదు. కానీ అసలు ఎలాంటి పర్యవేక్షణ లేకుండా ఉండే దానికంటే కొద్దిపాటి పర్యవేక్షణ ఉండడం మేలేకదా.

ప్రభుత్వం మీద ప్రజల అదుపు ఉండడానికి మరో గొప్ప కారణం ఏమిటంటే ప్రభుత్వ జవాబుదారీతనం పెరగడానికి అవకాశం ఉంటుంది. ప్రతిసారీ అనుభవం ద్వారానే నేర్చుకోవాలంటే కష్టం, కానీ అనుభవం లేకుండా అసలు నేర్చుకునే అవకాశం కూడా ఉండదు. ఇక అనుభవం మాత్రమే సరిపోదు, కావల్సింది కేవలం ఏదో ఒక అనుభవం కాదు వారికి కావల్సింది ప్రభావశీలమైన అనుభవం. తమ నిర్ణయం చాలా ప్రభావం చూపుతుంది తమ జీవితాల మీద అని అనుకున్నప్పుడు వారు చాలా ఆలోచించి చాలా తెలివిగా నిర్ణయం తీసుకోవడం కానీ ఎంపిక చేసుకోవడం కానీ చేస్తుంటారు. అదే పెద్ద ప్రభావం ఏమీ ఉండదన్నపుడు వారు ఎందుకు ఆలోచించే శ్రమ తీసుకోవాలి అని అనుకుంటారు. ఇది కేవలం అధికారానికి సంబంధించిన విషయం కాదు, చెప్పాలంటే ఇది చేతకానీ తనం. దీనివల్ల అవినీతి పెరుగుతుంది. అందువల్ల ఆలోచనల్లో, భావాల్లో బానిసత్వం వచ్చి చేరుతుంది. ఇందువల్ల వారు బద్ధకంగా, మొండిగా, బాధ్యత లేకుండా తయారవుతారు.

సామాన్య మానవులు ఎలాంటి తప్పుచేయరు లేదా వారికి తప్పుచెయ్యకుండా ఉండే జ్ఞానం ఉంటుంది అనేది చాలా పెద్ద మూఢనమ్మకం తప్ప మరోటి కాదు. వారు కూడా చాలా తప్పులు చేస్తారు. ప్రజలు చాలా అమాయకంగా ఉంటూ చాలా త్వరగా మోసపోతుంటారు. కానీ చాలా సందర్భాల్లో వారికి ఏం కావాలి, ఏది అవసరముందనేది అందరికి తెలిసి ఉంటుంది. వారికి ఏది సంతోషాన్ని ఇస్తుంది, ఏది బాధ పెడుతుందనే అవగాహన కూడా ఉంటుంది. నిజంగా వారికి అవకాశం కలిగిస్తే వారి కోసం ఇతరులు ఎంపిక చేసే దాని కన్నా వారి కోసం వారు చేసుకునే ఎంపిక సరిగా ఉంటుంది. అయితే అతడు సరిగా ఎంపిక చేసుకున్న దాని కంటే కూడా దానిలో ఏవైనా పొరపాట్లుంటే వాటినే ఎక్కువగా గుర్తుపెట్టుకొని ఎత్తి చూపుతుంటారు. వాటిని సరిచేసుకునే అవకాశం అతడికి ఇస్తే మరోసారి అలాంటి తప్పు జరగకుండా మరింత జాగ్రత్తగా ఉంటాడు.

ఒక యువకుడు ఒక జ్ఞానిని అడిగాడు – దేనివల్ల ఒక వ్యక్తి తెలివైనవాడు అవుతాడు అని దానికి ఆ గురువు "అది దాదాపుగా అతడు తీసుకునే నిర్ణయాల మీద ఆధారపడి ఉంటుంది" అప్పుడు ఆ యువకుడు అడిగాడు తాను ఎలా సరైన నిర్ణయం తీసుకోగలుగుతాను అని. అప్పుడు ఆ గురువు సమాధానం చెప్పాడు – "సరైన అనుభవం ఉన్నపుడు సరైన నిర్ణయం తీసుకోగలవు." అప్పుడు ఆ యువకుడు ఏడ్చినంత పని చేశాడు, "నాకు అలాంటి అనుభవం ఎలా దొరుకుతుంది" అని. దానికి జ్ఞాని సమాధానమిస్తూ, "తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం ద్వారా" అని చెప్పాడు.

కానీ కొంతమంది అంటారు… తరచుగా తప్పుచేసేవారు ఆ తప్పు నుంచి ఏలాంటి పాఠాన్ని నేర్చుకోనట్లయితే, వారి వల్ల మిగిలిన మనమంతా కూడా దాని ఫలితాలు అనుభవించాల్సిన అవసరమేముంది? నీకు ఇలా నిర్ణయాలు తీసుకోవడం చేతకావడం లేదు, నీ తరఫున నిర్ణయాలు చెయ్యడానికి నీకు ఒక కాపలాదారు ('కీపర్')ను పెడుతున్నాం అని అతడికి ఎందుకు చెప్పకూడదు? దీనికి ఒకే ఒక సమాధానం ఉంది. నిరంతరం అంటిపెట్టుకుని ఉండే ఈ కీపర్ వల్ల అతడు ఇక ఎప్పటికీ నేర్చుకోలేడు. చెప్పాలంటే భవిష్యత్తులో ఈ కీపర్ వల్లనే ఎక్కువ నష్టం జరగవచ్చు. ఎలాగంటే జూదం అనేది చట్ట బద్ధమైతే, అందువల్ల కొంత మంది ప్రజల జీవితాలు తప్పకుండా నాశనం అవుతాయి. కానీ నిషేధం అమలుకు అయ్యే వ్యయం, సమాజంలో ప్రభుత్వంలో వ్యాపించే అవినీతి విలువ కలిపితే వీధుల పాలైన జూదగాళ్లను పోషించడానికి అయ్యేందుకు అయ్యే వ్యయం కంటే ఎంతో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి జూదం చట్టబద్ధంగా నడవడం కంటే నిషేధించడం వల్లనే సమాజానికి నష్టం ఎక్కువ. రమ్ము అనే భూతం మద్యనిషేధానికి మించి అమెరికాకు ఏనాడూ ఎక్కువ నష్టం కలిగించలేదు.

ప్రజాస్వామ్యాలన్నీ విజయవంతం కాకపోవడానికి కారణం ప్రజా నిర్ణయం సరిగా లేకపోవడం వల్ల కాదు; అధికారంలో ఉండే వారి, వారి ప్రజాసేవకుల పనుల్లో పారదర్శకత లోపించడమే అసలు కారణం. సాధారణంగా అధికారం మీద ఎక్కువ వ్యామోహం ఉన్న వారు ప్రజలకు దేశానికి ఏది మంచో తామే ప్రయివేటుగా నిర్ణయించుకుని ఆ తర్వాత అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల అబద్ధపు హామీలు ఇస్తారు.

పిల్లలకు ఓటు హక్కు ఎందుకు నిరాకరించడం ఎంతో అన్యాయం అని అనడానికి కారణం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల, చర్యల వల్ల వారి జీవితామీద చాలా తీవ్రమైన

ప్రభావం ఉంటుంది కాబట్టి. ఒక దేశం మరో దేశం మీద యుద్ధం చెయ్యాలని నిర్ణయించుకుందనుకోండి, లేదా ఒక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆ దేశం యుద్ధం చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడిందనుకోండి... ఆ యుద్ధంలో చిన్నపిల్లలు కొన్ని సంవత్సరాల తరువాత తాము కూడా పాల్గొనాల్సి వస్తుంది, వారు ఎవరినైనా చంపాల్సి రావచ్చు లేదా చచ్చిపోవాల్సి రావచ్చు. కానీ ఆ నిర్ణయంలో చిన్నపిల్లలకు భాగస్వామ్యమే ఉండదు. ఇలాంటి సందర్భాల్లో ఓటు వేయని వారిని యుద్ధం నుంచి మినహాయించాలి. యుద్ధం సంగతి పక్కన పెడితే రాజకీయ నిర్ణయాల వల్ల ప్రభావితం అయ్యేది మాత్రం ఎక్కువగా చిన్నపిల్లలే. ఎందుకంటే వారు భవిష్యత్తులో ఆ నిర్ణయాల ఫలితాలను అనుభవిస్తూ ఆ సమాజంలో ఎక్కువ కాలం పాటు జీవించాల్సి ఉంటుంది.

ఏ వయసువారికైనా సరే అందరికి ఓటేసే అవకాశం ఉండాలని నేను అన్నప్పుడు పెద్దవారు అందరూ ఆశ్చర్యంగా, అపనమ్మకంగా, చెప్పాలంటే కొద్దిపాటి కోపంగా నా వైపు చూస్తారు. నేను పదహారేళ్ల పిల్లలకు మాత్రమే కాదు, ఆరేళ్ల పిల్లలకు కూడా ఓటేయాలన్న కోరిక ఉంటే ఓటేసే అవకాశం ఉండాలని అంటున్నాను.

ఒక వేళ ఇలాంటి అవకాశం ఉంటే నాకు తెలిసిన ఆరేళ్ల పిల్లల్లో చాలా మంది ఓటు వేయ్యాలని అనుకుంటారు. వారు నివసిస్తున్న సమాజంలో వారికి మరింత గౌరవం, విలువ ఇస్తే వారు ఇప్పుడున్న దానికంటే చాలా భిన్నంగా తయారవుతారు. పిల్లలకు ప్రపంచంలో చాలా విషయాలు అన్వేషించాలన్న, అనుభవించాలన్న ఆసక్తి కుతూహలం ఉంటుంది. దానికి మనం వారికి కావల్సినంత అవకాశం కల్పిస్తే వారు ముందుగా ఇంటి నుంచే వారి అన్వేషణ ప్రారంభిస్తారు. అందులో భాగంగా చాలా మంది ఆరేళ్ల పిల్లలకు ఓటింగ్ కూడా ఆసక్తికరంగా ఉండొచ్చు. కొంతమంది ఉత్సాహం కోసం భిన్నంగా ఉండడం కోసం ఓటేస్తుండొచ్చు. కొంత మంది వారి స్నేహితుల దగ్గర దీని గురించి మాట్లాడే అవకాశం ఉంటుందని వేస్తుండొచ్చు. మరి కొంత మంది వారి కుటుంబంలోని సభ్యులందరు ఎన్నికల గురించి, అభ్యర్థుల గురించి చర్చించుకోవడం విని ఉండడం వల్ల ఆసక్తి కలిగి పెద్ద వారు చేస్తున్న వారు కూడా వోటు వెయ్యాలని అనిపించి ఉండొచ్చు. చాలా మంది చిన్న పిల్లలు నాకు తెలిసి ఓటు వెయ్యకపోవచ్చు కూడా.

నేను చూసిన వారిలో అందరికంటే తక్కువ వయసున్న ప్రచార కార్యకర్త ఆరేళ్ల వయసున్న అమ్మాయి. 1972లో అధ్యక్ష ప్రచారం జరుగుతున్న సమయంలో ఆ అమ్మాయి

తల్లి మెక్‌గవర్న్ ఆఫీసులో పనిచేస్తుండేది. ఆమెకు బేబీ సిట్టర్ల వద్ద పాపను వదిలేంత స్తోమత లేదు. అందువల్ల ఆమె తనతో పాటు తన పాపను కూడా వెంట తీసుకొని వచ్చేది. అక్కడ అందరూ హడావిడిగా పనులు చేస్తుంటే ఆ అమ్మాయికి కూడా చాలా ఆసక్తిగా అనిపించేది. త్వరలోనే ఆమె స్టాంప్‌లు వెయ్యడం, ఎన్వలప్‌లు అతికించడం, పేపర్లు జిరాక్స్ చేయడం వంటి పనులు చేయడం మొదలు పెట్టింది. ఆ పనులు చేయడం ఆమెకు చాలా ఆనందంగా కూడా ఉండేది. ఆమెకు అక్కడి నుంచి వెళ్లడం చాలా కష్టంగా ఉండేది, ఎప్పుడు ఎప్పుడు తిరిగి రావాలా అన్నట్టు వెళ్ళేది అక్కడి నుంచి.

అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఆమెకు ఉండి ఉంటే? ఆమె అలా వేసి ఉంటే బావుండును అనిపించింది. ఆమెకు ఆ బాధ్యత కూడా చాలా ఉత్సాహంగానే ఉండేదేమో బహుశ. ప్రతి రాజకీయ కార్యకర్తకు తెలుసు... చాలా చిన్న కారణాలతో పెద్దవాళ్లలో చాలామంది ఎన్నికలకు దూరంగా ఉంటారు, (ఉదాహరణకు ఆదివారం ఉదయం ఫుట్‌బాల్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం టీవిలో ఉండి అదే రోజున ఎన్నికలు కూడా ఉంటే ఓటు వెయ్యడానికి చాలామంది రాకపోవచ్చు కూడా). ఆ పిల్లకు అభ్యర్థి, అతడి సామర్థ్యం గురించి ఎలాంటి అవగాహన ఉంటుంది? చాలా తక్కువ. మెక్‌గవర్న్ అనేది ఆమె విన్న పేరు ఆమె చుట్టూ ఉన్న పెద్దవారి నుంచి, ఆమెకు అది నచ్చింది, అతడిని నమ్మింది కూడా. ఆమె వారంతా ఉత్సాహంగా ప్రచారం నిర్వహించడాన్ని చూసింది, వారి మాటలను బట్టి చెడ్డదని ఆమె భావిస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా అతడు ఏదో చేస్తాడని కూడా అనుకుంటుంది. ఒకవేళ ఆమె తల్లిదండ్రులు వారి స్నేహితులు నిక్సన్ కోసం పని చేసి ఉంటే సహజంగానే ఆమె అతడికి ఓటు వేసేందుకు ఆసక్తి చూపించేది. ఆమెకు రాజకీయాల గురించి ఏమీ తెలియకపోయినా ఆమెకు ఏం తెలుస్తుందనేది ఇక్కడ ముఖ్యమైంది, పెద్దవారు దేని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు, ఆసక్తి కనబరుస్తారు, దేనికోసం ఎక్కువ పనిచేస్తారు దాని మీదే ఆమె నిర్ణయం ఆధారపడి ఉంటుంది. నాకు తెలిసి ఆమె ఓటు వెయ్యగలిగితే చాలా మంది పెద్దవారికంటే అర్థవంతంగానే తన అభ్యర్థిని ఎన్నుకొని ఉండేది.

పదేళ్ల వయసున్న వారి విషయం మరో రకంగా ఉంటుంది. ఇది కాస్త భిన్నంగా ఉంటుంది. వారిలో ఎక్కువ మంది ఓటు వేయడానికి ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది. అది కూడా వారి తల్లిదండ్రుల ఆసక్తిలో, పనిలో భాగం పంచుకోవడం కోసం కాకుండా

వారి స్వంత కారణాలు వారికి ఉంటాయి. నాకు తెలిసిన చాలా మంది పదేళ్ల బ్యాచ్ పిల్లల్లో నేను గమనించాను... నేను నా స్నేహితులు కొంతమంది కాలేజ్ నుంచి బయటకు వచ్చేనాటికి ప్రపంచం పట్ల ఎంత అవగాహన కలిగి ఉన్నామో అంతకంటే మెరుగ్గానే ఆలోచించే విధంగా ఉండటాన్ని. పదేళ్ల వారిలో ఎక్కువ మంది ఓటు వేసేందుకు ఉత్సాహపడుతూ ఉండొచ్చు. మరి వారు దీనికి దూరంగా ఎందుకుండాలి? ఇక పద్నాలుగు సంవత్సరాల వయసు వచ్చేసరికి వారికి జీవితంలోని సాంఘిక, వ్యక్తిగత జీవితాల గురించి వారి అభిప్రాయాలు వారికి దాదాపుగా ఏర్పడి ఉంటాయి. మరోవైపు మనం యుక్తవయస్కులు చెయ్యడానికి అనుమతించని అనేక పనులు వారు అప్పటికే చాటుగా చేస్తూంటారు కూడా.

దీని గురించి పిల్లలు ఏమనుకుంటున్నారన్నది దాదాపుగా ఏమీ తెలియదనే చెప్పాలి. కిడ్స్ పత్రికలో ప్రచురితమైన నా లెటర్స్ ద్వారా నేను పాఠకులను అడిగాను వారికి ఓటు వేసే హక్కు ఉంటే ఎలా ఉంటుంది అని. వారికి అలాంటి అవకాశం కల్పిస్తే, ఒకవేళ ఓటు వేసి ఉంటే అని అడిగాను. హాలాండ్ (మిచిగాన్) లో ఉన్న లాంగ్‌ఫెలో స్కూల్‌లో ఒక టీచర్ నా ఈ లెటర్‌ను ఫోర్త్ గ్రేడ్ క్లాస్‌రూంలో చదివి వినిపించింది. వారి అభిప్రాయాన్ని తెలుపుతూ చాలామంది నాకు ఉత్తరాలు రాశారు కూడా. వారంతా ఉత్తరం రాసే ముందు ఈ విషయం గురించి క్లాస్ రూంలో కానీ తల్లిదండ్రులతో కానీ చర్చించారా లేదా అనే విషయం నాకు తెలియదు, పిల్లలు రాసిన ఉత్తరాలను వాటిలోని అంశాన్ని బట్టి క్రింది విధంగా వర్గీకరణ చేశాను.

| | |
|---|---|
| అవకాశం ఉంటే నేను ఓటు వేసి ఉందును | 8 బాయ్స్, 3 గాళ్స్ |
| నేను ఓటు వేస్తాను | 1 బి |
| నేను ఓటు వేస్తాను కానీ పిల్లలు ఓటు వేసేందుకు అనుమతించరాదు | 5 బి, 2 జి |
| నేను ఓటు వెయ్యను | 1 (మతపరమైన కారణాలతో) |
| మమ్మల్ని అనుమతించకూడదు | 1 జి |
| నేను ఓటు వెయ్యను, మమ్మల్ని అనుమతించరాదు | 4 బి, 4 జి |

ఓటు వేయం అని లేదా ఓటు వేసే అనుమతి పిల్లలకు ఉండకూడదు అని అభిప్రాయం వ్యక్తం చేసిన వారు కింది అభిప్రాయలు వ్యక్తం చేశారు. (కొంతమంది ఒకే కారణం చెప్పారు, కొందరు ఒకటి కంటే ఎక్కువ కారణాలు చెప్పారు)

| | |
|---|---|
| ఎలాగో తెలియదు, కష్టం, బాధ్యత తెలీదు వంటివి | 10 |
| వేచి ఉండాల్సిన వయసులో ఇది తగదు | 4 |
| ఓటింగ్ మిషన్లు పగలగొట్టే అవకాశం ఉంది | 3 |
| తల్లిదండ్రుల మాదిరిగానే ఓటు వేస్తారు | 2 |

ఏడుగురు పిల్లలు మాత్రం అనుమతిస్తే ఓటు వేస్తామని చెప్పితీరేవారు. కానీ పిల్లలకు అలాంటి అనుమతి ఉండకూడదు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. పెన్సిల్ దొంగతనం చెయ్యడం లేదా విరామ సమయంలో ఇతర పిల్లలను తోసిపడేసే వారిని ఇంటికి పంపేయాలని లేదా ఒక వారం పాటు స్కూల్ నుంచి సస్పెండ్ చెయ్యాలని నా ఫిఫ్త్ గ్రేడ్ పిల్లలు చెప్పిన విషయాన్ని స్ఫురింపజేసింది. నిజానికి ఎంతో కోపంగా సీరియస్‌గా అలాంటి కఠిన శిక్ష విధించాల్సిందేనని చెప్పిన పిల్లలు తాము రోజూ అలాంటి చిలిపి పనులు చేసేవారే. ఇక రకరకాల కారణాల వల్ల పిల్లలు ఓటు వేయడానికి తగినంత తెలివితేటలు కలిగి ఉండరని చెబుతున్న ఈ ఏడుగురు పిల్లల దృష్టిలో తాము పిల్లల కిందికి రామని వారి ఉద్దేశం. వారు పిల్లలు అని సంబోధిస్తున్నది తమకంటే తక్కువ వయసున్న వారినని మనం గమనించాలి. బాగా పెద్ద పిల్లలు కూడా ఇదే విషయం చెప్పారు.

మరో వైపు, ఫోర్త్ గ్రేడర్లు 'పిల్లలకు' ఓటు వేయనివ్వరాదని చెప్పినప్పుడు, ఆ పిల్లలు తమకంటే చిన్నవారని వారి ఉద్దేశం అయిఉండాలి. నాకు తెలిసిన చాలా మంది ఫిఫ్త్ గ్రేడ్ పిల్లలు కూడా తాము కిడ్స్ కావచ్చని అంగీకరించినప్పటికీ, తాము చిన్నపిల్లలం మాత్రం కాదని ప్రకటించుకున్నారు.

ఇద్దరు పిల్లలు మాత్రం తమను ఓటు వేసేందుకు అనుమతించకూడదని, పెద్దవారికి అది న్యాయం కాదని రాశారు. నాకు తెలిసి వారికి ప్రశ్న అర్థమై ఉండదు. కానీ దీన్ని కచ్చితంగా చెప్పలేను.

మరోచోట నేను నైన్త్ గ్రేడ్ విద్యార్థులతో జరిపిన ఒక సమావేశంలో ఓటు వేసే అవకాశం ఉంటే తాము వేస్తామనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 1972 అధ్యక్ష ఎన్నికలలోనో పద్దెనిమిది నుంచి ఇరవైయొక్క సంవత్సరాల మధ్య వయసు యువకులు చాలాఎక్కువ సంఖ్యలో ఓటర్ల లిస్టులో తమ పేర్లను నమోదు చేసుకున్నారు, ఓటింగ్‌లో పాల్గొన్నారు వారి ఓట్లు చాలా చోట్ల ఫలితం మీద చాలా ఎక్కువ ప్రభావాన్నే చూపాయి. యువతతో కూడా చాలా మందికి పెద్దలకు ఉన్నట్టుగానే దేశ రాజకీయ పరిస్థితుల పట్ల ఆసక్తి ఉందనే విషయం దీని వల్ల మనకు అర్థమవుతోంది. యువతలో చాలామంది నామినేషన్ విధానం, అభ్యర్థుల గురించి తాము ఇది వరకు అపోహలో ఉండేవారమని చెప్పారు. వారు అపోహలో ఉన్నారనడానికి ఎలాంటి సందేహం అవసరం లేదు కానీ వారి ప్రతిస్పందన మాత్రం అనూహ్యమైనది. వారు బలవంతంగానే తమ పేర్లు నమోదు చేసుకొని ఉండొచ్చు కానీ ఓటు వేయడం మాత్రం నిర్ణయాత్మకంగా వేశారు, అయితే ఇది రెండు పార్టీల రాజకీయ నాయకులకు ఒక విషయాన్ని పూర్తిగా అర్థమయ్యేలా చేసింది. వారు చేస్తున్న పని పెద్దగా నచ్చని ఓటర్ల సంఖ్య ఎక్కువగానే ఉండొచ్చు కానీ వారంతా కూడా వారు నమ్ముతున్న అభ్యర్థికి తప్పకుండా మద్దతు ఇస్తున్నారన్న విషయం. యువత ఓట్లను పెద్దగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని భావించ కూడదని, యువతకు మేలుచేసే రాయితీలు కల్పించడం కూడా ఒక పొలిటికల్ రిస్కే అవుతుందన్న విషయాన్ని ఈ అంశం ద్వారా వారు రాజకీయనాయకులను ఒప్పించగలిగారు. ఒక యువ అభ్యర్థిగా అధ్యక్ష బరిలో దిగిన మెక్‌గవర్న్‌కి యువత ఓట్లు ఎక్కువగా రాలేదు. ఇలాంటి పాఠాలతో ఇక ముందు ఏ అభ్యర్థీ యువతను నిర్లక్ష్యం చెయ్యడు. ఇక ఇప్పుడు వీలైనంత ఎక్కువగా వారి కోసం చేసే ప్రయత్నం చేస్తారు. అయితే, యువతకోసం పనిచేయడం కంటే వారికి వ్యతిరేకంగా పనిచేయడం వల్లనే లాభం అని వారు భావించారు.

ఒక ప్రత్యేక రాజకీయ కారణం వల్ల ఓటు వేసే వయసును పద్దెనిమిది నుంచి పదాహారుకు తగ్గించడం కుదరదు. దాని కోసం కనీసం రెండు విషయాలు జరగాలి. పదహారు నుంచి పద్దెనిమిది సంవత్సరాల మధ్య వయసున్న వారు రాజకీయ నాయకులకు ఒక హెచ్చరిక చెయ్యాలి. ఇప్పుడు మాకు ఓటు హక్కు కల్పించనట్టయితే రేపు మాకు ఈ హక్కు వచ్చిన తర్వాత మేమేంటో చూపిస్తాం అని, ఇక రాజకీయనాయకులకు వారి మాటల్లోని ఆంతర్యం అర్థం కావాలి. ఈ పదహారు నుంచి పద్దెనిమిది సంవత్సరాలలోపు

వారు తమ పక్షాన మాట్లాడడానికి కొంత మంది వయోజనులను కూడా తమతో చేర్చుకోవాలి, అంటే పద్దెనిమిది నుంచి ఇరవై సంవత్సరాల వయసున్న వారిని తమతో చేర్చుకోవాలి. నేను ఏమంటానంటే విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న వారు, వారి విద్యాసంస్కరణలను ఆశిస్తున్న వారు అందరూ కూడా ఇప్పుడు ఇక విద్యార్థి హక్కులనే మాట మరచిపోవాలి ఇక పౌర హక్కుల గురించి మాట్లాడడం ప్రారంభించాలి. మీకు ఓటు హక్కు సంక్రమించిన వెంటనే మీరు ప్రేమించే మీకంటే చిన్న వారైన వారికి ఆ హక్కు కావాలని ఉద్యమించండి. ఇక అప్పుడు స్కూళ్ల సంస్కరణ అనేది చాలా చిన్న విషయం అవుతుంది, అనేక రాజకీయ అంశాలలో భాగం పంచుకునే అవకాశం దొరుకుతుంది. ఇక డీన్ లేదా ప్రెసిడెంట్ ఆఫీస్ ముందు ర్యాలీలు, నినాదాలు చేసే అవసరం ఉండదు.

నేను ముందే చెప్పినట్టు ఓటేసే అవకాశం ఉంటే విషయాల గురించి తెలుసుకోవాలన్న అవగాహన కలుగుతుంది, మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశం కలుగుతుంది. అవకాశం ఉందంటే వారికి ఓటేసే విషయంలో ఆసక్తి కూడా పెరుగుతుంది. ఈ రోజుల్లో చాలా మంది పిల్లలు “నాకు రాజకీయాలు, ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ఆసక్తి ఎందుకుండాలి, నాకు ఓటేసే అవకాశమే లేనపుడు నేను దాని గురించి తెలుసుకొని ఏం చెయ్యాలి?” అని అడుగుతున్నారు. కావాలనుకుంటేనే ఓటు వేయగలిగే అవకాశం వారికి కల్పించాలి. ఇలా చెయ్యడం వల్ల వారికి వారి చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల మరింత ఆసక్తి కలుగుతుంది. తెలుసుకోవాలన్న కుతూహలం పెరుగుతుంది. ఓటింగ్ ప్రక్రియను పాఠ్యాంశాలలో చేర్చాలి, స్కూల్‌లో అలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజలు ఎందుకు ఓటు వెయ్యాలి? ఓటు వేసే వారిలో వెయ్యని వారిలో తేడా ఏమిటి? వారు ఏం చేస్తారు? (ఇలాంటి ప్రశ్నలకు కొంత మంది పెద్దలు మాత్రమే సమాధానం చెప్పగలుగుతారు) ఓటింగ్ ప్రక్రియ మీద అవగాహన కలిగించడానికి, ఉత్సాహపరచడానికి హైస్కూల్‌లోనూ, ఎలిమెంటరీ స్కూల్‌లోనూ స్కూల్ ఎన్నికలు, క్లాస్ ఎన్నికలు జరగాలి. ఇదొక చిన్న మికీ మౌస్ పోరాటం తప్ప మరోటేమీ కాదు. దీనిలో పాపులారిటీ తప్ప మరేమీ ఉండదు. దీని కోసం విద్యార్థులు కొన్ని వారాలపాటు దీని గురించి మాట్లాడుకుంటారు, పనిచేస్తారు. ఇక్కడ ఎన్నుకున్నవారికి కానీ ఎన్నుకోబడిన వారికి కానీ పెద్దగా వచ్చేదేమీ ఉండదు. మనం దీన్ని ఒక చిన్నపిల్లల ఆటగా చూస్తాము కానీ ఎలాంటి

లాభం లేని విషయానికే పిల్లలు ఎంత శ్రద్ధతో పనిచేశారనే విషయాన్ని పెద్దగా పట్టించుకోము. వారి గురించి అంతకంటే ఎక్కువ ఏమీ ఆలోచించము  కూడా.

ఈ మధ్య నేను ఒక చిన్న అమ్మాయి 'స్నూపీ ఫర్ ప్రెసిడెంట్'  అని రాసి ఉన్న ఒక టీషర్ట్ వేసుకొని ఉండడాన్ని చూసినపుడు నాకు ఎన్నో ఆలోచనలు కలిగాయి. ఎంత 'క్యూట్'గా ఉందో కదా అనుకున్నాను. పిల్లలకు ప్రెసిడెన్సీ అంటే ఏమిటో తెలియదన్న విషయం మనకు  అర్థమవుతోంది, ఆమె ఆ విషయం గురించి అవగాహనతో ఆలోచించలేదని కూడా తెలుస్తోంది. ఆమె ఆ టీషర్ట్ వేసుకుని కనిపిస్తే  ఆ టీషర్ట్ తయారు చెయ్యాలన్న ఆలోచన ఒక పెద్దవారిదే అనే విషయం మన స్ఫురణకు రానే రాదు. అలాంటి టీ షర్టు పెద్దవారే తయారు చేస్తారు, మరో పెద్దవారు దాన్ని పిల్లల కోసం కొంటారు, కాని పిల్లలకు దాని గురించి ఏం తెలీదు.

కొన్నిసార్లు నేను  యూనివర్సిటీ, కాలేజీలలో విద్యావేత్తలతో ఈ విషయం గురించి చర్చించాను. చిన్నపిల్లలకు కూడా ఓటేసే అవకాశం ఉండాలి అని నేను అన్నపుడు చాలామంది భయంగా చెప్పాలంటే కోపంగా స్పందించారు. ఒకసారి ఒక మీటింగ్‌లో ఒకతను లేచి నిలబడి  ఉద్వేగంతో గొంతు వణుకుతుండగా ఒక ఆరు సంవత్సరాల వయసున్న పిల్లవాడికి ద్రవ్యోల్బణం గురించి ఎలా అవగాహన ఉంటుందనే విషయం నాకైతే అర్థమే కాలేదు' అని అడిగాడు.  నేనన్నాను "యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెంట్‌కే ద్రవ్యోల్బణ సమస్యపై ఏం చెయ్యాలో తెలీదు, చెప్పాలంటే చాలా రాష్ట్రాల పెద్దలకు కూడా తెలీదు, ఒకవేళ తెలిస్తే వారు చేసి ఉండేవారు కదా" అని.

చాలామంది అనుకుంటారు పిల్లలకు ఓటు వేసే అవకాశం ఇస్తే వారు తెలివి తక్కువగా, అమాయకంగా, చిన్న చిన్న కారణాలతో ఓటు వేసేస్తారని, నాకు తెలిసి అవగాహన కలిగి ఓటు  వేస్తున్న వారికంటే చాలా తెలివిగానే వారు ఓటు వేస్తారని నేను అనుకుంటున్నాను. ఒక వేళ అంత తెలివిగా వారు ఓటు వెయ్యలేకపోయినా అది వారిని ఓటింగ్‌కు దూరంగా ఉంచడానికి సరైన కారణం కాదని నా అభిప్రాయం.

ఇప్పుడు ఓటు వేస్తున్న వారు కూడా చాలా అమాయకమైన కారణాలు చూపి అభ్యర్థులను ఎంచుకుంటున్నారనడానికి చాలా ఆధారాలున్నాయి. కాలం గడుస్తున్న కొద్దీ చాలా విషయాలు నేర్చుకున్నారు. ఒక సాధారణ కాగితం మీద 'స్వాతంత్ర్య ప్రకటన' లేదా

'హక్కుల పత్రం' టైప్ చేసి ఇచ్చారు. తర్వాత వాటి మీద సంతకం చెయ్యమని ప్రజలను అడిగినపుడు స్వాతంత్ర్య ప్రకటననే చాలా మంది గుర్తించలేకపోయారు. అవి చాలా అభ్యంతరకరంగా, కమ్యూనిస్ట్ భావాల మాదిరిగా ఉన్నాయంటు చాలా మంది తిరస్కరించారు. కొరియా యుద్ధం ప్రారంభమైన తర్వాత రెండు మూడు సంవత్సరాల్లో సంస్కృతి, విద్యా, సమాజంలో అప్పుడు జరుగుతున్న విషయాలు, ప్రస్తుత సంఘటన గురించిన అనేక విషయాలు చర్చించే ఒక దినపత్రిక ప్రతినిధులు ఒక పెద్ద నగరంలో రోడ్డు మీద కనిపించిన చాలామందిని ప్రపంచంలో ఏం జరుగుతోందన్న ప్రశ్న వేసి సమాధానాలు తీసుకునే వారు. ఒకసారి కొరియా ఎక్కడుందో ఇదమిద్దంగా చెప్పమని అడిగినపుడు – పసిఫిక్ సాగర తీరాన, జపాన్ దగ్గర, చైనా ప్రక్కన వంటి సమాధానాలు చెప్పారు. దాదాపు ఒక్కరు కూడా సరిగా చెప్ప లేకపోయారు. చాలామంది అసలు ఎలాంటి సమాధానం చెప్పలేకపోయారు. ఈ మధ్యకాలంలో అధ్యక్ష ప్రచారం జరుగుతున్న 1972లో వాటర్ గేట్ కుంభకోణం అప్పుడప్పుడే వెలుగులోకి వస్తోంది. నేను ఇది రాస్తున్న సమయానికి (ఏప్రిల్ 1973) అప్పుడప్పుడే ఆ విషయం అమెరికన్ల దృష్టికి వస్తోంది. 1972 ఎన్నికల సమయంలో ప్రతి పత్రికలోనూ, టీవీలోనూ దీని గురించి ఊదరగొడుతున్న సమయంలోనే ఒక సర్వే నిర్వహించినపుడు కేవలం దేశంలోని మూడోవంతు మంది మాత్రమే దాని గురించిన అవగాహనతో మాట్లాడారు. సగం మందికి అదంటే ఏంటో కూడా తెలియదు. అమెరికా రాజకీయాల మీద ప్రజలకు ఉన్న అవగాహన పట్ల ఇదొక ముఖ్యమైన గుర్తింపుగా భావించవచ్చు.

కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో డిస్ట్రిక్ట్‌లో కాంగ్రెస్ ఎలక్షన్ జరిగింది. సభలో ఎప్పటి నుంచో సభ్యుడిగా ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఇండో–చైనా యుద్ధానికి మద్దతు తెలిపాడు; డెమోక్రటిక్ ప్రత్యర్థి, బాధ్యత కలిగిన ఒక మంత్రి దీన్ని వ్యతిరేకించాడు. పాలో ఆల్టో ఒక పెద్ద ధనవంతుల సమాజం, స్టాన్‌ఫర్డ్ యునివర్సిటీ అక్కడే ఉంది, అక్కడి నుంచి చాలా ఎక్కువ డబ్బుని ప్రచారంలో ఉపయోగించారు. ప్రతి చోట వారికి సంబంధించిన కరపత్రాలు, వివరణ పత్రాలు, ఫోటోలు ప్రతి చోట కనిపించాయి. ప్రచారం చేసే వారు కూడా ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రతి విషయాన్ని వెలుగులోకి తెస్తూ ఒక్కో అభ్యర్థి వందలాది ప్రచారాలు నిర్వహించాడు. ఎలక్షన్‌లో రిపబ్లికన్ పార్టీ గెలిచిన తర్వాత కొంతమంది సామాజిక శాస్త్రవేత్తలు వారు నిర్వహించిన ఏ రకమైన ప్రచారం

ప్రజల మీద ఎలాంటి ప్రభావం చూపింది అనే అంశం మీద పరిశోధన చేయాలని అనుకున్నారు. ఆ పరిశోధనలో తేలిందేమిటంటే ఇక్కడ పెద్దపెద్ద ప్రచార అంశాలు ప్రజలు అసలు పట్టించుకోనే లేదు. వారు అభ్యర్థులను ఎన్నుకున్న విధానం ఎలా ఉందంటే కొంత మంది అభ్యర్థి ముఖం వారికి నచ్చడం వల్ల, కొంత మంది అభ్యర్థి పేరు నచ్చడం వల్ల, కొంత అభ్యర్థి వయసులో పెద్దవాడు కాబట్టి మంచి అనుభవం ఉండి ఉంటుందని, మార్పు కోరుకున్నందున, లేదా వారు ఎప్పుడూ డెమోక్రటిక్ పార్టీకి లేదా రిపబ్లికన్ పార్టీకే ఓటు వేసేవారు, ఇప్పుడు మారేందుకు సరైన కారణం లేనందు వలన... ఇలాంటి రకరకాల కారణాలతో వారు ఓటు వేశారు. చాలా మంది ఓటర్లకు ఏ అభ్యర్థులు ఏ పార్టీకి చెందిన వారో, ఏ పార్టీ విధానం ఏమిటి అనేదో కూడా తెలీదు. కొంతమంది యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నవారు కూడా అవగాహన లేక యుద్ధాన్ని సమర్థిస్తున్న వారికి ఓటు వేశారు. కొంతమంది రిపబ్లికన్‌లనుకొని డెమోక్రాట్లకు, అదే విధంగా డెమోక్రాట్లనుకొని రిపబ్లికన్లకు వేశారు. ఇలా సరైన అవగాహన లేకుండా, సరైన సమాచారం తెలుసుకోకుండానే ఓట్లు వేశారు. ఇలా వేసిన వారు విద్యావంతుల సమాజానికి చెందిన వారే మరి. ఎంతో ప్రచారం తర్వాత కూడా ఇలాంటి ఫలితాలు అంటే ఇది నమ్మశక్యం కానీ విషయం.

ఇక విషయమేమిటంటే ఇక్కడ అమాయకత్వం, సమాచారలేమి వంటివి పెద్దల ఓటు వేసే విధానంలో కూడా ఆటంకాలవుతున్నాయి. భూమి బల్లపరుపుగా ఉందని నమ్మేవారు మన అమెరికాలో ఇప్పటికీ ఉన్నారు. వారు కూడా ఓటు వెయ్యవచ్చు. ఇప్పటికి బైబిల్‌లో చెప్పినట్టు ప్రపంచం ఏడు రోజుల్లో తయారు చేయబడిందని, పురుషుడి పక్కటెముక నుంచి స్త్రీ సృష్టి చేయబడిందని... ఇలాంటివన్నీ నిజమని నమ్మేవారు ఉన్నారు. వారు కూడా ఓటు వేయవచ్చు. ఫోర్డ్ మోటార్ కంపెనీ యజమాని హెన్రీ ఫోర్డ్ అతని జీవితంలో చాలాకాలం పాటు "ప్రోటోకాల్స్ ఆఫ్ ద ఎల్డర్స్ ఆఫ్ జియాన్" అనే పౌరాణిక గ్రంథాన్ని నమ్మేవారిలో ఒకరుగా ఉన్నారు. ప్రపంచాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని యూదులు చేసిన కుట్రకు నమోదు పత్రంగా దీన్ని అభివర్ణిస్తారు. ఆయన కూడా ఓటు వెయ్యవచ్చు. ప్రపంచంలోని ఇతర మనుషులందరు యంత్రాలని భావించేవారు కూడా ఉన్నారు. ఇంకా రకరకాల మూఢనమ్మకాలు ఉన్నవారు ఉన్నారు. వారందరూ ఓటు వేసేందుకు అవకాశం ఉంది. మరి పిల్లలనే ఎందుకు మినహాయించాలి? పెద్దలంతా ఓటేయడానికి అర్హులని చెబుతున్న కారణాలకంటే పిల్లలు కూడా ఓటెయ్యడానికి అర్హులని చెప్పడానికి మంచి

కారణాలున్నాయి. రాజకీయ నాయకులకు, కార్యాలయాలు నడిపే వారికి ఈ విషయం బాగా అర్థమవుతోంది. 1972 ఎన్నికల తర్వాత ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమవుతోంది.

కొంతమంది అడుగుతారు "తమ తల్లిదండ్రులు తాము చెప్పిన వారికే ఓటు వెయ్యాలని లేదంటే మీకు శిక్షతప్పదని పిల్లలను బెదిరించే ప్రమాదం ఉంటుంది కదా" అని. పిల్లల పట్ల తమ అభిప్రాయాలు మార్చుకుంటున్న సమాజంలో పిల్లలకు ఓటు హక్కు ఉండాలని వాదించేవారు కొద్ది మంది ఉంటే వారిని వ్యతిరేకించే వారు ఎక్కువ మంది ఉన్నారు. ప్రేమించే, గౌరవించే తల్లిదండ్రుల ప్రభావం అతడి మీద సహజంగా కొంత ఉంటుంది. అయినప్పటికీ తాము ఓటు వేసిన వారికి వ్యతిరేకంగా పిల్లలు ఓటు వేసినా వారు పెద్దగా పట్టించుకోరు. వారు పిల్లల ఉత్సాహానికి, స్వేచ్ఛకు విలువ ఇస్తారు. అదే విధంగా సంబంధాలు ఆరోగ్యకరంగా లేని కుటుంబంలో పిల్లలకు సరైన ప్రేమ, గౌరవం దొరకనపుడు ఇక పిల్లలు బహిరంగంగానే తమ తల్లిదండ్రులను వ్యతిరేకిస్తారు. మనం మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి, ఏమిటంటే మనం ఎన్నో సంవత్సరాలు గడిచినా ఎంతో ఎదిగినప్పటికీ మన తల్లిదండ్రులు ఓటు వేసినట్టుగానే మనం కూడా ఓటు వేస్తున్నాం. మన మీద ఎప్పటికీ ఒక్క రాజకీయాల్లో మాత్రమే కాదు ఎన్నో విషయాల్లో మన తల్లిదండ్రుల ప్రభావం కచ్చితంగా ఉంటుంది. మనం ప్రేమించే, మనలను ప్రేమించే వ్యక్తుల ప్రభావం కచ్చితంగా మన మీద చాలా విషయాల్లో ఉంటుంది. పిల్లల ఓట్లు కూడా అలాగే వారి తల్లిదండ్రుల ప్రభావంతో వేస్తారు. తెలివి తేటలు కలిగిన, గౌరవం కలిగిన వారు వారి పిల్లల మీద సహజంగా ప్రేమను, అభిమానాన్ని, కలిగి వారి మీద తప్పకుండా ఎంతో కొంత ప్రభావాన్ని కలిగి కూడా ఉంటారు. అలాంటి తెలివైన పౌరుల ప్రభావం వారి పిల్లల ఓట్ల ద్వారా హెచ్చించబడి సమాజం మీద మరింత ఎక్కువ ఎందుకు ఉండకూడదు? ఎక్కువ మంది పిల్లలున్న వారి (సహజంగా బీద వారి) ప్రభావం సమాజం మీద ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉంటుంది కదా అనే వారు కూడా ఉన్నారు. అయినప్పటికీ కూడా పిల్లలను ఓటింగ్ కు దూరంగా ఉంచడానికి అది సరైన కారణమేదీ లేదు.

పిల్లలు కూడా ఓటు వేయడానికి వారికి కొన్ని అర్హతలుండాలని వాదించేవారు ఉన్నారు. వారు కొన్ని పరీక్షలు ఎదుర్కోవాలని అనేవారు కూడా ఉన్నారు. నాక్కూడా అది

నిజమే కదా అనిపించింది. కానీ నాకు ఎవరన్నా చెప్పగలరా తెలివి తేటలు కొలవడానికి ఒక ప్రామాణికమైన పద్ధతి ఏదైనా ఉందా? థర్మామీటర్ నోట్లో పెట్టి శరీర ఉష్ణోగ్రత కొలిచినట్టు ఏదైనా పరికరంతో వ్యక్తి తెలివి తేటలు కొలవగలిగే అవకాశం ఉందా? అలాంటి అవకాశం ఉంటే నేను ఈ వాదనను సమర్థించగలను. ఇలా ఓటు వెయ్యడానికి తప్పనిసరిగా ఈ తెలివితేటల పరీక్షను దాటి తర్వాత ఓటువెయ్యాలి అంటే బావుంటుంది. ఇలాంటి వాదనలన్ని కూడా సిద్ధాంత పరమైనవి మాత్రమే. కానీ అలాంటి పరీక్ష ఏదీ అందుబాటులో లేదు. ఒకవేళ అలాంటి టెస్ట్ ఉన్నా అది నిజాయితీగా ఉపయోగిస్తారన్న నమ్మకం కూడా లేదు. మనం ఈ మధ్య కాలపు చరిత్రను పరిశీలిస్తే చదువులేని నల్లజాతి స్త్రీ పురుషులను ఓటింగ్‌కు దూరంగా ఉంచాలని నిర్ణయించారు. కానీ వారి నేర్చుకునే శక్తి, తీర్పరితనం వారిని నిషేధించిన తెల్ల వారి కంటే యాభై రెట్లు మెరుగ్గా ఉన్నాయని తేలింది. నల్లజాతి లాయర్లను యూనివర్సిటీ స్టూడెంట్స్‌ను తమ పేర్లు కూడా సరిగా రాయలేని తెల్లవారు ఓటింగ్‌కు దూరంగా ఉంచుతారు. ఓటు వేసే అర్హత సాధించడానికి కచ్చితమైన పరీక్షేమీ లేదు. కాబట్టి వీటన్నింటికి ఒకే ఒక పరిష్కారం ఓటు వెయ్యాలని ఆశించే అందరికి ఓటు వేసే అవకాశం ఉండాలి. వారికి కావల్సిన సమాచారం అంతా కూడా వారికి అందుబాటులో ఉంచాలి. అది వారు ఓటు వెయ్యడానికి సరైన నిర్ణయం తీసుకోవడానికి ఉపయుక్తంగా ఉంటుంది.

# 18. పనిచేసే హక్కు

ఏ వయసులో ఉన్న పిల్లలకైనా సరే డబ్బు కోసం పనిచేసే హక్కు ఉండాలి. ఆ డబ్బు పై యాజమాన్యం, దాని ఖర్చు, పొదుపు వంటి సర్వ హక్కులు వారికే ఉండాలి. ఈ హక్కు కూడా ఓటు హక్కు మాదిరిగానే ఇది వారంతట వారు నేర్చుకొని స్వతంత్రంగా జీవించే హక్కు. మిగతా ఏ హక్కు ఇచ్చినా ఇవ్వకపోయినా ఈ హక్కు మాత్రం తప్పనిసరిగా పిల్లలకు ఇవ్వాలి.

ప్రస్తుతం ఉన్న బాలకార్మిక చట్టాలు దీనికి ఆటంకంగా ఉన్నాయి. పనిచేసే అర్హత సంపాదించే వయసు తగ్గించినా కూడా ఓటేసే అర్హత మాదిరిగా ఒకటి రెండేళ్లు తగ్గిస్తారు. ఇలా వయసు తగ్గించడానికి ఏ సమాజం కూడా అంత సులువుగా ఒప్పుకోదు ఎందుకంటే దీని వల్ల దరిద్రం, నిరుద్యోగం పెచ్చరిల్లుతాయన్న కారణం చూపుతారు. ఓటు హక్కులాగే ఇది లభించడం కూడా పిల్లలకు కష్టం. వారు ఇలాంటి హక్కును ఈ మధ్యకాలంలోనే పొందిన తమ సీనియర్ మిత్రులను కలిసి పోరాటం చేస్తే తప్ప. సమాజంలో ఎక్కువ మందికి పిల్లలకు అంతటి తెలివితేటలు, అర్హత వచ్చిందని, తమతో పాటు సమానంగా పనిచెయ్యగలరని నమ్మితే తప్ప పెద్దలు వారికి ఈ హక్కు కల్పించే అవకాశం ఉండదు.

చట్టాన్ని మార్చడానికి ముందు సమాజంలోని పెద్దల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. చాలామంది పిల్లలు పనిచెయ్యాలని అనుకోవడానికి చాలా రకాల కారణాలు ఉన్నాయి. వారికి డబ్బు అవసరం ఉంటుంది, వారికి ఇష్టమైన వస్తువులు కొనుక్కునే స్వేచ్ఛ వారికి లభిస్తుంది. వారి భవిష్యత్తు కోసం వారు పొదుపు చేసుకునే అవకాశం దొరుకుతుంది. మనలాంటి వినియోగ సంస్కృతి ఉన్న సమాజంలో డబ్బులేని వారు సమాజానికి దూరమవుతారు. అవసరంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి కొంత స్వంత డబ్బు ఉండాలి. ఇది ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. ధనవంతులైన తల్లిదండ్రుల పిల్లలు ఇప్పటికే రకరకాలుగా డబ్బు సంపాదిస్తున్నారు. ఇలాంటి హక్కు

అందుబాటులోకి తేవడం వల్ల పేదపిల్లలకు చట్టబద్ధంగా డబ్బు సంపాదించుకునే అవకాశం కల్పించడం సాధ్యం అవుతుంది. ఇలాంటి అవకాశం లేకపోవడమనేది దొంగతనాలు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పిల్లలను వాడుకోవడానికి లేదా పిల్లలు అలాంటి వాటికి ట్యూన్ కావడానికి ఒక పెద్ద కారణం. కొంతమంది ఇది సహవాసం అనుకొని, లేదా అది తమ తెలివితేటలు రుజువు చేసే విధానం అని భావించి లేదా తోటివారి ముందు హీరోగా కనిపించడానికి చేస్తారు. మరికొంత మంది తమ జీవితంలోని ఖాళీని పూరించుకోవడానికి లేదా జీవితంలోని బాధ మరిచిపోయి ఆనందంగా ఉండడం కోసం, దుర్బుద్ధి వల్ల, ఇతరులను భయపెట్టడానికి చేస్తుంటారు. కొంతమంది పనిచేసే అర్హత ఉన్నప్పటికీ దొంగతనాలు ఇతర చట్ట వ్యతిరేక పనులు చేస్తుంటారు. కానీ పేదపిల్లలకు పనిచేసే అవకాశం దొరికితే వారు మరింత ఎక్కువ డబ్బు సంపాదించగలుగుతారు.

1950 ప్రాంతంలో పెద్ద పెద్ద నగరాల్లో పిల్లలు గ్యాంగులుగా ఏర్పడ్డారు. ఒక గ్యాంగ్ మరొక గ్యాంగ్‌తో ఎప్పుడూ పోట్లాడుతూ ఉండేవి. 1960 చివరి నాటికి ఈ గ్యాంగ్‌ల వ్యవహారాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. కానీ ఇప్పుడు మళ్ళా ఈ గ్యాంగ్ సంస్కృతి నగరాల్లో విస్తరిస్తోంది. ఇది ఒక భయంకరమైన సమస్యగా పరిణమించే అవకాశం ఉంది. ఈ రోజుల్లోని గ్యాంగులు చాలా పెద్దవి. వాటిలో తిరిగేవారి దగ్గర నిజమైన తుపాకులు తదితర ఆయుధాలు ఉంటున్నాయి. వారు మరింత నేరపూరితంగా, హింసాత్మకంగా ఉంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం ఎలా కనుగొనాలో ఎవరికీ అర్థం కావడం లేదు. వారికి ఎదిగే అవకాశం కల్పించాలి. చాలామంది 1950లో గ్యాంగ్ సభ్యులు గ్యాంగ్ వదలాలంటే ఏం చర్య చేపట్టాలనే అంశాల గురించి రాశారు. చాలా సందర్భాల్లో దీనికి పరిష్కారంగా వారికి ఉపాధి కల్పించడమే మార్గంగా తోచింది. వారికి వారి స్వంత డబ్బు సమకూర్చునే అవకాశం ఉంటే ఫ్యామిలీ నుంచి వేరుపడడానికి, వారి కోసం ఇంటిని ఏర్పాటు చేసుకోవడానికి, పెళ్లి చేసుకొని కొత్త జీవితం ప్రారంభించడానికి అవకాశం ఉంటుంది. ఇలాంటి అవసరం గ్యాంగ్‌లోని సభ్యుడికి ఒక వయసుకు వచ్చేసరికి కలుగుతుంది. ఇక్కడ ఆశ్చర్యం కలిగించే మరో విషయం ఏంటంటే గ్యాంగ్‌లో అందరికంటే వయసులో పెద్దవాడైన గ్యాంగ్ సభ్యుడు తిరిగి జనజీవన స్రవంతిలో కలవాలని అనుకున్నపుడు మిగిలిన వారు అతడిని వదిలేసేవారు, గ్యాంగ్‌లో కొనసాగాల్సిందిగా బలవంత పెట్టేవారు కాదు. ఈ గ్యాంగ్ జీవితం పిల్లల కోసం ఏర్పరచుకున్నదని, ఇక ఇప్పటి నుంచి పెద్దవారు చేసే పనులేవైనా తామూ చేసే అవకాశం ఉండాలి అన్నట్టుగా వారి ప్రవర్తన ఉండేది.

పని అనేది సృజనాత్మకమైనది, సాహసోపేతమైనది మాత్రమే కాదు. ప్రపంచ అన్వేషణలో ఇది ఒక భాగం. స్కూల్లో పిల్లలకు ఎలాంటి పని నేర్పించాలో అర్థం కానప్పుడు

పిల్లలకు తరగతులు ఒక విసుగుగా అనిపిస్తాయి. స్కూల్ గదులను విసుగు కలిగించేవిగా ఎందుకు తయారు చెయ్యాలి? పిల్లలంతా పనిచెయ్యడంలో ఆనందంగా ఉంటున్నప్పుడు, కాస్త సమయమైనా వారికి పనిచేసుకునే వెసులుబాటు ఉంటే బావుంటుంది. పని చేయడం అంటే ఏదో ఆకర్షించే వింత ప్రపంచం. ఎల్లప్పుడు అది పెద్దలకు చెందినది. పిల్లలకు కూడా వారితో కలిసి పనిచేసే అవకాశం లభిస్తే వారిలోని ఒక కొత్త కోణం వెలుగు చూసే అవకాశం లభిస్తుంది, వారు కూడా పెద్దల ప్రపంచంలో తామూ భాగంగా భావించగలుగుతారు. అంతేకాదు తన భవిష్యత్తును చూడగలుగుతాడు. ఒకరోజు అతడు కూడా పెద్దవాడవుతాడు. రోజులో ఎక్కువ సమయం పనిచేస్తాడు. అప్పుడు జీవితం ఎలా ఉంటుందో ఇప్పుడే తెలుస్తుంది.

నాకు తెలిసిన ఒక పిల్లవాడు చాలా చక్కటి మంచి వాతావరణం కలిగిన స్కూల్లో చదువుతూ కూడా సంతోషంగా కనబడేవాడు కాదు. అతడు ఎంత త్వరగా ఉద్యోగంలో చేరదామా అని చాలా ఆసక్తిగా ఉన్నాడు. అతడు ఎలాంటి పని చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. అతడి స్నేహితులు చేస్తున్న ఉద్యోగం చెయ్యడం ద్వారా అతడు తనకు లభించే అలవెన్సు కంటే ఎక్కువ డబ్బు సంపాదించగలిగాడు. ఇక అతడి దృష్టిలో అది అతడి డబ్బు. అతడు చెప్పలేదు కానీ నాకు అనిపించింది.. పనిచేసే చోట పెద్దవారితో అతడికి ఏర్పడిన సంబంధాలు అతడికి భిన్నంగా తోచి ఉండొచ్చు. ఇది వరకు అతడికి పెద్దల విషయంలో ఉన్న ఒకే ఒక సంబంధం ఎలాంటి బాధ్యత లేనిది – అది ఆధారపడడం. పెద్దవారు అతడి పట్ల శ్రద్ధ కనబరచడం మాత్రమే తెలుసు. పనిచేసే చోట కొంతమంది పెద్దలు అతడికి నచ్చి కూడా ఉంటారు, కొంతమంది నచ్చకపోవచ్చు కూడా. ఇదివరకు అతడికి పెద్దవారు చెప్పిన మాట తప్పని సరిగా పాటించాల్సిన పరిస్థితి ఉండేది. ఎందుకంటే వారు చెప్పేదేదైనా అతడి మంచి కోసమే కాబట్టి. కానీ ఒక స్టోర్‌లో పనిచేస్తున్నపుడు అతడు అలాంటి మాటలేవీ వినలేదు. అతడికి ఇది చెయ్ అది చెయ్ అనే ఆజ్ఞలు లేదా ఇలా అలా చెయ్యమని కోరే అభ్యర్థనలు తన బాస్ నుంచి కానీ కస్టమర్ల నుంచి కానీ వినిపించి ఉంటాయి. వారికోసం  అతడు చేసే పనులు వాస్తవానికి ఒక సేవ వంటివి. అవి నిజానికి చిన్నవే అయి ఉండొచ్చు. అంతేకాదు అతడు తన శక్తి సామర్థ్యాలు అందుకు ఉపయోగించాడు. ఆ స్టోర్ ఉన్నది అతడికి సాయం చెయ్యడానికి కాదు, వస్తువులు అమ్మడానికి, సేవలు అందించి డబ్బు సంపాదించడానికి. అక్కడ అతడు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అతడు శ్రద్ధ పెట్టనపుడు "ఎన్నిసార్లు చెప్పాను ఇది ఇలా చెయ్యకూడదని" వంటి మాటలు విని ఉండొచ్చు. లేదా "త్వరగా కానీయ్... ఈ గది వెంటనే శుభ్రంగా  కావాలి" లాంటి మాట, లేదంటే మెచ్చుకోళ్లు, కృతజ్ఞతలు విని ఉండొచ్చు.  కాని అతడు ఆశాజనకంగా లేడు, అతడి వైఖరి బాగాలేదు, అతడు కాలేజిలో

ప్రవేశించలేదు, అతడు సక్సెస్ క్యాండిడేట్ కాబోడు అంటూ అతడిని అనుక్షణం అంచనా వేసి (జడ్జ్ చేసి) స్కూల్లో చెప్పేటటువంటి అస్పష్ట కారణాలు కావివి. స్టోర్‌లో అతడికి చెప్పే పనికి అతడు చేసే దానికి ఆ స్టోర్ బాగోగులకు మధ్య కచ్చితమైన సంబంధం ఉంటుంది. చూడండి, స్కూల్‌కు ఇక్కడికి ఎంత తేడానో! అక్కడ మంచైనా చెడైనా టీచర్లు ఏది మంచి అని ఏది చెడు అని చెబుతారో అదే. కాబట్టే అక్కడ ఏది చెయ్యడానికైనా టీచర్ చెప్పిందన్న కారణం తప్ప మరే సరైన కారణం కనిపించదు.

పని వల్ల ప్రపంచంలో సాధారణంగా మనం గుర్తించగలిగే తేడా వస్తుంది. ఎవరైనా ఒక అదృష్టవంతుడైన అరుదైన పిల్లవాడికి పెద్దలతో కలిసి ఏదైనా ఒకదాన్ని తయారుచేసే, నిర్మించే పనిలో భాగం పంచుకునే అవకాశం దొరకుతుంది. వారు అనేక సంవత్సరాల తరువాత సైతం దాన్ని చూసి 'ఇందులో నా పాత్రా ఉంది' అనుకోగలడు సగర్వంగా. పని అనేది పిల్లలకు పరీక్ష వంటిది. తరచుగా వారికి కొన్ని యంత్రాలు, పని ముట్లను ఉపయోగించి పనిచేయడం ఇష్టంగా, ఆసక్తిగా ఉంటుంది. అలాంటివి స్కూల్‌లో కానీ ఇంట్లో కానీ ముట్టుకునే అవకాశమే ఉండదు. వ్యాక్యూమ్ క్లీనర్ నడిపించడం లేదా మిక్సర్, లేదా పవర్ లాన్ మూవర్ ఉపయోగించడం లేదంటే ఒక ట్రాక్టర్ నడిపించడం కంటే ఆసక్తికరమైన పని పిల్లలకు మరేముంటుంది? ఏ ఆటబొమ్మను వాటితో పోల్చి చూడగలరు? నాకు తెలిసిన ఒక ఎనిమిది తొమ్మిదేళ్ల పిల్లవాడిని వాళ్లింటి ఆవరణలో పవర్ మూవర్‌తో లాన్ కత్తిరించడానికి అనుమతించేవారే కాదు. అది తొయ్యడం అతడికి చాలా కష్టం అయ్యేది, అయినా అది నడపడం, ఆపని చేయడం అతడికి ఇష్టం. వాళ్లింట్లో ఆ పనిచేస్తున్న వారిని తరచుగా చూస్తూ తానుకూడా చెయ్యగలిగితే ఎంత బావుండు అని అనుకుంటూ ఉండేవాడు. కానీ కొన్ని సంవత్సరాల వరకు ఆ పని అతడికి సాధించాల్సిన లక్ష్యంగానే ఉండిపోయింది.

సమ్మర్‌హిల్‌లో చాలామంది పిల్లలకు పనిచేయడం ఇష్టం ఉండదు, బలవంత పెడితే తప్ప ఆట నుంచి పని వైపు మళ్లరు అని అనేవారు. చాలామంది తల్లిదండ్రులు ఇంటి పనిలో తమకు సాయం చెయ్యమని అడిగి అడిగి అలసిపోయిన వారంతా కూడా ఇది నిజమే అని ఒప్పుకుంటారు కూడా. నిజమే కొన్ని పనులు చెయ్యడం పిల్లలకు నచ్చదు. కొన్ని పనులు ముఖ్యంగా ఇంటి పనులు చెయ్యడం దాదాపు ఎవరికీ ఇష్టం ఉండదు. ఎంఎస్ మ్యాగజీన్ విడుదల చేసిన రికార్డింగ్ "ఫ్రీ టూ బీ యూ అండ్ మీ" లో కరోల్ షెయిమింగ్ ఇంటి పనుల మీద. మహిళల మీద పాడిన ఒక హాస్యాస్పదమైన పాట ఆ రికార్డింగ్‌లో ఉంది. అవి మనం టీవీలో అలాంటి దృశ్యాలు చూస్తూ ఉంటాము. అందులో ఆమె ఎప్పుడూ నవ్వుతూ పనిచేస్తూ ఉంటుంది. దాని అర్థం ఆమె సంతోషంగా ఆ పనులన్నీ చేస్తోందని కాదు. ఆమె ఒక నటి, అలా నవ్వుతూ నటించడానికి ఆమెకు

డబ్బు ఇస్తారు. కానీ ఎవరూ కూడా ఇంటి పనిని నవ్వుతూ ఆనందంగా చెయ్యరు. కాబట్టి ఇంట్లో ఉండే ప్రతి ఒక్కరూ వారు స్త్రీలైనా పురుషులైనా అబ్బాయిలైనా అమ్మాయిలైనా తప్పనిసరిగా ఇంటిపనుల్లో భాగం పంచుకొని తీరాలి.

మనం పని గురించి పిల్లల గురించి మాట్లాడుతున్నపుడు మనం వారికి చెబుతున్న పనేంటి? అది ఆట కంటే భిన్నంగా ఎలా ఉంటుంది? అనే దాని మీద ఆధారపడి ఉంటుంది. పనంటే చాలా సీరియస్ విషయం. ఆటంటే అంత ముఖ్యమైంది కాదు అని కొంతమంది అంటుంటారు, కానీ ఏది సీరియస్ విషయమో, ఏది ముఖ్యమైన విషయమో ఎవరు నిర్ణయిస్తారు? పనిచేసేవారా లేదా చూసేవారా? కొంతమంది ఆట ఆడడం, వాయిద్యాలు వాయించడం వంటివి డబ్బు కోసం చేస్తారు. కొందరు సరదాగా చేస్తారు. డబ్బు కోసం చేసేవారు తప్పనిసరిగా దాన్ని సీరియస్‌గా తీసుకోవాలా? రాయడం లేదా సంగీతం వంటి పనులతో డబ్బు సంపాదించే వారికి నిజంగా పనంటే ఏమిటి అనేది తెలియదని ప్రమాదకరమైన, కష్టమైన పనులు చేసేవారు అంటుంటారు. కొంతమంది కొన్ని పనులు మిగతా వారికంటే చాలా సంతోషంగా, ఆసక్తిగా చేస్తుంటారు. చాలావరకు పిల్లలకు  ఇష్టం ఉండని పనులు దాదాపు ఎవరికైనా నచ్చనివే.

నీల్ ఇదే వ్యత్యాసాన్ని పని మరియు ఆట మధ్య చూపించారు. పిల్లల ఆట గురించి రకరకాలుగా ఊహించవచ్చు. కానీ పని విషయంలో ఇది సాధ్యం కాదు. పిల్లలకు వారి ఊహాజనిత జీవితం ముఖ్యమైందే కానీ పని కాదు. ఇందులో కొద్దిపాటి నిజం ఉంది. అంట్లు తోమడాన్ని ఎలా మనం అందంగా ఆనందంగా ఊహించుకోగలం. మరో వైపు ఉత్సాహం లేకపోతే నేను పుస్తకం రాయలేను. ఈ పుస్తకం ఎవరూ కొనరు, ఎవరూ చదవరు అనుకున్నపుడు అది సమయం వృధా తప్ప మరేమీ కాదు అనిపిస్తుంది. అలాగే పిల్లలు చాలా బద్ధకంగా ఉంటారు, సునాయాసంగా అయ్యే పనులు చేసేస్తారు. కానీ కష్టంగా ఉండే పనులు చేయించాలంటే వారిని ఒత్తిడి పెట్టాలి అంటారు. అలా అనేవారు నిజంగా చాలా పొరపడుతున్నారు. నేను మొదటిసారిగా సమ్మర్‌హిల్‌లో ఎంతో చిన్న పిల్లలు కూడా పెద్ద పెద్ద గోతులు తవ్వడం చూసినపుడు ఆశ్చర్యపోయాను. ఈ పని చెయ్యడానికి నిజంగానే చాలా శ్రమ పడాల్సి ఉంటుంది, చాలా  నైపుణ్యం అవసరం ఉంటుంది. అంతేకాదు అంకిత భావం అవసరం ఉంటుంది. ఎందుకంటే ఈ గొయ్యి తవ్వడానికి కొన్ని వారాల సమయం పడుతుంది. మేము ఇక చాలు అని చెప్పేవరకు ఎవరూ కూడా మధ్యలో ఆ పని వదిలేయలేదు.

ఊహానుభూతి ముఖ్యమైనది. పిల్లలు వారి స్వైరకల్పనలకు పగటి కలలకు తోడ్పడేలాంటి, తమకు స్వేచ్ఛ కల్పించేటటువంటి పనులు చేయాలనుకుంటారు. తద్వారా

వారిలో నేర్చుకునే శక్తి పెరుగుతుంది. యూఎస్‌లో మనం పిల్లల నేర్చుకునే విధానాన్ని నెమ్మదింప జేస్తున్నాము, వారి ఊహలకు అడ్డు తగులుతున్నాము. పిల్లలు ఏదో ఒకటి తయారుచేసి అది తిమింగలంలా ఉంది అని అంటారు. ఇక వారు దానితో ఆడుతూ నిజమైన తిమింగలంతో ఆడినట్టుగా ఊహల్లో తేలిపోతుంటారు. వారి లక్ష్యం అక్కడ వారు ఒక తిమింగలాన్ని తయారు చెయ్యడం. అది ప్లాస్టిక్‌తోనా లేక, కాంక్రీట్ తోనా, స్టీల్‌తోనా అనేది వారికి అవసరం లేదు. వారికి వారు చేసుకున్న తిమింగలం బొమ్మ కావాలి. కానీ దాదాపుగా వారికి తయారుగా ఉన్న తిమింగలం బొమ్మ అందుబాటులో ఉంచుతారు. అంటే నా ఉద్దేశం ఆడుకోవడానికి సర్వం సిద్ధంగా ఉన్న ఆటస్థలాల్లో వారిని వదులుతాము. అదే ఆటస్థలాల నిర్మాణ సమయంలో కూడా వారిని అందులో భాగస్వాములను చేయడం వల్ల సరైన ప్రయోజనం ఉంటుంది. తవ్వడం, శుభ్రం చెయ్యడం, అతుకు వెయ్యడం, వెల్డింగ్ చేయడం, కోయడం, కొలవడం, మేకులు కొట్టడం వంటి పనుల్లో వారికి భాగస్వామ్యం ఉంటుంది. ఈ పనులు కొద్ది పాటి కష్టమైనవి కూడా. కానీ ఇక్కడ వారు ఆ పనిలోని వైవిధ్యాన్ని ఆనందిస్తారు. వారికి కావల్సింది వారు స్వయంగా నిర్మించుకుంటున్నారు. అదెలా చెయ్యాలో వారే నిర్ణయించుకుంటున్నారు. వారు కొద్ది అయోమయంలో ఉన్నప్పటికీ, వారు అక్కడ కూలీలు కాదు కళాకారులు. వారు నిర్మించే దానిలో వారి ఊహ కూడా మిళితమై ఉంటుంది. అది నౌక కావచ్చు, లేదా ఒక టవర్ కావచ్చు లేదా హోటల్ కావచ్చు లేదా ఒక సీక్రెట్ క్లబ్ కావచ్చు కానీ అందులో వారి ఊహ మాత్రం కచ్చితంగా ఉంటుంది. చాలా రకాలైన ఉత్సాహవంతమైన పనులు వారి మనసులో అప్పటికే ఊహించి పెట్టుకున్నవి ఎన్నో జరుగుతాయి అక్కడ. బెన్ రోగర్స్‌లా స్టీమ్ బోట్‌ను వీధుల్లో నడుపుతూ వెళ్లినట్లు, నిజమైన బ్రష్‌తో సున్నం వేస్తూ టామ్ సాయర్ కలిసినట్లు ఊహల్లో తేలిపోవడం నిజమైన పని చేస్తున్నప్పుడే సాధ్యం. ఆ స్వైరకల్పనలు అతడికి బాగా ఉపయోగపడతాయి.

మనం చెప్పే చిన్న చిన్న పనులు చెయ్యడం పిల్లలకు ఇష్టం ఉండకపోవడానికి మరో కారణం కూడా ఉంది. మొదటి కారణం వారు సాధారణంగా ఇలాంటివన్నీ వారు ఒంటరిగా ఒక్కరే చెయ్యాల్సి ఉంటుంది. చిన్న పిల్లలు చాలా మంది మీ గది శుభ్రం చేసుకోండి అని చెప్పినపుడు వారితో పాటు నేనో లేక మరొకరో సాయంగా ఉంటామన్నపుడు చాలా సంతోషంగా ఆపని చేయడం నేను గమనించాను. అలాంటి వాటిని ఆటగా, పోటీగా చాలా సందర్భాల్లో మార్చి చూశాము. అలాంటి సందర్భాల్లో వారు చాలా ఉత్సాహంగా చాలా శ్రమ కోర్చి చాలా త్వరగా పనులు పూర్తి చేయడం గమనించాము. చాలా రకాల ఇంటి పనులు చెయ్యడానికి విసుక్కునే పిల్లలు మరొకరితో కలిసి ఈ పనులు చెయ్యమన్నపుడు చాలా సంతోషంగా చేస్తుంటారు.

పిల్లలు మనం చెయ్యండని అడిగిన లేదా పురమాయించిన పనులను నిరాకరించడానికి మరో  కారణం అది అంత అవసరమైంది కాదని వారికి అనిపించడం. మనం చెత్త పడేసి రమ్మని అన్నపుడు అది ఎంత అవసరమైందో మనకు తెలుసు. ఎప్పటికప్పుడు చెత్త బయటపడేయ్యక పోతే వంటిల్లు క్రమంగా చెత్తతో నిండిపోతుంది. మనం మనసులో దాన్ని అలా ఊహిస్తుంటాము. చెప్పాలంటే కొద్ది పాటి దుర్వాసన కూడా వచ్చినట్టు అనిపిస్తుంటుంది. ఈ విషయంలో మనం పిల్లల కంటే ఎక్కువే ఊహిస్తుంటాం. కానీ పిల్లలకు వారి ఊహా ప్రపంచం వారికి వేరేగా ఉంటుంది. మనం ఆ చెత్త బయట పడెయ్యకపోతే ఏమౌతుందో తెలుసా అని మనం అడుగుతాం, అతడికి మాత్రం ఏమవుతుంది, చెత్త అలా మూలపడి ఉంటుంది అంతే కదా అనుకుంటాడు. అల్ఫ్రెడ్ కోర్జిబ్స్కి తన పుస్తకం సైన్స్ అండ్ శానిటీలో మనుషులను 'టైమ్–బైండర్లు'గా అభివర్ణించాడు. పిల్లలు పెద్దల్లో ఈ విషయంలో ఒక తేడా ఉంది. అది పిల్లల కంటే పెద్దలు ఎక్కువ 'టైమ్–బైండ్' చేస్తారు అని ఆయన అభిప్రాయపడ్డాడు.

చాలావరకు మనం పిల్లలకు చెప్పే పనులకు అసలు ముగింపు ఉండనే ఉండదు. అవి ఎప్పటికీ పూర్తి కావు. అదే పనిని పదేపదే చెయ్యాల్సి వస్తుంది. అసలు ఏంటి ఇది అని చాలాసార్లు వాళ్లు ఆలోచిస్తారు. నేను పడుకుంటే మళ్లీ నలిగిపోయే ఈ పక్కను నేను ఎందుకు ప్రతిసారీ సరిచేసుకోవాలి? ఇది అంత అడగరాని ప్రశ్నేమీ కాదు. నిజానికి నాక్కూడా దీనికి సమాధానం తెలియదు. నేను ఈ పక్కను సరిచేసుకోకపోతే ఎవరో ఒకరు సరిచేస్తారు, అసలు వాళ్లు మాత్రం ఎందుకు చెయ్యాలి? దాని అవసరమేంటో నాకు అర్థం కావడం లేదు అనేది మరికొంతమంది పిల్లల ప్రశ్న. ఇలాంటి ప్రశ్నలు వారి మెదళ్లను తొలిచేస్తూ ఉంటాయి. అసలు ఇందులో ఉద్దేశ్యం  ఏమిటి? ప్రతిరోజు రాత్రి ఎవరో ఒకరు పడుకొని చిందరవందర చేసే దాన్ని,  ప్రతిసారీ ఇక దీనిపై ఎవరూ పడుకోరు అన్నంత నీట్‌గా ఎందుకు పెట్టుకోవాలి.

కొంత పని మనం చెయ్యాలి, కొంత పని పిల్లల భాగస్వామ్యంతో చెయ్యాలి. అలా చెయ్యడం వల్ల అది వారు మాత్రమే చేసే పని అని వారికి అనిపించదు. మా నాన్నకు తోటపని చాలా ఇష్టం. మా ఇంట్లో ఎప్పుడు కూరగాయల తోట పెంచేవారు. మా నాన్నగారి నాన్న ఒక రైతు.  ఆయనకు చాలా పెద్ద వ్యవసాయ క్షేత్రం ఉండేది. వారి కుటుంబమంతా కూడా అక్కడ పనిచేసేవారు, ఆయన అన్నగారు ఇప్పటికీ వ్యవసాయమే చేస్తున్నారు. అంటే వారి కుటుంబం భూమితో అనుబంధాన్ని కలిగి ఉంది. ఇది ఒక చిన్న పిల్లవాడికి ఎలా అర్థమవుతుంది? తోట పని అనేదానికి పట్టణ జీవన విధానం చాలా రకాలుగా భిన్నంగా ఉంటుంది. ఇది ఆయనకు నచ్చదు, ఆయన వారి ఊరిలో ఏం చేసేవాడో అది చేయడానికే ఇష్టపడేవాడు. చాలామందిలా ఆయన కూడా ఎలాంటి

వస్తువు ఉత్పత్తి చెయ్యని, దాన్ని అనుభూతించని వ్యాపారంలో ఉన్నారు. కూరగాయలు ఇక్కడ యథార్థం, ఒక చిన్న విత్తనం భూమిలో నాటుతారు. అనంతరం చాలా పనులు చేస్తారు. ఆ తర్వాత దాని నుంచి మొలకెత్తిన మొక్క అందించే కూరగాయలను లేదా ఫలాలను ఉత్పత్తిని కోసుకొని తినవచ్చు. వీటిలో ఏది కూడా ఒక చిన్నపిల్లవాడికి ముఖ్యమైంది కాదు. ప్రపంచంలో ఏదీ ప్రత్యేకమైనదిగా అమూర్తమైనదిగా అతడికి అనిపించదు. ప్రతి ఒక్కటీ కూడా సరిసమానంగా వాస్తవమైందని, దృగ్గోచరమైందని భావిస్తాడు. ఒక కూరగాయలు అనేవి వారికి మిగతా వాటి కంటే పెద్ద అద్భుతమేమి కాదు. తోటలో పని మా నాన్న గారికి చాలా ముఖ్యమైన విషయం. కానీ మాకు మాత్రం అది ఎప్పటికి తెగని, ఎలాంటి లక్ష్యం లేని విషయంగా తోచేది.

తోటపని, చెట్లు పెంచడాన్ని నేను సాధారణమైన ఒక ఆలోచనా విధానాన్ని తెలపడానికి చర్చించాను. అలాంటి పనుల్లో పిల్లలు మనతో కలిసి పనిచెయ్యడానికి ఇష్టపడరు. పిల్లలు ప్రపంచాన్ని ఉన్నదున్నట్టుగా అంగీకరిస్తారు. దాన్ని అన్వేషించడానికి వారికి సరిపడినంత పని ఉంది. ప్రపంచం గురించి తెలుసుకోవాలి, ఇక్కడ జీవించడం నేర్చుకోవాలి, దాన్ని కాస్త మార్చగలిగినపుడు చాలా సంతోషిస్తాడు, ఏ విషయంలోనైనా తనదైన ముద్ర ఉండాలని అనుకుంటాడు, అది వీలుపడనపుడు రాళ్ల మీద బొమ్మలు చెక్కడానికి అయినా సరే ఇష్టపడతాడు. కానీ వీటన్నింటి గురించి అతడికి తొందరలేదు, అనంతమైన జీవితం అతడి ముందుంది. వయసు పెరుగుతున్న కొద్దీ మనకు సమయం చాలా తొందరగా గడుస్తున్నట్టు అనిపిస్తుంది, జీవితం చాలా పరిమితంగా, చిన్నదిగా తోస్తుంది. జీవితం చాలా అశాశ్వతంగా తోస్తుంది. మన తొందరను వారు అర్థం చేసుకోలేరు. వారు పంచుకోనూ లేరు. మనమూ ప్రపంచాన్ని మార్చాలనుకుంటాం, దానికి చాలా చిన్న మార్గాలను ఎంచుకుంటాం, మనం ఉన్న చోటనే మన ముద్ర వేయాలనుకుంటాము. వారికీ మనకూ అదీ వ్యత్యాసం.

సూత్రప్రాయంగా పిల్లలు ఇష్టపడే పనులేమిటో నేను ఇక్కడ ప్రస్తావించాలనుకుంటున్నాను. పిల్లలకు వారి చేతులను వీలైనంతగా వాడే వీలుండాలి, మట్టి ముద్దను కలిపినట్టుగా, వారికి వస్తువులన్నింటిని కలిపేయడం ఇష్టముంటుంది, రంగులు చూడడాన్ని ఇష్టపడతారు. వారికి మార్పు చాలా స్పష్టంగా తెలుస్తుండాలి, వారికి నీటిని ఉపయోగించడం ఇష్టం, పైపు ద్వారా నీళ్లు పట్టడం వారికి చాలా ఇష్టంగా ఉంటుంది. చిన్న చిన్న గుంటలు తవ్వడం, నీటి దారి మళ్లించడం వంటివన్నీ వారికి చాలా చక్కటి పనులు.

చాలామంది చిన్న పిల్లలకు వంట చేయడం ఇష్టముంటుంది. ఎలిమెంటరీ స్కూల్‌లో చదివే పిల్లలకు వంట చేయడం అనేది చాలా ఇష్టమైన పని. వంట చేయడానికి

ఉపయోగ పడే అన్ని వస్తువులూ పదార్థాలు – ఒక గుడ్లు తప్ప మిగిలినవన్నీ కూడా– వారికి చాలా అందంగా అనిపిస్తాయి, మంచి వాసన కలిగి ఉంటాయి. వాటిలో ఏదో ఇంద్రజాలం ఉన్నట్టు ఉంటుంది వారికి, మొదట్లో ఈ వస్తువులన్నీ కూడా ఒక విధంగా కనిపిస్తాయి, తర్వాత కొద్ది సమయానికే వీటి స్వరూపం మారిపోతుంది. వంట పూర్తయిన తర్వాత బయటికి వచ్చేది కుకీస్ లేదా కేకు లేదా మరేదైనా సరే... వారికి అది ఉత్కంఠభరితంగా ఉంటుంది. అంతలోనే వారికి తెలుస్తుంది అదేమిటో తెలియడానికి ఎక్కువ సమయం వేచి చూడాల్సిన అవసరం ఉండదని. అంతిమ పదార్థం ఏదైనా సరే అది త్వరలోనే వచ్చేస్తుందని, దాన్ని వారు తినవచ్చని వారికి తెలుస్తుంది. వంట పని మొదలైనప్పటి నుంచే అతడు తన దృక్పథం, లక్ష్యం విషయంలో చాలా స్పష్టంగా ఉంటాడు. అతడు మనసులో ఊహిస్తుంటాడు – నేను ఇప్పుడు ఫలానాది చూడబోతున్నాను, తర్వాత దాన్ని నేను తింటాను.

పెయింటింగ్ కూడా పిల్లలకు చాలా ఇష్టం. దానికి ఉపయోగించే పనిముట్టు వారి అదుపులో ఉంటుంది, మంచి అనుభూతిని ఇస్తుంది. గోడమీద పెయింట్ బ్రష్ కదులుతున్నపుడు వచ్చే తృప్తి మాటల్లో చెప్పేది కాదు. పెయింట్ చూడడానికి కూడా చాలా మంచి స్వరూపంతో రంగుతో ఆకర్షణీయంగా ఉంటుంది. అదే వారికి చాలా ముఖ్యమైంది. బ్రష్ ప్రతి కదలిక పని పూర్తి చేస్తున్న భావన కలిగిస్తుంది. అసలు పెయింటింగ్ బ్రష్ ఒక ఫాంటసీ వారికి. అంత తరచుగా చెయ్యను కానీ నేనూ ఏదైనా పెయింట్ చేస్తున్నపుడు ఎంత బాగా చేస్తున్నాను అని అనుకోకుండా ఉండలేను.

వాడే పనిముట్లు పరిచయం లేనివిగా, కొంతవరకు ప్రమాదకరంగా ఉండాలి, ఇంకా అందులో మంట లేదా వేడి కూడా ఉండేట్టయితే పిల్లలకు మరింత ఆసక్తికరంగా అనిపిస్తాయి. కోపెన్‌హాగెన్ వెలుపల బ్యాగ్స్‌వాయెర్డ్‌లో ఉన్న 'న్యే లిల్లేస్కోల్' (న్యూ లిటిల్ స్కూల్) వద్ద పిల్లలు వెల్డింగ్ పని చేస్తారు. వారిలో అందరికంటే పెద్దపిల్లల వయసు 14 ఏళ్లు ఉంటుంది. చాలా మంచి వెల్డర్లలో కొందరైతే పదిసంవత్సరాలలోపు వారే. వారిలో కనీసం ఒకరైనా పెద్దవారు చూపినంత వైవిధ్యం కనబరుస్తారు. ఆ స్కూల్లో చాలా ప్రముఖమైన పనుల్లో వెల్డింగ్ ఒకటి. చాలా అమెరికన్ స్కూల్స్‌లో వెల్డింగ్ పరికరం మనకు కనిపించదు. నిజానికి పిల్లలకు ఏదైనా హాని జరిగితే అన్ని రకాల న్యాయ చట్టాలను స్కూలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందువల్ల వెల్డింగ్ వంటి వాటిని స్కూల్లో ప్రవేశపెట్టరు సాధారణంగా. కానీ నాకు తెలిసినంత వరకు న్యూ లిటిల్ స్కూల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీన్ని అన్ని స్కూళ్లలో ప్రవేశ పెట్టవచ్చు. ఎందుకంటే వెల్డింగ్‌లో అయ్యే గాయాలు ఫుట్ బాల్ ఆటలో తగిలే దెబ్బల కంటే తక్కువ ప్రమాదకరం గానే ఉంటాయి.

వారు ఏం చేస్తున్నారో వారికి తెలిసే ఏ పనైనా సరే పిల్లలకు చాలా బావుంటుంది. వ్యాక్యూమ్ క్లీనర్ నడిపించడం కొంత సమయం పాటు వారికి ఆనందంగా ఉండొచ్చు. కానీ ఒకసారి యంత్రాన్ని నడిపించడం మొదలు పెట్టిన తర్వాత పెద్దగా జరిగేదేమి ఉండదు అక్కడ కాబట్టి వారికి  అది అంత బావుండకపోవచ్చు. ఒక్కోసారి వ్యాక్యూమ్ క్లీనర్‌లో ఏదైనా చిక్కుకున్నపుడు అది స్టక్ అవుతుంది. అది చూడడం వారికి నచ్చవచ్చు. వ్యాక్యూమ్ క్లీనర్‌తో పనిచేస్తున్నపుడు చాలాసార్లు మీరు పనిచేసిన చోటుకి చెయ్యని చోటుకి తేడా తెలుసుకోవడం కష్టం. మా నాన్న తోటపనిలో కలుపుతీయడం చాలా విసుగు తెప్పించే పని. అది ఎంతకూ తెగే పనికాదు అనిపించేది. పెద్ద పెద్ద కలుపు మొక్కలతో తోట పాడవుతున్నప్పటికీ మాకు ఆ పనిలో పాలు పంచుకోవాలని అనిపించేది కాదు. అది శుద్ధ దండగలా అనిపించేది. కానీ అక్కడ కూడా ఒక పని నాకు చాలా నచ్చేది. ఒక్కోసారి కొంత గడ్డి తొలగించి మరో మొక్క నాటడానికి నేలను సిద్ధం చేయడం, లేదా ఎరువు వెయ్యడానికి మొక్క మొదళ్లలో కొద్దిగా తవ్వి అందులో ఎరువు వేసి మూసేయడం వంటివి. దీనికి నిజంగానే కొద్దిగా కష్టపడాలి. ఈ పని చేస్తుండగా చూడడం నాకు ఇష్టంగా ఉండేది. ఆ పని చేసి నేను ఎలా చేశానో చూడడం బావుండేది. అది ఎంతవరకు పూర్తయిందంటే నేను చెప్పగలను నేను ఒక పావు వంతు పని పూర్తిచేశాను అని. ఇలాంటిదే లాన్ మూవింగ్ చెయ్యడం  కూడా. పని జరుగుతున్న కొద్దీ తోట రూపం మారుతుంటుంది. ఇలాంటి పని పిల్లలకు నచ్చుతుంది. కర్రను రంపం ఉపయోగించి కోయడం కూడా ఇలాంటిదే. పని చాలా కష్టమైంది, రంపం అంత సులభంగా ఏమీ కదలదు, చేయి నొప్పి నుంచి ఉపశమనం పొందడం కోసం  తరచుగా విరామం తీసుకోవాల్సి రావచ్చు. రంపం చాలా నెమ్మదిగా కర్ర లోపలికి దిగుతుంటుంది, పని చాలా నెమ్మదిగా జరుగుతున్నప్పటికీ రాలుతున్న రంపపు పొట్టును చూస్తే మనకు పని జరుగుతున్నట్టు అర్థమవుతుంది.

ఈ పని లక్ష్యం ఏంటనేది అతడికి అర్థమవుతోంది. పని చెయ్యడానికి బలం, నైపుణ్యం అవసరమవుతూ ఉండి, అతడు చేసే పని కళ్ల ముందు కనిపిస్తూ ఉంటే ఆ పనిని చెయ్యడానికి తప్పకుండా  పిల్లలు ఇష్టపడతారు. పిల్లలకు పని ఇచ్చే ముందు అది అనంతంగా ఉండేది కాకూడదు, అతడు అంచనాకు దొరకనట్టుగా ఉండకూడదు, అతడు ఎంత పనిచేశాడనేది కొలిచేందుకు వీలుగా ఉండాలి అలాంటి పని ఏదైనా ఎంత కష్టమైందైనా సరే వారు తప్పకుండా చేస్తారు. అయితే పెద్ద పని అంటే ప్లేట్ నిండా ఎక్కువెక్కువ వడ్డించిన ఆహారంలా అనిపిస్తుంది వారికి, ఆ లక్ష్యాన్ని వారు పూర్తి చెయ్యగలరని వారికి నమ్మకం కుదరనపుడు దాన్ని ప్రారంభించడం ఎందుకు? అలా వారిలో కొన్ని పనుల పట్ల అయిష్టత వ్యక్తమవుతుంది. మొదట్లో పుస్తకం రాయడం మొదపెట్టాలంటే నాకు ఇలాంటి అడ్డంకులే ఏర్పడేవి, నా ఊహలో పూర్తి పుస్తకపు స్వరూపం రూపుదిద్దుకుంటే కానీ నేను రాయడం మొదపెట్టే వాడినే కాదు.

మనం తరచుగా పిల్లలను మనకు సాయం చెయ్యమని అడగాలి, వారు వచ్చి సాయం చేస్తామంటే చెయ్యనివ్వాలి. వారు సాయం చేయగలిగే వయసుకు వచ్చిన తర్వాతే మన దగ్గరికి సాయం చేస్తామని వస్తారు. కానీ మనం వారికి అవకాశం ఇవ్వడానికి వెనకాడతాం. ఉదాహరణకు ఒక రగ్గును వ్యాక్యూమ్ క్లీన్ చెయ్యడానికి వారు ఆసక్తి చూపుతారు కానీ అందులో కొంత భాగం వారికి  అనుభవం లేనందువల్ల వదిలేసే అవకాశం ఉంటుంది అప్పుడు మళ్లీ మనం చేసుకోవాల్సి వస్తుంది. అది మనకు చాలా కష్టంగా అనిపించి ఎందుకులే మనమే స్వయంగా చేసుకుందాం అని అనుకుంటాము. కానీ పిల్లలు ఆసక్తి చూపినపుడు వారికి అప్పగించడమే తెలివైన పని, మనకు సాయం చెయ్యడం వారికి అంత ముఖ్యం కాదని మనం అనుకుంటూ ఉంటాం, నాకు తెలిసిన ఒక మూడున్నర సంవత్సరాల పిల్లవాడు వాళ్లమ్మ భోజనాల బల్ల సర్దుతుండగా వచ్చి సాయం చెయ్యాలనుకున్నాడు, కానీ ఆమె ప్లేట్లు జారిపడిపోతే పగిలిపోతాయన్న కారణంతో అతడిని సాయం చెయ్యనివ్వలేదు. కానీ ఆ పిల్లవాడు బలవంత పెట్టాడు, ఇక చివరికి ఆమె అతడికి ప్లేట్ జారి పడిపోకుండా రెండు చేతులతో ఎలా జాగ్రత్తగా పట్టుకోవాలో, ప్లేట్ పట్టుకొని ఎలా నడవాలో నేర్పించింది. అందువల్ల అతడు ప్లేట్ బల్ల మీద జాగ్రత్తగా ఎలా పెట్టాలో నేర్చుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతడు ఎప్పుడు ప్లేట్ కింద పడెయ్యలేదు. అంతేకాదు  చాలా విషయాల్లో అతడు సాయంగా ఉంటూనే ఉన్నాడు. ఇది ప్రతిసారీ ఇంత సులభంగా ఏమీ ఉండకపోవచ్చు. పిల్లలందరూ ఒకే మాదిరిగా సాయం చెయ్యలేరు, చాలా సాయంగా ఉండే  పిల్లలు కూడా మనకు అవసరమున్నపుడు సాయం చెయ్యడానికి  సిద్ధపడకపోవచ్చు.

అయినప్పటికి మనం పిల్లలు సాయం చేయ్యడానికి ఆసక్తి కనబరిచినప్పుడు మనం వారికి అలాంటి ఒక అవకాశం తప్పకుండా కల్పించాలి. లేదంటే వారు ఆ అవకాశాన్ని కోల్పోవచ్చు. లేదంటే మనకు వారి మీద నమ్మకం లేదని వారు ఆ పనిచెయ్యలేరేమో అనే భావన కలగవచ్చు. మనకు అవసరమైనపుడు వారి సాయం అడగడం కాకుండా వారు మొదటిసారి సాయం చేస్తామని వచ్చినపుడే ఎందుకు ఒప్పుకోకూడదు? లేదంటే వారు చెయ్యాలనుకునే పని నిజంగానే అంత ముఖ్యమైంది కాదని, అది కేవలం పెద్దవారు మాత్రమే చేసే పని అని వారు అనుకుంటారు.

నేను ఇప్పటి వరకు చెప్పింది మధ్య తరగతి కుటుంబాల్లో పిల్లలు ఇంటి పనిలో సాయం చెయ్యడం గురించి మాత్రమే. పెద్దగా ఉండే పెద్ద కుటుంబాలకు చెందిన పిల్లలు చాలా చిన్న వయసు నుంచే ఇంటి పనిలో సాయం చేయడం మొదలు పెడతారు. పెద్ద వారు మరేదో పనిలో తీరిక లేకుండా ఉండడం వల్ల వారిని బయటికి వెళ్లి మందుల వంటివన్నీ కొనుక్కొని రావడం వంటి పనులు చెయ్యమని అడొగొచ్చు. మెక్సికోలో లేదా

అమెరికాలో  చాలా పట్టణాల్లో ఒకటి రెండు సంవత్సరాల పిల్లలను ఆరు సంవత్సరాల పిల్లలు చూసుకోవడం మనం చూస్తూనే ఉంటాము. ఇదేమన్నా తప్పా? ఎప్పుడూ ఇదే పని పెద్ద పిల్లలు చెయ్యాల్సి రావచ్చు, అందువల్ల అతడికి తన స్వంతానికి సమయం ఉండకపోవచ్చు కానీ అదేమి వారి ఆరోగ్యానికి హానికరం కాదు. చెప్పాలంటే ఇంకా మంచిదే. అలా చిన్న పిల్లలను చూసుకునే పిల్లలు చాలా ప్రేమగా  ఉంటారు, బాధ్యతగా ఉంటారు, చాలా శక్తితో కూడా వ్యవహరిస్తారు.

కానీ పిల్లలు డబ్బు కోసం పనిచేయడం ప్రారంభిస్తే భయంకరమైన బాలకార్మిక వ్యవస్థ రోజులు తిరిగి వస్తాయని వాదిస్తారు కొంత మంది. కానీ అలా జరగకుండా మనం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వారి హక్కులకు భంగం వాటిల్ల కుండా చూడొచ్చు.

పంథొమ్మిదో శతాబ్దంలో చాలా భయంకరమైన బాల కార్మిక వ్యవస్థ రూపొందడానికి కారణాలు ఒకసారి పరిశీలిద్దాం. మొదటి కారణం అప్పుడు పిల్లలకు పని ఎంచుకునే లేదా తిరస్కరించే అవకాశం లేదు. వాళ్లు దాదాపు బానిసల్లా ఉండే వారు. వారి తల్లిదండ్రుల బలవంతం మీద వారు పనిలో చేరేవారు. పేదరికం వల్ల వారు వారి కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టంగా ఉండడం వల్ల వారు అలా తమ పిల్లలను పనిలో పెట్టాల్సిన అగత్యం ఏర్పడేది. అప్పటికే సగం ఆకలితో ఉన్న పిల్లలు పనిచెయ్యకపోతే పూర్తిగా ఉపవాసం ఉండాల్సి వచ్చేది. వారు బానిసల్లా ఉండాల్సిన పరిస్థితి ఉంటే ఇక వారికి ఎంచుకునే అవకాశం ఎక్కడుంటుంది. ఎలాంటి అవకాశాలు ఉండేవి కావు, దొరికిన పని లేదా చెప్పిన పని చెయ్యడం తప్ప మరో మార్గం లేదు.

పేదరికం పిల్లలను బానిసలుగా మార్చింది. అప్పుడు ఇంత మంచి బాలకార్మిక చట్టాలు కూడా లేవు... వారికి విముక్తి కలిగించడానికి. ఇప్పుడు అలా పని చెయ్యాల్సిన అవసరం ఉన్న పిల్లలు చాలా కొద్ది మందే ఉంటారు, కానీ  పిల్లలందరి హక్కును ఇప్పుడున్న ఈ చట్టం హరిస్తుంది. పంథొమ్మిదో శతాబ్దంలో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఎక్కువగా పనిచేసేవారు. కానీ చట్టాన్ని వారికి ఇష్టమైనన్ని గంటలు పనిచేసే అవకాశం ఉండేలా సవరించాల్సి ఉంది. ఇలాంటి అవకాశం కల్పించడం వల్ల వారికి లభించే డబ్బుతో వారు వారికి ఉండే అవసరాలు తీర్చుకోగలుగుతారు. వారికి పనిచేసే అవకాశం లేకపోవడం వల్ల వారు అన్నింటికి ఇతరుల మీద ఆధారపడాల్సి వస్తోంది. అంతేకాదు చాలా పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు వారి సంపాదన లేకపోవడం వల్ల సరైన భోజనం సైతం దొరకడం లేదు, ఇది వారికి భవిష్యత్తులో చాలా నష్టం చేస్తుంది. వారు చాలా విషయాలు స్కూల్లో నేర్చుకుంటున్నారు కానీ ఆ విజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియడం లేదు,ముఖ్యంగా పిల్లలందరిని బాల కార్మిక చట్టాల పరిధిలోకి తేవడం వల్ల

పేదపిల్లలకు డబ్బు సంపాదించుకునే అవకాశం కొరవడి, వారికి ఈ చట్టాల వల్ల మేలు కంటే కూడాఎక్కువ నష్టమే జరుగుతోంది.

బాలకార్మికులకు భయంకరంగా మారేది అక్కడ అప్పగించే పని కూడా అనేది మరో విషయం. అది చాలా కష్టంగా ఉండేది, అది పిల్లల సామర్థ్యానికి మించి ఉండేది. రోజుకు పద్నాలుగు గంటలు ఒక్కోసారి పదహారు గంటల పాటు కూడా పిల్లల చేత పనిచేయించేవారు. అందువల్ల పిల్లలు తరచుగా అపాయంలో పడడం, ఆనారోగ్యం పాలు కావడం జరిగేది. ఇలాంటి పరిస్థితులు పిల్లలకు కాదు పెద్దలకు కూడా ఎదురయ్యేవి. గనులు, మిల్లులు వారికి నరక కూపాలుగా ఉండేవి. పిల్లలైనా పెద్దలైనా సరే యంత్రాల మధ్య చిక్కుకోవడం, రసాయనాలు, ధూళీ వల్ల అనారోగ్యం పాలు కావడం లేదా ప్రమాదాలలో మరణించడం వంటివి సాధారణ విషయాలుగా ఉండేవి. దుస్తుల దుకాణాలలో కుట్టు పనిచేసే మహిళలు తరచుగా తమ చూపును కోల్పోయే వారు. నేను ఈ మధ్యకాలంలో ఒక సర్వే ఫలితాలు విని ఆశ్చర్యపోయాను. ఆర్థికవేత్త, పారిశ్రామిక సలహాదారు అయిన పీటర్ ఎఫ్ డ్రకర్ ఒక వ్యాసంలో రాసిన ప్రకారం దేశంలోని రైలు మార్గాలు వేసిన వలస కూలీల సగటు పని జీవితం (వర్కింగ్ లైఫ్) కేవలం 5 సంవత్సరాలు మాత్రమే. అంటే ఆ తర్వాత వారు పని చేయలేని స్థితిలో పడతారు. మనం ఎంతో గర్వించే మన దేశ ఆధునిక ఆర్థిక వ్యవస్థ మిగిలిన అన్ని పారిశ్రామిక దేశాల ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే పూర్తిగా మానవ ఎముకలు, రక్తంతో నిర్మితమైందే.

ఇక ఈ అన్ని విషయాల మధ్య పిల్లలు నష్టపోవాల్సి వచ్చింది. పిల్లలకు కూడా వారి తల్లిదండ్రుల మాదిరిగానే కూలీ కింద తక్కువ డబ్బే వచ్చేది. దానితో వారి కుటుంబ అవసరాలు తీరడమే చాలా కష్టంగా ఉండేది. అందువల్ల వచ్చిన డబ్బు వారు వాడుకోవడానికి వీలయ్యేది కాదు.

కానీ ఇప్పటికి మన దేశంలో ఒక ధనిక దేశంలో ఉండాల్సిన దానికంటే ఎక్కువ దారిద్ర్యం ఉంది. అయితే ప్రపంచ పారిశ్రామిక పట్టణాలతో పోల్చితే ఈ పంథొమ్మిదో శతాబ్దంలో తక్కువ పేదరికమే ఉండేది. అయినా, పేదరికం ఇంకా బాగా తగ్గించే మార్గాలు అన్వేషించిన తర్వాతే మనం పిల్లలకు పని హక్కు కల్పించగలం. భయంకరమైన బాల కార్మిక వ్యవస్థకు దారి తీసిన దారుణమైన పేదరికం గురించి, ప్రమాదకరమైన, విధ్వంసకరమైన పనులు ఎక్కువ గంటల పాటు పని చేయాల్సిన దుర్భర పరిస్థితి గురించి, పిల్లల చేత బలవంతంగా పని చేయించే పరిస్థితి గురించి అలాంటి సమాజంలో ఎవరూ భయపడరు. అయినా, నేటికి కూడా జీవన ప్రమాణాలు పెంచుకోవడానికి పిల్లలను పనిచేయమని బలవంత పెట్టే అవకాశం లేకపోలేదు. అయితే అది అవసరం అభద్రత

వల్ల కాదు, దురాశ, అసూయల వల్ల మాత్రమే.  కొన్ని కుటుంబాల్లో భర్త రెండు ఉద్యోగాలు , భార్య ఒక ఉద్యోగం చేస్తారు.  అప్పుడే ప్రతి రోజు వారి కళ్ల ముందు టీవీలో కనిపించే జీవితాన్ని గడపడానికి  వారికి అవకాశం ఏర్పడుతుంది. లేదా పిల్లలకు వారు అనుకున్నట్టుగా చదువు చెప్పించడం వంటివి చెయ్యడానికి అవకాశం ఉంటుంది. తద్వారా పిల్లలను సమాజంలో మరింత మంచి స్థానంలో నిలబెట్టాలని ఆశిస్తారు. వారు అలా చెయ్యగలుగుతారో లేదో కానీ ఆ లక్ష్యంతో పిల్లలను కూడా బరిలోకి దించుతారు. అంతేకాదు కొంత మంది పిల్లలు తమ స్వంత అవసరాల కోసం కూడా పనిచేయాలని అనుకుంటారు. కానీ వారి  తల్లిదండ్రులు వారు సంపాదించిన డబ్బు తెచ్చి కుటుంబ అవసరాల కోసం ఖర్చుపెట్టాలని ఆశిస్తారు.  ఇలాంటి పరిస్థితులు మనలో చాలా ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి, ఇలాంటి పరిస్థితుల్లో ఎలా పిల్లల హక్కులు కాపాడగలుగుతాము? వారిని ఎలా రక్షించగలుగుతాము ఇలాంటి తల్లిదండ్రుల బారి నుంచి, ముఖ్యంగా పిల్లలు వారి ఇంటిని వదిలి ఉండలేని లేదా వదిలి ఉండాలని వారు ఆశించని పరిస్థితి ఉన్నపుడు ఏం చెయ్యాలి?

# 19. ఆస్తి కలిగి ఉండే హక్కు

**పి**ల్లలందరికీ కనీసం కొద్దిపాటి ఆస్తి కలిగి ఉండే హక్కు ఉండాలి. ఆస్తి కొనడం, అమ్మడం, డబ్బు అప్పుగా తీసుకోవడం, ఒప్పందాలు చేసుకోవడం వంటి పెద్దలు చేసే అన్ని విధులూ నిర్వర్తించడానికి సంబంధించిన వీలుండే మరింత విస్తృతమైన సంపూర్ణ ఆర్థిక స్వాతంత్ర్యం, బాధ్యతలకు సంబంధించిన హక్కు లాంటిది కాదిది. ఈ రెండో హక్కు అమలు కావాలంటే చాలా సమయం పడుతుంది కాబట్టి కనీసం ఈ లోపు వారు కొంత ఆస్తి కలిగి ఉండే చిన్న హక్కును చట్టం కల్పించాలి. ఈ రెండు చిన్నా పెద్ద హక్కులు వారి ముందు పెట్టి ఏది కావాలంటే చాలామంది బహుశ తమకు చిన్న హక్కు చాలంటారు.

ఈ రోజుల్లో నాకు తెలిసినంతవరకు చట్టం ఒక పిల్లవాడిని మైనర్ అని అంటుంది. ఇక మైనర్‌కు దేనికి యాజమాన్య బాధ్యత తీసుకునే హక్కులేదు. కేవలం అతడికి మాత్రమే చెందేది ఏదీ ఉండదు వారికి. ఒకవేళ వారికి దక్కాల్సింది ఉంటే అది వారి తల్లిదండ్రుల లేదా సంరక్షకుల చేతిలో ఉంటుంది, వారు అతడికి ఇచ్చేద్దామని అనుకునే వరకు. అతడి ఒంటి మీద ఉన్న బట్టలు కూడా అతడి తల్లిదండ్రులు ఇచ్చినవే. వాటిని వారు తీసుకొని పారేసే హక్కు కూడా తల్లిదండ్రులకు ఉంటుంది. తను స్వంతంగా పనిచేసి సంపాదించిన డబ్బు కూడా అతడికి చెందినది కాదు. అతడు సంపాదించిన ఆస్తినంతా కూడా అలా పక్కన పెట్టి అతడికి అర్హత కలిగిన వయసు వచ్చిన తర్వాత మాత్రమే అతడి చేతికి ఇస్తారు. కానీ ఇప్పటికిప్పుడు అనుభవించే హక్కు వారికి ఉండదు.

ఈ రోజుల్లో అధిక ఆదాయ కుటుంబాల్లో చాలావరకు పిల్లలకు చెందినవి ఏవైనా సరే అతడు సంపాదించినది కానీ అతడికి బహుమతుల రూపంలో లభించిన

డబ్బు కానీ తల్లిదండ్రులు వాడుకోడం లేదు. కాని చాలామంది పిల్లలు అది వారు సంపాదించినదైనా వారికి లభించినదైనా వారి తల్లిదండ్రుల అనుమతి లేనిదే అతి స్వల్పంగా తప్ప దాన్ని ఖర్చుపెట్టడానికి ఉండదు. శిక్షగానో లేక సంరక్షణ కోసమో వారి దగ్గరున్న డబ్బును తల్లిదండ్రులు ఎప్పుడైనా తీసేసుకోవచ్చు. వారు ఇవ్వాలనుకున్నప్పుడే ఇవ్వొచ్చు.

ఎప్పుడైనా పిల్లలు తమ తల్లి దండ్రులతో ఫలానా వస్తువు కావాలని అడిగినప్పుడు తల్లిదండ్రులు సాధారణంగా చెప్పే సమాధానం ఇంత చిన్నపుడే నీకు ఎందుకు అది అనో లేక అది నీకు అవసరం లేదనో, లేక ఆ వస్తువు పెట్టుకోవడానికి మన ఇంట్లో స్థలం లేదనో, లేక అది చాలా ప్రమాదకరమైనదనో, లేక అది మంచిది కాదనో, దానితో నువ్వు చాలా త్వరగా అలసి పోతావనో, అందరి దగ్గర ఉంది కాబట్టి కావాలని అంటున్నావనో చెబుతుంటారు. కొన్నిసార్లు ఈ అభ్యంతరాలన్ని కూడా నిజమే అయి ఉండొచ్చు కూడా. అయితే నిజమా కాదా అన్నది కాదు ఇక్కడ విషయం... ఈ చర్చలో చివరకు గెలిచేది తల్లిదండ్రుల మాట మాత్రమే అన్నది. పిల్లలకు ఆస్తి హక్కు ఉండడం అంటే అతడు కావాలనుకున్న కోరుకున్న ప్రతి వస్తువు అతడి దగ్గర ఉంచుకునే హక్కు కలిగి ఉండడం.

ఇది సాధారణంగా ఆలోచిస్తే అంత తెలివిగా అంత సరైందిగా అనిపించకపోవచ్చు. పిల్లలకు ఆస్తి కలిగి ఉండే హక్కుకి, తల్లి దండ్రులు లేదా సంరక్షకుల హక్కులకు మధ్య వివాదం తలెత్తే అవకాశం ఉంది. ఒక వేళ క్వార్టర్స్‌లో లేదా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కుటుంబంలోని పిల్లవాడు తనకు డ్రమ్స్ వంటి చాలా చప్పుడు చేసే వస్తువు కావాలని అడిగినపుడు తల్లిదండ్రులకు వద్దని చెప్పే హక్కు తప్పకుండా ఉంటుంది. అందుకు కారణం వారు స్వయంగా ఆ చప్పుడులో ఉండలేకపోవడం లేదా పరిసరాలలో నివసించే పొరుగు వారికి అంతరాయం కలుగుతుందన్న కారణం కావచ్చు. ఇలాంటి వాటికి బాధ్యత వహించాల్సింది తల్లిదండ్రులే కాబట్టి. ఇలాంటివి కాకుండా పిల్లల అడిగే చిన్న చిన్న కోరికలకు అతి కఠినమైన నియమాలు ఉండకూడదు, వారు ఎటైనా వెళ్లాలనుకోవడం లేదా సమాజంలో మరేదైనా చెయ్యాలను కోవడం వంటి వాటికి వారికి హక్కు ఉండాలి.

పిల్లలకు తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు ఇచ్చిన వాటిపై లేదా తాము స్వయంగా సంపాదించుకున్న దానిపై వారి హక్కుల గురించి చట్టంలో ఒక నిబంధన చేర్చాలని నేను సూచిస్తాను. ఆ ఆస్తిని తనతో అట్టి పెట్టుకొని తన ఇష్టానికి పెద్దల మాదిరిగానే వాడుకునే హక్కు ఉండాలి. అయితే ఆ హక్కు ఇంటి నిబంధనలకు, ఇరుగు

పొరుగు వారి హక్కులకు సమాజ చట్టాలకు ఉల్లంఘనగా ఉండరాదన్న షరతు (పెద్దలకు వర్తించే మాదిరగానే) ఉంటుంది.

ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. పిల్లల ఆస్తిని ఎలా నిర్ణయించి చెప్పగలుగుతాము? ఒక వేళ అతడు డబ్బు సంపాదిస్తే అది కచ్చితంగా అతడిదే. ఎవరి నుంచైనా అతడికి బహుమతిగా లభిస్తే అది అతడిదే. మరి అతడి గదిలో ఉన్న వస్తువుల సంగతేమిటి? వాటిని అతడు అమ్మవచ్చా? లేదా వాటి స్థానంలో కొత్తవి తెచ్చిపెట్టుకోవచ్చా? పెట్టుకోరాదు అతడి తల్లిదండ్రులు ఒప్పుకుంటే తప్ప. మరి అతడి బట్టల సంగతేమిటి? పెరుగుతున్న పిల్లలకు బట్టలు కొనడం చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఒక పిల్లవాడికి బట్టలు కొని ఇచ్చిన తర్వాత ఇక అవి శాశ్వతంగా అతడివేనా? అవి తనకు అవసరం లేదనుకున్నపుడు లేదా తనకు నచ్చనపుడు వాటిని అమ్మెయ్యవచ్చా? దీనికి కూడా నేను అంగీకరించను ఎందుకంటే బట్టలు అతడు వాడుకోవడానికి ఇప్పించినవే అతడి గదిలో ఉంచిన ఫర్నిచర్ మాదిరిగానే. అవి ఇంట్లోని ఇతరులు కూడా వాడుకునే అవకాశం ఉంటుంది, అంటే తన సోదరీసోదరులు వాడుకునే అవకాశం ఉంటుంది. పిల్లలకు తన తల్లి దండ్రులకు చెందిన ఏ వస్తువునైనా సరే అమ్మే హక్కు పిల్లలకు లేదు. ఇంకా చెప్పాలంటే ఒకసారి కొన్న బట్టలు చిన్నవై పోయి అవి ఇక అతడు వాడడానికి ఉపయోగపడకపోతే వాటిని తల్లిదండ్రులు ఇంట్లో ఉన్న చిన్న పిల్లలకు వాడవచ్చు. లేదా అమ్మెయ్యవచ్చు లేక మరి దేనికైనా ఉపయోగించుకోవచ్చు. చదువు, స్కూల్ కోసం ఉపయోగించే ఇతర వస్తువులు, ఆట వస్తువులు ఇతర అన్ని వస్తువులకూ ఇదే వర్తిస్తుంది. తల్లిదండ్రులు ఇచ్చిన వస్తువులలో ఏవైనా దీర్ఘకాలికంగా ఉపయోగపడేవి అయినపుడు అవి వారికే చెందుతాయి. వాటిని వాడాల్సిన అవసరం లేదనుకున్నపుడు వాటిని గురించిన నిర్ణయం తీసుకునే హక్కు వారికి ఉంటుంది.

అయితే ఒక కుటుంబంలోని పిల్లవాడికి స్కూల్‌కు వెళ్లడానికి లేదా ఇతర అవసరాలకు ఉపయోగించడానికి ఒక బైక్ కొన్నారనుకోండి దాన్ని ఆ పిల్లవాడు తన అవసరాలకోసం లేదా ఇతర ఖర్చుల కోసం అమ్మే హక్కు ఉండదు.

ఆటబొమ్మల విషయంలో హద్దులను నిర్ణయించడం కష్టంగా ఉంటుంది. వాటితో పిల్లలకు ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడుతుంది. కాబట్టి అవి అతడి వయసుకు చిన్నగా అయిపోయాయని తల్లిదండ్రులు భావించినప్పటికీ, లేదా ఇంట్లో అతడికంటే చిన్న పిల్లవాడు

అవి ఆశించినప్పటికీ వాటిని ఇచ్చేయవల్సిందిగా అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉండకూడదు. నాకు తెలిసిన  పదేళ్ల పిల్లవాడి దగ్గర అన్ని సైజుల్లో కోవలా అనే ఒక రకం ఎలుగుబంటి బొమ్మలున్నాయి. ఆ జంతువులు అంటే తనకు చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. ఈ బొమ్మలు అతడికి చాలా ముఖ్యమైనవి. వాటన్నిటినీ వరుసలో పెట్టుకొని వాటితో పాటు పడుకోవడం అతడికి అలవాటు. ఒకసారి వాళ్లమ్మ నువ్వు పెద్దయ్యాక వేరే చోటకు వెళ్లి, వేరేగా ఉంటున్నప్పుడు ఇన్ని బొమ్మలు పెట్టుకోవు అన్నది. దానికతడు "అప్పుడు నేను  మరిన్ని కొంటాను" అని చెప్పాడు.  అతడికి తన ఎలుగుబంటి బొమ్మలను తనతో కావల్సినన్ని రోజులు పెట్టుకునే హక్కుండాలి.

చివరగా చెప్పేదొక్కటే. పిల్లలు తాము సంపాదించుకున్నవి, తమకు బహుమతులుగా  లభించినవి అయిన డబ్బు లేదా ఆస్తి ఏదైనా సరే అతడిదే అనే నియమాన్ని చట్టంలో చేర్చాలి. వాటిని అతడు వాడుకోవచ్చు, అమ్ముకోవచ్చు, దానం చేసుకోవచ్చు.

# 20. ప్రయాణం చేసే హక్కు

**పి**ల్లలకు ప్రయాణం చేసే హక్కు, ఇంటికి దూరంగా ఎక్కడైనా నివసించే హక్కు ఉండాలి. ఈ హక్కు దీనికిదే ఒక్కటిగా ఉండటం సాధ్యం కాదు. యాజమాన్య హక్కు, సంపాదించే హక్కు, లేదా డబ్బు పొందే హక్కు వంటి హక్కులు లేకుండా పిల్లలకు వారి ఇష్టమున్న చోటుకి ప్రయాణించే హక్కు, ఇంటికి దూరంగా నివసించే హక్కు ఉండడంలో అర్థం ఉండదు. పిల్లలు ఆర్థికంగా, చట్టపరంగా వారి బాధ్యత వారు తీసుకోగలగాలి, ఇతర హక్కుల గురించి మరోచోట చర్చించుకుందాం. ప్రస్తుతం ఇక్కడ మనం కేవలం ప్రయాణం చెయ్యగలిగే హక్కు గురించి మాత్రమే చర్చించుకుందాం.

చాలా మంది పిల్లలకు ప్రయాణాలు చెయ్యడం ఇష్టముంటుంది. చాలామందికి ప్రయాణించడం అంటే ఒక సాహసంలా ఉంటుంది. ప్రపంచం గురించి తెలుసుకోవడానికి ఇదొక మంచి మార్గం. అలా సముపార్జించిన జ్ఞానాన్ని పుస్తకీకరించడం కూడా బావుంటుంది. మనకు పరిచయం లేని ఒక కొత్త సమాజంలో నివసించడం, తెలియని భాషలో విషయాలు అర్థం చేసుకోవడం వల్ల మనలోని నైపుణ్యం, తెలివితేటలు మెరుగవుతాయి.

పిల్లలకు అవకాశాన్ని కల్పిస్తే వారు చాలా త్వరగా ఎక్కువ ప్రాంతాలు పర్యటించగలరు. చాలా మంది చట్టంతో సహా ఎన్నో కష్టాలు ఉన్నప్పటికీ ప్రయాణాలు చేస్తారు. అమెరికాలోని చాలా రాష్ట్రాలలో లిఫ్ట్ తీసుకుని ప్రయాణించడంపై ఆంక్షలు ఉన్నాయి (ఇలా చేసేవారిని హిచ్‌హైకర్స్ అని వ్యవహరిస్తారు). హిచ్‌హైకర్స్‌ను వాహనాలలో ఎక్కించుకోడం కొన్ని రాష్ట్రాలలో నిషిద్ధం. ఆ వాహనదారులకు శిక్షవేయడం, జరిమానావిధించడం చేస్తుంటారు. అయినప్పటికీ పిల్లలు ఇలా ప్రయాణాలు చేస్తూనే

ఉంటారు. హిచ్‌హైకింగ్ కొన్ని సార్లు ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా మహిళా హిచ్‌హైకర్స్ మీద దాడులు, హత్యలు జరిగేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది కొన్ని సార్లు జరుగుతుంటుంది. కానీ మాములుగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో చనిపోయే వారితో పోలిస్తే ఇలా చనిపోయే వారి సంఖ్య చాలా చాలా తక్కువ. యాంటి–హిచ్‌హైకింగ్ చట్టాలు ముఖ్యంగా టూరిజం ఎక్కువగా ఉండే రాష్ట్రాలలో కఠినంగా అమలు చేస్తుంటారు. అందుకు కారణం పిల్లలను కాపాడటం కోసం కాదు.'బమ్స్', 'హిప్పీలు' వంటి వారిని రాష్ట్రానికి దూరంగా ఉంచే కారణం కావచ్చు, డబ్బుకోసం ప్రయాణికులను హత్యలను నిరోధించడం కావచ్చు.

పిల్లలకు యూరప్‌లో ప్రయాణించడానికి హిచ్‌హైకింగ్ సర్వసాధారణం. దక్షిణ యూరప్ దేశాల్లోని పురుషులకు మహిళ పట్ల ఉండే సాంప్రదాయిక వైఖరుల వల్ల బాలికలు ఈ ప్రాంతంలో మరికొందరి మహిళలతో కలిసి హిచ్‌హైకింగ్ చెయ్యడం కూడా అంత సురక్షితం కాదు. కానీ ఉత్తర యూరప్‌లో ఒంటరి మహిళ కూడా చాలా సురక్షితంగా హిచ్‌హైకింగ్ చెయ్యవచ్చు. ఎక్కువ దూరం ప్రయాణాలు చేయడానికి ఎక్కువ డబ్బు ఖర్చయ్యే పరిస్థితి ఉన్నపుడు ఇలా ప్రయాణాలు చేయడం చాలా మంచి పద్ధతి అని ప్రతి ఒక్కరు ఒప్పుకుంటారు. అయితే టూరిజం పెద్ద వ్యాపారంగా మారిన తర్వాత ప్రయాణీకుల నుంచి ఎక్కువ సొమ్ము సంపాదించడం ప్రజలు నేర్చుకున్నారు. అందువల్ల పేదలు ఎవరికీ అవసరం లేకుండా పోయింది. యూరోపియన్ దేశాల్లో పిల్లలు ప్రయాణాలు చేయడం కష్టంగా పరిణమించింది. ఈ విషయంలో వారు మనకంటే చాలా వెనుకబడి ఉన్నారు. కొన్ని చోట్ల ఇలా ప్రయాణాలు చేసే యువత మాదక ద్రవ్యాలు వాడుతారనే అనుమానం కూడా ఉంది. అసలు విషయం ఏమిటంటే యువత కాస్త అసాధారణంగా కనిపిస్తారు. చాలా మందికి వారు డబ్బు ఖర్చు పెట్టే విధానం మీద అనుమానాలుంటాయి. ఎక్కువగా కొనగలిగే శక్తి లేని వారు ఈ సమాజానికి పెద్దగా అక్కర్లేదు. ఇలా ప్రయాణాలు చేసే యువతలో చాలా మంది నిజానికి అంత పేదవారేమీ కాదు. ప్రయాణాలు చేసే వారంతా కాలేజి విద్యార్థులు. వారి దగ్గర మంచి బైకులు ఉంటాయి. వారు క్యాంపింగ్‌కు కావల్సిన సరంజామా అంతా కూడా కొనగలిగేంత స్తోమత కలిగి ఉంటారు. అయినప్పటికీ వీరు ప్రతి రోజు ఇరవైఐదు డాలర్లు ఖర్చుపెట్టి మోటెల్స్‌లో బసచేయరు, వీరు సాధారణంగా ఏదో ఒక చోట తమ టెంట్ వేసుకొని రాత్రుళ్లు గడుపుతారు. అందుకే అక్కడి వ్యాపారస్తులు, ఇతరులు ఇలాంటి యువతను అడ్డుకోవాలని అనుకుంటారు, ఇది వారి వ్యాపారానికి చాలా చెరుపు చేస్తుంది. వారిని కనుక ఇలాంటి వాటికి దూరంగా ఉంచకపోతే పర్యాటకులు రావడం తగ్గిపోతుంది అనే కారణాన్ని చెబుతారు.

చాలా సంవత్సరాల క్రితం కొలరాడోలో బోధిస్తున్న రోజుల్లో నేను పశ్చిమానికి ప్రయాణిస్తున్నాను, కారు డ్రైవింగ్ చేసుకుంటూ మధ్యలో కార్లోనే పడుకుంటూ నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను. ఒక రాత్రి న్యూయార్క్ మీదుగా ప్రయాణిస్తున్నాను రోచెస్టర్‌కు దగ్గరగా ఉండగా నాకు చాలా అలసటగా నిద్రొస్తున్నట్టుగా అనిపించింది. ఇక డ్రైవింగ్ చెయ్యడం అంత సురక్షితం కాదు అని అనిపించింది. కారు ఎక్కడ ఆపాలా అని చూస్తున్నాను, అక్కడ ఎక్కడా కూడా రెస్ట్ తీసుకోవడానికి సరైన ప్రదేశం దగ్గరలో కనిపించలేదు. కానీ ఒక చోట బాగా గడ్డి పెరిగిన ఒక ప్రాంతం కనిపించింది. వెంటనే కారు అటు వైపు పోనిచ్చి అక్కడే పక్కగా ఆపి నేను నిద్రకు ఉపక్రమించాను. కాసేపటికి ముఖం మీద లైట్ వేస్తూ నన్ను ఒకరు నిద్ర లేపారు. అతడొక ప్రభుత్వ రక్షక భటుడు, అతడు నన్ను అడిగాడు నేను అక్కడ ఏం చేస్తున్నానని, నేను చెప్పాను నేను చాలా దూరం నుంచి డ్రైవింగ్ చేస్తూ వచ్చానని, చాలా అలసటగా, నిద్ర వస్తున్నట్టుగా ఉంటే ఇక్కడ నిద్రపోతున్నానని. అతడు చాలా కఠినంగా నేను అలా రోడ్డు పక్కగా విశ్రాంతి తీసుకోకూడదని అన్నాడు. అలా అనడానికి నాకు కారణమే కనిపించలేదు. అప్పుడు సమయం దాదాపు ఉదయం మూడు గంటలు, చెప్పాలంటే అక్కడ అసలు ట్రాఫిక్ లేనే లేదు. నేను విశ్రాంతి తీసుకుంటున్న ప్రదేశం హైవే నుంచి ఎంత లేదనుకున్నా కూడా దాదాపు 150 అడుగుల దూరంలో ఉంది. నాకు నేను డ్రైవింగ్ చేస్తూ నిద్ర పోతానేమోనని భయంగా ఉందని చెప్పాను. అతడు అప్పుడు చాలా కఠినంగా "నీకు నిద్ర పోవాలంటే వెళ్లి ఏదైనా మోటెల్‌లో పడుకో" అంటున్నాడు, నాకు అనిపించింది అతడు లోకల్ మోటెల్స్‌కు వ్యాపారం అందించడానికి తోడ్పడుతున్నాడని. హిచ్ హైకింగ్ లేదా డ్రైవింగ్ చేసే ప్రయాణికులు రాత్రి బసచేయడానికి అమెరికాలోనూ యూరప్ తరహా సమ్మర్ క్యాంప్ గ్రౌండ్స్ ఉండాలి. అంత అందంగా ఉండవు. టెంట్లు చాలా ఇరుకుగా ఉంటాయి, కానీ ఇది తక్కువ ఖర్చుతో రాత్రి గడపడానికి ఒక మంచి మార్గం, వీటిని ఉపయోగించుకోవడం వల్ల తక్కువ డబ్బులతో యూరప్‌లో ఎక్కువ ప్రాంతాలు తిరిగి చూడవచ్చు.

హిచ్‌హైకింగ్ సులభం, సురక్షితం చెయ్యగల మార్గాలు కొన్ని ఉన్నాయి. వాహనం ఆపితే ప్రమాదం జరిగే ప్రదేశాల్లో కూడా హిచ్‌హైకర్లు లిఫ్ట్ అడుగుతుంటారు. హిచ్‌హైకింగ్‌ను చట్టబద్ధం చెయ్యడం వల్ల మనం వారి కోసం ప్రత్యేకించి సురక్షితమైన ప్రదేశాలను కేటాయించవచ్చు. కాలేజీల వద్ద సదస్సుల వద్ద వాటికి సంబంధించిన వివరాలతో బులెటిన్ బోర్డులు ఉంచాలి.

ప్రయాణికులకు బసచేసే నిద్రించే సౌకర్యం చవకగా అందుబాటులోఉండాలి. యూరప్‌లో చాలా యూత్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. 1951లో నేను 1500

మైళ్ల బైస్కిల్ ట్రిప్ ఒకటి చేశాను. ఇదంతా కూడా ప్యారిస్ నుంచి రోమ్ వరకు సాగింది చాలా రాత్రుళ్లు నేను ఇలాంటి హాస్టళ్లలోనే పడుకున్నాను వీళ్లు ఒక రాత్రికి దాదాపుగా 25సెంట్లు వసూలు చేసేవారు. కాస్త మెరుగైన వాటిలో మరికొంత ఎక్కువ వసూలు చేస్తుండొచ్చు. ప్రయాణికులు రాత్రి బస చెయ్యడానికి ఎక్కువ డబ్బు ఖర్చు లేకుండా దేశంలో ఏ ప్రదేశానికైనా ఏ వయసు వారైనా ప్రయాణం చెయ్యడానికి అవకాశం కల్పిస్తూ ప్రతి దేశంలో ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. ఒక రాత్రి పడుకొని లేచి పొద్దున్న కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి ప్రయాణం కొనసాగించడానికి ఇది బావుంటుంది. 1953లో చాలా ఇటాలియన్ రైల్వే స్టేషన్లలో ఆల్బెర్గో డూయిర్నో అనే పగటి హోటళ్లు ఉండేవి. ఎండాకాలం ఇవి ప్రయాణిలకు వరంగా ఉండేవి. వీటిలో మంచాలు, స్నానాల గదులు అందుబాటులో ఉండేవి. ఇక్కడ కొద్ది సమయం పాటు లేదా ఒక రాత్రి విశ్రాంతి తీసుకోవచ్చు. ఆమ్‌స్టర్‌డామ్, కొపెన్‌హాగన్, కెనడాలోని ఎడ్మాంటన్ లలో నేను ఇలాంటి సౌకర్యాలు చాలా ఎయిర్‌పోర్టుల్లో చూశాను. వీళ్లు కొద్దిపాటి ఫీజు వసూలు చేస్తారు కానీ హోటళ్లతో పోల్చినపుడు చాలా తక్కువ ఖర్చు అవుతుంది.

తల్లిదండ్రులు వెంట లేకుండా పిల్లలు ఒంటిరిగా ప్రయాణాలు చేస్తే వారు తప్పిపోరా? అవును, అలాంటి అవకాశం ఉంటుంది. ఇప్పుడు పెద్దలు కూడా తప్పిపోతున్నారు. ఇదొక చిన్న సమస్య కావచ్చు. పెద్ద విషాదం లేదా ఘోరం మాత్రం కాదు. పిల్లలకు ఇంటితో, లేదా స్నేహితులతో సంప్రదించే మార్గాలు తెలిసుండాలి, అతడితో పాటు అతడి పేరు అడ్రసు వెంట ఉండాలి. ఇలాంటి జాగ్రత్త తీసుకున్నపుడు కొద్ది సమయం పాటు గందరగోళానికి గురైనా, అతడికి పెద్దగా హాని ఉండదు. ఒక వేళ అతడికి ఇంటిని కానీ, స్నేహితులను కానీ సంప్రదించడం తెలియకపోతే ఎలా? అని కొంత మంది అడుగుతారు. ఈ మాత్రం సమాచారం కూడా లేకుండా పిల్లలు దూరప్రయాణం చేయడమంటే అది లెక్కలేనితనం అవుతుంది. దానికి తల్లిదండ్రులు కానీ ప్రభుత్వం కానీ ఎవరూ ఏం చెయ్యలేరు. అయితే నేను ప్రతిపాదించిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిన తర్వాత కూడా ఎలాంటి లోపం లేకుండా పొరపాట్లు జరగకుండా ఉంటుందన్న గ్యారెంటీ ఏమీ లేదు. పిల్లల దగ్గర వారికి సరిపడా డబ్బు ఉండాలి, వారు దగ్గరలో ఉన్న బస్ స్టేషన్, ఎయిర్‌పోర్టుకు చేరుకొని టికెట్ కొనుక్కోగలిగేలా ఉండాలి.

ప్రయాణాలు చెయ్యాలనుకునే పిల్లల కంటే కూడా పెద్దవారే ఎక్కువ సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తోంది. నేను విమానాలలో చూశాను పూర్తిగా పక్షవాతం వచ్చి వీల్‌ఛైర్‌లో

ఉండేవారు, అంధులు ఎవరో ఒకరి సహాయం లేకుండా ప్రయాణాలు చెయ్యలేరు. అందుకని వారిని ప్రయాణాలు చెయ్యకుండా నిరోధించలేము, వారికి కావల్సిన సాయం పొందడానికి కావల్సిన సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. వారికి సాయం చేయడానికి కావల్సినంత మందిని అందుబాటులో ఉంచడం కూడా సాధ్యపడకపోవచ్చు. ప్రపంచం చాలా పెద్దది, అది చాలా గందరగోళంగా, అపరిచితంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని మార్చడానికి మనం చేసిందేమీ లేదు. సరైన సైన్ బోర్డులు, మ్యాపులు ఇతర సమాచారం అందించే సౌకర్యాలు కల్పించడం ద్వారా దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించడమైనా సులభతరం చెయ్యవచ్చు. మన ప్రపంచం అనుకున్నంత రహస్యమేమీ కాదు, కానీ మనం దాన్ని పిల్లలకు మన ఇల్లు కనీసం పొరుగిల్లు మాదిరిగా అందుబాటులో ఉంచాలి. ప్రయాణాలు చేయడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఇప్పటికీ చాలామంది పిల్లలు తమ తల్లిదండ్రులే ఒక దూర ప్రయాణం చెయ్యవల్సిందిగా ప్రోత్సహించినప్పటికీ, లేదా ఎవరైనా దూరప్రాంతాల్లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి రమ్మని అన్నప్పటికీ అలా ఒంటరిగా వెళ్లడానికి ఆసక్తి చూపరు, భయపడతారు, చెప్పాలంటే వెళ్లలేమని తిరస్కరిస్తారు. అలాంటి పిల్లలు ప్రయాణాలు చెయ్యకపోవడమే మంచిది. ఇలాంటి పిల్లలు ఒంటరిగా బయటికి పంపడం అంత సురక్షితం కాదు కూడా.

ఒకవేళ తల్లిదండ్రుల అనుమతితో సంబంధం లేకుండా ఇలా పిల్లలకు ప్రయాణించే హక్కును కల్పించడం వల్ల వారిపై తల్లిదండ్రుల అదుపు తప్పిపోతుందని భయపడాల్సిన అవసరం లేదు. నేను ప్రతిపాదించిన ఏ ప్రతిపాదన వల్ల కూడా పిల్లల మీద సహజంగా పెద్ద వారికి ఉండే ఏ అదుపూ తప్పిపోదు, చెప్పాలంటే అది ఇంకా బలోపేతం అవుతుంది.

పిల్లలు ఈ సహజమైన అదుపు నుంచి వేరుగా ఉండలేరు. దాని ఆధారంగా వారు ప్రపంచంలో వారి స్థానాన్ని తెలుసుకుంటారు. ఇక్కడి నుంచే వారు మరింత విశాలమైన సమాజాల్లోకి ప్రవేశించడానికి అస్కారం ఉంటుంది. వారికి అధికారం మీదున్న నమ్మకం చాలా గొప్పది. ఒకవేళ ఎప్పుడైనా తల్లిదండ్రులు కోప్పడినా, శిక్షించినా పిల్లవాడికి ఆ సమయంలో చాలా కోపంగా ఉంటుందేమో. కాసేపు అలుగుతాడేమో కూడా. కానీ చాలా త్వరగా తిరిగి మామూలై పోతాడు. అతడు అలకలో ఉన్నపుడు అతడిని అటంకపరచకుండా కావల్సినంత సమయం ఇవ్వాలి. అతడు ఏం చెయ్యాలో అతడినే నిర్ణయించుకోనివ్వాలి. మన నియమాలు ఒప్పుకొమ్మని ఒత్తిడి చెయ్యకూడదు. పిల్లవాడు తనంతటతానే దానికి అంగీకరిస్తూ తగ్గి వస్తాడు. చిన్న పిల్లవాడైతే త్వరగానే వస్తాడు, కాస్త పెద్దవాడైతే మాత్రం కొద్దిగా సమయం తీసుకుంటాడు. తిరిగి స్నేహపూర్వకంగా దగ్గరికి

చేరుతాడు. తెలివైన, ప్రేమ కలిగిన తల్లిదండ్రులు అలాంటి సందర్భాల్లో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారు. కానీ కొంత మంది అలా చెయ్యరు, పిల్లవాడి దగ్గర నుంచి మరోసారి అలా చెయ్యననే మాట కావాలంటారు, లేదా తనను తాను నిరూపించుకోవాలంటారు. నిజానికి ఇలా చెయ్యడం చాలా తప్పు. కానీ చాలా మంది తల్లిదండ్రులు ఈ తప్పు చేస్తుంటారు. దాంతో పిల్లలు సంధికి రావడం నెమ్మదిగా తగ్గిస్తారు. ఇలా సంధికి వెళ్లడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని పిల్లలు భావిస్తారు. ఇక స్పందించడం మానేసి వీలైనంత వరకు ఇలాంటి సమస్యకు దూరంగా ఉండాలని అనుకుంటారు.

ఉదాహరణకు ఒక పిల్లవాడు ప్రయాణం చెయ్యాలనుకున్నాడు. కానీ అతని తల్లిదండ్రులు అందుకు నిరాకరించారు. ఏం జరుగుతుందో ఒకసారి మనం ఊహిద్దాం. ఒకరోజు పిల్లవాడు వచ్చి తల్లిదండ్రులతో తను ఒక ట్రిప్పు వెళ్లాలనుకుంటున్నట్టు చెప్పినపుడు నిజంగా సహజమైన ప్రేమాభిమానాల ద్వారా లభించిన సహజమైన అధికారం ఆ కుటుంబ సభ్యుల మధ్య ఉంటే ఆ తల్లిదండ్రులు పిల్లవాడి మాటను కొట్టిపారెయ్యరు. అతడి మాటను పూర్తిగా వింటారు, ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నాడు, ఎప్పుడు, ఎలా వెళ్లాలనుకుంటున్నాడు అనే విషయాలు అతడిని చెప్పనిస్తారు. ఒక వేళ వారికి అది నచ్చకపోతే అప్పుడు ఎందుకు అని అడుగుతారు. ఎప్పుడైనా పిల్లలు ఎక్కడికైనా వెళ్లాలని కానీ, ఏదైనా పని చెయ్యాలని కానీ అనుమతి అడిగినపుడు ఇలాంటి చర్చ జరుగుతుంది. కానీ నిజానికి పిల్లవాడికి తల్లిదండ్రుల అనుమతి అంతగా అక్కర్లేదు కానీ అతడు కొంత సమయం తల్లిదండ్రులను ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు. తల్లిదండ్రులు అతడిని ఒప్పించడానికి ప్రయత్నిస్తారు, ఈ మొత్తం చర్చ ఎవరి మాట చివరిది కావాలనే దాని ప్రకారం ఈ మొత్తం చర్చ జరుగుతుంది.

ఒకసారి నేను ఒక పదకొండు సంవత్సరాల పిల్లవాడికి అతడి తల్లికి మధ్య జరిగిన ఒక సంవాదాన్ని వినడం తటస్థించింది. ఆ పిల్లవాడు ఒకటి రెండు రోజులపాటు కొండ ప్రాంతాల్లోని ఒక క్యాంపుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్ళాలనుకున్నాడు. ఆమె చాలా రకాల అనుమానాలు, బాధ వ్యక్తం చేసింది. ఆ సంవత్సరంలో చాలా మంచు తుఫాన్లు వచ్చాయి కొండ ప్రాంతాల్లో కాబట్టి ప్రమాదకరం అని చెబుతూ అలాంటి ప్రమాదాలు మీరు ఎలా ఎదుర్కోగలరు అని కూడా ప్రశ్నించింది. అలాంటి ప్రదేశాల్లో నివసించడం అతడికి అతడి స్నేహితులకు కానీ పూర్తి పరిజ్ఞానం ఉందా అని అడిగింది. ఎన్ని బట్టలు తమ వెంట తీసుకెళ్లాలి? రాత్రి పూట చలి చాలా ఎక్కువగా ఉంటుంది, అందరు పడుకోవడానికి వారి దగ్గర ఎన్ని స్లీపింగ్ బ్యాగ్‌లు ఉన్నాయి? మరి వంట ఎలా?

ఏం తింటారు? మూడు రోజుల పాటు ఎలా గడుపుతారు? ఇలా వారి చర్చ కొనసాగింది చాలా రోజుల పాటు. తల్లీకొడుకులిద్దరు వారివారి వాదాలతో కయ్యానికి కాలు దువ్వుతున్నట్లు ఉండేవారు. అతడు ఆ పని చేయగలుగుతాడు అని ఆమెకు నమ్మకం కుదిరేదాకా ఇలా నడిచింది. నిజానికి తను అతడిని ఆపలేననే విషయం ఆమెకు అర్థం అయ్యేవరకూ అని చెప్పాలి. ఆమె అధికారం హక్కు చాలా సహజమైంది. అది తన శక్తి చూపాలన్న ఉద్దేశ్యంతో కూడినది కాదు.

చివరకి అలా వెళ్లడానికి ఆమె ఒప్పుకుంది. కానీ తుపానుగా ఉండడం వల్ల ఒక్కరోజుకి వాయిదా పడింది. నెమ్మదిగా ఇద్దరూ రాజీకి వచ్చారు. సరే నువ్వు వెళ్లవచ్చు, కానీ జాగ్రత్తగా తిరిగి రావాలి అనే ఒప్పందం మీద. కానీ ఆచరణలో చాలా తప్పులు జరిగాయి. పిల్లలకు  అనుభవం లేకపోవడం వల్ల పొగమంచు వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారు టెంట్ల బయటే నిద్రించారు. వారు అనుకున్నదానికంటే ఎక్కువ చల్లగా, తడిగా ఉంది బయట. ఇలా జరుగుతుందనుకుంటే ఈ ట్రిప్ ఉండేది కాదు. ఈ క్యాంపు తర్వాత ఒక పిల్లవాడు చెప్పాడు అక్కడ మేము అసలు ఊహించని వెయ్యి విషయాలున్నాయి. అవి మాకు క్యాంపింగ్ చేస్తుంటేనే అర్థమయ్యాయి వాటిని అసలు ఊహించను కూడా ఊహించలేదని చెప్పాడు. అందుకే అనుభవం గొప్పదంటాను నేను.

ఒకవేళ పిల్లలకు తల్లిదండ్రుల అనుమతి లేకుండా ప్రయాణించగలిగే హక్కు చట్టబద్ధంగా కల్పించినప్పటికీ ఇప్పుడు మనం చెప్పుకున్న క్యాంపింగ్ కార్యక్రమం ఇలాగే జరిగి ఉండేది. అప్పుడు కూడా వారికి పెద్దల సలహాలు, సహాయం తప్పకుండా కావాలి.

ట్రిప్‌కు వెళ్లడానికి ముందు పిల్లలు వారి టెంట్‌ను ఇంటిపక్కన ఒక గడ్డి నేలమీద వేసి చూసుకున్నారు.ఎలా ఉంటుంది, అది వేయగలుగుతామా లేదా అని తెలుసుకోవడానికి. ఇక మరో కుటుంబంలోని మరో పిల్లవాడు ఒక దీర్ఘమైన క్యాంపుకు వెళ్లడానికి ముందు అతడు తన తండ్రి, అన్నతో కలిసి ఇంటి బయట టెంట్ వేసుకొని అక్కడ పడుకున్నాడు. బయట పడుకోవడం ఎలా ఉంటుందో  తెలుసుకోవడానికి. ఇక్కడ నేను చెప్పదలచుకున్న దేమిటంటే ఇలా పిల్లలు కొత్త కొత్త అనుభవాలు  పొందాలనుకుంటారు అని మాత్రమే. అన్నీ ఒకేసారి కావాలని కూడా అనుకుంటారు కూడా. వారు తెలియని విషయాలు అన్వేషించాలనుకుంటారు. అంతేకాదు వారు కొద్దిపాటి సంప్రదాయబద్ధంగా ఉండాలని కూడా అనుకుంటారు. అప్పటి వరకు ఏ పిల్లవాడు కూడా ఇల్లు వదిలి వెళ్ళిపోయి ఉండడు. లేదా మూడు నెలల పాటు ఇంటికి దూరంగా ఉండే వందమైళ్ల ట్రిప్పు గురించి కూడా ఆలోచించి కూడా ఉండడు. ఒక పాత నానుడి ఉండనే ఉంది కదా పిల్లలు

ఇంట్లోంచి పారిపోడం గురించి... పొద్దున్న అలా ఇల్లు వదిలి వెళ్లిన పిల్లవాడు మూలమలుపు దాటి పోలేడు. ఎందుకంటే అతడికి ఆ వీధి దాటడం తెలియదు, లేదా రాత్రి భోజనానికల్లా ఇల్లు చేరుకుంటాడు. ఎందుకంటే అతడికి రాత్రి భోజనం ఎక్కడ చెయ్యాలో అర్థం కాదు అని. అయితే ఇక్కడ ప్రశ్నేమిటంటే పిల్లలు స్వతంత్రంగా అడుగు బయటపెట్టడాన్ని మనం ప్రోత్సహించాలా లేదా వారిని నిరోధించాలా అనేది. చాలామంది వారి పిల్లల అన్వేషణా పటిమను గౌరవిస్తారు, వారి అభిప్రాయాలు శ్రద్ధగా వింటారు. చాలా తీవ్రమైన విషయాలకు మాత్రమే అభ్యంతరాలు చెబుతారు, అవసరమైన చోట రాజీ మార్గాన్ని అవలంబిస్తారు. ఎందుకంటే వారు గట్టిగా అభ్యంతరపెట్టినప్పటికీ పిల్లలు ఆ పనిచేసి తీరతారని అనుకున్నపుడు మన మార్గదర్శకత్వంలో వారు పని చేస్తూ పోవడం మంచిది కదా.

పిల్లలు వారు కావాలనుకున్నప్పుడు మన నుంచి వారి స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛని తీసుకోగలరని మనకు అనిపించినపుడు ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ముందు నుంచే వారిని సంసిద్ధం చేయడం అవసరం. ఎప్పుడైనా సరే పెద్దలు తమని ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్తారన్న విషయం పిల్లలకు అర్థమై ఉంటే వారు ఎలా వెళ్తున్నారనే దాని మీద పెద్దగా శ్రద్ధ నిలపరు. పెద్దవారు కూడా వారికి ఆ విషయం గురించి నేర్పించాలని అనుకోరు. తప్పని సరి పరిస్థితుల్లో మాత్రమే పిల్లలు తాము ఎలా వెళ్లాలి, ఎక్కడికి వెళ్లాలి అనే దాని మీద శ్రద్ధ నిలుపుతారు, నేర్చుకుంటారు. ఒక తల్లి ఆమె ఏడేళ్ల కుర్రాడు ఇక్కడ బోస్టన్ నగరంలో ఒక ఆసక్తికరమైన ఆట ఆడుతుండగా నేను చూశాను. వారు ఇంటికి వెళ్ళే సమయంలో ఇద్దరు రెండు వేర్వేరు దారుల గుండా ఇంటికి వెళ్లాలి, వారిలో ఎవరు ముందుగా చేరుకుంటారనేది పోటీ. ఇది నిజానికి పోటీ కాదు కానీ ఇంటికి వెళ్లే వివిధ దారులను పరిచయం చెయ్యడం. అందువల్ల అతడికి తన పరిసరాలతో పరిచయం ఏర్పడుతుంది. ఇలాంటి చిన్న చిన్న ప్రయాణాల ద్వారా మనం పిల్లలకు మార్గదర్శనం చెయ్యవచ్చు, మనకు ఏమీ తెలియనట్టు అతడే మనను ఇంటికి తీసుకువెళ్ళాలని చెప్పడం వంటి చిన్న చిన్న ఆటల ద్వారా పిల్లలకు ప్రపంచాన్ని పరిచయం చెయ్యవచ్చు.

# 21. సంరక్షకుడిని ఎంచుకునే హక్కు

**పి**ల్లలు వారు ఎంపిక చేసుకోడానికి నేను మూడు ప్రత్యామ్నాయాలు సూచిస్తాను. 1. వారు ఇప్పుడు ఎలా ఉన్నారో అలాగే వారి తల్లిదండ్రుల (వారు సహజమైన లేదా పెంచుకుంటున్న వారు) సంరక్షణలోనే ఉండడం. నేను వీరికి ప్రాథమిక సంరక్షకులు అనే పేరు పెట్టాను 2. తల్లిదండ్రులు కాకుండా వారు ఎంచుకున్న వారి సంరక్షణలో ఉండడం వీరిని ద్వితీయ సంరక్షకులు అంటారు. 3 పూర్తి స్వతంత్రంగా, ఆర్థికంగా, చట్టపరంగా పూర్తిగా పెద్దవారిలా ఎవరి మీదా ఆధారపడకుండా జీవించడం. ఈ మూడు రకాలలో ఏదో ఒక దాన్ని ఎంచుకునే హక్కు పిల్లలకు ఉండాలి. ఈ అధ్యాయంలో ఈ మూడు అవకాశాల గురించి చర్చించాలనుకుంటున్నాను.

ఇప్పుడు కూడా ఎగువ మధ్య తరగతి లేదా ధనిక కుటుంబాల్లో చాలా మంది పిల్లలు వారి తల్లిదండ్రుల వద్ద  కాకుండా చట్టపరంగా లోకో పేరెంట్స్ అని పిలిచే వారి వద్దే పెరుగుతున్నారు. డబ్బున్న వారు  పిల్లల పెంపకం లోని కష్టాలను అనుభవించాల్సిన పనిలేదు. తమ పిల్లలను పెంచడానికి వారు ద్వితీయ సంరక్షకులను కొంటారు. కానీ చాలా మందికి అంత స్తోమత ఉండదు. నేను ఇలాంటి సెకండరీ గార్డియన్స్ చాలా ఎక్కువ మంది, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండాలని సూచిస్తాను. ఇంకా చెప్పాలంటే పిల్లలు తమ సంరక్షకులను తామే ఎంచుకోగలిగే అవకాశం కూడా ఉండాలి. ఇలా పిల్లలు ఎంచుకునే సెకండరీ గార్డియన్స్ రెండు రకాలుగా  ఉండవచ్చు 1 ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబము, 2 ఒక గ్రూప్ లేదా ఒక కమ్యూనిటి.

ఈ ప్రైమరీ (ప్రాథమిక), సెకండరీ (ద్వితీయ) సంరక్షకుల మధ్య ఉండే తేడాను మనం ఒకసారి కూలంకషంగా చర్చించుకుందాం. సెకండరీ సంరక్షకులను ఎంచుకునే

సమయంలో పిల్లలకు, సెకండరీ సంరక్షకులకు మధ్య ఒక ఒప్పందం ఉండాలి. వీరిద్దరి మధ్య జరిగిన ఈ ఒప్పందం ఎప్పుడు రద్దు అవుతుందనేది అందులో చాలా స్పష్టంగా ఉండాలి. ఒకవేళ ఎలాంటి గడువు తేదీని పేర్కొని ఉండకపోతే అది ముగిసిపోదు, అది అలాగే కొనసాగుతుంది. లేదంటే వారు ఒప్పందం తయారు చేసుకునే సమయంలోనే ఒక నెల లేదా ఒక సంవత్సరం లేక కొన్ని సంవత్సరాలు అని నిర్ణయించుకోవాలి. ఆ సమయం తర్వాత మాత్రమే వారు ఒప్పందం రద్దు చేసుకోవడానికి లేదా కొనసాగించడానికి అవకాశం ఉంటుంది. అంతే కాదు వారు ఎంచుకున్న సమయంలో ఒప్పందం రద్దు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఇది విద్యార్థులు యూనివర్సిటితో చేసుకునే ఒప్పందం మాదిరిగానే ఉంటుంది. ఈ ఒప్పందం ఒక నిర్ణీత సమయం వరకు ఉంటుంది. ఒక అండర్ గ్రాడ్యుయేట్ కాలేజిలో అయితే అది నాలుగేళ్లు ఉంటుంది. ఎలాంటి అభ్యంతరాలు లేకపోతే ఆ విద్యార్థి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే దాకా అక్కడే ఉండవచ్చు. కానీ విద్యార్థి తాను ఆ కోర్సు పూర్తిచెయ్యదలచుకోకపోతే మధ్యలో కాలేజి విడిచి వెళ్లవచ్చు, లేదా కాలేజికి ఏదైనా అభ్యంతరం ఉన్నపుడు కాలేజీ కూడా విద్యార్థిని కాలేజి విడిచి వెళ్లాల్సిందిగా కోరవచ్చు. అయితే ఇక్కడ కాలేజీ విద్యార్థి దగ్గర నుంచి డబ్బు తీసుకుంటుంది కాబట్టి విద్యార్థిని కాలేజి వదలమని కోరడానికి తగిన కారణాలు చూపాల్సి ఉంటుంది. సెకండరీ గార్డియన్ కూడా అంతే. తాను ఒప్పందం రద్దు చేసుకోవాలనుకుంటే తప్పనిసరిగా తగిన కారణాలు చూపాల్సి ఉంటుంది. కానీ పిల్లలు అతడిని వద్దని చెప్పడానికి ఎలాంటి కారణం తెలపాల్సిన అవసరం లేదు. అతడి కారణాలేమైనా సరే దాన్ని అతడు మరే థర్డ్ పార్టీకి తెలియజేయనవసరం లేదు.

మరోవైపు ప్రైమరీ సంరక్షకుడి సంబంధం గురించిన అంశాలు – ఇది వాలంటరీ కాదు, పిల్లల తల్లిదండ్రులు. వారు సహజమైన వారైనా దత్తత తీసుకున్న వారైనా సరే వారు పిల్లలకు ప్రాథమిక సంరక్షకులు అవుతారు. కనీసం పిల్లలకు మైనారిటీ తీరేవరకు వారు ఎలాంటి కారణంతోనూ కూడా ఈ సంబంధాన్ని రద్దు చేయడం కుదరదు. పిల్లవాడు తనంతట తాను ఇల్లు వదిలి పోవచ్చు లేదా ఇతర సంరక్షకులను ఎంచుకోవచ్చు, లేదా కొద్ది కాలం పాటు స్వతంత్ర పౌరుడుగా బతకవచ్చు. ఏ కారణం చేతైనా సరే ఆ పిల్లవాడు తిరిగి తన ప్రైమరీ సంరక్షకుల దగ్గరకు వచ్చి వారి మీద ఆధారపడాలని అనుకుంటే వారు అతడిని తిరస్కరించే అవకాశం లేదు. కానీ చట్టం దృష్టిలో మైనర్లుగా ఉన్న వారు తప్పకుండా ఎవరో ఒకరి సంరక్షణలో ఉండాలి. తల్లిదండ్రులను నిరోధించే హక్కు ఎవరికి

ఉండకూడదని కొంతమంది వాదిస్తారు. ఎందుకంటే పిల్లలు ఈ లోకానికి రావడానికి కారణమే వారు కాబట్టి.

కొంతమంది అడుగుతారు... ఎవరైనా సరే సెకండరీ గార్డియన్‌కు బదులు ప్రైమరీ బాధ్యత ఎందుకు తీసుకుంటారని. దీనికి ఒక సమాధానం : ఈ అగ్రిమెంటు పిల్లలు, సెకండరీ గార్డియన్ల మధ్య జరుగుతుంది. పిల్లలే వీరిని ఎంచుకుంటారు. ఒకవేళ పిల్లలు మరీ చిన్నవారై నిర్ణయం తీసుకోలేని వారైతే, అప్పుడు ఆ పిల్లలను కోరుకునే వారు ఎవరైనా సరే తప్పనిసరిగా ప్రైమరీ సంరక్షకులు అయితీరాలి, అంటే సహజ తల్లిదండ్రుల బాధ్యత తీసుకుని తీరాలి.

ఇప్పటికీ ప్రైమరీ సంరక్షకులకు, అంటే పిల్లల తల్లిదండ్రులకు "మేము ఈ పిల్లవాడిని ఇక భరించలేము, ఇతడిని ఇంట్లో ఉంచుకోవడం ఇక మా వల్ల కాదు, ఇతడిని మా దగ్గర నుంచి తీసుకెళ్లండి, ఏదైనా చెయ్యండి" అని చెప్పడానికి వెనుకాడతారు. ఇలాంటి సందర్భాలలో చట్టం పిల్లవాడిని జైల్లో పెడుతుంది. నేను ఏమంటానంటే పిల్లవాడికి అలాంటి సందర్భాలలో ఎంచుకోవడానికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. మరో సంరక్షకుడిని వెతుక్కోవడం లేదా స్వతంత్ర పౌరుడిగా జీవించడం వంటి మరిన్ని అవకాశాలు అతడి ముందు ఉండాలి. ఒకవేళ పిల్లవాడికి సెకండరీ సంరక్షకులకు దొరకకపోతే, స్వతంత్ర పౌరుడిగా జీవించడం కూడా అతడికి చేతకాకపోతే అప్పుడెలా? అప్పుడు రాజ్యం అతడి బాధ్యతను స్వీకరించి ఏదైనా హోమ్‌లో ఉంచాలి. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యం ఆధ్వర్యంలో నడిచే ఇలాంటి సంస్థ ఇప్పుడున్న దానికంటే ఎక్కువ మానవత్వంతో వ్యవహరించగలిగితే బావుంటుంది. తల్లి దండ్రులకు ప్రైమరీ సంరక్షణ బాధ్యత నుంచి బయటపడే అవకాశాన్ని కల్పించాలి, అంతే కాదు పిల్లవాడు ఎవరి మీదా ఆధారపడి ఉండడానికి ఇష్టపడనపుడు రాజ్యం అతడికి ఇష్టమున్నా లేకున్నా స్వతంత్ర పౌరుడిగా ప్రకటించాలి.

పిల్లలు సెకండరీ సంరక్షకులతో జీవిస్తున్నంత కాలం వారే అతడి లోకో పేరెంట్స్, వారే అతడి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకి ఒక పిల్లవాడు సెకండరీ సంరక్షకుల దగ్గర ఉండగా ఏదైనా తప్పు లేదా నేరం చేసినట్టయితే దానికి వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. "నువ్వు ఇలాంటి పనులు చేసేట్టయితే మాతో ఉండడానికి వీల్లేదు, మరేదైనా దారి చూసుకో లేదంటే మీ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లిపో" అనిచెప్పేందుకు వారికి హక్కు ఉంటుంది. కానీ అలా చెప్పడం ద్వారా కూడా ఆ పిల్లవాడు తమ దగ్గర ఉన్నపుడు చేసిన దాని ఫలితానికి బాధ్యత మాత్రం తామే వహించాల్సి ఉంటుంది. అలాగే పిల్లవాడు స్వతంత్ర పౌరుడిగా జీవిస్తూ ఏదైనా తప్పు చేసి తర్వాత తల్లిదండ్రుల దగ్గరకు

వచ్చి నేను మీతో కలిసి ఉంటాను అని చెప్పడం ద్వారా అతడు చేసిన తప్పుకు తల్లిదండ్రులను బాధ్యులను చెయ్యడం కుదరదు.

నేను చెప్పేదేమిటంటే చట్టం పిల్లలను పెద్దలుగా గుర్తించి పూర్తిస్థాయి పౌరులుగా ప్రకటించే వరకు పిల్లలు వారికి ఇష్టమున్నా లేకున్నా తమకు అందుబాటులో ఉన్న వారిమీద ఆధారపడి బతకడం కాకుండా వారు ఎవరిమీద ఆధారపడాలో లేదా స్వతంత్రంగా జీవించాలో నిర్ణయించుకునే అవకాశం కల్పించాలని మాత్రమే. వారు వారి సంరక్షకులను ఎంచుకోవాలి లేదా స్వతంత్రంగా బతకగలగాలి. వారికి ఈ స్థితిలో నుంచి బయటికి రావడం, తిరిగి అదే అనుబంధంలోకి వెళ్లడం అనేది సౌకర్యవంతంగా ఉండాలి.

మనకు ఇదంతా కూడా చాలా ఇబ్బందికరంగా అనిపిస్తోంది కానీ అనుకున్నంత ఇబ్బందికరం కాదు. ఇప్పుడు నేను ప్రతిపాదించినవన్నీ కూడా చాలామంది ఇప్పటికే అనుసరిస్తున్నారు కాకపోతే దానికి వారు ఒక ఆకర్షణీయమైన పేరు పెట్టలేదు అంతే. నేను చిన్నగా ఉన్నపుడు మిషిగాన్‌లోని గ్రాండ్ ర్యాపిడ్స్‌లో ఉన్న మా తాతగారి ఇంట్లో ఎండాకాలంలో కొన్ని రోజులు గడిపేవాడిని. నాకు ఆ రోజులు ఎంతో ఆనందంగా గడిచేవి. నేనంటే వారికి, వారంటే నాకు చాలా ప్రేమ, నేను చుట్టుపక్కల ఉన్న ఇతర నా ఈడు పిల్లలతో స్నేహం కూడా చేసేవాడిని. నాకు పదకొండు సంవత్సరాల వయసున్నపుడు అనుకుంటా నేను మా గ్రాండ్ పేరెంట్స్ అనుకున్నాం, చలికాలం మొత్తం నేను వారితో గడిపితే మజాగా ఉంటుందని. ఈ అద్భుతమైన ఆలోచన వచ్చిన సమయంలో మా తాతాగారి వయసు దాదాపు ఎనభై సంవత్సరాలు. కానీ అది సాధ్యమేనా, ఆలోచించి ఇద్దరం కలిసి మొత్తానికి మా తల్లిదండ్రులకు రాశాం. ఇలా చెయ్యడం మీకేమీ అభ్యంతరం లేదు కదా అని. దానికి సమాధానంగా 'సరే నువ్వు చలికాలంలో అక్కడే ఉందువు గానిలే' అని టెలిగ్రాం వచ్చింది. అలా చేయడం వల్ల నేను ఒక సంతోషకరమైన సంవత్సరాన్ని గడపగలిగాను.

కొంతకాలం క్రితం బోస్టన్‌లో నా స్నేహితుడి ఇంట్లో వారి బంధువుల అబ్బాయి ఒకతను ఉండి చదువుకునే వాడు. అతడి తల్లిదండ్రులు ఒక సంవత్సరం పాటు ఎక్కడో విదేశాల్లో ఉండాల్సి వచ్చింది అందువల్ల అతడు ఇక్కడ ఉండే వాడు. ఈ ఏర్పాటు అందరికి సౌకర్యవంతంగా ఉంది. చాలా మందికి పిల్లలను తమతో ఉంచుకోవడం చాలా ఇష్టంగా ఉంటుంది. కొన్ని కుటుంబాల వారు పిల్లలను కొద్దికాలం పాటు ఒకరి పిల్లలు మరొకరి దగ్గర ఉంచుకొని సంరక్షిస్తుంటారు కూడా. చాలా సంతోషంగా ఉండే కుటుంబాల్లో కూడా ఒక సందర్భం వస్తుంది అతడు కుటుంబంతో కలిసి జీవించడాన్ని భరించలేని లేదా

కుటుంబం అతడిని భరించలేని స్థితి వస్తుంది. సంతోషంగా కుటుంబ జీవితం గడుపుతున్న నా స్నేహితుడు ఒకాయన చెప్పాడు "జాన్ నువ్వు కుటుంబ జీవితం ప్రారంభించిన తర్వాత పిల్లలను వారు చిన్నగా ఉన్నపుడు ఎంత ప్రేమగా పెంచినా సరే వారితో ఎలాంటి ఉపయోగం లేని రోజు ఒకటి వస్తుంది. దానికి నువ్వు మానసికంగా సిద్ధమై ఉండు" అని.

నా టీనేజి ప్రారంభమైన కొత్తలో చాలామంది ఇతర పిల్లల్లాగే నాకు కూడా నా తల్లిదండ్రులతో అంత మంచి సంబంధాలు ఉండేవి కాదు. నా దగ్గరి మిత్రుడొకడు కూడా నాలాంటి పరిస్థితుల్లోనే ఉండేవాడు. నేను అతడి ఇంటికి వెళ్లినపుడల్లా అతడు ఎదో ఒక సమస్యలో ఉండేవాడు. కానీ నా తల్లిదండ్రులకు అతడు అతడి తల్లిదండ్రులకు నేను చాలా నచ్చేవాళ్లం. కొంత కాలం పాటు నేను అతడి కుటుంబంతో అతడు నా కుటుంబంతో ఉండగలిగితే బావుండేది. ఇలాంటి అవకాశం ఉంటే నాలో ఉన్న లోపాలు ఏమిటో అతడి తల్లిదండ్రులకు తెలిసి నాకంటే అతడే మెరుగనే అభిప్రాయానికి, ఇటు నా తల్లిదండ్రులు కూడా అతడిలో లోపాలు తెలియడం వల్ల నేను ఎంత మెరుగో తెలిసుండేది. మేము తిరిగి మా ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత నిజానికి మా తల్లిదండ్రులకు మాకు మధ్య సంబంధాలు కచ్చితంగా మెరుగై ఉండేవి.

కొన్నిసార్లు పిల్లలు వారు ఎప్పుడూ ఉండే చోట అంత ఆనందంగా ఉండరు కానీ మరోచోట బావుంటారు. నాకు తెలిసిన ఒక అమ్మాయి వాళ్లింట్లో అంత సంతోషంగా ఉండేది కాదు కానీ మరో కుటుంబంతో చాలా సన్నిహితంగా ఉండేది. వారికి కూడా ఆ అమ్మాయిని తమతో ఉంచుకోవడం చాలా ఇష్టంగా ఉండేది. ప్రతి సారీ తల్లిదండ్రులకు వారి స్వంత పిల్లలే చాలా నచ్చాలని, వారితోనే ప్రేమగా ఉండాలన్న నియమేమీ లేదు. వారికి ఇతర పిల్లలు కూడా నచ్చవచ్చు.ఎందుకు అటు పిల్లలకు ఇటు తల్లిదండ్రులకు వారికి నచ్చిన వారితో ఉండే అవకాశం కల్పించకూడదు?

గ్రూపు, కమ్యూనిటీ, ఆర్గనైజేషన్‌లు సెకండరీ సంరక్షకులుగా ఉండవచ్చు. దీనికి కూడా కొన్ని ఉదాహరణలు ఉన్నాయి. దానికి మంచి ఉదాహరణ సైనికులకు ప్రజలకు మధ్య ఉన్న సంబంధం పిల్లలకు సంరక్షకులకు మధ్య ఉన్నట్టుగానే ఉంటుంది. వారు ప్రజలకు కావల్సిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తారు. ప్రజల్లో ఎవరైనా సమస్యల్లో ఉన్నపుడు పరిస్థితిని వారు చేతుల్లోకి తీసుకొని ఈ బాధ్యత మాది అని సివిల్ పోలీసులకు తెలియజేస్తారు. కాలేజీ, యూనివర్సిటీలు కూడా తమ విద్యార్థులతో ఇలాంటి సంబంధాన్నే కలిగి ఉంటాయి. వారు భోజనం, వసతి కల్పిస్తారు. చాలా అంశాల్లో వాళ్లను అదుపు చేస్తుంటారు, కనీసం క్యాంపస్‌లో ఉన్నపుడు వారు చేసే పనులకు బాధ్యత వహిస్తారు.

ఇలాంటి మరో ఉదాహరణ బోర్డింగ్ స్కూళ్లు, వారి విద్యార్థులు. వైఎంసీఏ, వైడబ్ల్యూసీఏ, వైఎంహెచ్ఏ వంటివి కూడా ఉన్నాయి. ఇంటి నుంచి పారిపోయిన వారికి ఆశ్రయం కల్పించే ప్రదేశాలు చర్చిల ఆధ్వర్యంలో చాలా పట్టణాలలో నడుస్తున్నాయి. కొద్దికాలం పాటు పిల్లల బాగోగులు చూసే విశ్రాంతి గృహాలు కోపెన్‌హెగెన్ ఇంకా యూరప్‌లోని చాలా పట్టణాలలో ఉన్నాయి. వీటిని ఎక్కువగా పిల్లలే వాడుకుంటూ ఉంటారు.

ఇలాంటి ఉదాహరణలు చూసిన తర్వాత మనం ఇలాంటి సంస్థలు లేదా కమ్యూనిటీలను సౌకర్యాలతో కొద్దిపాటి ఖర్చుతో పిల్లలకు అందుబాటులో ఉంచడాన్ని గురించి ఆలోచించవచ్చు. ఒక్కోసారి ఎలాంటి డబ్బు చెల్లించలేకపోయినా పెద్దవారి సంరక్షణలో వారు బతికేందుకు అవకాశం కల్పించగలగాలి. పిల్లవాడు ఇంటికి దూరంగా కొంతకాలం జీవించాలనుకున్నపుడు వారికి మరో సంరక్షకుడో లేదా మరో కుటుంబమో అతడి బాధ్యత తీసుకునే వారు అందుబాటులో ఉండాలి. కుటుంబంలో వారికి ఎదురైన చేదు అనుభవాలు కావచ్చు, మరే ఇతర కారణం చేతనైనా కావచ్చు... వ్యక్తిగత సంబంధాలు వారు కోరుకోనప్పుడు వారికి ఇలాంటి అవకాశం ఉండాలి. వారు కోరుకున్నపుడు వారు బోర్డింగ్ స్కూల్‌కు లేదా క్యాంప్‌కు వెళ్లి ఉండే అవకాశం ఉండాలి.

ప్రత్యామ్నాయ లేదా సమ్మర్ స్కూల్స్, సమ్మర్ హిల్స్, లూయిస్ వాడమ్స్ వంటివి, ఇలాంటి ప్రదేశాలన్నింటిని కమ్యూనిటీలుగా పరిగణించవచ్చు. సమ్మర్ హిల్స్ కమ్యూనిటీ కంటే ముందుగా ఒక స్కూల్ అని చెప్పాలి. ఎందుకంటే స్కూల్‌గా ప్రకటించనట్టయితే చట్టం కమ్యూనిటిగా నడిచేందుకు అంగీకరించదు. కాబట్టి ఇలాంటి స్కూళ్లు మరిన్ని ఏర్పాటుచేయ్యాలి. లీప్ (లోయర్ ఈస్ట్ సైడ్ యాక్షన్ ప్రాజెక్ట్) న్యూయార్క్‌లో ఒక కమ్యూనిటీగా ప్రారంభమైంది. అది దగ్గరలో ఉన్న పిల్లలకు అందుబాటులో ఉండే హోమ్ వంటి ప్రదేశం. తర్వాత కాలంలో ఇది స్కూల్‌గా రూపాంతరం చెందింది. ఇలాంటి చాలా కమ్యూనిటీలు మరింత మెరుగ్గా పనిచేయ్యాల్సి ఉంది. తక్కువ డబ్బుతో ఎక్కువ మందికి సేవ అందించాల్సి ఉంది. వీటిని స్కూళ్ల ముసుగులో నడపాల్సిన అవసరం ఉండకూడదు. స్కూళ్ల మాదిరిగా అమానవీయ విధానాలలో కాకుండా శిక్షణ అందించడం వారి పెద్ద వారు కోరిన విధంగా వారికి శిక్షణను అందించి వారిని కాలేజీకి పంపే ఏర్పాట్లు చేయ్యడం తర్వాత కాలంలో వారికి మంచి ఉద్యోగం దొరికేలా వారికి శిక్షణ అందించడం వంటివన్నీ ఇక్కడ అందుబాటులో ఉండాలి. ఇక్కడుండే పిల్లలు మరేదైనా నేర్చుకోదలచుకున్నా వారికి అందుబాటులో ఉండాలి. వారు కోరుకున్న విధంగా వాటిని నడిపించుకునే అవకాశం ఉండాలి. ఇలాంటి కొన్ని కమ్యూనిటీలు అన్ని వయసుల వారికీ కూడా ఉపయోగకరంగా

ఉంటాయి. వారి సొంత ఆలోచనకు వారికి అవకాశం ఉండాలి. వారు కోరుకున్నట్టుగా వారికై వారు సంగీతం లేదా ఏదైనా కళ లేదా నటన లేదా ఏదైనా ఒక ఉత్పత్తి సంస్థ, వ్యాపారం మరింకేదైనా సరే ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉండాలి.

మిషైల్ ఎస్. కాయే రాసిన ది టీచర్ వజ్ ద సీ (లింక్స్ బుక్స్, న్యూయార్క్) ఒక మంచి పుస్తకం. ఇందులో ఒక మంచి కమ్యూనిటీ ఎలా ఏర్పాటు అయ్యింది అది ఎలా వృద్ధి చెందింది, మార్పు చెందింది... ఆ ఉదంతాన్ని చాలా కూలంకషంగా వర్ణించడం జరిగింది. పాలో ఆల్టో సమీపంలో ఒక ఆల్టర్‌నేటివ్ స్కూల్ ముందుగా ఒక పసిఫిక్ హై స్కూల్‌గా పారంభమైంది. కానీ త్వరలోనే అక్కడ చాలా మంది చేరి పనిచేయడం ప్రారంభించారు, ఇక అప్పటికి వారికి అర్థమైంది వారు పిల్లల అవసరాలకు అనుగుణంగా ఆ సంస్థను నడిపించలేకపోతున్నారన్న విషయం. వారు నిజాయితీగా, సహాయకారిగా ఉంటూ సమాజంలోని పిల్లలకు పెద్దలకు మధ్య మంచి సంబంధాలు నెలకొల్పే విధంగా ఉండాలని వెంటనే నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు వారిని వారు కమ్యూనిటీగా ప్రకటించుకున్నారు. అక్కడ అన్ని వయస్సుల వారు నివసించే అవకాశం కల్పించారు. అర్థంలేని హైస్కూల్ అకడమిక్ తరగతి గదుల నుంచి దీన్ని ఒక ఫ్రీ హైస్కూల్‌గా ప్రకటించారు.

ఇలాంటి కమ్యూనిటీలు అన్నింటికీ కూడా వాటి స్వంత నియమ నిబంధనలు ఉంటాయి. అక్కడ నివసించే పిల్లలను బట్టి వాటిని రూపొందిస్తుంటారు. క్రమశిక్షణ పాటించడం, ఎప్పుడైనా ఒక రాత్రికోసం బయటికి వెళ్లాలనుకుంటే వారు ఎక్కడికి వెళ్తున్నారు ఎప్పుడు తిరిగి వస్తారు అనే సమాచారం అక్కడి నిర్వాహకులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఇలాంటి కమ్యూనిటీలకు సెకండరీ సంరక్షకులకు ఉండే అన్నీ హక్కులు ఉండాలి. ఎవరి ప్రవర్తనైనా సరిగా లేనపుడు, లేదా వారివల్ల చాలా ఇబ్బందిగా ఉంటుందని వారు అనుకున్నపుడు ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉంటుంది. వారిని క్యాంపస్ వదిలి వెళ్లిపొమ్మనే హక్కు ఉంటుంది. కానీ ఒక వాలంటరీ సంస్థకు సాధారణంగా ఇలాంటి అభ్యంతరాలు ఉండవు. మీరు మీ అంతట మీరే స్వయంగా వచ్చి ఇక్కడ ఉండాలనుకున్నపుడు మీరు ఉండాలన్నా వెళ్లాలనుకున్నా అది మీ ఇష్టం అనే అంటుంటారు సాధారణంగా. అలాంటి సందర్భాల్లో కమ్యూనిటీ " మీరు ఇక్కడుండాలంటే మాత్రం ఇలాంటి కొన్ని నియమాలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. లేదంటే మీరు వెళ్లిపోవచ్చు" చెప్పవచ్చు. సమ్మర్‌హిల్ వంటి చోట ఇలాంటి నియమ నిబంధనలన్ని కూడా బహిరంగంగా చర్చించి ఏర్పాటు చేయడం, మార్పు చేయడం జరుగుతుంది. కానీ మిగతా చోట్ల ఇవి కాస్త కఠినంగా ఉండవచ్చు. కమ్యూనిటీలో సందర్శకులు కూడా వచ్చి

ఆశ్రయం పొందే అవకాశం ఉండాలి. "కొంతకాలం పాటు ఇక్కడ ఉండి, ఇక్కడ జరుగుతున్న కార్యకలాపాలలో పాలు పంచుకొని అప్పుడు మీరు ఇక్కడ చెయ్యాల్సిన మార్పుల గురించి మాకు ప్రతిపాదన చెయ్యవచ్చు" అని వారితో అనే అవకాశం ఉండాలి. ఇక్కడ చాలా వైవిధ్య భరితమైన వాతావరణం ఉండాలి.

ఇలాంటి కమ్యూనిటీ నిర్వహణ కోసం తప్పనిసరిగా అక్కడ నివసించే అందరూ ఏదో ఒక పని చెయ్యాలి. ఇది నిర్వహణ వ్యయం తగ్గించడానికి సహకరిస్తుంది. కొన్ని ఆశ్రమాల్లో ఇలాంటి అవకాశం ఉండదు. అలాంటి ప్రదేశాలు హోటళ్లు, యూత్ హాస్టళ్ల మాదిరిగా చాలా ఖరీదైనవిగా ఉంటాయి. అలాంటి ఒక చోట నేను ఒకసారి బసచేశాను. అలాంటి చోట నివసించేవారు పనిలో భాగం పంచుకోవాల్సిన అవసరం ఉండదు. కాబట్టి ఇక్కడ ఉండడానికి మనం డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అది కాస్త ఎక్కువగానే ఉంటుంది. కాబట్టి పిల్లలు ఖరీదు తక్కువగా ఉండే, పనిదొరికే చోట ఉండడమే మంచిది. ఎక్కువ ఖరీదైన చోట ఉండడం అతడికి వీలు కాకపోవచ్చు.

ఎవరు ఇలాంటి ప్రదేశాలు ఎవరు ఏర్పాటు చేస్తారు? వారికి ఎవరు డబ్బు చెల్లిస్తారు? అక్కడ ఎవరు పనిచేస్తారు? దీనికి నేను కొన్ని సమాధానాలు చెబుతాను. ఇలాంటి సంస్థలు అన్నీ కూడా సాధారణంగా ప్రభుత్వం లేదా అక్కడ పనిచేసే వారు నడిపిస్తుంటారు. ఇలాంటి సంస్థలు పరిశ్రమగా మారవా? స్కూళ్ల మాదిరిగా ఇక్కడ ఇచ్చే శిక్షణ కూడా వ్యర్థంగా ఉండిపోదా? మనం అలా జరగకుండా నివారించాల్సి ఉంటుంది. నేను ప్రతిపాదిస్తున్న సంస్థకు ఇప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న కమ్యూనిటీకి మధ్య చాలా తేడా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థలు ఒక రకమైన జైళ్ల మాదిరిగానే ఉంటాయి. అక్కడుండాలని ఎవరూ కోరుకోరు. అక్కడున్న వారు కూడా వేరెవరో తెచ్చి కొన్ని కారణాలతో అక్కడ ఉంచడం వల్ల ఉన్నారు. వారు వచ్చి వీరిని బయటికి వదలాల్సి ఉంటుంది. కానీ కమ్యూనిటీల్లో నివసించేవారు వారికి నచ్చకపోతే అక్కడి నుంచి ఎప్పుడైనా వెళ్లి పోవచ్చు. కమ్యూనిటీ కూడా వారిని నిరోధించకూడదు. ఎంత మందికి నచ్చితే అంతమంది ఉంటారు.

ఇలాంటి సంస్థలు ఏర్పాటు చెయ్యడం వల్ల సమాజంలోని అందరికీ పిల్లలతో సహా ఉపాధి దొరుకుతుంది. ఈ కమ్యూనిటీని వాడుకుంటున్న వారు వీటి వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది. ఇవి ప్రజా సేవకోసం ఏర్పాటు చేసినవి. వారు తప్పనిసరిగా సేవ చెయ్యాల్సి ఉంటుంది.

ఇక మరోవైపు పిల్లలకు కనీస సంపాదన హామీ హక్కు లేనట్లయితే ఈ ఆశ్రమాలు మరింత డబ్బును ఇతర మార్గాల ద్వారా పొందాల్సి ఉంటుంది. కొన్ని ప్రైవేట్ సంస్థల ద్వారా, విరాళాలు, ఫీజుల ద్వారా లభించాలి. కానీ ఎక్కువగా ప్రభుత్వం నుంచే అందాల్సి ఉంటుంది.

వీటి ఏర్పాటుకు రెండు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. డెన్మార్క్‌లో పది లేదా అంతకంటే ఎక్కువ కుటుంబాలు కలిసి ఒక స్కూల్ ఏర్పాటు చేసే వీలుంది. ఇలా ఏర్పాటు చేసిన స్కూల్‌ను ఒక సంవత్సరం పాటు నడపగలిగితే తర్వాత సంవత్సరం నుంచి ప్రభుత్వం ఆ స్కూల్ నిర్వహణకు అవసరమయ్యే వ్యయంలో ఎనభై శాతం వరకు అందజేస్తుంది. స్కూల్ స్థాపించడానికి కావల్సిన పెట్టుబడి మాత్రం స్కూల్ నడిపే వారు భరించాల్సి ఉంటుంది. యూత్ హాస్టల్ లేదా ఆశ్రయం నడపాలనుకునే వారికి కూడా ప్రభుత్వం ఇలాగే సహాయం అందించి ప్రోత్సహించాలి. ఒకవేళ పిల్లల దగ్గర డబ్బు చెల్లించగలిగే స్తోమత ఉంటే ప్రభుత్వం పెట్టుబడి పెట్టి అవసరమైన భవనాలు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను, నిర్వహణ వ్యయాలను అక్కడ నివసించే వారే భరించేట్టుగా ఏర్పాటు చెయ్యవచ్చు. లేదా ప్రభుత్వం ఈ రెండు రకాల అవకాశాలు కల్పించవచ్చు.

ఇలాంటి చోట్ల ఎవరు పనిచేస్తారు? ప్రస్తుతం చాలామంది ఫ్రీ స్కూళ్లలో లేదంటే సాహస క్రీడా ప్రాంగణాల్లో లేదా ఇతర వాలంటరీ కమ్యూనిటీల్లో నియామకాల పట్ల జీతం చెల్లించే ఉద్యోగాల కంటే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. కాబట్టి ఇక్కడ పనిచేయడానికి మనుషులు దొరుకుతారో లేదో అనే సందేహం వద్దే వద్దు. ప్రతి ఒక్కరికీ కనీస ఆదాయం ఉండేట్లయితే వేతనం అంటూ చెల్లించాల్సిన అవసరం ఉండదు, లేదా ఎక్కువగా ఇవ్వాల్సి ఉండదు. ఆ సంస్థ చెల్లించగలిగిన మొత్తానికి మరి కొద్దిగా జత చేసి ప్రభుత్వం కూడా చెల్లించవచ్చు. ప్రభుత్వం ఇలాంటి సంస్థ నేరుగా స్థాపించడం కంటే ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించి ఇలాంటి వారి సంస్థ అధ్వర్యంలో నడిపిస్తే బావుంటుంది. ఇలాంటి సంస్థలలో ఉండే క్వార్టర్లు చాలా సాధారణంగా ఎందుకుంటాయో నాకు అర్థం కాలేదు. లారీ, మిషెల్ కోల్ ఇంకా న్యూయార్క్ లోని లీప్ స్కూల్‌లో చదువుతున్న వారి స్టూడెంట్స్ అంతా కలిసి అందమైన, మడిచి పెట్టడానికి అనువుగా ఉండే బెడ్, స్టోరేజి, స్టడీ యూనిట్లను పిల్లల కోసం తయారు చేశారు. వీటన్నింటిని మడిచి ఒక పెద్ద పెట్టెలో పెట్టడానికి వీలవుతుంది. లేదా వారు దాన్ని తెరచుకొని ఒక చిన్న ప్రైవేట్ రూమ్‌గా కూడా దాన్ని ఉపయోగించుకోవచ్చు. వాటిని కలిపి డబుల్ లేదా ట్రిపుల్ రూములుగా

కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. వారికి ఇష్టమైనట్టుగా దాన్ని కలుపుకోవచ్చు కూడా. ఈ బాక్స్ తయారు చేయడానికి పెద్దగా ఖర్చు కూడా కాదు. వీటిని పెట్టుకోవడానికి పెద్దగా స్థలం కూడా అవసరం ఉండదు. వీటి కోసం లీప్ స్కూల్లో ఒక స్టోర్ కూడా ఉంది.

నా భయం ఏంటంటే ఇలాంటి సంస్థలకు డిమాండ్ ఎంత ఎక్కువగా ఉందంటే దీని ఆధారంగా ఒక పరిశ్రమ లేదా బ్యూరోక్రసీ ప్రారంభం అవుతుందా అన్నట్లు. ఇదివరలో స్కూళ్లు కూడా ఇలాగే సేవాభావంతో మొదలయ్యాయి కానీ సమయం గడుస్తున్న కొద్ది అవి చాలా నియమాలతో, కఠినంగా, స్వార్థపూరితంగా తయారయ్యాయి. అందుకే ఇలాంటి సంస్థలు చిన్నవిగానే ఏర్పాటు చెయ్యాలి. వీటిని కేంద్రీకృతం చెయ్యకూడదు. డెన్మార్క్‌లో ఉండే స్కూ ళ్లలో తృప్తిగా లేని వారు ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా ఆలోచించి కొత్త విధానాలు రూపొందించి వాటిని అమలు చేసుకోవచ్చు. ఆవాసపు అవసరం, సమాజంతో కలిసి బతికాలన్నది మానవులలో చాలా ప్రాథమికమైన కోరిక. ఇటువంటి దాని మీద ఏకచ్ఛత్రాధిపత్యం, ఇతర వృత్తిపరమైన, చట్టపరమైన ఆధిపత్యం ఉండకూడదు.

నిజంగానే ఇలాంటి సంస్థ ఆవశ్యకత సమాజానికి ఉందా? అవును, ఎలాంటి సమాజంలో అయినా యువత, పిల్లల మార్పు, స్వేచ్ఛ, సాహస, ప్రయాణాలు చేసే అవకాశం, కొత్తవారిని కలుసుకోవడం వంటి ఎన్నో కొత్తదనాలు కోరుకుంటారు. పిల్లలతో కొంత కాలం కుటుంబానికి దూరంగా ఉండాలని, కోరుకున్నపుడు తిరిగి వారితో కలిసిపోవాలని ఇలా కొద్దిపాటి మార్పులతో వారిని చేరుకోవాలని ఆశిస్తారు. ఇది కుటుంబాలకు కూడా చాలా మంచిది.

# 22. రాబడి హామీ హక్కు

ప్రతి నెలా తప్పనిసరిగా రాబడి ఉండాలంటే సమాజంలో గౌరవప్రదంగా జీవించాలంటే తప్పనిసరిగా ఉద్యోగం ఉండాలి. ఉన్న ఉద్యోగాల సంఖ్య కంటే మనుషుల సంఖ్య ఎక్కువగా ఉన్నపుడు మిగతా వారు ఉద్యోగాలు చేస్తున్న వారి మీద ఆధారపడాల్సి వస్తుంది. ప్రస్తుతం దేశంలోని సగం మంది స్త్రీలు, చాలామంది పెద్దవారు, పిల్లలు ఇలాంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. వారు అలాగే ఉండిపోతే వారు వారి స్వేచ్ఛ, హక్కులు యధార్థ రూపం దాల్చడం కష్టం. ఎందుకంటే వారు వారికి కావల్సిన ప్రతి దాని కోసం ఉద్యోగం చేస్తున్న వారి మీద ఆధారపడడం వల్ల వారికి తిండిపెడుతున్నది ఉద్యోగం చేస్తున్న వారే అనే భావన కలుగుతుంది. అప్పుడు ఉద్యోగం చేస్తున్నవారు చెప్పినట్లు తాము చేయ్యాల్సి ఉంటుందన్న అభిప్రాయం క్రమంగా ఏర్పడుతూ వస్తుంది. వారికి కొద్దిపాటి అవకాశం ఉన్నప్పటికీ అతను చెప్పిన మాట ప్రకారమే బతకాల్సి ఉంటుంది. ఎందుకంటే వారికి మరో దారి చూసుకునే వీలు లేదు.

మన సమాజంలో మనం ఎప్పుడు స్త్రీ, పిల్లల హక్కుల గురించి చర్చించినా కూడా అది ఎగువ మధ్యతరగతి లేదా ధనిక వర్గాలకు చెందిన వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకొని మాట్లాడుతుంటాం. ఈ తరగతుల్లో స్త్రీల వద్ద కానీ, పిల్లల దగ్గర కానీ వారిదని చెప్పే కొద్దిపాటి డబ్బు తప్పకుండా దగ్గర ఉంటుంది. లేదా వారికి కావాలంటే ఉద్యోగాలు దొరుకుతాయి లేదా సాయం చెయ్యడానికి వారికి అందుబాటులో డబ్బున్న వారు ఉంటారు. చాలామందికి ఇలాంటి అవకాశాలు కూడా ఉండకపోవచ్చు. దిగువ మధ్యతరగతి, పేద స్త్రీలు, పిల్లలకు ఉద్యోగం చేస్తున్న వారి మీద ఆధారపడడం మినహా మరో అవకాశం ఉండకపోవచ్చు. వారికి వారిదంటూ కొంత రాబడి ఉంటే తప్ప.

అందువల్ల సమాజంలో ప్రతి ఒక్కరికీ స్వతంత్ర జీవనం సాగించాలని కోరుకునే హక్కు, ఆ సమాజం వారందరికీ కనీస రాబడి సమకూర్చినప్పుడు మాత్రమే అది సఫలం అవుతుంది. ఎందుకు అలాంటి రాబడి హామీ ఉండాలి? అది ఎంత మొత్తంలో ఉండాలి? దానికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయి. దీనిని సాధించడానికి ఉన్న మానసికమైన, రాజకీయపరమైన అడ్డంకులు ఏమిటి? వీటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ఇలాంటి ప్రశ్నలన్నింటినీ చర్చించాలంటే ఇక్కడ ఈ అధ్యాయంలో నేను కేటాయించాలనుకున్న దానికంటే ఎక్కువ స్థలం అవసరమవుతుంది. ఇలాంటి రాబడి హామీ పెద్దవారు, స్త్రీలు, పురుషులు, వివాహితులు, అవివాహితులు ఇలాంటి ఏ తేడా లేకుండా పిల్లలతో సహా అందరికీ ఉండాలని నేను ప్రతిపాదిస్తాను. పిల్లలు వారు కోరుకునే వయసు వచ్చినప్పటి నుంచి వారికి ఇలా రాబడి ఉండాలి. ఇలా ఉన్నపుడే వారికి వారు కావాలన్నపుడు ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు, ప్రయాణం చేసేందుకు, వారికి నచ్చిన సంరక్షకులను ఎంచుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇలా సరైన నిలకడ కలిగిన రాబడి ఉన్నపుడే ఇలాంటి హక్కులన్నింటికి ఒక అర్థం ఉంటుంది. ఇలాంటి ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబ అనుబంధాలను బలహీన పరుస్తుందని కొంత మంది వాదిస్తారు. కానీ కుటుంబ సభ్యుల మధ్య ఉండే అనుబంధానికి కారణం ఆరోగ్యకరమైన మానవ సంబంధాలు కాకుండా పేదరికం కావడం మాత్రం ఏమాత్రం మంచిది కాదు.

ఒకవేళ పిల్లవాడు సంరక్షకుడి మీద ఆధారపడి జీవిస్తున్నట్టయితే పెద్దవారైన సంరక్షకులు అతడి నివాసం, భోజనం, బట్టలు ఇతర అవసరాల కోసం ఖర్చు పెడుతున్నట్టయితే వారు పిల్లవాడి రాబడిలో కొంత ఇవ్వమని అడగవచ్చు. అందువల్ల పిల్లవాడి రాబడిలో కొంత భాగం సంరక్షకుడికివెళ్లిపోతుంది, అది ఎంత? ఒకవేళ పిల్లవాడు పరస్పర ఒప్పందం ప్రకారం సెకండరీ సంరక్షకుడితో ఉన్నపుడు ఎంత ఇవ్వాలనేది ముందుగానే నిర్ణయించబడి ఉంటుంది. ఒకవేళ సంరక్షుకుడు పెద్దగా డబ్బు లేని వాడైతే పిల్లవాడితో ముందుగానే చెబుతాడు “నువ్వు ఇక్కడ మాతో కలిసి ఉండాలనుకుంటే నిర్ణీత డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది” అని. ఒకవేళ డబ్బు ఉన్నవారైతే వారికి అంత అవసరం ఉండకపోవచ్చు. ఒకవేళ గార్డియన్ ఒప్పందంలోని ఈ భాగం పట్ల తర్వాత కాలంలో అసంతృప్తికి లోనైతే దీన్ని అప్పుడు చేర్చుకోవచ్చు. గార్డియన్ ఏ సమయంలోనైనా సరే ‘నువ్వు ఈ డబ్బు నాకు చెల్లించనట్టయితే నువ్వు ఇక్కడ ఉండడానికి వీల్లేదు” అని చెప్పేందుకు

హక్కు ఉంటుంది. ఈ ఒక్క విషయం ఆధారంగా కలిసి ఉండాలని అనుకునే వారు విడిపోరు.

కానీ తల్లిదండ్రులు అంటే ప్రైమరీ గార్డియన్ ఈ డబ్బు ఇవ్వకపోతే నువ్వు బయటికి వెళ్ళాల్సి ఉంటుంది అని చెప్పలేరు. అలాంటపుడు పిల్లవాడి రాబడిలో సరైన భాగాన్ని ఎలా తీసుకోగలుగుతారు? ఇక అక్కడ ఈ సరైన భాగం ఎంతవుతుంది? ఇలాంటి విషయాలన్ని కూడా చట్టంలో రాసి ఉండాలా? ఇలాంటి విషయాలన్ని కూడా తేటతెల్లం చెయ్యాలి అని కొందరు అంటారు కానీ నేను అవసరం లేదని అనుకున్నాను. పిల్లవాడు గార్డియన్‌తో కలిసి ఉంటున్నట్టయితే అతడి వంతు రాబడిలో కొంత భాగం నేరుగా గార్డియన్‌కే చెల్లించే ఏర్పాటు ఉండాలి.సంరక్షకుడు, పిల్లలు ఈ భాగస్వామ్యాన్ని మార్చదలచుకుంటే వారిద్దరు దీని గురించి ఆలోచించాలి.

కుటుంబంలోని ప్రతి సభ్యుడికి కొంత రాబడి ఉంటే ప్రతిఒక్కరూ పన్ను ఫారాలు ఫైల్ చేస్తూ, పన్ను వాపసులు కూడా పొందుతుంటే ఇక కుటుంబ నిర్వహణకు ఎవరు ఎంత డబ్బు ఇవ్వాలి అనే దాని గురించి అంతులేని చర్చకు దారి తీయదా? అని కొంత మంది అడుగుతారు. కుటుంబం అంతటిని ఒకే ఆర్థిక ప్రమాణం (ఎకనామిక్ యూనిట్)గా భావించడం మంచిది కదా? అని కూడా అనుమానం వ్యక్తం చేస్తారు. ఇప్పుడు ఈ విషయాలు దాటవేయడం కంటే మరింతగా చర్చించడమే మేలు. కుటుంబం అంతటిని ఒక ఎకనమిక్ యూనిట్‌గా పరిగణించి వారి మొత్తం రాబడి కుటుంబానికి అందజేయాలి. నిజానికి కుటుంబానికి చెందిన ఆదాయం, ఆస్తి అంతా కూడా సాధారణంగా కుటుంబ పెద్ద (సాధారణంగా పురుషులకు)కు చెందుతుంది. ఇక కుటుంబంలోని ఇతర సభ్యులందరు వారి అవసరాలకోసం అతడిని అడిగి తీసుకోవాల్సి ఉంటుంది. మరో వైపు కుటుంబ వనరులు ఎలా పంచాలి అనే వాదన ఉండనే ఉంది. ఇక ప్రస్తుతం ఆధారపడి ఉన్న మిగతా సభ్యులంతా కూడా వారి అవసరాల కోసం సంపాదన ఉన్న వారి ముందు చేయి చాచి అడిగి తీసుకోవాల్సిందే. అది కూడా వారి వాటా వారికి తగిన నిష్పత్తిలో లభిస్తుందని నేను అనుకోవడం లేదు. వారు పనిచేసి సంపాదిస్తే తప్ప వారికి అలా అడిగి తీసుకోవడానికి ఎలాంటి హక్కు ఉండదు. కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఇలా రాబడి ఉండే అవకాశం ఉన్నట్టయితే, అందరూ ట్యాక్స్ కట్టి టాక్స్ క్రెడిట్స్ పొందే అవకాశం ఉంటే కుటుంబంలో ఆర్థికపరమైన స్పర్థ చెలరేగే అవకాశం ఉండదనేదే చాలామంది వాదన.

కానీ ఈ రకమైన సాంకేతికపరమైన ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే రాజకీయ స్థాయిలో చర్చ జరగాల్సి ఉంటుంది. ఇలాంటి విషయాలు ఇక్కడ నిర్ణయం చెయ్యడం సాధ్యంకాదు.

చివరగా ఒక విషయం, అదేమిటంటే పేదరికం భయంతో చాలామంది ఇతరుల మీద ఆధారపడి బతుకుతున్నారు. ఇప్పటి వరకు ఒక్క దేశం కూడా పౌరులకు ప్రతి నెలా కనీస రాబడి వచ్చేలా పూచీ పడలేదు. దేశంలోని పేదరికం తగ్గాలి అంటే ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవన విధానం ఉండడానికి కావల్సినంత డబ్బు వచ్చే అవకాశం ఉండాలి. ఒక దేశంలోని జీవన ప్రమాణాలు అక్కడి పేదల జీవన విధానం ఎంత మెరుగ్గా ఉందనే దాని మీద ఆధారపడి ఉంటుంది.

# 23. ఆర్థిక, న్యాయపరమైన బాధ్యత కలిగి ఉండే హక్కు

**యు**వకులకు ఇప్పుడు లేని మరో రెండు హక్కులు ఉండాలి. మొదటిది చట్టపరంగా సంపూర్ణ సమాన పరిరక్షణ కలిగి ఉండే హక్కు. ఇక రెండోది న్యాయబద్ధంగా, ఆర్థికంగా బాధ్యతాయుతుడైన పౌరునిగా జీవించే హక్కు. మొదటి అంశం విషయానికి వస్తే పిల్లల విషయంలో ఇతరులు కానీ ప్రభుత్వం కానీ తీసుకునే చర్యలు, ఇతర అంశాలు పెద్దల విషయంలో ఎలా ఉంటాయో అలాగే ఉండాలి. కానీ చాలా సందర్భాలలో చట్టం పిల్లలను పెద్దల కంటే కఠినంగా చూస్తోంది. చట్టం పిల్లల పట్ల పెద్దల కంటే దయతో, సున్నితంగా వ్యవహరిస్తుందని అనుకుంటారు. వారి అనుభవలేమిని తెలియని తనాన్ని కొంత వరకు క్షమిస్తుందని అనుకుంటారు. కానీ నిజానికి పెద్దలతో కంటే కూడా కఠినంగా వ్యవహరిస్తుంది. యువతలో చాలామంది జైళ్లలో ఉన్నారు – అంటే వారు స్వేచ్ఛగా ఉండడానికి వీల్లేని సంస్థల్లో ఉంచబడుతున్నారు. ఇక్కడ వారితో చాలా కఠినంగా, క్రూరంగా వ్యవహరిస్తారు. వారేదో తప్పు చేసినందుకు కాదు కేవలం సమాజంలో వారిని ప్రేమించేవారు, వారి పట్ల శ్రద్ధ చూపే వారు ఎవరూ లేకపోవడం వల్ల. ఇక జైళ్లలో ఉన్న మరికొంతమంది పిల్లల్లో చాలామంది వారు చేసిన చిన్నపాటి తప్పులకు శిక్ష పడి ఉన్నారు, ఇవే తప్పులు పెద్దవారు చేస్తే తప్పకుండా వారికి ఇంతకంటే తక్కువ శిక్షలే పడతాయి.

అసంఖ్యాకమైన ఉదాహరణలు ఉన్నప్పటికీ నేను మీకు కొన్నింటి గురించి ఇక్కడ చెబుతాను. డిసెంబర్ 25, 1972లో టైమ్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన స్టోరీ "చిల్డ్రెన్స్ రైట్స్; ద లేటెస్ట్ క్రూసేడ్"లో ప్రస్తావించిన సంఘటన.

పిల్లవాడైన గెరాల్డ్ గాల్ట్ అదో జోక్ అనుకున్నాడు. ఆరిజోనాలోని గ్లోబ్ సమీపంలో నివసించే ఒక గృహిణికి ఫోన్ చేశాడు. సుప్రీం కోర్టు దృష్టిలో ఫోన్ చేసి విసిగించడం ఒక నేరం. ఆ పిల్లవాడికి లాయర్ లేడు. ఆ గృహిణి నుంచి బహిరంగంగా సాక్ష్యం తీసుకోలేదు. ఎలాంటి వాదప్రతివాదాల రాతప్రతులు నిర్వహించలేదు. అప్పీలుకు వీల్లేదు. ఇలాంటి సందర్భాల్లో పెద్దవారికైతే ఎక్కువలో ఎక్కువ రెండు నెలల శిక్ష పడుతుంది. కానీ గాల్ట్‌ను స్టేట్ ఇండస్ట్రియల్ స్కూల్‌లో అతడి 15 సంవత్సరాల వయసు నుంచి 21 సంవత్సరాల వాడు అయ్యే వరకు ఉంచారు.

ఇదే కథనంలో మరో చోట ఇలా ఉంటుంది :

పామ్ కేసును పరిశీలించి చూస్తే ఇప్పుడు ఆమె వయసు 16. తండ్రి ఆమెను ఆమె తల్లిని ఇంటి నుంచి బయటికి పంపించేసిన తర్వాత పామ్‌ను పోషించడం తల్లికి కష్టమైపోయింది. ఇక ఆమెను ఆమె తల్లి ప్రభుత్వానికి అప్పగించేసింది. "పామ్ చాలా తెలివైంది మాత్రమే కాదు చాలా సున్నితమైంది కూడా" అని చెప్పారు షికాగో అటార్నికి చెందిన పాట్రిక్ మర్ఫీ. "కానీ ఆమె అంత ఆకర్షణీయంగా ఉండదు. అందువల్ల ఆమెను ఒక సంవత్సరం పాటు సంరక్షణ గృహంలో ఉంచారు. తర్వాత ఆమెను తప్పుదారి పట్టిన వాళ్లను, నేరగాళ్లను ఉంచే ఒక హోమ్‌కు పంపించారు. (నోట్ : మనం ఈ జైళ్లను హోమ్స్ అని ఎందుకు అంటాము?) తర్వాత ఆమెను ఎల్జిన్ స్టేట్ హాస్పిటల్‌కు పంపించారు. వాళ్లు ఆమెను ఆటపట్టించేవారు కాబట్టి ఆమె అక్కడ ఇతర పిల్లలతో పోట్లాడేది. ఎల్జిన్‌లో పరిస్థితి మరింత దిగజారింది. అందువల్ల ఆమెను దాదాపు 28 రోజుల పాటు మంచానికి కట్టేసి ఉంచారు. తర్వాత ఆమెను విడిచిపెట్టినప్పుడు అక్కడ పనిచేసే ఒక నర్సును కొట్టడం వల్ల మరో 30 రోజుల పాటు బంధించి ఉంచారు. అప్పటికి ఆమెకు నిజంగానే సైకోథెరపి అవసరమైంది. ఇదంతా ప్రభుత్వం ఆమెకు స్వేచ్ఛ ఇవ్వకుండా నిర్బంధించడం వల్లే ఇలా జరిగిందని నేను భావిస్తున్నాను.

> షికాగోలోని కుక్ కౌంటీ బాలనేరస్తుల కోర్టుకు పోయిన సంవత్సరం మొత్తం 28,740 కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 3,500 కేసులు పెద్ద నేరాలకు సంబంధించినవి కాగా 9,200 కేసులు తల్లిదండుల నిర్లక్ష్యానికి లోనైన వారు లేదా పారిపోయిన వారు వంటి కేసులు. ఇలా పారిపోవడానికి చాలా సందర్భాల్లో వారి పట్ల క్రూరంగా ప్రవర్తించడం, నిర్లక్ష్యంగా చూపడం వంటివి కారణమవుతాయి. "తల్లిదండ్రులు పిల్లలను కొట్టగలరు, పిల్లలు మరీ తీవ్రంగా గాయపడితే తప్ప తల్లిదండ్రుల మీద ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోరు" స్టాన్‌ఫోర్డ్ కాట్జ్ అన్నాడు. మసాచుసెట్స్‌లో ఒక 15 సంవత్సరాల అమ్మాయిని ఆమెను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఇతర మగపిల్లలతో మాట్లాడకూడదు అని నియమం పెట్టినా పాటించడం లేదంటూ ఆమెను హింసించారు. దాంతో వారిని కోర్టులో ప్రవేశపెట్టారు. వారికి ఎలాంటి శిక్ష పడలేదు. ఆమె మంచిపిల్ల కాదు అని వారు వాదించారు.

ఆమె మంచి అమ్మాయి కాదు... ఎందుకంటే ఆమె వారు చెప్పిన మాట వినలేదు. వారి ఆదేశాలు పాటించలేదు. పిల్లలకు కూడా వారికి నచ్చిన వారితో మాట్లాడే హక్కు ఉండాలని చట్టంలో స్పష్టంగా రాసుకోవాలి. నేను ఈ దిగువన తెలిపిన సంఘటన రానురాను సాధారణంగా మారిపోతోంది.

> ...జానీ లిండ్‌క్విస్ట్ కథ విని షికాగో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వయసు ఆరేళ్లు. అతడు తను ఉంటున్న సంరక్షణాలయంలో సంతోషంగా ఉంటున్నాడు. అతడి పోషణ తమవల్ల కాదంటూ తల్లిదండ్రులు మొర పెట్టుకోవడంతో జానీ సంరక్షణ గృహానికి పంపబడ్డాడు. కానీ అతడి తల్లిదండ్రులు మనసు మార్చుకున్నారు. దాంతో అతడు తన తండ్రి గురించి భయాన్ని వ్యక్తం చేసినా వినిపించుకోకుండా సోషల్ వర్కర్స్ అతడిని తల్లి దండ్రులకు అప్పగించారు. నాలుగు నెలల తర్వాత పోలీసులు చెప్పిన దాని ప్రకారం అతడి తండ్రి అతడిని విచక్షణా రహితంగా కొట్టడం వల్ల అతడి తలకు చాలా తీవ్రమైన గాయం అయ్యింది. నాలుగు వారాలపాటు కోమాలో ఉన్న తర్వాత అతడు మరణించాడు. ఫలితంగా ఇల్లినాయిస్ సెనెట్ కమిటి కాలిఫోర్నియాకు చెందిన చైల్డ్ కేర్ చట్టాలను సవరించాలని నిర్ణయించింది. పిల్లలు సరైన కారణం చెప్పగలిగే వయసులో ఉంటే వారికి ఇష్టమైన వారి ఆధ్వర్యంలో ఉండే అవకాశం కల్పించాలని తీర్మానించారు.

ఈ బిల్లు గురించి ఇల్లినాయిస్ లెజిస్లేచర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో నాకు తెలియదు. అది పాస్ అవుతుందో కాదో అనే అనుమానం నాకు ఉంది. ఇక మరో విషయం ఏంటంటే ఇలాంటి చట్టాలన్నీ కూడా కేవలం పుస్తకాలలోనే ఉంటాయి. జానీ లిండ్‌క్విస్ట్ వంటి పిల్లల జీవితాల్లో అది ఎంత వరకు మార్పు తేగలరనేది అనుమానస్పదమే. ఇప్పుడు యూఎస్‌లోని అధికారులు, పిల్లల సంరక్షకులు అందరూ కూడా ఆరేళ్ళ పిల్లవాడు సరైన కారణాలు చూపగలడని ఇప్పుడు అంగీకరిస్తారా? ఇదే ఇక్కడ అతి ముఖ్యమైన విషయం. టైమ్ మ్యాగజైన్ పాయింటు వదిలేసింది. ఈ విషయంలో జానీ చెప్పింది చాలా సరైందిగా తోచింది నాకు. అతడి కారణాలు ప్రభుత్వం, ప్రభుత్వంలోని పెద్దలు ఇచ్చే కారణాల కంటే చాలా కచ్చితంగా ఉన్నాయి. మరో ఆరేళ్ల పిల్లవాడు తన అవసరాలు ఏమిటో, భయాలు ఏమిటో చెబితే మనం వినే స్థితికి ఇప్పటికైనా వచ్చామా?

> లాయర్–సైకాలజిస్టు జోసెఫ్ గోల్డ్‌స్టీన్ (ఏల్ లా స్కూల్) చట్టం పరిధిలో పిల్లలను పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నాడు. అనాథలైన పిల్లలను వారు కోరుకున్న దగ్గరి బంధువులకు లేదా దూరపు బంధువులైనా వారికి ఇష్టమున్న సన్నిహిత మిత్రులకైనా సరే అప్పగించాలని వారు అభిప్రాయపడ్డారు.
>
> అది కచ్చితంగా కాస్త మెరుగైన పరిస్థితిగానే ఉంటుంది. కథనం చివరకి వచ్చేసరికి నేను మొదలు పెట్టిన చోటికే వచ్చాను. ప్రభుత్వమే 24 గంటలు, వారంలో ఏడు రోజులు, సంవత్సరంలో 52 వారాలు మంచి పేరెంటింగ్‌ను అందించాలంటే దాదాపు అసాధ్యమే. ఏ ప్రభుత్వం కూడా పేరెంట్స్‌ను సమకూర్చడం లేదా అలాంటి సేవలు అందించడం అనేది ఇప్పటి వరకు ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. నాకు తెలిసి అలాంటి అవసరం ఏ పిల్లవాడికి కూడా ఉండదని అనుకుంటున్నాను. ఒకవేళ జరిగినా కూడా అది పిల్లవాడి ఆరోగ్యానికి అంత మంచిది కాదు.

టైమ్స్ మ్యాగజైన్ అడుగుతున్నది నిజానికి ఏమిటంటే పిల్లల మీద జరుగుతున్న వేధింపులు ఆపడానికి చర్యలు తీసుకోవాలని మాత్రమే. కానీ తల్లిదండ్రుల అధికారాలకు భంగం కలగకూడదు. ఇది సాధ్యం కాదు. తల్లిదండ్రులు లేదా రాజ్యం యొక్క అధికారాల నుంచి, వేధింపుల నుంచి కాపాడే ఏర్పాటు ఏదీ లేదు. కేవలం బాధితులకు ఆ కష్టం నుంచి తప్పించుకునే మార్గం చూపడం మినహా.

టైమ్స్ పత్రిక మాట్లాడుతున్నది తల్లిదండ్రులు సహజంగా చూపే ప్రేమపూరితమైన అధికారం గురించి కాదు, పిల్లలను భయపెట్టి, బలవంతపెట్టి, శిక్షించేటటువంటి వారి అధికారం గురించి మాత్రమే. నిజానికి పిల్లలను తల్లిదండ్రులు శిక్షించే కారణాలు, యజమానులు వారి బానిసలను శిక్షించే కారణాలు దాదాపుగా ఒకేవిధంగా ఉంటాయి. ముఖ్యంగా ఎదురు సమాధానం చెప్పడం, గౌరవించకపోవడం, విధేయత కనబరచకపోవడం, అనుమతి తీసుకోకపోవడం, ఇంటి నుంచి పారిపోవడం వంటి చర్యలకే వారికి తల్లిదండ్రుల చేతిలో శిక్షలు పడుతుంటాయి. శిక్షించే తీరును గమనించినపుడు పిల్లలకు ఎలాంటి హక్కులు లేవన్నట్టుగానే అనిపిస్తుంది.

మనం మరో వార్తా కథనాన్ని పరిశీలిద్దాం. అది ద న్యూయార్క్ టైమ్స్ పత్రికలో 27 జూన్ 1973 పత్రికలో పిల్లల చావులకు కారణం వారిపై దుర్మార్గాలే అంటూ ఇచ్చినది.

> చిన్నపిల్లల మరణాలకు వారిపై జరుగుతున్న దుర్మార్గాలే ఈ దేశంలో ప్రధాన కారణంగా ఉంటున్నాయని ముందు రోజు జరిగిన ఒక వైద్య సదస్సు అభిప్రాయాలను ఇందులో వివరించింది.
>
> ఈ అంశం మీద సాధికారికంగా మాట్లాడగలిగిన డాక్టర్ విన్సెంట్ జె. ఫాంటానా కూడా ఈ సంవత్సరంలోనే 50,000 మంది వేధింపుల కారణంగా మరణించి ఉంటారని, 30,000 మంది శాశ్వత వికలాంగులుగా మారి ఉంటారని అంచనా వేశారు.
>
> అమెరికన్ మెడికల్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో మాట్లాడుతూ, వైద్యులు ఈ సమస్య పట్ల గుడ్డికన్నుగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం కూడా వీటిపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందని, అందువల్లే ఇలాంటి వేధింపులు పునారావృతం అవుతున్నాయని డాక్టర్ ఫాంటానా వివరించారు. కానీ ఇలా జరిగిన ప్రతి సారి ప్రజల దృష్టికి తప్పకుండా వస్తున్నాయి. ఇక వెలుగులోకి రాని ఉదంతాలు ఇంతకు రెట్టింపు ఉంటాయని డాక్టర్ ఫాంటానా అన్నారు.
>
> “మానసిక ఆరోగ్యం సరిగ్గా లేనివారు మాత్రమే ఇలాంటి వేధింపులకు పాల్పడతారని అనుకోవడం మన అపోహ మాత్రమే” అని డాక్టర్ ఫాంటానా

ఈ కాన్ఫరెన్స్‌లో మాట్లాడే ముందు విలేకరుల సమావేశంలో చెప్పారు. "మధ్యతరగతి కుటుంబాల్లో పిల్లల మీద దాడి జరగడం అనేది వెలుగులోకి రానేరాదు, చాలా సందర్భాల్లో డాక్టర్లు కూడా పట్టించుకోరు, డాక్టర్లు కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటారు. దాని గురించి కనీసం ఫిర్యాదు కూడా చెయ్యరు" అని వెల్లడించారు. బ్రూక్లీన్‌లోని డౌన్‌స్టేట్ మెడికల్ సెంటర్‌లో చైల్డ్ సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్థర్ గ్రీన్ మాట్లాడుతూ, పిల్లలను వేధించిన 60 మంది తల్లులపై జరిగిన అధ్యయనంలో తేలినదాని ప్రకారం వారంతా ఒంటరితనంతో బాధపడుతున్న వారు, పరిపక్వత లేని వారు, అనుమానంతో బాధపడుతున్న వారు లేదా ఇతరుల పట్ల ఎలాంటి నమ్మకం లేని వారు... ఇలా రకరకాల మానసిక సమస్యలతో ఉన్నవారేనని చెప్పారు. కానీ అందులో చాలా మంది మానసిక వ్యాధిగ్రస్తులు మాత్రం కాదు అని ఆయన అన్నారు. "వీరిలో చాలా మంది వారి మానసిక అవసరాలు పిల్లలు తీర్చాలని కోరుకున్న వారు. అలా జరగనపుడు వారు తాము పిల్లల తిరస్కారానికి గురైనట్టు భావించారు. లేదా తాను ఆశించినట్టు పిల్లలు ప్రవర్తించడం లేదని భావించారు, అలాంటి సందర్భాలలోనే పిల్లల మీద దాడులు చేస్తారు." అని డాక్టర్ గ్రీన్ ముగించారు.

ఇక స్కూళ్లు మరియు పిల్లల హక్కుల గురించి మాట్లాడితే పిల్లలకు స్కూల్‌కు వెళ్ళాలా వద్దా అనే నిర్ణయం తీసుకునే హక్కు వారికి ఉండాలి. పిల్లల పట్ల శ్రద్ధ చూపే వారిలో ఎవరు ఉత్తమం అనే విషయం గురించి నేను వాదించదలచుకోలేదు. కొన్నిసార్లు తల్లిదండ్రులే నిజానికి పిల్లల పక్షం వహిస్తారు టీచర్లు, డాక్టర్లు, సైకియాట్రిస్టుల వంటి నిజంగా వారికి హాని చేసే వారి నుంచి కాపాడుతుంటారు. కానీ తరచుగా ప్రభుత్వ అధికారులు వారిని హాని చేసే తల్లిదండ్రుల నుంచి కాపాడుతుంటారు. టైమ్స్‌లో వచ్చిన కథనం ప్రకారం జానీ లిండ్‌క్విస్ట్ తన తండ్రి చేతిలో హత్యకు గురయ్యాడు, పామ్ అనే చిన్న అమ్మాయి ప్రభుత్వ హోమ్‌లో 58 రోజుల పాటు మంచానికి కట్టివేయబడింది (ఇంకా అక్కడ ఆమెకు ఏం జరిగిందో తెలియదు. ప్రభుత్వం చేతిలో తన జీవితం ఇలా ప్రారంభమైంది, అది ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందనేది మనం ఊహించలేము).

మనం పిల్లలకు తల్లిదండ్రులు, టీచర్లు, కౌన్సిలర్లు, సైకియాట్రిస్టులు, ఫ్యామిలీ కోర్టు, జడ్జీ, ఎవరైనా సరే పిల్లలకు వీరి సంరక్షణ సరైంది అని చెప్పడం కష్టం. ఇక్కడ

ముఖ్యంగా  గమనించాల్సిన విషయం తనకు ఏది మంచిదో పిల్లలకు బాగా తెలుస్తుంది. మీరు మరీ పెద్దవారిలాగా ప్రవర్తించి వారి పక్షాన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదు. వారి స్నేహితులెవరు, వారి శత్రువులెవరనేది వారు తెలుసుకోగలుగుతారు. ఎదుటి వారు వారిని ఇష్టపడడం లేదని, క్రూరంగా  ప్రవర్తిస్తారని వారు తెలుసుకోగలుగుతారు. ఒక ఐదేళ్ల పిల్లవాడు మంచి టీచర్‌కు, కఠినంగా వ్యవహరించే టీచర్‌కు మధ్య తేడాను కచ్చితంగా కనిపెట్టగలుగుతారు, అంతేకాదు కఠినంగా ఉండే టీచర్ నుంచి దూరంగా ఉండడానికి ప్రయత్నం కూడా చేస్తాడు. పెద్ద వారు మాత్రమే  కఠినంగా ఉండే టీచర్‌ను కూడా పిల్లవాడికి ఏదో మంచి చేస్తాడు అని తెలివి  తక్కువగా అపోహ పడుతుంటారు. నొప్పి వల్ల మంచి జరుగుతుందని పిల్లలు అసలు అనుకోరు అలా అపోహపడేది మనం మాత్రమే. వారికి నొప్పి వల్ల కూడా ఏదో మంచి జరుగుతుందని చెబుతుంటాం. కానీ పిల్లలకు వారికి నచ్చని, బాధ కలిగించే పరిసరాల నుంచి దూరంగా వెళ్లిపోయేందుకు, వారికి ఆహ్లాదకరంగా ఉన్న చోట ఉండేందుకు హక్కు ఉండాలి.

ఇక్కడ కొన్ని సమాన హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కొన్ని ఉదంతాల గురించి ప్రస్తావించదలచుకున్నాను. అందులో మొదటగా ద న్యూయార్క్ టైమ్స్‌లో 3 నవంబర్ 1973 లో ప్రచురితమైన ఎనిడ్ నేమీ ఆర్టికల్ చూద్దాం.

> విడాకుల కేసుల విచారణ సందర్భంగా పెద్దలు కోరితే తప్ప మైనర్లయిన పిల్లలను కోర్టుకు అనుమతించరు.
>
> ....పిల్లల హక్కులలో రెండు ముఖ్యమైన లోపాలున్నాయి. ఏ వయసులోనైనా సరే కోర్టులో దావా వేసే హక్కును నిరాకరించడం వాటిలో ఒకటి.
>
> 'పర్సన్స్ ఇన్ నీడ్ ఆఫ్ సూపర్‌విజన్' (పీఎన్ఎస్)గా వ్యవహరించే ఎలాంటి నేర చరిత్ర లేని పిల్లల గురించి మిసెస్ వువిలర్ అధ్యయనం చేశారు. వారికి సంబంధించిన కోర్టు విధి విధానాలతో ఆమె విసిగిపోయారు. "చట్టాలను ఉల్లంఘించిన మొండిపిల్లలను సరిదిద్దాలంటే తప్పనిసరిగా వారిని న్యాయ ప్రక్రియ నుంచి వేరు చెయ్యాలి. వారిని బాగుచెయ్యడం చేతకాని తల్లిదండ్రులే వారిని దీని పరిధిలోకి తీసుకువస్తారు. అయితే ఇక్కడ నేరం చేసిన వారి నుంచి విడదీసేందుకు వీరి కోసం వేరే ఎలాంటి నియమాలు అమలులో లేవు" అని అంటుంది ఆమె.

> మిసెస్ పిపెల్ మరియు డాక్టర్ హాఫ్‌మన్ తయారు చేసిన ఒక నివేదిక ఇలా పేర్కొంటోంది: ఇప్పుడున్న బాల నేరస్తుల న్యాయ వ్యవస్థలో ఒకే రకమైన నేరానికి పిల్లలు పెద్దల కంటే కూడా ఎక్కువ కాలం స్వేచ్ఛను కోల్పోవాల్సి వస్తోంది.

24 జనవరి 1972 నాటి ద రియల్ పేపర్ (బోస్టన్)లో చక్ ఫ్రేజర్ రాసిన 'హాఫ్‌వే టూ రిఫార్మ్ ; జెర్రిమిల్లర్ ఓపెన్‌డ్ ద డోర్స్' అనే ఆర్టికల్ నుంచి :

> ... అనేకమంది మసాచుసెట్స్ న్యాయమూర్తులు ఏ బాలుడినైనా 'ప్రమాదకరమైన వాడు' అని ప్రకటించి, అతడిని అనేక నెలల పాటు తాళాలు వేసి బంధించవల్సిందిగా తీర్పులు ఇచ్చే అధికారం కలిగి ఉన్నారు (మసాచుసెట్స్‌కు చెందిన యూత్ సర్వీసెస్‌లో పనిచేసే మిల్లర్ అంటున్నారు).

హొవర్డ్ జేమ్స్ రాసిన చిల్డ్రెన్ ఇన్ ట్రబుల్ (పాకెట్ బుక్స్), దీనితో పాటు ల్యారీ కోల్ రాసిన అవర్ చిల్డ్రెన్స్ కీపర్స్, లాయిస్ ఫోరెర్ రాసిన నో వన్ విల్ లిజన్ వంటి పుస్తకాలు చెబుతాయి పిల్లలను రక్షించడానికి ఏర్పాటైన సంస్థలు, చట్టం వారికోసం ఎలాంటి చర్యలు చేపడుతుందనే విషయాన్ని.

> కనీసం గంట సమయం కూడా పెద్దలైతే జైల్లో ఉండని చిన్నచిన్న తప్పులకు కూడా వేల మంది పిల్లలు – వారిలో ఏడెనిమిదేళ్ల వారు కూడా ఉన్నారు– నెలల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ది నేషనల్ కౌన్సిల్ ఆన్ క్రైమ్ అండ్ డెలిన్‌క్వెన్సీ అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం యునైటెడ్ స్టేట్స్‌లో లక్షమందికి పైగా 7–17 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు జైళ్లు లేదా జైళ్ల వంటి ప్రదేశాలలో మగ్గుతున్నారు. నిపుణులు తయారు చేసిన కేస్ హిస్టరీ చదివిన తర్వాత వందలాది పిల్లలు సమస్యల్లో ఉన్నట్టు అర్థమైంది. చిన్న చిన్న నేరాలకు పాల్పడే పిల్లలందరూ కూడా దాదాపుగా ఇల్లులేనివారే. కొన్నిసార్లు వారి తల్లిదండ్రులు తాగుడు వంటి వ్యసనాలకు బానిసలైన వారై ఉంటారు. చాలాసార్లు పిల్లలు తిరస్కారానికి గురైన వారో లేక వారు తిరస్కరించబడ్డామని భావించిన వారో అయి ఉంటారు. ఇలా భావించే వందలాది పిల్లలను నేను చూశాను. చాలా మంది పిల్లలను తమ తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడానికి తామే కారణమని భావిస్తుంటారు. లేదా వారిని తీవ్రంగా కొట్టినపుడు ప్రేమరాహిత్యానికి లోనయ్యేవారు.

"ఎవరైనా తమని తీవ్రంగా  కొట్టినపుడు వారు ప్రేమరాహిత్యానికి లోనవడం అంత ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు" అని జేమ్స్ అన్నారు. ఇలాంటి మాటలన్నీ కూడా పిల్లలతో కాసేపు మాట్లాడితే చాలా వినవచ్చు.

> మిల్లార్డ్ అనే 16 సంవత్సరాల తెలివైన పిల్లవాడు తన పెంపుడు తల్లితో అమర్యాదగా మాట్లాడుతున్నాడన్న కారణంతో  వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా జైలుకు పంపబడ్డాడు. అతడు ఎలాంటి చట్ట విరుద్ధమైన పనిచెయ్యలేదు. అతడి పెంపుడు తల్లి ఇలా ఎదురు సమాధానం చెప్పే పిల్లవాడిని పెంచడం తన వల్ల కాదని నిర్ణయించుకొని చట్టానికి అప్పగించేసింది.
>
> జైళ్లలో చాలామంది అబ్బాయిలకు పెద్దవారి నుంచి స్వలింగ సంపర్క వేధింపులు ఎదురవుతాయి. పిల్లలను కొట్టడం అనేది ఈ సంస్థల్లో చాలా సర్వసాధారణం. జిమ్‌ను ముందుగా మరియానా (ఫ్లోరిడా స్కూల్ ఫర్ బోయెస్)కు 12 సంవత్సరాల వయసులో పంపించారు. అక్కడ రెండు సంవత్సరాల రెండు నెలలు ఉన్నాడు. అక్కడ ఉన్నపుడు గార్డ్స్ అతడిని రెండు సార్లు కొట్టారు. ఒకసారి తనను లైంగికంగా వేధిస్తున్న ఒక పెద్ద పిల్లాడితో గొడవ పడినందుకు అతడు దెబ్బలు తిన్నాడు. పిల్లలను మనం కేవలం ప్రేమ పంచడానికి ఉపయోగపడే వస్తువుగా మాత్రమే కాదు ద్వేషం ప్రదర్శించడానికి ఉపయోగపడే వస్తువుగా కూడా వాడుకుంటున్నాము.

మనం పిల్లలతో చేసే దుష్ప్రవర్తన చాలా ఖరీదైంది కూడా. ఒక పిల్లవాడిని ఎలాంటి శిక్షణ, ఎలాంటి ఆటపాటలు లేకుండా ఒక సంస్థలో ఉంచడానికి, పెద్దలతో ఎలాంటి సంబంధం లేకుండా, సరైన భోజనం లేకుండా, కేవలం ఒక ఖాళీ గదిలో ఒక మంచంలో పడుకుంటూ, తరచుగా వేధింపులకు గురయ్యే చోట పిల్లలను ఉంచడానికి ఎంత ఖర్చువుతుందో ఎవరైనా ఊహించగలరా? మసాచుసెట్స్‌లో ఇలాంటి శిక్షా సంస్థను నడపడానికి దాదాపు ఒక్కొక్కరిపై 10వేల డాలర్ల నుంచి 14 వేల డాలర్ల వరకు సంవత్సరానికి ఖర్చు అవుతుంది. ఈ విషయం గురించి వ్యాసం రాసిన ఒక వ్యాసకర్త వెలువరించిన వివరాలు ఇవి. ఇదే ఖర్చును సరైన విధంగా ఖర్చు చేస్తే విలాసవంతమైన బోర్డింగ్  స్కూల్లో ఉంచి చదువు చెప్పించవచ్చు. అంతేకాదు సెలవుల్లో ఒక మంచి హోటల్లో లేదా రిసార్ట్‌లో అతడు కోరుకున్న చోట కూడా ఉంచవచ్చు. మనం పిల్లలకు విషయాలు సరిగ్గా అర్థం చేసుకోవడం నిర్ణయం చేసుకోవడం రాదనే విషయం గురించి మాట్లాడుకున్నాం. ఒక ఎనిమిదేళ్ల పిల్లవాడికి 12వేల డాలర్లు సంవత్సరానికి ఇచ్చి అతడి జీవితం అతడిని జీవించనిస్తే ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు చూసుకున్న దానికంటే ఎంతో

మెరుగ్గా అతడు జీవించగలుగుతాడు. చిన్న పిల్లల చేతికి డబ్బు ఇవ్వడం అంత మంచిది కాదు అంటారు, కానీ ఎందుకు? వారు ఉండడానికి ఎలాంటి ఆశ్రయం వారికి అందుబాటులో లేదు, వారు ఎవరికీ అక్కర్లేనప్పుడు ఎందుకు వారికి కావల్సిన డబ్బు వారికిచ్చి వారి జీవితాన్ని వారు జీవించే అవకాశం కల్పించకూడదు. వారికి కావల్సిన డబ్బు వారికి అందుబాటులో ఉంచి యుద్ధ సమయంలో ఇటాలియన్ చిన్న పిల్లలు బతికినట్టు బతికే అవకాశం ఎందుకు కల్పించకూడదు. జానీ లిండ్‌క్విస్ట్, ఇంకా విల్లో బ్రూక్‌లో కళ్లు పోగొట్టుకున్న పిల్లల వంటి వారికి జీవించే అవకాశాన్ని వారికి కల్పిస్తే తప్పేముంది. డాక్యూమెంటరీ ఫిల్మ్‌లు తీసే ఫెడ్ వైజ్‌మెన్ నాకు ఒక కథ చెప్పాడు. అతడి డాక్యూమెంటరీ ఫిల్మ్ తియ్యడానికి బాలల న్యాయస్థానాన్ని తన సబ్జెక్ట్‌గా తీసుకున్నాడు. అందులో భాగంగా బాలల న్యాయం గురించి పరిశోధిస్తున్నాడు. ఒకసారి ఒక కోర్టు రూమ్‌లో పదిహేనేళ్ల అబ్బాయి గురించి అక్కడున్న నలుగురైదుగురు పెద్దవారు చర్చ చేస్తున్నారు. అక్కడున్నవారిలో ఒక అటార్నీ, ఒక జడ్జి, ఒక సైకాలజిస్టు  ఇలా కొంతమంది మేధావులు ఉన్నారు. వారంతా ఆ అబ్బాయి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. ఆ గదిలో ఒక మూల కూర్చుని ఉన్న అతడు మాటి మాటికి "నాకు న్యాయం చెయ్యండి, నాకు న్యాయం చెయ్యండి" అని మాత్రమే అంటున్నాడు. అతడికి కచ్చితంగా న్యాయం జరగదేమో అన్న అనుమానం అతడిలో కనిపిస్తోంది. విచారణ జరుగుతున్నంత కాలం  చాలా మంది పెద్దవారు కూడా నెలల తరబడి చెప్పాలంటే ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోవడం జరుగుతోంది. కేవలం వారు పేదవారు లేదా  మైనారిటీ గ్రూప్‌కు చెందిన వారు కావడం మూలంగా బెయిల్‌కు కావల్సిన డబ్బు వారు కట్టలేకపోవడం వల్ల బెయిల్ లభించక ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. ఒకసారి ఒక స్కూల్ ప్రిన్సిపాల్‌ను అన్యాయంగా విధుల నుంచి తొలగించారు. అతడు స్టూడెంట్స్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ఆయన న్యాయం చెయ్యాలంటూ కోర్టుకు వెళ్లారు. అతడి న్యాయపోరాటానికి డబ్బు కావాలని ఒక మీటింగ్‌లో చెబుతుండగా నేను చూశాను. ఆయన అప్పటికే 5 వేల డాలర్లు ఖర్చు చేశారు. అయినా అప్పటికి కేసు ఇంకా కోర్టుకు రానే లేదు. మొత్తనికి చెప్పాలంటే చట్టం డబ్బున్నవారికే సరిగ్గా పనిచేస్తుందని చెప్పవచ్చు, అయితే పేదవారైన సరే పెద్దలకు లభించే ఆపాటి న్యాయం కూడా పిల్లలకు చట్టం నుంచి దొరకడం లేదు.

పిల్లలు కాబట్టి వారికి చట్టం నుంచి హక్కుల కంటే ఎక్కువే దొరకాలని నేను ఆశిస్తున్నాను. కానీ చట్టంలోని ప్రతి రక్షణ చర్య కూడా పెద్దలకు మాత్రమే ఉపయుక్తంగా ఉంది. నిర్ణయం తీసుకునే హక్కు, స్వేచ్ఛా పౌరుడిగా జీవించే  హక్కులు పిల్లలకు అదనంగా ఉండాలి. పిల్లలందరికి కూడా బాల్యం నుంచి విముక్తి పొందే హక్కు ఉండాలి.

పిల్లలకు చట్టపరమైన, ఆర్థికపరమైన పూర్తి బాధ్యతను ఇవ్వడం అంటే ఏమిటి? అంటే ఇప్పుడు పెద్దలందరికి ఏ విధంగా ఉన్నాయో ఆ నియమాలన్నీ పిల్లలకు కూడా అలాగే ఉండాలి. అతడి పౌరసత్వాన్ని గుర్తించాలి. అతడు ఎవరి మీదైనా ఫిర్యాదు చెయ్యడానికి ఇతరులు అతడి మీద ఫిర్యాదు చెయ్యడానికి  అవకాశం ఉండాలి. అతడికి ఆస్తి మీద యాజమాన్యం, కొనుగోలు, అమ్మకం హక్కులు ఉండాలి. అప్పు ఇవ్వడం, లేదా తీసుకోవడం, ఒప్పందాలు చేసుకోవడం, వాటిని రద్దు  చేసుకోవడం వంటి పెద్దలు చేసే అన్ని పనులు చట్టబద్ధంగా చేసే అవకాశం ఉండాలి.

ఒకవేళ పిల్లలకు పూర్తి ఆర్థిక బాధ్యతను ఇచ్చేసిన తర్వాత అతడు తీసుకున్న అప్పు చెల్లించలేకపోతే ఎలా? అని చాలామందికి అనుమానం వస్తుంది. ఇలాంటి సందర్భాలల్లో మిగతా అందరి పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటారో అలాంటి చర్యలే తీసుకోవచ్చు. గడువు పూర్తయిపోయినా అప్పు తీర్చని పిల్లల మీద కూడా కోర్టులో కేసు వేయవచ్చు. ఇలాంటి సందర్భాలలో కోర్టు వారి మోటార్ సైకిల్, క్యాంపింగ్ సెట్, స్టీరియో సెట్, కారు, సైకిల్ అతడి దగ్గర ఏది ఉంటే ఆ ఆస్తిని స్వాధీనపరచుకొని వేలం వేసి అతడు అప్పుపడిన వారికి ఇవ్వవచ్చు. పిల్లలకు నికర ఆదాయం, పెద్దవారిలాగా సరిపడినంత ఆదాయం ఉండకపోవచ్చు. ఇలా ఆదాయం ఉండకపోతే అతడితో ఒప్పందాలు చేసుకోవడానికి ఎవరూ సిద్ధంగా ఉండరు, కేవలం చట్టం మీరు అప్పు తీసుకోవచ్చు అన్నంత మాత్రాన ఎవరైనా అతడికి అప్పు ఇవ్వవచ్చని అర్థం కాదు. అప్పు తీసుకునే వారు ఎలా తీరుస్తారో కూడా వివరించి చెప్పాల్సి ఉంటుంది. వారి డబ్బు వారికి తిరిగి వస్తుందని ఒప్పించాల్సి ఉంటుంది.

ఎవరైనా పిల్లవాడు పూర్తి స్వేచ్ఛ కలిగిన పౌరుడిగా జీవిస్తూ కూడా తన తల్లిదండ్రులతో కలిసి  ఉండేందుకు అవకాశం ఉందా? ఉంటుంది కానీ దానికి వారు అంగీకరిస్తేనే. వారు ఇతడితో  కలిసి జీవించడానికి ఇష్టపడితే వీరు కూడా ఇతర పెద్దవారైన అతిథులు ఏ విధంగానైతే ఒప్పందాలు చేసుకుంటారో అదే విధంగా ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. వారి మీద ఆధారపడి జీవించడం అతడికి నచ్చకపోతే వారు అతడిని వారితోనే ఉండాల్సిందిగా  బలవంతపెట్టేందుకు  అవకాశం ఉండదు.

స్వేచ్ఛగా బతకడం గురించి ఎవరికి వారు ఎప్పటికప్పుడు నిర్ణయాలు మార్చుకోవడానికి అవకాశం ఉండదు. దీనికోసం ఒక నమోదు కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఒక  పౌరుడు తాను స్వేచ్ఛగా జీవించడానికి తన వయసును ధ్రువీకరించే పత్రాలు చూపిస్తే చాలు. ఉదాహరణకు ఒక పన్నెండేళ్ళ పిల్లవాడు స్వేచ్ఛగా జీవించే పౌరుడుగా ఉండాలనుకుంటే కొన్ని ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుంది.

పాస్ పోర్టు లేదా సోషల్ సెక్యూరిటీ కార్డు లేదా క్రెడిట్ కార్డ్ ఇలా తన గుర్తింపును నిర్ధారించే పత్రాలు జత చేస్తూ ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సిఉంటుంది. దానికి ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉండాలి. ఇలా పౌరసత్వం తీసుకోవడానికి కావల్సిన నియమనిబంధనలు అందరికీ అర్థమయ్యే విధంగా ఎంత ఎక్కువమందికి వీలైతే అంత ఎక్కువమంది తీసుకునేందుకు అనుకూలంగా ఉండాలి.

పిల్లలు పూర్తి స్థాయి పౌరులుగా నమోదు చేసుకోవాలంటే ఏవైన ప్రత్యేకమైన అర్హతలు కలిగి ఉండాలా? ఒక వయసు దాటిన వారు ఎటువంటి అభ్యంతరాలు లేకుండానే ఎలాంటి అర్హత పరీక్షించుకోకుండానే పూర్తి స్థాయి పౌరసత్వం పొందగలిగినప్పుడు కేవలం వారి వయసు తక్కువగా ఉందన్న కారణంతో ఇతరులకు ప్రత్యేకమైన అర్హతలు అడగడం అంత న్యాయ సమ్మతం కాదు. అయితే ఆర్థికంగా, చట్టపరంగా పూర్తి స్థాయి పౌరులుగా జీవించాలంటే మాత్రం వీరికి కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు, పరిస్థితులు, బాధ్యతలు అర్థం అవుతాయో లేదో మాత్రం తెలుసుకోవాల్సి ఉంటుంది. కారు నడపించడానికి అనుమతి పొందాలంటే వారు ఒక పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. మరో దేశంలో జీవించడానికి వెళ్ళేవారు దానికి అందుకు కొన్ని అర్హతలు సాధించాల్సి ఉంటుంది. స్వేచ్ఛ కలిగిన పౌరులుగా జీవించాలని ఆశించే పిల్లలు కొన్ని చర్చలు, కొన్ని సమావేశాల్లో పాల్గొని లేదా ఏదైనా పరీక్ష పాస్ కావాల్సి ఉంటుంది. అయితే ఈ టెస్ట్ నిష్పక్షపాతంగా నిర్వహించబడకపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఈ పరీక్ష చాలా పారదర్శకంగా ఎలాంటి అవినీతికి తావులేకుండా ఉండేలా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది.

ఇప్పుడు నేను చెప్పింది ఓటింగ్ విషయంలో చెప్పిన దానికి కొద్దిపాటి తేడాగా ఉందన్న విషయం నాకు తెలుసు. పౌరసత్వాన్ని అందించే చట్టం ద్వారానే పూర్తి స్థాయి ఆర్థిక, చట్టపరమైన బాధ్యతలు అందించాలి. ఇది ఓటు వేయడం కంటే కూడా గంభీరమైన విషయం ఎందుకంటే ఓటు వెయ్యాలా వద్దా అనే నిర్ణయం వారు స్వయంగా చేసుకోవచ్చు, పోలింగ్ బూత్‌కు వచ్చిన తర్వాత కూడా తన నిర్ణయాన్ని మార్చుకోవచ్చు. దాని కోసం ఎవరికి జరిమాన కానీ, శిక్షకానీ విధించరు. అందుకే పిల్లలు పూర్తి స్థాయి పౌరసత్వాన్ని ఆశిస్తున్నపుడు వారికి దాని అర్థం ఏమిటో ఎంతవరకు అర్థమైందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

# 24. ఇష్టానుసారం నేర్చుకునే హక్కు

**పి**ల్లలకు వారు తీసుకుంటున్న శిక్షణ వారి అదుపులో లేదా వారి ఇష్టప్రకారం సాగే హక్కు కలిగి ఉండాలి. అంటే వారు ఏం నేర్చుకోవాలి, ఎప్పుడు నేర్చుకోవాలి, ఆ శిక్షణ ఎంత కాలం పాటు సాగాలి, ఎంత వేగంగా నేర్చుకోవాలి, ఎలా నేర్చుకోవాలి వంటివన్నీ వారి ఆధీనంలో ఉండాలి. వారు ఒక వేళ స్కూల్ కు వెళ్లకుంటే ఏస్కూల్‌కు వెళ్లాలి, ఎంతకాలం పాటు వారు అక్కడ ఉండాలి వంటి నిర్ణయాలను స్వయంగా చేసుకునే హక్కు ఉండాలి

జీవించే హక్కును మించి ప్రాథమికమైన హక్కు మరేదీ లేదు. ఒక వ్యక్తికి నేర్చుకోవడంలో  స్వేచ్ఛ ఉండడం అంటే ఆ వ్యక్తి ఆలోచనలకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే. ఇది భావప్రకటనా స్వేచ్ఛ కంటే కూడా ప్రాథమికమైంది. అతడికి దేనిమీద ఆసక్తి ఉండాలి అనే విషయాన్ని మనం నిర్ణయిస్తున్నాం అంటే అతడి ఆలోచించే స్వేచ్ఛను హరిస్తున్నట్టే. దీన్ని మనం ఆసక్తి కలిగి ఉండే హక్కుగా అభివర్ణించవచ్చు. మనలో తలెత్తె ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ కలిగి ఉండే హక్కు పెద్ద వారిగా మనకు ఏది ఆసక్తికర విషయమో ఏదీ ఆసక్తిలేని విషయమో నిర్ణయించుకునే హక్కు మనకు ఉంటుంది. ఏది మనం నేర్చుకోవాలో ఏది వదిలేయాలో మనమే నిర్ణయించుకుంటాము. ఇలాంటి హక్కు మన నుంచి ఎవరైనా హరించడాన్ని మనం ఊహించను కూడా ఊహించలేము. పౌరసత్వం కలిగిఉండడం అంటే మన సొంత ఆలోచన మనం కలిగి ఉండడం, భావప్రకటన స్వేచ్ఛ కలిగి ఉండడం, మన ఆలోచన వీలైనంతగా వ్యాప్తి చేసుకునే హక్కు కలిగి ఉండటం అని భావిస్తారు. ఎంత కఠినంగా వ్యవహరించే ప్రభుత్వమైనా సరే ప్రజల ఆలోచనలను కూడా అదుపు చెయ్యగల శక్తి కలిగి ఉండదు.

నేర్చుకోవడాన్ని మన అదుపులో పెట్టుకునే హక్కు ఇప్పుడు ప్రమాదంలో పడింది. మనం మన చట్టంలో చూసినట్టయితే పిల్లలు ఏది నేర్చుకోవాలనేది ఎవరో ఒకరు విపరీతమైన, బలమైన అధికారాన్ని ఉపయోగించి నిర్ణయిస్తున్నారు. కొన్ని విషయాలు తప్పనిసరిగా నేర్చుకొని తీరాలని నియమాలు రూపొందిస్తున్నారు. చాలా ప్రాథమికమైన ఈ హక్కు ఇప్పుడు ప్రమాదం లో పడింది. ఇప్పుడు పిల్లలు కనీసం ఆరుగంటల పాటు తప్పనిసరిగా స్కూల్లో గడపాల్సి ఉంటోంది. సంవత్సరానికి 180 రోజులు దాదాపుగా పది సంవత్సరాల పాటు స్కూల్‌కు వెళ్లి తీరాలి. అక్కడ అతడు ఏదైనా నేర్చుకుంటున్నాడా లేక నేర్చుకోవడం లేదా అందులో కొన్ని అతడికి ముందే తెలుసా? ఇంతకంటే మంచి విషయాలు, ఇంతకంటే త్వరగా మరెక్కడైనా నేర్చుకోవచ్చా? దీంతో సంబంధం లేకుండా కొంత మంది పెద్దవారు వీటిని రూపొందించారు. దాన్ని అనుసరిస్తూ పిల్లలు నేర్చుకోవాల్సి ఉంటుంది. దీన్ని వ్యతిరేకించే పిల్లవాడిని నేరస్తుడిగా పరిగణిస్తారు. దీని ఆధారంగా మనం ఒక పరిశ్రమను ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసి పిల్లలు ఏం నేర్చుకోవాలి, ఎలా నేర్చుకోవాలి, ఎంత నేర్చుకోవాలి అనేది వారి ద్వారా పిల్లలకు నిర్దేశిస్తున్నాం. వీరిలో కొంత మంది మరింత అధికారాన్ని వారి మీద చూపడానికి కృషి చేస్తున్నారు. ఈ పరిశ్రమ అభివృద్ధి అనుకున్నంత త్వరితగతిన జరగడం లేదు కాబట్టి మరింత కఠినంగా వ్యవహరించడానికి వ్యూహాలు రూపొందిస్తోంది. ఇందులోకి వచ్చే పిల్లలు ఈ మధ్య కాలంలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం ప్రారంభించారు. "పిల్లలు ఏం చదువుకోవాలనేది మనం నిర్ణయించడం వారికి, మనకు కూడా మంచిదైతే అది అందరి విషయంలో ఎందుకు మంచిది కాదు? ఇప్పుడు మాట్లాడడం మొదలు పెట్టారు. దేశ వ్యాప్తంగా ప్రసారమైయ్యే ఒక టీవీ షోలో "ఊమ్బ్ టూ టూమ్బ్" స్కూలింగ్ గురించి చర్చ జరిగింది. గంటపాటు ఇంట్లో రాత్రి పూట హోం వర్క్ చెయ్యడం పిల్లలకు మంచిదైతే అది మరి మనకెందుకు మంచిది కాదు? అందువల్ల మనం కూడా టీవీకి దూరంగా ఉండొచ్చు. కొంత మంది నిపుణులు కలిసి మనకు ఏం తెలుసు అనేదాన్ని ప్రతిసారీ పరీక్షిస్తుంటారు. మనకు తెలియకపోతే దానికి తగిన మూల్యం మనం చెల్లించాల్సి ఉంటుంది.

ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ఆలోచించాల్సిన, చర్య తీసుకోవాల్సిన సమయం వచ్చిందని నేను చెప్పదలచుకున్నాను. పిల్లల కోసం నేను అడుగుతున్న ఈ హక్కును నేను పెద్దలకు కూడా వర్తించాలని నేను అంటున్నాను. మన మెదడులో మనకు తోచిన ఆలోచనలకు కార్యరూపం ఇచ్చుకునే హక్కు, ఎంత కాలం పాటు ఏ రకమైన స్కూల్‌కు వెళ్లాలనేది నిర్ణయించుకునే హక్కు కావాలని అంటున్నాను. నేను విద్యావంతుడిగా

ఉండడాన్ని వ్యతిరేకిస్తున్నాను. నేను ఏది నేర్చుకుంటే మంచిదనేది నా కోసం మరెవరో నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఇప్పుడు అమలులో ఉన్న నిర్బంధ విద్యావిధానాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. నేను విద్యావంతుడిగా ఉండాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఇప్పుడు అమలులో ఉన్న నిర్బంధ స్కూలింగ్ విద్యావిధానాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. నేను ఏది నేర్చుకుంటే మంచిదో నాకోసం వేరెవరో నిర్ణయించడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. వారు అసలు స్కూల్‌కు వెళ్లానుకుంటున్నారా లేదా అనేది కూడా వారే నిర్ణయించుకోగలగాలి. ఈ మాట చాలామందికి భయం కలిగించవచ్చు, లేదా కోపం రావచ్చు కూడా. “అంటే పిల్లవాడు స్కూల్‌కు వెళ్ళాలని ఆశించి పిల్లవాడికి అది ఇష్టం లేకపోతే అతడు స్కూల్‌కు వెళ్ళకుండా ఉండే హక్కు ఉండాలా లేక తల్లిదండ్రులు పిల్లవాడిని ఒక స్కూల్‌కు పంపాలనుకుంటే పిల్లవాడు మరో స్కూల్‌కు వెళ్లాలనుకున్నపుడు నిర్ణయం తీసుకునే హక్కు పిల్లవాడికి ఉండాలని అంటున్నారా” అని అడుగుతారు. అవును నేను అదే చెప్పబోతున్నాను. కొంత మంది అడుగుతారు ‘స్కూల్ అనేది అంత ముఖ్యమైంది కాక పోతే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్ బయటే ఉంచి వారి శ్రమను మరో విధంగా వాడుకోరా?” అని ఇది కూడా కొంతవరకు నిజమే కానీ ఇలాంటి తల్లిదండ్రులు సాధారణంగా పేద కుటుంబాల్లో ఉంటారు. వీరు పిల్లలు స్కూల్‌కు వెళ్ళే హక్కును హరిస్తున్నట్లు కనిపిస్తారు. అయితే నిజంగానే ప్రభుత్వం పిల్లల అన్ని హక్కులను కాపాడుతోందా, పిల్లలు నిజంగానే స్కూల్‌కు వెళ్లాలనుకుంటున్నారా, అతడికేమి కావాలి, తప్పకుండా ప్రతి పిల్లవాడు స్కూల్‌లోనే ఉండాలా, ఈ విషయంలో పిల్లలకు నిర్ణయించుకునే అవకాశం ఉండకూడదా?

పిల్లలకు స్కూల్‌కు వెళ్లాలా వద్దా అనే విషయంలో నిర్ణయం తీసుకునే హక్కు ఉండాలి అంటే అర్థం పెద్దల అభిప్రాయానికి ఎలాంటి విలువ లేదని కాదు. పిల్లవాడు మరీ విధేయత లేని వాడైతే తప్ప అలా తల్లిదండ్రుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా లేదా వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రవర్తించడం జరగదు. చాలావరకు పిల్లలు తల్లిదండ్రులకు నచ్చని పనులు చెయ్యకుండా, వారికి కోపం తెప్పించకుండా వారిని అసంతృప్తి పరచకుండానే జాగ్రత్త పడుతుంటారు. ప్రస్తుతం తల్లిదండ్రులు పిల్లల స్కూలింగ్ విషయంలో తమకు అవకాశం ఉందని భావిస్తున్నారు. కానీ ఇక్కడ కూడా చాలా రకాలుగా రాజీ పడాల్సి ఉంటుంది. అలాంటి తల్లిదండ్రులు తమ పిల్లలను నర్సరీకి పంపాలా లేదా కిండర్‌గార్డెన్‌కు పంపాలా అనే విషయంలో పిల్లల అభిప్రాయం తీసుకోవాలి. వారిని ఒక స్కూల్‌కు తీసుకొని వెళ్లి వారంపాటు ప్రయత్నించి చూడమని చెప్పవచ్చు. కొన్ని స్కూళ్లకు వారిని తీసుకొని వెళ్లి చూపించి వారికి ఏది నచ్చకపోతే అందులోనే చేరుస్తామని చెప్పవచ్చు.

తర్వాత కూడా అతడు తన స్కూల్‌ను ఇష్టపడుతున్నాడో లేదో గమనిస్తుండాలి, ఒకవేళ నచ్చకపోతే దాని గురించి తప్పకుండా ఆలోచించి అతడికి నచ్చే స్కూల్లో అతడిని చేర్చాలి.

నాకు తెలిసిన చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో స్కూల్ గురించి ఇలాంటి చర్చలు జరపడం నేను చూశాను. "ఒకవేళ నీకు ఈరోజు స్కూల్ గురించి ఆలోచించడం ఇష్టం లేకపోతే నీకు బాగాలేక పోతే, లేక నీకు దేని గురించైనా భయంగా ఉంటే, లేక నీకు ఇవ్వాళ మరేదైనా పని చెయ్యాలని గట్టిగా అనిపిస్తే నువ్వు ఇంట్లో ఉండిపోవచ్చు." అని చెప్పడం కూడా తెలుసు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల స్వంత ఆలోచనలకు విలువనిచ్చి వారిని ఒక ఆసక్తికరమైన యాత్రకు తీసుకువెళ్లవచ్చు. దానికి వారు స్కూల్ అనుమతి కూడా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఒకవేళ పిల్లవాడు యాత్ర చెయ్యడానికి ఇష్టపడకపోతే అతడు స్కూల్‌లోనే ఉండదలచుకుంటే దాని కోసం కూడా వారు ఏర్పాట్లు చెయ్యొచ్చు. వారి పిల్లవాడు స్కూల్‌లో దేనికైనా భయపడుతుంటే, సంతోషంగా లేడనిపిస్తే వెంటనే ఆ పిల్లవాడి స్కూల్ మార్చాలి. హాల్ బెన్నెట్ తన అద్భుతమైన పుస్తకం నోమోర్ పబ్లిక్ స్కూల్‌లో ఈ విషయాన్ని చాలా కూలంకషంగా వివరించారు.

నా స్నేహితురాలు ఒకామె చెప్పారు వాళ్ల అబ్బాయి థర్డ్ స్టాండర్డ్‌లో ఉన్నపుడు అతడికి ఒక బ్యాడ్ టీచర్ ఉండేవాడు. చాలా వేధింపులకు పాల్పడుతూ, బెదిరిస్తూ, వెటకారం చేస్తూ ఉండేవాడు. క్లాస్‌లో చాలామంది మరో సెక్షన్‌కు మార్చుకున్నారు. కానీ ఎనిమిది సంవత్సరాల ఈ పిల్లవాడు మాత్రం చాలా మొండిగా అదే క్లాస్‌లో ఉన్నాడు. అలాగే రెండు సంవత్సరాల పాటు భరిస్తూ వచ్చాడు. ఒకరోజు అకస్మాత్తుగా లేచి ఎలాంటి అనుమతి అడగకుండానే ఇంటికి వెళ్లిపోయాడు. అతడి ఈ రెండు సంవత్సరాల అనుభవాలు చాలా కఠినమైనవి, వాటి ప్రభావం అతడి మీద చాలా పడింది. చాలా త్వరగా గొడవలు పెట్టుకునే వాడిగా తయారయ్యాడు. అతడిలో ఆత్మవిశ్వాసం తగ్గిపోయింది. అతడిలోని సహజమైన హ్యూమర్ తగ్గిపోయింది. అతడి చేతి రాత కూడా చాలా అధ్వాన్నంగా తయారైంది. అతడి కంటి నిండా నీళ్లు నిండి ఇక ఆపుకోలేక బుగ్గల మీదికి జారిపోయాయి కూడా. అతడి తల్లి అది గమనించి ఏం జరిగిందని అడిగింది. విషయం తెలుసుకున్న తర్వాత "చూడు నువ్వు ఇదంతా భరించాల్సిన అవసరం లేదు, నువ్వు ఇక ఆ స్కూల్‌కు వెళ్లక్కర్లేదు, మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటాను. కానీ నువ్వు చెప్పు నీకు వెళ్లాలని లేకపోతే అసలు వెళ్లద్దు అని చెప్పింది. దానికి అతడు వద్దు అనే సమాధానం చెప్పాడు. సరే నీకేది సరైందనిపిస్తే అదే చెయ్యి కానీ జరిగేది ఏదైనా సరే నాకు చెప్పాలి. అని చెప్పి ఇక ఆ విషయాన్ని వారు వదిలేశారు. అలా ఆ పరిస్థితులలను ఎదుర్కొనే ధైర్యాన్ని ఇచ్చింది.

పిల్లలకు వారు నేర్చుకునే విధానాన్ని పూర్తిగా వారి ఇష్టానికి వదిలెయ్యడం అంటే వారు కోరుకున్న విధంగా స్కూల్‌కు వెళ్ళే అవకాశం కల్పించడం మాత్రమే. వారి తల్లిదండ్రుల అభిప్రాయాలకు విలువనివ్వకపోవడం కాదు. ఇది కేవలం వారికి నచ్చిన పని పిల్లలు చెయ్యడం లేదని పోలీసు  అధికారాన్ని ఉపయోగించి వారు చెప్పినట్టు వినేలా చేసే అధికారం వారికి ఉండకూడదని మాత్రమే. అంతే కాదు చట్టం పిల్లల మీద తల్లిదండ్రుల అధికారాలకు కొన్ని పరిమితులను విధించవచ్చు.

పిల్లలు నేర్చుకునే విధానం వారి అదుపులో ఉండాలి అనగానే కొంతమంది మరో వాదనను మన ముందుకు తీసుకువస్తారు. దాని గురించి కూడా చర్చించాలి. స్కూల్లో ఉన్నంత సమయం పిల్లలు బయటి ప్రపంచపు చెడు నుంచి దూరంగా ఉంచడానికి వీలవుతుంది. ముఖ్యంగా బయటి ప్రపంచపు దురాశ, అవినీతి, వ్యాపారాత్మక ధోరణి నుంచి దూరంగా పెట్టగలుగుతాము అని వాదిస్తుంటారు. దీన్ని బట్టి పిల్లలు స్కూల్‌లో ఒక ఉన్నతమైన జీవితాన్ని చూస్తారని అనుకుంటాము. 'మాకు తెలుసు సమాజంలో చాలా చెడు ఉంది. పిల్లలు సమాజంలో భాగం కాగానే దాని ప్రభావానికి లోనవుతారు, మనం పిల్లలను ఎంత త్వరగా సమాజంలోకి వదిలితే అంత త్వరగా వారు సమాజంలోని చెడు ప్రభావానికి గురవుతారు' అని కూడా అంటుంటారు. ఇలాంటి వారు స్కూల్స్ కాస్త మెరుగైన ప్రదేశాలని భావిస్తుంటారు. బయటి ప్రపంచానికి కంటే గౌరవప్రదమైన ప్రదేశాలు అనుకుంటారు. నా స్నేహితుడు ఒకరు స్కూల్‌ను చాలా పవిత్రమైన స్థలంగా భావిస్తున్నాడు. అక్కడుండే పిల్లలు, పెద్దలు కూడా అందరు ఉన్నతమైన భావాలు కలిగి బయటి ప్రపంచపు చెడుకు దూరంగా ఉంటారనే అభిప్రాయంతో ఉంటారు. కొద్దిపాటి పనైనా అక్కడ నిజాయితీగా జరుగుతుందని అనుకుంటారు. అక్కడుండే వారంతా ప్రతిసారీ ఒకరితో ఒకరు పోటీ పడుతూ ఉండకపోవచ్చు. కానీ చాలా వరకు స్కూల్ పిల్లలు ఎవరో ఒకరు చెప్పింది చేస్తూ ఉంటారు. వారి అంచనాలకు తగిన విధంగా ప్రవర్తిస్తుంటాడు, కానీ ఇది వరకు చెప్పిన విధంగా స్కూల్లోని కొన్ని భాగాలు మరింత దిగజారిపోయి కూడా ఉంటాయి. నాకైతే స్కూల్స్ నూతన సమాజంలోని చాలా అప్రజాస్వామికమైన, చాలా అధికారయుతమైన, చాలా ప్రమాదకరమైన ప్రదేశాలుగా కనిపిస్తాయి. ఇలా ఏకమొత్తంగా చాలా మంది ప్రజల్లోని ఆసక్తిని, స్వేచ్ఛను, నమ్మకాన్ని, గౌరవాన్ని చంపేయగల సంస్థలు మరింకేవీ లేవు. చాలా మెరుగైన స్కూళ్లలో కూడా పిల్లలు, టీచర్ల ఆలోచనా విధానం, జ్ఞానం ఒకే విధంగా చెడిపోయి ఉంది. వారు ప్రతిసారీ చేసే పనులన్నీ కూడా ఇతరుల అంచనాల మేరకు ఇతరులను తృప్తి పరచడానికి మాత్రమే చేస్తుంటారు. పిల్లలు టీచర్ల కోసం, టీచర్లు

తల్లిదండ్రుల కోసం సూపర్ వైజర్లు, స్కూల్ బోర్డు ప్రభుత్వం కోసం ఇలా ఎవరో ఒకరి అంచనాల మేరకు పనిచేస్తూంటారు. ఇక్కడ తనను ఎవరో ఒకరు ఎల్లపుడు అంచనా వేస్తుంటారన్న స్పృహలోనే పని చేస్తుంటారు. క్లాసులో టీచర్లు తాము చాలా బాగా పాఠం చెప్పిన తర్వాత కూడా " ఇప్పటిదాకా నేను చెప్పింది కరెక్టే కదా, నేను సరిగానే చెప్పానని రుజువు చెయ్యగలనా? నాకు మరే సమస్య రాదు కదా?" అని ప్రశ్నించుకుంటూనే ఉంటారు.

స్కూళ్లు ఇలా పాడై పోవడానికి కారణమేమిటి? స్కూల్‌ను ఇలా మార్చిన శక్తి ఏమిటి? వేరే కారణం లేదు, వాటి శక్తి హీనత వల్ల మాత్రమే ఇలా తయారయ్యాయి. తమ పిల్లలు ఏం చేస్తున్నారు ఎలా చేస్తున్నారు తెలుసుకోవాలన్న తల్లిదండ్రుల ఆత్రుత, అంటే తమ పిల్లలు ఇతర పిల్లలకంటే మెరుగ్గా ఉన్నారా లేదా అనే ఆసక్తి, తమ పిల్లలు ఇతరుల కంటే ముందుండాలనే కోరిక కూడా దీనికి కొంత కారణం. స్కూళ్లు పిల్లలను బయటి సమాజంలో ఉన్న చెడు నుంచి దూరంగా ఉంచలేవు, కనీసం సమాజంతో సమానంగా చెడును కలిగే ఉంటాయి. సమాజంలోని అనారోగ్యకరమైన లక్షణాలన్నీ స్కూల్‌లోనూ ఉన్నాయి. స్కూల్స్ సమాజపు అదుపులోనే ఉంటాయి. మనకు పెద్దగా సైన్స్ తెలియదు కానీ మనం సైంటిస్టులను ఆరాధిస్తాం, వారు చెప్పిన వాటిని ఒప్పుకుంటాం. వారి నుంచి మనకు కావల్సినవి ఏదో ఒకరోజు వస్తాయని అనుకుంటాం. హక్స్‌లే అనుకునే బ్రేవ్ వరల్డ్ అల్ఫాలు, బీటాలతో వస్తుందని అనుకుంటాము. పిల్లలకు ఎవరితోనైన సరే "కాదు" అని చెప్పే హక్కు ఉంది.

# 25. డ్రగ్స్ వాడే హక్కు

డ్రగ్స్ విషయంలో పెద్దలకు ఉండే అన్ని హక్కులు పిల్లలకు కూడా ఉండాలి. ఒకవేళ ఒక పిల్లవాడు తన కుటుంబం మీద లేదా సంరక్షకుడి కుటుంబం మీద ఆధారపడి జీవిస్తున్నాడనుకుంటే అతడికి బాధ్యత వహించే పెద్దల ఆధ్వర్యంలో నియమనిబంధనలకు అనుగుణంగానే జీవించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంట్లో పొగ తాగకూడదని అనుకుంటే వారితో నువ్వు పొగతాగడానికి వీల్లేదని చెప్పే హక్కు ఉంటుంది. అది వారికి మాత్రమే సంబంధించిన విషయం. అది పోలీసులు, చట్టానికి సంబంధించినది కాదు. తల్లిదండ్రులు ఇంకా పిల్లలు వాడే డ్రగ్స్ విషయంలో పెద్దవారు చాలా నియమనిబంధనలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తుంటారు.

మొత్తానికి నేను చెప్పాలనుకునేది ఏమిటంటే వారు వాడాలనుకునే డ్రగ్స్ వాడుకునే హక్కు అందరికీ ఉండాలి. మందులు అమ్మేవారు అవి అమ్మే సమయంలో వాటిని ఉపయోగించినపుడు వెంటనే, ఆ తర్వాత దీర్ఘకాలంలో వాటి ప్రభావం ఏవిధంగా ఉంటుందో తప్పకుండా వివరించి చెప్పాలి. ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులు ప్యాకింగ్ మీద పొగతాగడం ఆరోగ్యానికి హానికరం అని హెచ్చరిక రాసి ఉంటుంది. అలా చిన్న పాటి హెచ్చరికలు సరిపోవు. పొగతాగడం వల్ల దీర్ఘకాలంలో గుండెజబ్బు, క్యాన్సర్లు వంటి సమస్యలు వచ్చేందుకు చాలా అవకాశాలు ఉంటాయని స్పష్టంగా రాయాలి. పొగాకులో ఉండే నికోటిన్ నెమ్మదిగా పనిచేసే విషం మాత్రమే కాదు అది అలవాటవుతుంది కూడా. దీన్ని వాడుతూ మానేసినపుడు కొన్ని ఉపసంహరణ ప్రభావాలు కూడా కనిపిస్తాయి. నికోటిన్‌ను ఇతర మందుల తయారీలో కూడా కొద్దిపాటిగా వాడుతారు. అవి మారుజువానా, కాఫీ, ఆల్కహాల్, బార్బిట్యూరేట్స్, పెప్ పిల్స్ వంటి వాటిలో కొద్దిపాటి నికోటిన్ ఉంటుంది.

నిజానికి అన్ని మందుల షాపులలో అలాంటి మందులు వాటికి సంబంధించిన పూర్తి వివరాలు కలిగిన డైరెక్టరీ అందుబాటులో ఉంచాలి. ఎవరైనా అడిగినపుడు తప్పకుండా చూపించాలి. విటమిన్ సి  లేదా ఇ, కెబిజోన్ వంటి ఇతర మందుల గురించి రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. కొంతమందికి విటమిన్ సి వాడడం వల్ల జ్వరం, జలుబు వస్తుందని అనుకుంటారు. కానీ ఆ విషయాన్ని చాలా నమ్మకంగా గట్టిగా వ్యక్తం చెయ్యలేరు. ఎందుకంటే ఇది  పూర్తిగా రుజువు చెయ్యడం జరగలేదు కాబట్టి.

ఇప్పుడు నేను చేస్తున్న ప్రతిపాదన ఏమిటంటే ఎవరు ఏ మందులు వాడాలనుకుంటే ఆ మందులు వాడే అవకాశం ఉండాలి. ఇలాంటి అవకాశం కల్పించడం వల్ల సమాజంలో కేవలం డ్రగ్  కల్చర్ మాత్రమే అభివృద్ధి చెందుతుందని వాదించేవారు ఉన్నారు. మనకు ఒక డ్రగ్ కల్చర్ నిజానికి అవసరముంది. ఇందులో పిల్లల కోసం కొత్తగా చెయ్యాల్సింది పెద్దగా ఏమీ లేదు. మనం డ్రగ్ కల్చర్ మొదలు పెట్టడానికి ముందే పిల్లలకు డ్రగ్స్ గురించి తెలుసు. వారికి కావాల్సిన మందులు వారికి తెలుసు, ఎలా వాడాలో కూడా వారికి తెలుసు. చాలామంది పెద్దవారు రోజు కనీసం మూడు డోసుల్లోనైనా కాఫీ, పొగాకు, సారాయి వంటి సైకోయాక్టివ్ డ్రగ్స్ వాడుతున్నారు. ఇవన్నీ కూడా చాలా శక్తివంతమైనవి కూడా. ఇవన్నీ కూడా కొంతవరకు వ్యసనంగా మారగలిగేవే. వీటికి చాలా ప్రమాదకరమైన దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. అంతేకాదు ఇవి  ఆరోగ్యానికి హానికరం కూడా. దీనికి మరొక రసాయానాన్ని కూడా చేర్చాలి. అది చక్కెర. ఇది  నిజంగా మానసికంగా చాలా వ్యసనంగా మారుతుంది. మానవ జనాభాలో పిల్లలతో సహా చాలా మంది దీనికి బానిసలే. 23 ఆగస్ట్ 1973 న్యూసైంటిస్ట్ పత్రిక ప్రచురించిన ఒక వ్యాసంలో మెడిసిన్ అండ్ సొసైటీ అనే అంశం గురించి డాక్టర్ హెన్రీ మిల్లర్ ఒక భాగంలో కింది విధంగా చెప్పారు.

> – పాశ్చాత్య దేశాలలో వాడుతున్న డ్రగ్స్‌లో  ఆల్కహాల్, పొగాకు ప్రమాదకరమైన వాటిలో ముఖ్యమైనవి.  కానీ డ్రగ్ ఎడిక్ట్స్ గురించి నాతో చర్చించిన జర్నలిస్టు ఆలోచనలో ఇవి లేనే లేవు. మానసికంగా ప్రభావం చూపే డ్రగ్స్ వాడకం చరిత్రలో చాలా పూర్వం నుంచి ఉంది. అయితే ఇందులో కొన్నింటి వాడకాన్ని సమాజం అంగీకరించింది, కొన్నింటి వాడకాన్ని నేరంగా పరిగణిస్తోంది.

పంథొమ్మిదో శతాబ్దంలో నల్లమందును బ్రిటన్‌లో చాలా విరివిగా వాడేవారు. ముఖ్యంగా పేదవారు. అంతేకాదు మెడికల్ పుస్తకాల్లో ఇది ఆల్కహాల్ కంటే ఎక్కువ

ప్రభావాన్ని చూపుతుందని రాసి ఉంది. దీన్ని ఇండియా పాలకులు కూడా సమర్ధించారు. తమ దేశాలలో నల్లమందుకు ప్రత్యామ్నాయంగా మద్యాలను ప్రవేశపెట్టడాన్ని చాలా తీవ్రంగా వ్యతిరేకించారు. గంజాయి కూడా ఇలాంటిదే. ఇండియన్ హెంప్ కమిషన్, 1894 చాలా అరుదుగా కనిపించే తీవ్రమైన అనారోగ్య ప్రభావాలు, డ్రగ్స్ వాడే వారి వల్ల సమాజం మీద పడే ప్రభావాన్ని గురించి అధ్యయనం చేసింది. అవి వాడేవారికి తప్ప సమాజం అంతటి మీద వాటి చెడు ప్రభావాలు ఏవీ లేవని తేల్చింది. (పేజి 442)

డాక్టర్ జేమ్స్ విల్లీస్ తన ఇటీవలి పుస్తకం అడిక్ట్స్‌లో భారతీయుల్లో చాలామంది కొన్ని రకాల స్వీట్లు, కొన్ని రకాల కారపు స్నాక్స్‌కు అడిక్ట్ అయి ఉన్నారని వివరించారు. పురుష వ్యసనపరులను చాటోరా అని, మహిళా వ్యసనపరులను చాటోరీ అంటారు. విల్లి ఇంకా వివరించారు

> – చాటర్‌పన్ అలవాటున్న వారికి సమాజంలో పెద్దగా విలువ ఉండదు, వారిని అపరిపక్వ మనస్తత్వం కలిగిన వారిగా, స్త్రీలోలురిగా పరిగణిస్తారు. చాటర్‌పన్ అలవాటున్న వారి పరిసరాల్లో ఉండేవారిని రచయిత ఇంటర్వ్యూ చేసినపుడు స్వీట్లు ఎక్కువగా తినేవారు సామాజికంగా కొద్దిపాటి నష్టం కలిగేలా ప్రవర్తిస్తారని చెప్పారు. స్వీట్లు మరీ ఎక్కువగా తినేవారు వారిని వారు పోషించుకోలేని పరిస్థితుల్లో ఉంటారని, వారు చిన్న చిన్న మోసాలకు, దొంగతనాలకు పాల్పడుతూ రకరకాల సంఘ వ్యతిరేక కార్యకలాపాల ద్వారా ఎక్కువగా డబ్బు సంపాదించారనుకుంటారని తెలిసింది. మరికొంత మంది చాటోరాలు తరచుగా నేరాలు చేసి జైలుకు వెళ్తుంటారని చెప్పారు. ఈ వ్యసనం వల్ల వ్యక్తిగతంగా, నైతికంగా, సాంఘికంగా కూడా దిగజారతారని నిర్ధారణ అయ్యింది. (పేజి 40)

ఇదే కాకుండా చాలామంది పెద్దవారు మరికొన్ని డ్రగ్స్ కూడా తీసుకుంటారు. లక్షలాది మంది ఆస్ప్రిన్, ట్రాంక్విలైజర్లు, పెప్ పిల్స్, డైట్ పిల్స్, స్లీపింగ్ పిల్స్ ఇలా చాలావాటిని తరచుగా వాడుతుంటారు. అట్లాంటిక్‌లో బ్రూస్ జాక్సన్ రాసిన ఆర్టికల్ 'వైట్ కాలర్ పిల్స్ పార్టీ'లో చెప్పినట్టు షికాగో సంపన్న వర్గాల్లోని చాలామంది పెద్దవారు ప్రిస్క్రిప్షన్‌లో డాక్టర్లు సూచించిన దానికి కనీసం పది ఇరవై రెట్లు ఎక్కువ డోసుల్లో వాడుతున్నారు. ఈ డ్రగ్స్ అన్నీ కూడా వారి డాక్టర్ సూచించినవే కానీ డాక్టర్ సూచించిన దాని కంటే ఎక్కువ డోసుల్లో వాడుతున్నారు. న్యూయార్క్ మ్యాగజైన్ ఇంకా, ది న్యూయార్క్ టైమ్స్‌తో సహా కొన్ని పబ్లికేషన్లలో ప్రచురించిన కొన్ని వ్యాసాల్లో ఫీల్ గుడ్ డాక్టర్ల గురించి

రాశారు. ఈ ఫిజీషియన్లు పెద్ద డోసుల్లో విటమిన్లను వారి పేషంట్లకు ఇస్తుంటారు. ఇవి ఒకరకమైన ఆంఫీటమిన్‌లుగా కూడా పనిచేస్తాయి. వీటినే యువత స్పీడ్ అని పిలుచుకుంటారు. ఇలాంటి ఇంజక్షన్లను చాలామంది ప్రముఖులు తీసుకుంటుంటారు. దీనిలో ఒకరకమైన ఉత్తేజం కలిగించే రసాయనాలు వాడుతారు. వీటిని అటు ప్రకటనల్లోనూ ప్రచారం చేస్తున్నారు. ఇటు మెడికల్ ప్రొఫెషనర్లు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఏదైనా సరే ఆరోగ్యకరమైందని చెప్పి మీ కోసం డాక్టర్ సూచిస్తే సరిపోతుంది.

డ్రగ్స్ ఉపయోగించే పిల్లల గురించి పరిశోధించినపుడు చాలామంది పిల్లలు మొదటిసారి వాటిని వారి తల్లిదండ్రుల మందుల క్యాబిన్ నుంచి సేకరించి వాడినవారే. ఈ మధ్యకాలంలో ఒక సబర్బన్ టౌన్‌లో పిల్లలు చేసుకునే ఒక రకమైన పార్టీ పేరు గోల్డ్ ఫిష్. ఈ పార్టీకి వచ్చే పిల్లలు ఒక్కొక్కరు వారి తల్లిదండ్రుల మందుల క్యాబినెట్ నుంచి కొన్ని పిల్స్ తీసుకొని రావాల్సి ఉంటుంది. ఈ పిల్స్ అన్ని ఒక గిన్నెలో వేసి కలిపేస్తారు. అందులో నుంచి ప్రతి ఒక్కరు చూడకుండానే ఐదు లేదా ఆరు పిల్స్ తీసుకోని వాటిని మింగేయాలి. ఆ తర్వాత వారిలో ఎలాంటి మార్పులు వస్తాయో గమనించాలి. ఇలా మందు వాడడం వల్ల ఆశ్చర్యకరమైన ఎన్నో భావాలు కలుగుతాయన్న విషయాన్ని ఈ మధ్య పిల్లలు కనిపెట్టారు.

పిల్లలు పొగ తాగకూడదు, ఆల్కహాల్ వాడకూడదు అని అనే వారి ఉద్దేశంలో వారు ఆ పనిచెయ్యడానికి ఇంకా చాలా చిన్నవారు అనే భావనలో ఉంటారు. మరి పెద్ద వారికి దాని గురించి అంతా తెలుసా? మరి తెలిస్తే వారు పొగతాగడం ఆపేశారా? లేదు కదా. ది న్యూయార్క్ టైమ్స్‌లో ప్రచురించిన ఒక కథనం ప్రకారం 1969 నుంచి పద్దెనిమిది సంవత్సరాలు నిండిన స్మోకర్ల సంఖ్య రెట్టింపయ్యింది. పెద్దల్లో 42 శాతం మంది పురుషులు 30 శాతం మంది స్త్రీలు ఉన్నారు. పిల్లలు ఎంత మంది పొగతాగుతారనే వివరాలు అందజేయలేదు. ఎవరైనా సరే చిన్నగా ఉన్నపుడు ఏ మందు వల్ల ఎలాంటి హాని జరుగుతుందనేది చెప్పి ఒప్పించడం సులభం కాబట్టి పిల్లలకు అందరు చెబుతారు. అయినప్పటికీ మందు వల్ల కలిగే ప్రమాదాలు తెలియజేసినంత మాత్రాన పిల్లలు అవి వాడకుండా ఆపగలుగుతామన్న నమ్మకమేమి లేదు. స్కూల్‌లో నిర్వహించే డ్రగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాములలో పొగాకు, ఆల్కహాల్, కాఫీ వంటి కొన్ని డ్రగ్స్ గురించి వివరిస్తారు. ఇలాంటి కార్యక్రమాల ప్రభావం పిల్లల మీద ఎంతవరకు ఉంటుంది. మొదటి విషయం ఏంటంటే పిల్లలు పెద్దలు చెప్పే మాటలు నమ్మరు, ఇక రెండోది ఆ డ్రగ్స్ వాడడం వల్ల కలిగే ప్రభావాల పట్ల విపరీతమైన ఆసక్తి ఉంటుంది, తల్లిదండ్రులు, టీచర్లు చెడ్డవని చెబుతున్నారు

తప్ప అవి అంత చెడ్డవేమీ కాదని వారు అనుకుంటారు. చాలా రాష్ట్రాలలో ముఖ్యంగా న్యూయార్క్ లోని అన్ని స్కూల్స్‌లో ఆల్కహాల్ ఎంత ప్రమాదకరమైందనే విషయం గురించి విద్యార్థులకు బోధిస్తూనే ఉంటారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించని రాష్ట్రాలలో ప్రజలు ఎక్కువగా ఆల్కహాల్ తీసుకుంటున్నారా? ఇలాంటి కార్యక్రమాలు రూపొందించే శాసన సభ్యులు ఆల్కహాల్ తీసుకోకుండా ఉంటున్నారా? వారిలో చాలామంది తాగుతారని ఎలాంటి అనుమానం లేకుండా చెప్పవచ్చు.

ఆల్కహాల్, పొగాకు, కాఫీ, చక్కెర, నిద్రమాత్రలు, పెప్ పిల్స్ వల్ల కలిగే హాని ఎలాంటిదో  తెలిసినప్పటికీ వాటిని వాడుతూనే ఉన్నారంటే అలా వాడే వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతూనే ఉందంటే కారణం పెద్దవారవుతున్న పిల్లలు వీటిని వాడటమేనని అర్థం. పిల్లలకు కూడా వీటిని అందుబాటులో ఉంచితే వారు వీటిని ఎంచుకోవడంలో తప్పు నిర్ణయం తీసుకుంటారని కొంతమంది వాదిస్తారు. కానీ పెద్దలు అంత కంటే తప్పుగానే ఎంచుకుంటున్నారు ఇప్పుడు. మరి కొంతమంది ఈ డ్రగ్స్ పెద్దల కంటే పిల్లలకు మరింత ఎక్కువ హానీ చేస్తాయని వాదిస్తారు. వారి ఎదుగుదలలో లోపాలు ఏర్పడుతాయని వారి గుండెకు ప్రమాదకరంగా  మారుతాయని అంటుంటారు. ఒకవేళ ఇది నిజమైతే ఈ డ్రగ్స్ సరఫరా చేసేవారు ఈ విషయాలన్ని చాలా స్పష్టంగా పిల్లలతో సహా అందరికీ అర్థమయ్యేలా చెప్పాల్సి ఉంటుంది.

ఏది ఏమైనా పిల్లలకు మీరు పెద్దవారయ్యే వరకు పొగతాగకూడదు అని చెప్పడంలో ఎలాంటి అర్థం లేదు. వారికి కలిగే పొగతాగాలన్న కోరికను వారు పెద్ద వారయ్యే దాకా అణచిపెట్టుకోవడానికి తప్ప మరి దేనికి ఇది ఉపయోగపడదు. మొదటి సారి పొగతాగిన వారికి అసలు అది నచ్చదు. దాని రుచి భయంకరంగా ఉంటుంది. ఆ అనుభవం, ఆ తర్వాత ఉండే రుచి అసలు బావుండవు. ఈ దురలవాటు కావడానికి సమయం పడుతుంది. మరి ఈ దురలవాటు యువత ఎందుకు చేసుకుంటారు? ఎందుకంటే మనం కూడా ఎదిగామని తెలపడానికి ఉండే సంకేతాలలో ఇది ఒకటి అని వారు భావిస్తారు కాబట్టి. అంతేకాదు వారి చుట్టు ఉండే పెద్దవారు చేస్తుండడం కూడా ఒక కారణం. అందులో ఏదో ఉంది దీన్ని ఎక్కువ కాలం పాటు కొనసాగిస్తే అదేమిటో  తెలుసుకోవచ్చు అనుకుంటారు. పిల్లలకు ఏదైనా రుచి నచ్చకపోతే వారు దాన్ని పదేపదే చెయ్యడానికి సిద్ధపడరు చెప్పాలంటే దాన్ని తిరస్కరిస్తారు కూడా. నిజానికి పిల్లలు పొగ తాగకూడదని మనం గట్టిగా అనుకుంటే, వారికి పొగతాగడం వల్ల కలిగే నష్టాలు వివరించడం కంటే రోజుకో సిగరెట్ ఇచ్చి కాల్చమని చెప్పాలి. ఆ అసైన్‌మెంట్ పూర్తి చెయ్యని వారికి తప్పకుండా శిక్షలు కూడా అమలు చెయ్యాలి.

చట్టం అంగీకరించడానికి చాలా ముందు నుంచే ఈ రోజుల్లో పిల్లలు పొగ తాగుతున్నారు, ఆల్కహాల్ తీసుకుంటున్నారు. చాలామంది పిల్లలు పన్నెండేళ్లు నిండకుండానే పొగ తాగడం మొదలు పెడుతున్నారు. వారిలో చాలామంది తరచుగా పొగ తాగుతున్నారు కూడా. చాలామంది  పిల్లలు ఆల్కహాల్ కూడా తీసుకుంటున్నారు. పధ్నాలుగేళ్ల వయసు వచ్చిన వారిలో చాలామందికి తాగినపుడు ఎలా ఉంటుందో తెలుసు. వారిని అనుమతించడం ద్వారా మరింత ఎక్కువగా ఈ అలవాటుకు లోనవుతారన్న కారణంతో వారిని అడ్డుకోవడంలో అర్థం లేదు. నా అనుభవంలో నాకు తెలిసి పిల్లలు ఇలా తాగడం లేదా పొగ తాగడం ద్వారా తాము ఎదిగామని తెలియజేయడానికి ఇలా చేస్తుంటారు. కొన్నిసార్లు తోటివారి ఒత్తిడి వల్ల కూడా ఇలా చేస్తుంటారు.

పిల్లలు సమాజంలోని తోటివారి ఒత్తిడికి చాలా త్వరగా లోనవుతారు. ఎందుకంటే వారిని చేర్చుకునే సమూహం అదొక్కటే. మరొకరెవరు వారిని తమతో కలుపుకోవడానికి ఆసక్తి కనబరచరు. ఒకవేళ పెద్దలు వారిని ఎవరినైనా కలుసుకున్నపుడు వారు వీరిని పిల్లలుగానే పరిగణిస్తారు, వారి అనుయాయులుగానే చూస్తారు, తక్కువగా చూస్తారు, తెలివితక్కువ వారిగా అంచనా వేస్తారు, వారికి విలువ, గౌరవం, హక్కులు ఏవీ లేనివారిగా జమకడతారు. అందుకే అరుదుగా ఎవరైనా పెద్దవారిని కలుసుకున్నపుడు వారి వద్ద తెలివితక్కువగా ప్రవర్తించి వారిని అసంతృప్తి పరచకూడదని అనుకుంటారు. కనీసం ఒక్క పెద్దవారినైనా ఇష్టపడే అదృష్టవంతులైన పిల్లలు చాలా అరుదుగా ఉంటారు.

నేను చిన్నగా ఉన్నపుడు పార్టీలలో, ప్రత్యేక సందర్భాలలో, డాన్సులు ఉన్న పార్టీలలో నాకు సౌకర్యవంతంగా ఉండేది కాదు.  దాన్ని పోగొట్టుకోవడానికి ఆల్కహాలు తాగేవాడిని. కానీ అందరు ఇందుకే తాగుతారని అపోహపడేవాడిని. ఇలాంటి సామాజిక కార్యక్రమాలలో ఉండే పోటీతత్వం ఇబ్బంది పెట్టడం వల్ల ఇలా జరిగేది. అన్ని వయసుల వారు పాల్గొనే కార్యక్రమాలు సమాజంలో మరిన్ని జరగాల్సిన అవసరం ఉంది. అక్కడ హోదా ప్రశ్న తలెత్తకూడదు. పెద్దవాళ్లు  కూడా పిల్లలు ఈ విశాలమైన సమాజంలోకి రావడానికి తమ వంతు సహకారాన్ని అందించాలి. నా చిన్నపుడు నాకు పెద్దవాళ్లు  పాల్గొనే సామాజిక కార్యక్రమాలు చాలా నచ్చేవి. నాకు నేను ప్రముఖంగా ఉండడం గురించిన బెంగ లేకుండా సౌకర్యంగా అనిపించేది.

చాలా కుటుంబాల్లో పిల్లలను ఆల్కహాల్‌కు దూరంగా పెడుతుంటారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరికి కూడా పెద్దలు తాగుతున్న దాన్ని రుచి చూసే అవకాశం కల్పిస్తే కొంతకాలం వారికి అది చాలా బావుంటుంది, కానీ తర్వాత దాని మీద ఆసక్తిపోయి

వారు చాలా ఏళ్లవరకు దాని జోలికే వెళ్లరు. ప్రత్యేక సందర్భాల్లో కొద్దిపాటి వైన్ రుచి చూసే అవకాశం కల్పించడం మంచిదే. పది పన్నెండు సంవత్సరాల వయసు వచ్చిన వారికి వారి తల్లిదండ్రులు, అతిధులతో కలిసి ఒక గ్లాస్ బీర్ తాగేందుకు అనుమతివ్వాలి. అలాంటి పిల్లలు చాలామంది తాగడం తాము ఎదిగామని చెప్పడానికి ఒక ప్రత్యేకమైన రుజువు అని భావించడం ఉండదు. ఆ పని చేయడం పట్ల విపరీతమైన ఆసక్తి చూపకపోవచ్చు కూడా. వారి మీద దాని ప్రభావం ఎలా ఉంటుందనేది వారికి తెలిసి ఉంటుంది, కాబట్టి దాన్ని వారు కొంచెం తెలివిగానే ఉపయోగిస్తారు.

ఇలా చెయ్యడం వల్ల పెద్దలు వాడే డ్రగ్స్‌ను పిల్లల నుంచి దాచాల్సిన అవసరం ఉండదని నేను అనుకుంటున్నాను. కొన్ని సంవత్సరాల క్రితం ఫ్రాన్స్‌లో ఒక లజ్జాకరమైన విషయం వెలుగు చూసింది. ఆ దేశంలోని కొన్ని ప్రాంతాల్లో పదేళ్లు దాటక ముందే చాలా మంది పిల్లలు ఆల్కహాలిక్స్‌గా మారారని దర్యాప్తులో తేలింది. ఆ దేశంలో పెద్దలంతా కూడా కేవలం వైన్, హార్డ్ సైడర్ (యాపిల్ రసంతో చేసిన సారాయి), బ్రాందీ మాత్రమే తాగుతారు. పిల్లలంతా కూడా చురుగ్గా ఉండేవారు. ఉట్టినే దాహం వేస్తూ ఉండేది. ఏదైనా ఎక్కువగా తాగాలనిపించేది. వారికి ఎక్కువగా అందుబాటులో ఉండేది ఆల్కహాల్ కావడంతో అదే తాగేస్తూ అలా చాలామంది ఆల్కహాలిక్స్‌గా తయారయ్యారు. దీనికి ఒకే ఒక పరిష్కారం ఏంటంటే చాలా రకాల ఆరోగ్యకరమైన పానీయాలు వారికి అందుబాటులో ఉంచాలి. అంతేకాదు మనం పిల్లలకు 1. వారు తాగుతున్నదేమిటి అనే దాని గురించి పూర్తి సమాచారం ఇవ్వడం 2. డ్రగ్స్‌కు బానిసలు కాని పెద్దలను ఉదాహరణగా చూపుతూ వివరించడం 3. డ్రగ్స్‌ను సరైన పద్ధతిలో ఉపయోగిస్తున్న పెద్దల గురించి తెలపడం 4. ఎలాంటి లక్ష్యం లేని, విశ్వాసం కలిగించని సమాజంలో ఆ బాధను తప్పించుకోవడానికి అక్కడి ప్రజలు డ్రగ్స్‌ను తీసుకుంటారు.

స్కూల్స్ కూడా పిల్లల మధ్య ఈ సంస్కృతి ప్రజ్వరిల్లడానికి కొంత దోహదం చేస్తున్నాయి. ఇది కొంతవరకు మాత్రమే పిల్లలంతా కలుసుకునేందుకు వీలు కల్పించే ప్రదేశం కాబట్టి అది సరఫరా బిందువుగా మారింది. ఈ విధంగా ఆలోచించినపుడు స్కూల్స్ డ్రగ్ స్టోర్ల పాత్ర పోషిస్తున్నాయి. అంతేకాదు అక్కడ చేరిన పిల్లలు తాము డ్రగ్స్ ఏ పద్ధతిలో వాడుతున్నారో తెలుసుకునేందుకు అస్కారం ఏర్పడుతోంది కూడా. వాటి ప్రభావం ఎవరి మీద ఎలా ఉంటుందనేది కూడా పోల్చి చూసుకుంటారు. అంతేకాదు అక్కడ ఎవరు ఎలాంటి పిల్స్‌ను వాడుతూ ఎంత తట్టుకోగలుగుతున్నారనే అంశం మీద వారికి పోటీ కూడా ఏర్పడుతుంది. క్లాస్ రూంలో పిల్లల మధ్య చదువుకు సంబంధించిన

పోటీ ఉండాల్సిన చోట ఇలాంటి విషయాల మీద పోటీ ఏర్పడుతుంది. అసలు స్కూల్ అంటేనే చాలా నిరాసక్తంగా, శిక్షించే సంస్థగా, అసహ్యంగా ఉంటుంది. ఇక చాలా మంది పిల్లలు తాము స్కూల్ క్యాంపస్‌లోనే డ్రగ్స్ తీసుకుంటామని చెబుతున్నారు. అది వారికి స్కూల్‌లో ఆ రోజు గడపడానికి కావల్సిన శక్తిని ఇస్తుందని భావిస్తున్నారు. స్కూల్ అంటే ఫ్యాక్టరీ మాదిరిగానే ఉంటుంది. వాటిల్లో  కూడా డ్రగ్స్ వాడకం పెరుగుతూ వస్తోంది.

డాక్టర్ థామస్ స్లాజ్ తరచుగా చెప్పేదాన్ని బట్టి కొంతకాలం హెరాయిన్ అమెరికాలో లీగల్ డ్రగ్. గౌరవప్రదమైన స్థానంలో ఉన్న చాలామంది పెద్దలు దీన్ని వాడేవారు. హెరాయిన్ వాడే వారు మామూలుగా పనిచేసుకోలేరు అనేది పూర్తిగా నిజం కాదు. రోజు కొద్ది మోతాదులో హెరాయిన్ తీసుకునే వారు ఎప్పటిలా తమ పనులు తాము చేసుకోగలుగుతారు. వారు తమ హెరాయిన్ వాడకాన్ని వీలైనన్ని రోజులపాటు సమాజానికి తెలియకుండా దాచి ఉంచుకోవచ్చు. ఆ విషయం బయటపడితే మాత్రం వారు  చాలా ప్రమాదంలో పడతారు. హెరాయిన్ జీవితాన్ని నాశనం చేసే డ్రగ్ అని మన ప్రభుత్వం, పత్రికలు ప్రచారం చేశాయనేది నిజం. ఒక వైద్య పరిశోధకుడు హెరాయిన్ దీర్ఘకాలిక తక్షణ ప్రభావాలపై ప్రచురించిన పత్రం ప్రకారం స్వచ్ఛమైన మానవుడు ఇప్పటివరకు వ్యవస్థలో ప్రవేశపెట్టిన అత్యంత తక్కువ హానికరమైన డ్రగ్ హెరాయిన్. అయితే, హెరాయిన్ దొరకడం చాలా కష్టం, చాలా ఖరీదు కూడా. హెరాయిన్ డ్రగ్ కంటే హెరాయిన్ జీవన శైలి ఎక్కువగా జీవితాలను నాశనం చేస్తుంది. చాలా ఖరీదైంది కావడం వల్ల దీనిలో ఇతర ప్రమాదకర రసాయనాలు కలుపుతారు. ఎక్కువ డోసుల్లో తీసుకోవడం వల్ల చనిపోయారని భావించేవారు నిజానికి హెరాయిన్‌లో కలిపే క్వినైన్ వల్లనే మృత్యువాత పడుతుంటారు. చనిపోయేంత ఎక్కువ మొత్తంలో స్వచ్ఛమైన హెరాయిన్  తీసుకోవాలంటే అది చాలా ఖరీదైన వ్యవహారం. ఏ డ్రగ్ ఎడిక్ట్ కూడా ఆ ఖర్చు భరించలేడు. నిజానికి హెరాయిన్ పొగాకు, ఆల్కహాల్‌తో పోల్చి చూసినపుడు తక్కువ హానికరమైంది. కాని చాలా త్వరగా చౌకబారు ఆనందం కలిగిస్తుంది. పరిశుద్ధ మతావలంబీకులు ఉన్న దేశంలో సమాజం సహజంగా దీన్ని అంగీకరించదు. హెరాయిన్ (మరియు మారిజువానా) తీసుకున్నవారు పనిచేయడాన్ని ఇష్టపడరన్న నమ్మకం చాలామందిలో దాని పట్ల వ్యతిరేకతను పెంచింది. కాబట్టి, ఇది చాలా ప్రమాదకరమైందన్న వాదనను ప్రజలు వెంటనే ఆమోదించారు. ఆ తరువాత దీన్ని నిషేధిస్తూ చట్టాలు వచ్చాయి. దాంతో నిషిద్ధ హెరాయిన్ పరిశ్రమ పుట్టింది. ఇప్పుడు ఇదొక  అతి భారీ వ్యాపారంగా మారింది. ఉత్పత్తి కంటే సరఫరా మరింత పెద్ద వ్యాపారమైంది. అయితే, అసలు హెరాయిన్ వాడకం ఆరోగ్యానికి

తీవ్రస్థాయిలో నష్టం కలిగిస్తుందని నమ్మడానికి కూడా ఒక ముఖ్యమైన విషయం. హెరాయిన్‌కు చట్టబద్ధంగా అనుమతి ఉన్నప్పుడు  దేశవ్యాప్తంగా గరిష్ట స్థాయిలో దాదాపు 2,00,000 మంది దీనికి అలవాటు పడినవారు ఉండేవారు. వీరినే మనం అడిక్ట్స్ అని పిలుస్తాం. ఇప్పుడు దాదాపుగా తొంబై లక్షల మంది ఆల్కహాలిక్స్‌తో పోల్చితే ఈ సంఖ్య ఎంత తక్కువో అర్థమవుతుంది. ఇక ప్రతి సంవత్సరం 50,000 మంది దాకా ఈ అలవాటుతో మరణిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే వారి సంఖ్య ఇంతకు ఎన్నో రెట్లు ఉంటుంది.

అప్పుడప్పుడు  హెరాయిన్ వ్యతిరేక నిపుణులు హెరాయిన్‌ను కొన్ని దేశాలు చట్టబద్ధం చేసినప్పటికీ అది అంత మంచి ఫలితాలు ఇవ్వలేకపోయిందని అంటారు. “మంచి ఫలితాలు  ఇవ్వలేదు అంటే అర్థం ఏమిటి? ఏ రకమైన ఫలితాలు ఇవ్వలేదు? అనేది మా ప్రశ్న. అంటే ప్రజలు దాన్ని ముందు కంటే ఎక్కువగా వాడుతున్నారు అనేది వారి సమాధానం. కొంత మంది హెరాయిన్‌ను వాడుతున్నారంటే  వారికి అది ఇష్టమని అర్థం. అలాగే కొంత మందికి కాఫీ తాగడం లేదా పొగతాగడం లేదా ఆల్కహాల్ తీసుకోవడం ఇష్టముంటుంది. అలాగే కొంత మంది శక్తిమంతమైన, అలవాటయ్యే లక్షణం ఉన్న సైకోయాక్టివ్ డ్రగ్స్ తీసుకుంటున్నారంటే అర్థం ఏమిటి? అలా తీసుకోవడం వారికి ఇష్టమని. మరి మరో రకమైన డ్రగ్స్‌ను మరికొంత మంది ఇదే కారణంతో ఎందుకు తీసుకోకూడదు?

ఇటీవలి రిపోర్టు ప్రకారం హెరాయిన్ ధర  మరింత పెరగనుంది అంతేకాదు నాణ్యత కూడా తగ్గిపోతోంది, చాలామంది హెరాయిన్ నుంచి సులభంగా దొరికే, ట్రాంక్విలైజర్‌గా (మనసును ప్రశాంతంగా) పనిచేసే, బాధ తెలియని మరో డ్రగ్ వైపు మళ్లుతున్నారు. వీటివల్ల మరింత దారుణమైన ఆరోగ్య సమస్యలు కలుగవచ్చు. డ్రగ్స్ అన్నీ కూడా విషపదార్థాలేమీ కాదు. వీటి బారి నుంచి శరీరం త్వరగానే కోలుకుంటుంది కూడా. ఒకవేళ ఎవరైనా ఎక్కువ డోసులో వీటిని తీసుకుంటే వారు బతికుండడానికి ఎనిమిది గంటల పాటు వారు నిద్రపోకుండా చూస్తే చాలు. వారు ప్రమాదం నుంచి బయటపడతారు. కానీ కొత్త మత్తు మందుల విషయంలో అలా ఉండదు. ఓవర్ డోస్‌లో తీసుకున్నపుడు వారిని బతికించినా కూడా వాటి అవశేషాలు దేహంలో మిగిలిపోతాయి. కనీసం రెండువారాల పాటు చాలా అత్యవసర చికిత్స అందజేస్తూ ఖరీదైన వైద్యం చేయిస్తే తప్ప వారిని కాపాడలేము.

ఈ మధ్య చాలా సందర్భాల్లో స్టిమ్యులెంట్స్ (ప్రేరణ కలిగించేవి), డిప్రెస్సెంట్స్ బ్లాక్ మార్కెట్‌కు తరలి పోవడం సాధారణమై పోయింది. అందువల్ల డ్రగ్స్ మీద నియంత్రణ

సాధించడం దాదాపుగా అసాధ్యంగా పరిణమించింది. పెద్ద మొత్తంలో లీగల్ డ్రగ్స్ దొరకడం మాత్రమే కాదు. వీటి కాంబినేషన్లకు దాదాపు అసంఖ్యాక అవకాశాలు ఉన్నాయి. కొన్ని రకాల మత్తు పదార్థాలు కలిపి తీసుకుంటే చాలా ప్రమాదకరంగా పరిణమించవచ్చు. ఉదాహరణకు ఆల్కహాల్ బార్బిట్యుయేట్స్‌గా వ్యవహరించే నిద్రమాత్రలు కలిపి తీసుకుంటే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడవచ్చు. అదే వీటిని వేటికవి విడివిడిగా తీసుకోవడం అంత ప్రమాదకరం కాకపోవచ్చు.

ఈ 'లీగల్ డ్రగ్స్'ను ప్రైవేటుగా తయరుచేసుకోడం కూడా చాలా సులభం. కొద్దిపాటి రసాయనశాస్త్రం తెలిసి ఒక గదిలో పట్టే చిన్నపాటి పరికరాలు అందుబాటులో ఉంటే సులభంగా ఎవరికి వారే తయారు చేసుకోవచ్చు. ఇది ఎల్ఎస్‌డి విషయంలో ఇదే జరుగుతోంది కూడా. ఎల్ఎస్‌డిలో కల్తీ ఎక్కువగా జరుగుతూ ఉండటంతో దానికి చెడ్డపేరు రావడం, ఇతర డ్రగ్స్ ఫ్యాషనబుల్‌గా మారడం వల్ల దానికి ఇప్పుడు డిమాండ్ తగ్గిపోయింది. ఫ్యాషన్ మారినప్పటికీ ఈ డ్రగ్‌కి సంబంధించిన చిన్నపాటి సప్లయ్ ఎప్పుడూ మార్కెట్లో ఉంటూనే ఉంటుంది. చాలా రకాల డ్రగ్స్ విషయంలోనూ ఇదే జరుగుతుంది. పెద్ద పెద్ద డ్రగ్ కంపెనీల నుంచి వచ్చే డ్రగ్స్‌కి సంబంధించి పెద్ద మొత్తంలో ఉండే సప్లై ఆపడానికి మాదక ద్రవ్యాల అలవాటు మాన్పించేవారికి ఎలాంటి దారి కనిపించలేదు. ఇలాంటి డ్రగ్స్ సప్లయ్‌ని ఆపడం కానీ లేక వాటి అమ్మకాలను నిషేధించడం కానీ ప్రొహిబిషన్ లానే తప్పకుండా విఫలమవుతుంది. ఇలా చెయ్యడం వల్ల కేవలం పోలీసుల్లో, ఇతర ప్రభుత్వ అధికారుల్లో అవినీతి పెరిగిపోవడం తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదు.

న్యూయార్క్ టైమ్స్‌తో పాటు చాలా పబ్లికేషన్లలో నార్కోటిక్స్ ఏజెంట్ల చట్టవిరుద్ధమైన కార్యకలాపాల గురించి చాలా భయపెట్టే ఆర్టికల్స్ పబ్లిష్ అయ్యాయి. వారిమీద కేసులు పెట్టినా కూడా కోర్టుల్లో సాక్ష్యాలు లేవన్న కారణంగా ఇవన్నీ వదంతులుగా మారుతున్నాయి. వీరి మీద కేసుపెట్టడానికిముందే యూనిఫాం లేకుండా అనుమానం ఉన్న ఇళ్ల మీద దాడి చేస్తారు. అలా దాడి చేసినపుడు వారు పారిపోతుంటారు. కొన్ని సందర్భాల్లో కాల్పుల్లో చనిపోతారు. లేదంటే దాడుల్లో ఎలాంటి ఆధారాలు దొరకలేదని అంటుంటారు. ఇక వారు చట్టవిరుద్ధమైన లేదా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడ్డ పోలీసులు అసలు వారిని వదిలి అమాయకులను చంపుతారు. ఈ మధ్యకాలంలో ఒక షాకింగ్ కేస్ ఒకటి కాలిఫోర్నియాలోని హాంబల్డ్ కౌంటీలో జరిగింది. ఇలా హత్యచేయబడ్డ యువకుడు ఎలాంటి పౌరహక్కులకు భంగం కలిగించలేదని శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఒక కోర్టు నిర్ధారించింది కూడా. పోలీసులు అతడిని ఎలాంటి సాక్ష్యం కానీ వారెంటు కానీ లేకుండానే అతడి మీద కాల్పులు

జరిపారు. నిజానికి మనకున్న పౌరహక్కులు ఏమిటి? మన యాంటి డ్రగ్స్ చట్టాలు ఇలాంటి చట్టబద్ధమైన హత్యలకు ఆస్కారం కలిగిస్తున్నాయి.

"డ్రగ్ రెయిడ్ విక్టిమ్స్ స్ట్రైవ్ టూ కన్‌స్ట్రక్ట్ ఏ న్యూ లైఫ్" పేరిట ఒక వ్యాసం ద న్యూయార్క్ టైమ్స్‌లో ఆండ్రూ మాల్కోమ్ రాశాడు. 19 ఆగస్టు, 1973 న ప్రచురించిన ఈ వ్యాసంలో చట్ట విరుద్ధమైన హింసాత్మకమైన డ్రగ్ రైడ్స్‌లో గురించి వివరించాడు ఈ కథనంలో...

> హెర్బెర్ట్, ఎవ్లీన్ గిగ్లియెట్టో అనే దంపతులు ఇల్లినాయిస్‌లోని కోలిన్స్‌విల్లేలో నివసించేవారు. వాళ్ల ఇంటి మీద జరిగిన చట్ట విరుద్ధమైన డ్రగ్ రైడ్ తర్వాత ఇల్లు వదిలి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నారు. వారు మరో పాశ్చాత్య దేశంలో తమ కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సిద్ధపడుతున్నారు.
>
> డ్రగ్స్ దుర్వినియోగ చట్టాల అమలు చేసే ఫెడరల్ ఆఫీస్‌కు చెందిన 15 మంది ఏజెంట్లు పై అధికారుల అనుమతి లేకుండానే ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండానే ఒక అపార్టుమెంటులోకి ఒక అర్ధరాత్రి ప్రవేశించారు. అక్కడ పడుకున్న దంపతుల మీదకు గన్ గురి పెట్టి ఆ ఇంటిని సోదా చేశారు. ఆ ఇంట్లో ఏమీ దొరకలేదు. తర్వాత వారు తప్పుడు అడ్రస్‌కు వచ్చినట్టు చెప్పారు.
>
> గిగ్లియెట్టో ఒక మిలియన్ డాలర్ల పరువు నష్టం దావా వేశారు. ది ఫెడరల్ డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ వారు వారి ఏజెంట్లు ఆరుగురి మీద చర్య తీసుకోవాలనుకున్నారు.
>
> గిగ్లియెట్టో తన ఇంటి మీద జరిగిన రైడ్ గురించి వివరిస్తూ అర్ధరాత్రి పూట తమ ఇంటికి బ్లాంక్ కాల్స్ వచ్చేవని చెప్పారు. పార్కింగ్‌లో ఉంచిన తమ కారు సోదా చేశారని, గ్లిగియోట్టో సోదరుడి మీద కత్తితో దాడి జరిగిందని, కొంతమంది ఈలోగా గిగ్లియెట్టో తల్లి ఇంటిలోకి కూడా ఎవరో బలవంతంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. "ఇక తప్పనిసరి పరిస్థితుల్లో జూలై మొదటి వారంలో మేము ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాము" అని చెప్పారు. తన కొత్త అద్దె ఇంటిలో సేదతీరుతున్న ఆయన తన కొత్త అడ్రస్‌ను ప్రచురించవద్దని కోరారు. "మేము ఆ రైడ్స్‌ను తేలికగా తీసుకోవాలనుకున్నాము కానీ వారు మా జీవితాలు దుర్భరం చేశారు" అన్నారు. 31 సంవత్సరాల వయసున్న ఈయన బాయిలర్లు తయారు చేసే వాడు, ఇప్పుడు కొత్త ఉద్యోగం వెతుక్కోవడానికి కష్టపడుతున్నారు.

ఇదొక అసామాన్యమైన కథ. ఫెడరల్ ఏజెంట్ల నేరం రుజువు కాలేదు. కానీ డ్రగ్ ఏజెంట్స్‌కి అక్కడుండే ఇతరులకు అందరికీ తెలుసు. వారి వేధింపులు తాళలేకనే గిగ్లియెట్టో తన ఇంటిని, ఉద్యోగాన్ని వదిలి  పారిపోవాల్సి వచ్చింది. ప్రభుత్వ ఏజెంట్ల దాడికి ఒకసారి గురైనామంటే వారు పదే పదే దాడి  చేస్తూనే ఉంటారా? మరి ఒక పౌరుడు ప్రభుత్వ ఏజెంట్ల చట్టవిరుద్ధ చర్యల వల్ల నేరస్తుల మాదిరిగా పారిపోవాల్సి వస్తోంది. అయినా ఈ కథ ఇక్కడితో ఆగిపోదు.

చట్ట విరుద్ధమైన డ్రగ్స్ వాడకాన్ని అదుపు చేసే చట్టాల వల్ల కొద్దిపాటి మంచి జరిగినా అవి చాలా ఎక్కువ చెడు చేస్తున్నాయి. అలాగే పెద్దలు చేసే కొన్ని పనులు పిల్లలు చెయ్యకూడదని నిషేధించే చట్టాలు కూడా ఇలాంటివే. పౌరులు డ్రగ్స్ వాడడం ఒక విధమైన 'సమస్య' అయినప్పటికీ, అది సంభవించడానికి వీల్లేని దుష్కార్యం మాత్రం కాబోదు. అయినా  ఈ 'సమస్య'కు ఒకటే పరిష్కారం ఏమిటంటే, డ్రగ్స్ రహిత సమాజం సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అలాంటి సమాజంలో బతకడం సంతోషం అని ప్రజలు భావించాలి. డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు లేకుండా ఆనందంగా పనిచేసుకుంటూ జీవించడం సంతోషం అని ప్రజలు భావించగలగాలి. వారికి డ్రగ్స్ వాడకం వల్ల ఆనందం లభించడం కాకుండా అది ఎలాంటి ఆనందం లేనిదిగా అనిపించాలి. ఆంద్రూ విల్లీ "ది నేచురల్ మైండ్"లో ఆరేళ్ల  వయసు పిల్లలు ఎంత శక్తిమంతంగా, ఎంత చురుకుగా ఉంటారో చెబుతూ ఆ స్థితిని 'నేచురల్ హై'గా అభివర్ణించాడు. అంతటి శక్తిమంతంగానూ, చురుకుగానూ సమాజంలో ప్రజలందరూ ఉండేటువంటి పరిస్థితిని కల్పించాలి, అది మాత్రమే అందరి ఆరోగ్యం బావుండడానికి తోడ్పడుతుంది. అప్పుడు మాత్రమే మనం చెప్పుకునే మంచి నిర్మితమవుతుంది, చాలామంది కనీసం కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనైనా డ్రగ్స్ ఉపయోగించాలని అనుకుంటారు. సంస్కృతి, చరిత్రలో మానవుడు డ్రగ్స్‌ను పరికరాలు, జంతువులను వాడుకుంటున్నట్టుగానే వాడుకుంటున్నాడు. చెప్పాలంటే ఎల్లప్పుడు అలాగే ఉంటాడు కూడా.

# 26. వాహనం నడిపే హక్కు

**అ**మెరికాలోని చాలా రాష్ట్రాలలో కొంత మంది పెద్దల ఒత్తిడి వల్ల ఏదో అవసరం వల్ల లేదా ఆటో ఇండస్ట్రీలో ఉండే రకరకాల లాబీల వల్ల ఇంకా అనేక కారణాల వల్ల పెద్దలకు ఉండే ఇతర హక్కులన్నింటి కంటే ముందుగానే ఈ వాహనం నడిపే హక్కును ఇచ్చేస్తున్నారు. చెప్పాలంటే కొన్ని రాష్ట్రాలలో సిగరెట్ వెండింగ్ మిషన్ నుంచి సిగరెట్ కొనే వయసు కంటే ముందే వాహనం నడిపే హక్కును ఇచ్చేస్తున్నారు. నేనైతే ఏదైనా వాహనం నడపడానికి లైసెన్స్ ఇచ్చేందుకు నిర్దేశించిన నియమాలు మరింత కఠినంగా ఉండాలని నమ్ముతాను. డ్రైవింగ్ విషయంలో అశ్రద్ధగా ఉండేవారి లైసెన్సులు రద్దు కూడా చెయ్యాలి. కానీ ఏ వయసు వారైనా సరే వారికి డ్రైవింగ్‌కు సంబంధించిన పూర్తి పరిజ్ఞానం, నైపుణ్యం ఉన్నపుడు కారు నడిపించేందుకు అనుమతి ఉండాలి.

చాలా మంది పెద్దవారి కంటే 25 సంవత్సరాలలోపు వారు డ్రైవింగ్ చేస్తున్నపుడు జరిగిన రోడ్డు ప్రమాదాల సంఖ్య చాలా ఎక్కువ అని తరచుగా చాలా మంది లెక్కలు చూపుతుంటారు. డ్రైవింగ్ అంటే వారి వాదన ప్రకారం జడ్జిమెంటుకు సంబంధించిన విషయం, ఇక జడ్జిమెంట్ చేసే సామర్థ్యం వయసుతో పాటు వస్తుంది. కాబట్టి లీగల్ డ్రైవింగ్ వయసును పెంచాలని వారి ఉద్దేశం. దీని గురించి మాట్లాడే ముందు ఇలా వాదించే వారు చూపించే రోడ్డు ప్రమాదాల లెక్కల గురించి ఒకసారి చర్చించుకుందాం, లెక్కల ప్రకారం కేవలం 25 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నందువల్ల మాత్రమే ఒకరు రోడ్డు ప్రమాదానికి కారణమయ్యారని చెప్పడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాల్లేవు. ఇంకా చెప్పాలంటే అతడి కంటి చూపు చాలా చురుకుగా ఉండడం వల్ల మరింత

సమర్థవంతంగా డ్రైవింగ్ చెయ్యగలుగుతాడు. జడ్జిమెంట్ చెయ్యగలిగే సామర్థ్యం వయసును బట్టి కాకుండా వ్యక్తుల మీద ఆధారపడి ఉంటుంది.

యువత మీద ఈ విషయంలో వివక్ష చూపడం కంటే హైవే మీద రోడ్డు ప్రమాదాలు జరగడానికి అసలు కారణాలు అన్వేషిస్తే చాలా మేలే జరుగుతుంది. నిజానికి ప్యాసింజర్లుగా ప్రయాణం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన లేదా గాయపడిన ఎంతోమంది పిల్లలను కాపాడేందుకు వీలవుతుంది. దానికోసం –

1. కఠినమైన డ్రైవింగ్ పరీక్ష.
2. ఆల్కహాల్ తీసుకొని డ్రైవింగ్ చేసే వారికి చాలా పెద్దమొత్తంలో జరిమానా విధించడం.
3. మెరుగైన డిజైన్‌తో కార్ల తయారీ, సురక్షితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కార్లను తయారు చేయాలి.
4. ఎక్కువ 'క్రాష్ రెసిస్టెన్సీ' కలిగిన కార్లను తయారు చేయడం.
5. తక్కువ శక్తి (పవర్) కార్లు, శక్తి (పవర్) మీద కఠినమైన పరిమితులు.
6. తప్పని సరిగా షోల్డర్ బెల్ట్ ధరించేలా నియమాలు, పాటించని వారికి జరిమానాలు.
7. కార్ల కంపెనీలకు డీలర్లకు ఏ కార్ల వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి, వాటిలో లోపాల వల్ల అలా జరుగుతున్నాయా అనే విషయాల మీద కూడా దృష్టి సారించడం.
8. వేగ నియంత్రణలో కఠిన నియమాలు, రోడ్ల నిర్మాణంలో రఫ్‌నెస్, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు.
9. ప్రమాదాలకు గురవుతున్న, రక్షణ చర్యలు నిర్లక్ష్యం చేస్తున్న వ్యక్తుల డ్రైవింగ్ సామర్థ్యాన్ని తరచూ పరీక్షించడం.
10. మరింత నిజాయితీగా, కఠినంగా రక్షణ చర్యల పర్యవేక్షణ. అంతేకాదు ప్రయాణాలు చెయ్యడానికి వ్యక్తిగతంగా వాహనాలు వాడడం వల్ల ఎక్కువ ఇంధనం కూడా ఖర్చు కూడా ఉంటుంది. దీన్ని తగ్గించడానికి వీలైనంత వరకు తక్కువ

ప్రమాదాలకు ఆస్కారం ఉండే తక్కువ ఖర్చుతో పూర్తయ్యే విధంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాడడానికి ప్రోత్సాహం.

ఇవే కాకుండా పిల్లలు, యువత డ్రైవింగ్ మీద మరో ఆరోపణ కూడా చేస్తారు, అదేంటంటే యువత అనుభవం లేకుండా సరిగ్గా జడ్జి చెయ్యకుండా నడిపించడం మాత్రమే కాదు, వారు ఆల్కహాల్ తీసుకొని డ్రైవింగ్ చెయ్యడం కూడా ప్రమాదాలకు కారణం అని అంటుంటారు. అది చాలా ప్రమాదకరం అని వారికి తెలిసి కూడా వారు ఏదో ఒక కారణంతో చేస్తారు. స్త్రీల కంటే పురుషులే ఎక్కువగా తాగడం, డ్రైవింగ్ చెయ్యడం చేస్తారు. ఈ రెండూ కూడా పెద్దవారిమయ్యామని చెప్పడానికి రుజువుగా భావిస్తారు. అది వారిలోని ఉత్సాహాన్ని నిరూపించుకునే మార్గంగా భావిస్తారు కూడా. కార్ల డిజైన్‌ను చేసేటప్పుడు అవి ఎంత అందంగా హుందాగా కనిపిస్తున్నాయని కాకుండా ఎలాంటి డిజైన్లు వాహనాన్ని అదుపు చెయ్యడానికి సులభంగా ఉంటాయనే దాని మీద ఎక్కువ దృష్టి నిలపడం మంచిది. చాలామంది పెద్దవారు సురక్షితంగా డ్రైవింగ్ చెయ్యగలిగినపుడు పిల్లలను పెద్దల సమాజానికి దూరంగా ఉంచకుండా వీలైనంత త్వరగా వారిని అందులోకి స్వాగతించాలనుకుంటే మాత్రం చాలామంది యువకులు వారి పెద్దల మాదిరిగానే విజయవంతంగా డ్రైవింగ్ చెయ్యగలుగుతారు. అంతేకాదు వారి కంటి చూపు చాలా చురుకుగా ఉండడం వల్ల, లైట్ల కాంతి పరావర్తనాన్ని సైతం తట్టుకోగలగడం వల్ల యువకుల్లో చాలామంది మెరుగ్గానే డ్రైవింగ్ చేస్తారు.

# 27. చట్టం, యువత, శృంగారం

**పి**ల్లలతో సహా అందరికి తమ వ్యక్తిగత శృంగార జీవితం, చర్యల మీద పూర్తి అదుపు కలిగి ఉండే హక్కు ఉండితీరాలి. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం ఇందులో ప్రభుత్వం గానీ, రాజ్యం కానీ, చట్టం కానీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. శృంగారం విషయంలో పెద్దలు వ్యక్తిగతంగా కేవలం వారికి సంబంధించిన కార్యంగా భావిస్తారో అలాగే భావించే హక్కు పిల్లలకు కూడా ఉండాలి. ఇప్పుడున్న దాని కంటే తక్కువ వయసులో బాధ్యత కలిగిన స్వేచ్ఛాయుత పౌర జీవనం గడిపేందుకు పిల్లలకు హక్కును కల్పించేట్టయితే ఇలాంటి వారిని శృంగారం విషయంలో కూడా వయసుతో సంబంధం లేకుండా ఇతర పౌరులందరితో సమానంగానే చూడాలనేది నా అభిప్రాయం. పౌరసత్వం లేని, ఇతర సంరక్షకుల ఆధ్వర్యంలో జీవనం సాగిస్తున్న ఇతర పిల్లల గురించి కూడా తర్వాత చర్చిస్తాను.

శృంగార జీవితానికి సంబంధించిన హక్కు పిల్లలకు ఇవ్వకూడదని పెద్దలు భావించడానికి అతి పెద్ద కారణం శృంగారం అనేది మంచి విషయం కాదని, అది చెడ్డదని, తప్పని భావించడం. మన సమాజం అటు కఠోరమైన మత నియమాలు, ఇటు శృంగార కోరికలు ఈ రెండూ కలగలసి ఉంది. ఇది చాలా ప్రమాదకరమైన సంగమం. యూఎస్‌లోని చాలా ప్రదేశాలలోని రాజకీయ నాయకులలో ఎక్కువ మంది శృంగారం అనేది ఒక హక్కు, అది కచ్చితంగా చట్టబద్ధంగా ఉండాలని నమ్ముతున్నారు. అయితే పెళ్లి చేసుకుని పిల్లలను కనడానికి లేదా వైవాహిక వ్యవస్థను నిలబెట్టడానికి మాత్రమే శృంగారాన్ని ఉపయోగించుకునేందుకు చట్టం అంగీకరిస్తుంది. అలా కాని శృంగారం చట్టప్రకారం శిక్షార్హమైంది. నేను ప్రతిపాదించిన హక్కులను పిల్లలకు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించేట్టయితే ఇది నేను పిల్లల కోసం అడుగుతున్న చిట్టచివరి హక్కు.

మనం పిల్లలకు వారి శృంగార జీవితం మీద వారికి పూర్తి హక్కు ఇవ్వకపోవడానికి మరో కారణం ఏంటంటే పెద్దల శృంగార జీవితం మీద విశాల భావాలు కలిగిన వారు కూడా పిల్లలు చాలా పవిత్రమైన వారు, అమాయకమైన వారు అని, వారికి శృంగారపరమైన ఆలోచనలు ఉండవని, అసలు అలాంటి అవసరం ఉండదని నమ్మడం. ఇది ప్రతి పిల్ల వాడి విషయంలో నిజం కాదు. కానీ కొంత మంది పిల్లల్లో ఇలాంటి ఆలోచనలు పది, పదకొండు సంవత్సరాల వయసులోనే కలుగుతాయి. చాలా పరిశోధనల్లో పిల్లల్లో లైంగిక పరిపక్వత వచ్చే వయసు రోజురోజుకు తగ్గుతున్నట్టు తేలింది. కానీ మనం చాలా కారణాలు చూపుతూ మన అభిప్రాయాలు మార్చుకునేందుకు సిద్ధంగా లేము. అలా చేయడం వల్ల మనం వారి శృంగార జీవితానికి సంబంధించిన విషయాలు పట్టించుకోకుండా ఉంటాము. వారిని మన ప్రేమను పంచుకునే ఒక వస్తువుగా వాడుకోవడానికి సిద్ధంగా ఉంటాము కానీ మనం వారికి కానీ వాళ్లు మనకు కానీ శృంగార వస్తువుగా కనిపించకుండా ఉండడానికి ఇలాంటి ఏర్పాటు ఒకటి చేసుకున్నాము.

స్త్రీలు శృంగారం వల్ల కలిగే ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుంది, వారు గర్భం దాల్చి పిల్లలను కనాల్సి ఉంటుంది కాబట్టి శృంగారం నుంచి స్త్రీని చట్టం కాపాడాలని కొందరు వాదిస్తారు. ఒకవేళ వారు వయసులో చిన్న వారైతే వారు వారి ఇష్టం లేకుండానే గర్భం దాల్చేందుకు అవకాశం ఉంటుంది అని వాదిస్తారు. దీన్ని బట్టి అర్థం అవుతున్నదేమిటంటే స్త్రీ తనకు పిల్లలు కావాలా వద్దా అనే నిర్ణయం తీసుకోలేదనే అర్థం ధ్వనిస్తోంది. అంటే వారు కేవలం రాజ్యం లేదా పురుషుడి ఆదేశాలు పాటించే, పిల్లలు పుట్టించే యంత్రంగా బతకాలి. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఎంతో మంది యువతులు వారికి ఇష్టం లేకుండానే గర్భం దాలుస్తున్నారు పిల్లలను కంటున్నారు. పుట్టిన పిల్లలను ఏం చెయ్యాలో కూడా వారికి తెలియడం లేదు. ఇలాంటి పరిస్థితి వారికి ఎన్నో రకాల సామాజిక, మానసిక సంఘర్షణలకు గురిచేస్తుంది. చాలా చిన్న వయసులో పిల్లలను కనడమనేది వయసు పైబడిన వారు పిల్లలను కన్నపుడు కలిగే అన్ని సమస్యలు కలిగిస్తుంది.

మనం చాలా సులభంగా ఈ సమస్యలు, ప్రమాదాలు, విషాదాల నుంచి బయటపడడానికి ఉన్న మార్గం పిల్లలు పెద్దవారు కాగానే వారికి శృంగారం, గర్భనిరోధక సాధనాలు, గర్భం, శిశుజననం గురించిన పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచాలి. పది సంవత్సరాల వయసు వచ్చేసరికి పిల్లలందరికీ గర్భం ఎలా దాలుస్తారు, గర్భం దాల్చకుండా ఉండడానికి ఏం చెయ్యాలి వంటి విషయాల్లో పూర్తి పరిజ్ఞానం ఉండాలి. గర్భనిరోధక సాధనాలు, పిల్స్, ఇతరత్రా సలహాలు చవక ధరల్లో, అందుబాటులో ఉంచాలి. అంతే కాకుండా మనం సెక్స్ అనంతరం కూడా వాడే గర్భనిరోధక పిల్స్ అభివృద్ధి చేసుకున్నాము. వాటి గురించి, పురుషులు ఉపయోగించే కండోములు గురించి తెలియజేయాలి. వీటన్నింటి

వల్ల  అవాంఛిత గర్భాల సమస్య దాదాపు తొలిగిపోతుంది. మనం ఇలాంటి చవకైన, సురక్షితమైన గర్భ నిరోధక సాధానాలు అందుబాటులో ఉంచడం వల్ల ఇలా అవసరం లేని గర్భాల వల్ల జన్మించే పిల్లల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు.

స్వేచ్ఛగా జీవిస్తున్న చిన్నపిల్లలను సెక్సుపరంగా వాడుకునే అవకాశం పెద్దవారికి కల్పిస్తే చెడ్డ ఆలోచన కలిగిన కొంతమంది పెద్దవారు దాన్ని దుర్వినియోగం చేసే వీలుందన్న భయాన్ని కొంతమంది నాతో వ్యక్తం చేశారు. ఇక్కడ విషయం ఏమిటంటే 'ఒక అమాయకురాలైన యువతి, ఒక చెడ్డవాడైన పురుషుడు' అనే భావనలో ఉంటారు. లేదంటే కొంతమంది 'ఒక యువకుడు తనకంటే పెద్ద వయసు స్త్రీతో సెక్సులో పాల్గొనడం' గురించి మాట్లాడతారు. ఈ రెండు సందర్భాల్లో కూడా కొన్ని అపోహలున్నాయి. ఇక్కడ కేవలం పురుషులు మాత్రమే కామంతో ఉంటారని, స్త్రీలు అలాంటి ఉద్దేశం లేకుండా 'స్వచ్ఛం'గా ఉంటారన్న భావం ధ్వనించేలా ఉంది. పెద్దవాడైన పురుషుడితో సెక్సులో పాల్గొన్న ప్రతి అమ్మాయి కూడా అతడి బాధితురాలిగా చిత్రీకరించబడుతుంది.

ముగ్గురు ఆడపిల్లలున్న ఒక తల్లి నాతో ఒకసారి చెప్పింది..  ఒక యువకుడు అతడితో సెక్సులో పాల్గొనవల్సిందిగా తన కూతుళ్లలో ఒకరిని రకరకాలుగా బ్లాక్‌మెయిలింగ్ ఒత్తిళ్లు  చేస్తున్నట్లు తెలిసి, ఏమైనా సరే ఆ పని చేయవద్దు అని చెప్పి తన కూతురిని కాపాడుకున్నట్లు వెల్లడించింది. అయితే ఇక్కడ ఆ అమ్మాయి మాత్రం తనకు ఆ అనుభవం వద్దని చెప్పడం లేదు. నాకు చెయ్యాలని ఉంది కానీ మా అమ్మ నన్ను చంపేస్తుంది అంటుంది. ఇదంతా కూడా సమాజంలో స్త్రీని ఒక లైంగిక వస్తువుగా భావించడం వల్ల కలిగిన పరిణామాలు. నేను ప్రతిపాదించేటటువంటి సమాజంలో ఇలాంటి  (ఆమె కూతురు విషయంలో లాంటి) లైంగిక ప్రమాదాలు తక్కువగా ఉంటాయి. అదే విధంగా పురుషుడి మీద కూడా ఒత్తిడి తగ్గుతుంది. సెక్సును ప్రమాదకరమైందిగా, భావోద్వేగపరమైందిగా, మైమరపించేదిగా మాత్రమే కాకుండా తప్పుగా, విరక్తిగా కూడా భావించనట్లయితే దాని నుంచి ఎవరినీ మరొకరు  కాపాడాల్సిన అవసరం అంతగా ఉండదు.  వారిని కాపాడుకోవడానికి వారే సరిపోతారు. స్త్రీ లైంగికపరంగా పురుషులకు ఎంత ఎక్కువగా ఆకర్షణీయంగా కనిపిస్తే ఆమెకు అంత విలువ అని అమ్మాయిలు  భావించడం  మానేస్తే వారిని బ్లాక్‌మెయిల్ చేసే అబ్బాయిలు ఉండరు. అలాంటి ప్రయత్నాలు చేసిన వారు తాము దురదృష్టవంతులని త్వరలోనే తెలుసుకుంటారు కూడా.

కానీ పిల్లలు స్వేచ్ఛగా బాధ్యతాయుతమైన జీవనం గడుపుతున్న పౌరులుగా ఉన్నపుడు వారు ఇతర పౌరుల మాదిరిగానే తమ లైంగిక జీవితం మీద పూర్తి అదుపును కలిగి ఉండే అవకాశం ఉంటుందా? లేక వారి సంరక్షకులు దీని గురించి ఏదైనా

మాట్లాడుతారా? ఒకవేళ వారు ఒప్పుకోకపోతే చట్టం జోక్యం చేసుకుంటుందా? చేసుకుంటే అది ఎలా?

నాకు ఇక్కడ చాలా వివాదాలు తలెత్తేలా అనిపించాయి. నాకు తెలిసి పిల్లలతో సహా ప్రజల వ్యక్తిగత విషయాలలో రాజ్యం జోక్యం చేసుకోకూడదనే అనుకుంటున్నాను. అలాగే ఎవరూ కూడా మరొకరి వ్యక్తిగత విషయాలను తమ అదుపులో పెట్టుకోవడం సరి కాదని నేను నమ్ముతాను. వారు ఏ వయసు వారైనా సరే వారి లైంగిక జీవితం మరొకరు నిర్దేశించిన విధంగా ఉండాలనుకోకూడదు. చెప్పాలంటే చట్టం యువత ఇప్పుడు వారిలో చాలా మంది చేస్తున్న పని చేసే హక్కు లేదని చెప్పకూడదు. కానీ రాజ్యానికి ఈ విషయంలో ఉన్న అధికారం ఎలాంటిదో తెలుసుకోవడం ఎలా అయితే అంత సులభం కాదో, యువతకు ఎలాంటి హక్కులున్నాయో చెప్పడం కూడా అంతే.

మన చట్టాల్లో లైంగిక ప్రవర్తన గురించి అనేక నిబంధనలు ఉన్నాయి. ఇందులో కొన్ని అసలు అమలు కావు కేవలం పుస్తకాలలో మాత్రమే ఉంటాయి. ఇవి రాజకీయ నాయకులను సురక్షితంగా ఉంచడానికి ఉపయోగపడతాయి. వారిని ఎవరూ ప్రశ్నించకుండా ఉండడానికి మాత్రమే అలా ఉంచుతారు అంతే. సెక్సు సంబంధాల గురించి ఇప్పుడు చట్టంలో మనం పొందుపరుచుకున్నవన్నీ కూడా పాక్షికంగా అమలు జరిగినా కూడా మనలో చాలా మంది జైళ్లలోనే ఉండాల్సి ఉంటుంది. అదృష్టం కొద్దీ రాజ్యం ఈవిషయంలో పెద్దగా జోక్యం చేసుకోదు, ఒక వేళ అమలు చేయ్యాలనుకున్నా కూడా అది అంతగా సాధ్యం కాకపోవచ్చు కూడా. యువత ఇన్ని కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటూ కూడా శృంగారానికి దూరంగా ఉండడం లేదు. ఇది నాకు ఫర్లేదు. ప్రజలు ఇప్పటికే చట్టవ్యతిరేకంగా చేస్తున్న దాన్ని ఆపలేనపుడు దాని ప్రభావం తక్కువగా ఉండేలా చూసుకోవడం రాజ్యానికి మంచిది కదా. రాజ్యం కొన్ని చట్టాలు అమలు చెయ్యలేదు కానీ వాటిని ఉపసంహరించుకోవడానికి కూడా ధైర్యం చెయ్యదు. వారు కొన్ని విషయాలు తీసుకొని అమలు పరుస్తుంటారు. ఇలాంటి వాటిని రాజ్యం తనకు నచ్చని వారిని జైల్లో పెట్టడానికి బాగా ఉపయోగించుకుంటుంది.

ఇక మరో సమస్య ఏంటంటే, ఎవరితోనైనా లైంగిక సంబంధాన్ని పెట్టుకోవడమంటే అది ఒక బాధ్యతగా అనిపిస్తుంది నాకు. భౌతిక ఆవేశాలను అదుపులో ఉంచినా లేదా నివారించినా మానసికమైన ఉద్వేగాలు అలాగే ఉంటాయి. దీన్ని బట్టి మనకు అర్థమవుతున్నదేమిటంటే లైంగిక స్వేచ్ఛ కావాలని అనుకునే వారు కచ్చితంగా ఇతర బాధ్యతలను అంగీకరించడానికి సిద్ధంగా ఉండాలి. కానీ యువతలో స్వేచ్ఛగా బతుకుతున్న వారిని కూడా దానికి దూరంగా ఉంచారు. సెక్సు నుంచి ఎవరినైనా

అపడం ఎవరి బాధ్యత? దాన్ని ఎలా నిలువరిస్తారు? ఇది కేవలం పెద్దలు వారి గురించి ఆరాలు తీయడానికి, వాళ్ల వ్యవహారాల్లో తలదూర్చడానికి, వారిపై నిఘా వేయడానికి, వారికి నీతి పాఠాలు చెప్పడానికి, వారిని బెదిరించడానికి మాత్రమే పనికి వస్తుంది. దీనివల్ల వచ్చే లాభమేం ఉండదు. కేవలం పిల్లలకు పెద్దలకు మధ్య ఉన్న అనుబంధాలు దెబ్బతినడం తప్ప. దీని ప్రకారం చాలా మంది యువతులు, యువకులతో శృంగార పరమైన సంబంధం కలిగి ఉన్నందుకు ఏళ్ల తరబడి జైళ్లలో గడపాల్సి ఉంటుంది. ఇలాంటి శిక్షించే అధికారాలను ఎలాగైనా అడ్డుకుని తీరాలి. నేరం చేశారన్న ఆరోపణతో ఒకరి స్వేచ్ఛను పూర్తిగా అదుపు చేస్తూ జైల్లో పెట్టడం చాలా తీవ్రమైన చర్య. నిజానికి ఇలాంటి చర్య దానికదే ఒక నేరం వంటిది. ఒకవేళ నిజంగానే ఒక వ్యక్తి వల్ల ఇతరులకు ఎంతో హాని జరుగుతున్నపుడు ఇలాంటి తీవ్రమైన చర్య తీసుకోవాలి. కానీ సెక్సులో పాల్గొనడం అంటే ఒకరికొకరు ఆనందాన్ని పంచుకునే చర్య. దీనికి వ్యక్తులను జైల్లో పెట్టడం నైతికంగా చాలా తప్పు.

ఇక్కడ మరో సమస్యేమిటంటే లైంగిక కార్యకలాపాల్లో పాల్గొనే యువతీ యువకులు వారి తల్లిదండ్రులు లేదా ఇతర సంరక్షకులతో కలిసి ఉంటున్నపుడు వారి ఇంట్లో ఇలాంటి కార్యకలాపాలకు వారు అడ్డుచెప్పవచ్చు. వారు ఒప్పుకుంటే కనీసం పట్టించుకోకుంటే ఇక సమస్య ఉండదు. కానీ వారు ఒప్పుకోకపోవడానికి మాత్రం పెద్దగా కారణాలు నాకైతే కనిపించడం లేదు. ఒక సెకండరీ గార్డియన్ ఇలా చెప్పే హక్కు ఉంటుంది "నీ లైంగిక జీవితం నీ ఇష్టం. కానీ ఈ ఇంట్లో ఏం జరగాలనేది నా ఇష్టం. నువ్వు ఇలాంటివన్నీ కొనసాగించాలనుకుంటే నువ్వు ఇల్లు విడిచి వెళ్లాల్సి ఉంటుంది" అని చెప్పవచ్చు. లేదా "నువ్వు మా సంరక్షణలో ఉన్నపుడు నువ్వు ఇలాంటివి చెయ్యడం మాకు నచ్చడం లేదు, నీ ఈ పనుల వల్ల మాకు ఇతరులతో మాట రావచ్చు" అని చెప్పవచ్చు. ఇక తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉండే పిల్లల విషయంలో వారి ప్రతి పనికి ఆ తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇలాంటి ముఖ్యమైన విషయాల గురించి పిల్లలకు వారు ఏం చెయ్యవచ్చో, ఏం చెయ్యరాదో తప్పకుండా వివరించి చెప్పాల్సి ఉంటుంది. అయితే పిల్లలకు రాజ్యం ఇచ్చి పరిరక్షించాల్సిన ఓటు హక్కు పని హక్కు వంటి వాటికి ఇక్కడ మినహాయింపు ఉంటుంది. ఒకవేళ పిల్లలు తమ తల్లిదండ్రులతో ఉండడానికి ఇష్టపడకపోతే వారు వారికి ఇష్టమైన మరో సంరక్షకుడిని ఎంచుకోవడానికి లేదా స్వేచ్ఛా జీవనం సాగించడానికి అవకాశం ఉంటుంది.

# 28. తీసుకోవాల్సిన చర్యలు

**యు**వతతో పౌల్ గుడ్‌మ్యాన్ జరిపిన చాలా చర్చల్లో ఇలా చెబుతూ ఉండేవాడు: ఒక విభిన్నమైన, మెరుగైన ప్రపంచం కోసం కృషి చేయడానికి ఒక ఉత్తమ మార్గం ఏమిటంటే అలాంటి ప్రపంచంలోనే మీరు ఉన్నట్లుగా భావిస్తూ, ప్రస్తుత మీ దైనందిన జీవితంలో కూడా వీలైనంత వరకు అక్కడ ఎలా ప్రవర్తించాలో అలాగే ఉండండి. ప్రపంచం మీరు ఉండదలచుకున్నట్లుగానే దాదాపు మారినట్లయితే, మీరేం చేస్తారు, ఎలా జీవిస్తారు, ఇతరులతో మీరు ఎలా చూస్తారు? అని కూడా ప్రశ్నించేవాడు. ఇప్పుడు కూడా అలాగే జీవించండి, ఇప్పుడు కూడా ఎదుటివారితో అలాగే చూడండి అని సలహా ఇస్తాడు. అందుకు మీకు ఏదైనా అడ్డు నిలిచినట్టు అనిపిస్తే దాన్ని ఎలా అధిగమించాలో మార్గం అన్వేషించండి. మనం పిల్లలతో, వారు అతి చిన్న వారైనా అతి తక్కువ వయస్సు ఉన్న వారైనా సరే, వారిని ఎక్కడ చూసినా మనం నిర్మించాలని భావిస్తున్న సమాజంలో ప్రతిఒక్కరూ వారిని ఎలా చూడాలనుకుంటున్నారో అలాగే ఇప్పుడూ మీరు వారిని చూడండి.

మనం వారితో మర్యాదగా ప్రవర్తించడం మొదలు పెట్టాలి. పిల్లల మీద అధికారం చూపే వారు, వారిని కేవలం ప్రేమ వస్తువుగా చూసే వారు, అత్యంత ప్రీతిపాత్రమైన పెంపుడు జంతువులా భావించే వారు ఇలా ప్రవర్తించడానికి ఇబ్బంది పడతారు. మర్యాదగా ప్రవర్తించాలంటే ముందుగా మనం ఇతరుల ఆత్మాభిమానాన్ని గుర్తించాలి. మనతో ఇతరులు ఎలా ప్రవర్తించాలని మనం ఆశిస్తామో మనం కూడా ఇతరులతో అలా ప్రవర్తించినపుడే అది సాధ్యమవుతుంది. కేవలం అతడిని భౌతికపరమైన మాత్రమే భావోద్వేగాలపరంగా కూడా వారి పరిస్థితులు కూడా అతడు మనకు అనుమతించిన మేర మాత్రమే అతడి జీవితంలో మనం కల్పించుకోవాలి. మనం వారితో మర్యాదగా నడుచుకోవడం అంటే మనం పిల్లలతో మాట్లాడే సమయంలో ఎక్స్‌క్యూస్ మీ, ప్లీజ్, థ్యాంక్యూ వంటి మర్యాదపూర్వకమైన మాటలు మనం ఇతరులతో ఎంతటి మర్యాదగా ఉపయోగిస్తామో అలాగే ఉపయోగించాలి. మనం పిల్లలకు పనులు చెబుతున్నపుడు వారికి పనివారికి

చెప్పిన విధంగా చెప్పకూడదు, మీ తోటివారిని సాయం అడిగితే ఎలా అడుగుతారో అలాగే చెప్పాలి. ఎందుకంటే అతడు ఈ ప్రపంచానికి కొత్తగా వచ్చినవాడు, మనం ఎలా ప్రవర్తిస్తున్నామో గమనించి ప్రవర్తన నేర్చుకుంటాడు.

వారిని మర్యాదగా చూడాల్సిన మరో చిన్న విషయం ఏంటంటే వారి ప్రైవసీ హక్కును కాపాడడం. నేను ప్రతిపాదించిన హక్కులన్నీ కూడా పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే వరకు వారికి ఆ హక్కులన్నీ ఉన్నట్టుగానే మనం భావించాలి. ఎలాగంటే పిల్లల గదిలోకి ప్రవేశించే ముందు మనం వారి అనుమతి తీసుకోవాలి. చాలా మంది పిల్లల గది బయట తమను డిస్టర్బ్ చెయ్యకూడదని తెలియజేసే బోర్డులు పెట్టుకుంటారు. ఇలాంటి సైన్ బోర్డు పెట్టే పిల్లలందరికి పెద్దవారి నుంచి తగిన మర్యాద దొరకడం లేదని భావించాలి. వారి గది ఎవరైనా ప్రవేశించడానికి వీలుండే ప్రదేశమని పెద్దలు అనుకుంటారు.

ప్రైవసీ అంటే ఆలోచనల్లో ప్రైవసీ, అలాగే ఉండే చోటు విషయంలో ప్రైవసీ. చాలా మంది తమ పిల్లలు ఏం చేస్తున్నారు, ఇంకా చెప్పాలంటే ఏం ఆలోచిస్తున్నారో కూడా తెలుసుకునే హక్కు తమకు ఉందని భావిస్తారు. ప్రతి సారీ అడుగుతారు " ఇవ్వాళ స్కూల్లో ఏం చేశావు?" అని అడుగుతారు. అందుకు సమాధానంగా పిల్లలు "ఏమీ లేదు" అంటుంటారు. అంటే దాని అర్థం "నేను మాట్లాడడానికి ఏమీ లేదు" అని లేదా "ఇప్పుడు నీతో పంచుకోవడానికి నా దగ్గర ఏమీ లేదు" అని అర్థం. నిజంగా పిల్లలు ఏం చేస్తున్నారో వినాలనుకునే వారు ఇలాంటి ప్రశ్న అసలు అడగనే అడగరు.

నేను ఇప్పటికే పిల్లలు స్వేచ్ఛగా, అన్ని విషయాలు చెప్పడానికి సిద్ధంగా ఉండాలంటే ఏం చెయ్యాలో చర్చించాను. ఇక్కడ మరికొన్ని సూచనలు చెయ్యాలను కుంటున్నాను. చాలా మంది పిల్లలకు డబ్బు ఖర్చుపెట్టే స్వేచ్ఛను ఇచ్చినట్టయితే వారు చాలా తెలివి తక్కువగా వృథాగా ఖర్చుపెడతారని, వారు మోసపోతారని అనుకుంటారు. ఈ మధ్య ఒక వ్యక్తి నన్ను అడిగాడు "ఒక పిల్లవాడు ఒక షాపుకు వెళ్లి అక్కడ క్రెడిట్ కార్డును ఉపయోగించి పది డాలర్లు ఖర్చు పెట్టి క్యాండీ బీన్స్ కొంటే ఎలా ఉంటుంది?" అని ఇలాంటి ప్రశ్నలు భయాలు చాలా మందిలో ఉంటాయి. ఒక సారి అలాచెయ్యడం వల్ల అతడికి ఒక అనుభవం వస్తుంది. దాని వల్ల అతడు చాలా విషయాలు నేర్చుకుంటారు. పది డాలర్లు పెట్టి కొనుక్కున్న క్యాండి బీన్స్ అతడు తినడానికి చాలా ఎక్కువన్న విషయం అతడు తెలుసుకుంటాడు. అంతేకాదు అతడి స్నేహితులెవరికీ కూడా ఇలాంటి నష్టం కాకుండా చూస్తాడు. తర్వాత అతడికి తెలుస్తుంది పది డాలర్లతో కేవలం క్యాండీ బీన్స్ మాత్రమే కొనడం తెలివి తక్కువ తనం అని తెలుసుకుంటాడు.

అయితే డబ్బులకు చాలా ప్రాముఖ్యత ఉండే సమాజంలో జీవించాల్సిన పిల్లలకు డబ్బు గురించి చాలా ఎక్కువగా తెలిసుండాలి. వాటిని సంపాదించడానికి ఏం చెయ్యాలో కూడా తెలిసుండాలి. ఏ పని చేస్తే ఎంత డబ్బు సంపాదించవచ్చు, వాటితో ఏం కొనాలి, వాటిని ఎలా జాగ్రత్త చెయ్యాలి వంటివన్నీ తెలుసుకోవాలి. ఇలాంటి విషయాలు నేర్చుకునే అవకాశం చాలా కుటుంబాల్లో పిల్లలకు కల్పించరు. చాలా మంది పిల్లలకు తమ తల్లిదండ్రులు ఏం పనిచేస్తారో తెలియనే తెలియదు. వారికి ఎంత డబ్బు వస్తుందో కూడా తెలియదు. వారు దాన్ని ఏ రకంగా ఖర్చు పెడతారనేది కూడా తెలియదు. కానీ ఈ విషయాలన్ని పిల్లలకు తెలియడం మంచిదే.

పిల్లలకు కుటుంబ ఆర్థిక స్థితిగతులు తెలియడం మాత్రమే కాదు అతడి మీద ఖర్చు పెట్టదలచుకున్న కొంత డబ్బు స్వయంగా అతడి చేతనే ఖర్చు చేయించాలి. చాలా మంది మధ్యతరగతి తల్లిదండ్రులు వారి పిల్లలకు వారు చిన్నగా ఉన్నప్పుడే అలవెన్సు మాదిరిగా ఇస్తుంటారు. కానీ ఇది చాలా చిన్న లెక్క. కొంత మంది పిల్లలు ఈ డబ్బును పొదుపు చేసి బట్టలు, ఇతర ముఖ్యమైన వస్తువులు కొనడానికి దాచుకుంటుంటారు. అయినప్పటికి పిల్లల కోసం తల్లిదండ్రులు కూడా అవసరమైనవి కొంటుంటారు, పిల్లలను వారి దగ్గరున్న డబ్బుకు లెక్కరాసి చూపమని అడుగుతారు. మనం దీనికంటే కొంచెం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇస్తున్న డబ్బుకు సంబంధించిన డబ్బు గురించిన ట్రాక్ రికార్డు ఒకటి రెండు సంవత్సరాల పాటు పిల్లల సహాయంతో తయారు చెయ్యాలి. చాలా మంది పిల్లలు ఇలా చెయ్యడం మీద పెద్దగా శ్రద్ధ పెట్టరు. కానీ ఇలా చేసిన పిల్లలు మాత్రం ప్రాముఖ్యాన్ని నిర్ణయించుకోవడం గురించి చాలా నేర్చుకుంటారు. ఏ విషయాలైనా సరే ఎంత త్వరగా నేర్చుకుంటే అంత మంచిది. పిల్లలు మరింత పెద్ద బాధ్యత తీసుకోగలగాలి, మరింత మంచి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సంపాదించాలి.

ఇదివరకు నేను చెప్పాను పిల్లలకు అన్ని వయసుల స్నేహితులూ ఉండేలా చూసుకోవాలి. చెప్పాలంటే మనం ఇలాంటి పరిస్థితులు పిల్లలకు కల్పించము. మనం మన పిల్లలకు చాలా తక్కువ మందిని పరిచయం చేస్తాము, మనం మన పిల్లలకు ఇతర పిల్లలకు వారికి స్నేహితులుగా ఉండాలని, లేదా మన స్నేహితుల పిల్లలు వారికి స్నేహితులుగా ఉండాలని కోరుకుంటాము. వారికి మరొకరు తెలిసే అవకాశమే ఉండదు. స్మిత్ దంపతులకు ఒక ఎనిమిది సంవత్సరాల టామ్ అనే కొడుకున్నాడనుకోండి. వారు తమకు పెద్దగా పరిచయం లేని జానెస్ దంపతులు కొడుకు సామ్‌ను తమతో పాటు పిక్నిక్‌కు లేదా మరో చోటుకు తీసుకువెళ్తామంటే జానెస్ దంపతులు పర్వాలేదు అనుకుంటారు. అదే వారికి టామ్ అనే కొడుకు లేడనుకోండి, అప్పుడు ఇదే ప్రతిపాదనతో స్మిత్ దంపతులు వారిదగ్గరకు

వచ్చినపుడు వారు కొద్దిపాటి అనుమానంతో చూస్తారు. అంతేకాదు వారితో తమ కొడుకును పంపడానికి ఇష్టపడకపోవచ్చు కూడా. ఇక స్మిత్ దంపతులు కాకుండా వారిలో ఒకరే ఉండి సామ్‌తో స్నేహం చెయ్యాలనుకుంటే సామ్ స్థానంలో అమ్మాయి కనుక ఉంటే జానెస్ దంపతులు మరింత జాగ్రత్తగా ఉంటారు.

పిల్లలకు అపరిచితులతో మాట్లాడ కూడదని చెబుతుంటాము సాధారణంగా. అంటే తల్లిదండ్రుల స్నేహితులు లేదా స్నేహితుల తల్లిదండ్రులతో తప్ప ఇంకెవరితోనూ మాట్లాడకూడదని అర్థం. మిగతా ఎవరైనా సరే అపరిచితులే. అలా మనం పెద్దలతో పిల్లలు ఏర్పరుచుకునే సామాజిక సంబంధాలపై పరిమితులు విధిస్తాం. కొన్ని భయాలు ఉంటాయి, పిల్లలను పెద్దలు అపహరించుకుపోయి వేధింపులకు గురిచేయడం లేదా మానభంగాలు, హత్య చేయడం వంటి దుర్ఘటనల ప్రభావం వల్ల భయంతో పెద్దలు ఇలాంటి పరిమితులు విధిస్తుంటారు. ఇలాంటి విషయాలకు భయపడి మనం పిల్లలను వారికి ఇష్టమైనట్టు పెద్దవారితో స్నేహం చెయ్యడానికి అనుమతించకపోవడం వల్ల వారికి మనకు తెలియకుండానే చాలా పెద్ద నష్టం చేస్తున్నాం.

వీటిని, ఇతర ప్రజాభిప్రాయాలను మార్చడం చాలా కష్టం. ఎంతంటే స్కూళ్ల గురించి, విద్యాబోధన గురించి ఉన్న దృక్పథాన్ని మార్చడం కంటే కూడా క్లిష్టమైనది. సమాజంలో దశాబ్దాలుగా స్కూల్స్ గురించిన చర్చ జరుగుతూనే ఉంది. పిల్లలకు సంబంధించిన ఈ విషయాల గురించిన చర్చ దాదాపుగా జరగలేదనే చెప్పాలి. ఇలాంటి విషయాలన్ని కూడా ఎక్కువ ప్రాచుర్యంలోకి రావాల్సి ఉంది. అంతేకాదు మన ఆధ్వర్యంలో ఉన్న పిల్లలకు ఇలాంటివన్నీ సాధ్యపడేలా చూడాలి. వారు మరిన్ని కొత్త స్థలాలు చూడాలనుకున్నా, ఎక్కువ మందితో పరిచయాలు పెంచుకోవాలనుకున్నా, ఎంచుకోవడానికి ఎక్కువ అవకాశాలు, చెయ్యడానికి ఎక్కువ పనులు వారికి అందుబాటులో ఉండాలి. వారు మన మీద ఆధారపడడాన్ని నెమ్మదిగా తగ్గిస్తూపోవాలి. మన వ్యక్తిగత జీవితాల్లో సమాజం అంగీకరించనివి, చట్టం అనుమతించనివి కూడా మనం చాలా పనులు విజయవంతంగా చెయ్యవచ్చు. 27 ఆగస్టు 1973న టైమ్స్ మ్యాగజీన్‌లో ప్రచురితమైన 'లెస్ స్కూల్ – మోర్ వర్క్' అనే వ్యాసంలో ఈ విషయాల గురించి చర్చ జరిగింది.

> ప్రతి దశాబ్దంలోనూ స్కూళ్ల సుదీర్ఘ సమయం తగ్గిస్తూపోవాలి. యువత పెద్దవారుగా మారి సమాజంలోకి ప్రవేశించడానికి మరో మార్గం దొరకాలి కదా అని తెలివైన వారు ప్రశ్నిస్తుంటారు. 'ప్రెసిడెంట్స్ సైన్స్ అడ్వైజరీ కమిటీ' ఛైర్మన్ జేమ్స్ కొల్‌మాన్ అతడి బృందం ఇచ్చిన రిపోర్టులో 14–24 సంవత్సరాల మధ్య వయసున్న అమెరికా పిల్లలకు 'ఎక్కువ

పని – తక్కువ పాఠశాల' అనే విధానం అమలు చేయాల్సిన అవసరం ఉన్నట్టు తెలిపారు.

... ఎందుకంటే పెద్దవారిగా ఎదిగిన తర్వాత పిల్లలకు ఉపయోగపడే విషయాలు ఏవీ కూడా స్కూల్స్‌లో నేర్పించడం లేదు. అంతేకాదు అక్కడ పని చేయడంలో తీసుకునే బాధ్యతను పరిచయం చెయ్యడం లేదు, ఇతరులతో ప్రవర్తించే తీరును తెలపడం లేదు. స్కూల్స్ ఈ సామర్థ్యాలు పెంపొందించడంలో విఫలమయ్యాయి అని కొల్‌మెన్ ప్యానెల్ చెప్పింది. వారి మీద ఉండే నిఘా వారిని అవసరమైన నైపుణ్యాలు పెంపొందించకుండా అడ్డుకుంటోంది.

... దీనికి మంచి పరిష్కారం విద్యాబోధన సమయాన్ని కొద్దిగా పరిమితం చెయ్యాలి. యువతకు చదువుతో పాటు పని చేసుకునే వెసులుబాటు కల్పించాలి. బాధ్యత కలిగిన పనుల్లో వారికి భాగస్వామ్యం కల్పించాలి. రకరకాల వయసుల వాళ్ళు రకరకాల నేపథ్యాల నుంచి వచ్చిన వారితో కలిసిపోయే అవకాశం ఇవ్వాలి. ఇలా చెయ్యడం వల్ల వారిలో పెద్దవారిలో ఉండే నైపుణ్యాలు పెంపొందడానికి స్కూల్ నుంచి కొంత కాలం పాటు విముక్తి లభించినట్టు ఉంటుంది. ఈ ప్యానెల్ సూచించిన ప్రతిపాదన ప్రకారం పిల్లలను స్కూల్స్ నుంచి త్వరగా బయటికి తీసుకు వచ్చి ఇతర సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాన్ని కల్పించాలి. హాస్పిటల్స్, సింఫనీ ఆర్కెస్ట్రా, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, ఇంకా ఫ్యాక్టరీల వంటి చోట్ల పిల్లలకు పనిచేసే అవకాశాన్ని కల్పించాలి. ఇలాంటి చోట పనిచేయడానికి 16 సంవత్సరాల వయసు నుంచి ఉద్యోగంలోకి తీసుకోవడం మొదలుపెట్టాలి. అలా తీసుకొని వారికి అక్కడ పనిచేయడానికి కావల్సిన నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశం కల్పించాలి. ఇలాంటిది ఇప్పు డు కూడా అప్రెంటిస్‌షిప్ పేరుతో అమలులో ఉంది కానీ పిల్లలను దీనికోసం తీసుకోవాలి.

ఇది పాల్ గుడ్‌మ్యాన్ చాలా ఏళ్ల క్రితమే ప్రతిపాదించాడు. వీరు ప్రతిపాదించిన ఈ ప్రతిపాదనకు రాజకీయ నాయకులు అధికారులు తప్పకుండా మద్దతును ఇవ్వాలి. ఈ ప్రతిపాదనల వల్ల సమాజంలో ఈ దిశగా చర్చ జరగడం మొదలవుతుంది. ఈ ప్రతిపాదనలను గౌరవించినంత మాత్రాన వాటిని అమలు చేస్తారని అర్థం కాదు. కానీ గౌరవం కలిగితే వాటిని అమలు చేసేందుకు ఒక అవకాశం మాత్రం ఉంటుంది. ఒకవేళ గౌరవప్రదంగా అనిపించకపోతే మాత్రం అవి ఎప్పటికీ అమలు కావని అర్థం.

టైమ్స్‌లో ప్రచురించిన వ్యాసం తర్వాత భాగం ఇఫ్ యు కెన్ ఫైండ్ ఇట్ లో ఫెడరల్ స్థాయిలో లేదా సిటి లేదా రాష్ట్ర స్థాయిలో తీసుకోగలిగే చర్యలు ప్రతిపాదించడం జరిగింది.

> మూడేళ్ల క్రితం కెనడా ప్రభుత్వం ప్రయోగాత్మకంగా యువతకు అవకాశాల పేరుతో ఒక కార్యక్రమం చేపట్టింది. పని చెయ్యాలనుకునే పిల్లల కలలు నిజం చేసుకునే అవకాశం కల్పించింది.

ఇలాంటి ఉద్యోగాలు, పనిచేసే అవకాశాలు స్కూల్స్ ఆధ్వర్యంలో నడవకూడదు. లేదా మీరు చేసే పని స్కూల్లో వారి ప్రతిభ మీద ఆధారపడి ఉండకూడదు. చాలా రకాల సంస్థలకు యువత చేసే సాయం అవసరమవుతోంది. అవి చిన్న న్యూస్‌పేపర్లు, మ్యాగజైన్లు, సినిమాలు, థియేటర్లు, చిన్నపాటి స్కూల్స్, ఇతర సాదాసీదా సంస్థలు వంటి వాటికి యువత సేవల అవసరం చాలా ఉంది. ఇలాంటి పనులు చేసుకునే అవకాశం కూడా పిల్లలకు చాలా ఉంటుంది. చాలా పెద్ద పట్టణాల్లోని కాలేజి, యూనివర్సిటీ బుక్ స్టోర్స్ ఇలాంటి సమాచారాన్ని అందిస్తున్నాయి. చాలామంది యువత ఇలాంటి సంస్థలలో పనిచేయడానికి చాలా సంతోషిస్తున్నారు. ఇంకా ఉపయోగపడే ఎన్నో పనులు యువత ఎలాంటి జీతం లేకుండానే చేస్తున్నారు. దీనికి సంబంధించిన పేరు స్కూల్‌కు రావాలన్నా, లేక వారు మరింత స్వేచ్ఛగా ఈ పనులు చేసుకోవాలన్నా వారు చట్టబద్ధంగా స్కూల్ నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం ఉండాలి. దానికోసం దేశంలో స్కూళ్ల హాజరు నిబంధనలు మార్చాల్సి ఉంటుంది.

దీని కోసం యువత ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభల్లో కృషి జరగాల్సి ఉంటుంది. స్కూల్స్‌లో విధించే అత్యంత దారుణమైన కార్పోరల్ పనిష్మెంట్లు వీటిలో ఒకటి. వీటిని పిల్లల మీద పెద్దలు చేసే చట్టబద్ధమైన దాడులుగా మనం పరిగణించవచ్చు, ముఖ్యంగా ఆ పిల్లలు మైనారిటీ, పేద కుటుంబాలకు చెందిన వారై ఉంటారు. ఒకే ఒక రాష్ట్రం మసాచుసెట్స్ మినహా చాలా రాష్ట్రాలలో ఇది చట్టబద్ధమే. ఇది నిజంగా చాలా హేయమైన చర్య. దీని గురించి జోనాథన్ కొజోల్స్ రాసిన పుస్తకం డెత్ ఎట్ యాన్ ఎర్లీ ఏజ్ లో దీని గురించి చాలా బాగా చర్చించారు.

పిల్లల మీద సంరక్షకులు చేసే దాడి కంటే ఎక్కువగా చట్టం దాడి చెయ్యదనేది దీనిలో చివరగా చెప్పే అంశం. ఒకవేళ ఏదైనా తప్పు చేసినప్పటికీ వారిని హేయమైన శిక్షద్వారా కాకుండా వారి పట్ల చట్టం కూడా కనికరంతో వ్యవహరించాలి.

నేను ప్రతిపాదించిన ఈ హక్కులన్నీ కూడా పిల్లలకు అందుబాటులోకి రావాలంటే చట్టసభల్లో రకరకాల బిల్లులు రూపొందించాల్సి ఉంటుంది. వీటి గురించిన విస్తృతమైన

చర్చ జరగాలి. వీటికి కొంత ప్రచారం కూడా జరగాలి. లెజిస్లేటివ్ కమిటీల ముందుకు వెళ్లడానికి ముందు వీటికి అనుకూలంగా ఆలోచించగలిగే సభ్యులు వీటికి అనుకూలత వ్యక్తం చేస్తారు. రానున్న సంవత్సరాలలో అలాంటి వారితో కలిసి పనిచేయాలి. తద్వారా మరిన్ని శాసనాలు వచ్చేందుకు వీలవుతుంది.

రాజకీయనాయకుల చొరవతో ఇవి సమీప భవిష్యత్తులో అమలులోకి తీసుకురావచ్చు. ఇలా ముందుగా మనం మెజారిటీ వయసును పద్దెనిమిదికి ముందు తగ్గించాలి. మనం వారికి స్వేచ్ఛా పౌరులుగా జీవించడానికి పనిచేయడానికి ఇప్పుడు ఎవరో ఒకరి సంరక్షణలో లేదా ప్రభుత్వ జైళ్లలో ఉంటున్న పిల్లలకు తప్పనిసరిగా అంతకంటే తక్కువ వయసులోనే అవకాశం కలిగించాలి. మసాచుసెట్స్ రాష్ట్రంలో మాదిరిగా స్కూల్లో పిల్లలకు సంబంధించిన పూర్తి రికార్డులు అందుబాటులో ఉండాలి. ఇవి పిల్లల తల్లిదండ్రులకు మాత్రమే కాదు పద్దెనిమిది సంవత్సరాల కంటే పెద్ద పిల్లలకు కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ అంతకంటే తక్కువ వయసున్న పిల్లలకు కూడా ఇవి అందుబాటులో ఉండాలి. పెద్దలకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసువేసే హక్కు కూడా పిల్లలకు మనం కల్పించవచ్చు. ఇది చాలా రకాలుగా పిల్లల మీద జరుగుతున్న వేధింపులు అరికట్టడానికి ఈ హక్కు ఉపయోగపడుతుంది. ఇలాంటి రక్షణ ఒకటి ఉండడం వల్ల ఎంత కోపం వచ్చిన తల్లితండ్రులైనా సరే తమ పిల్లల మీద భౌతిక దాడులు చేయరు, ఎందుకంటే అతడు బతికితే తమ మీద కేసు వేసి కోర్టుకు లాగే అవకాశం ఉంటుంది కాబట్టి.

నేను చెప్పాలనుకున్నది స్పష్టంగానే చెప్పానని అనుకుంటున్నాను. ఆధునిక బాల్యం పిల్లలకే కాదు, పెద్దలకు కూడా చాలా సంక్లిష్టంగా మారుతోంది. పిల్లలు పిల్లల్లాగే మిగిలిపోవడం కొన్ని సార్లు చాలా కష్టంగా ఉంటుంది. అందుకే నా ప్రతిపాదనలన్నీ వీలైనంత త్వరగా అమలు కాగలిగితే అటు పెద్దలకు ఇటు పిల్లలకు అందరికీ బావుంటుంది.

# రచయిత గురించి

కాలిఫోర్నియా మసాచుసెట్స్ కొలరాడోలో జాన్ హోల్ట్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకు, హార్వర్డ్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు కూడా బోధించారు. ఆయన ఇతర రచనలు : హౌ చిల్డ్రన్ లెర్న్, హౌ చిల్డ్రన్ ఫెయిల్, ది అండర్ అచీవింగ్ స్కూల్స్, వాట్ ఐ డూ మండే?, ఫ్రీడం అండ్ బియాండ్ పుస్తకాలు, న్యూయార్క్ టైమ్స్‌లో, ద గ్రేడ్ టీచర్‌లో ఎన్నో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఇవే కాకుండా విద్యా రంగానికి చెందిన ఇంకా చాలా ప్రచురణలు ఉన్నాయి. **1977** నుంచి గ్రోయింగ్ విత్ అవుట్ స్కూల్ అనే ద్వైమాసిక పత్రికకు సంపాదకుడిగా పనిచేశారు.

.. .. ..

*నాకు తెలిసి పిల్లలతో సహా ప్రజల వ్యక్తిగత విషయాలలో రాజ్యం జోక్యం చేసుకోకూడదనే అనుకుంటున్నాను. అలాగే ఎవరూ కూడా మరొకరి వ్యక్తిగత విషయాలను తమ అదుపులో పెట్టుకోవడం సరికాదని నేను నమ్ముతాను.*

.. .. ..